# మాంగల్యం తంతునానేనా...



శ్రీమతి హాజరా

# మాంగల్యం తంతునానేనా....

సాయంత్రం నాలుగు దాటబోతూన్న ఆ సమయంలో ఎండ నులి వెచ్చగా సుకుమారంగా వుంది!

ఎత్తుగా వున్న కొండల మధ్య నుండీ మెల్లగా వయ్యారంగా కదులుతోంది--చిన్న రైలు!

'కొండలతో పోటీపడి పెరుగుతున్నాయా' అన్పించేట్లుగా వున్న ఏపుగా, ఎత్తుగా, బలంగా వుండి ఆరోగ్యకరమైన వాసనలు వెదజల్లుతూన్న యూకలిప్టస్ చెట్లు ఆకాశంతో గుసగుసలు చెబుతున్నాయి.

ఎటువైపు చూసినా కంటికి అందినంత దూరమూ నిండి వున్న రంగు రంగుల పూలు మదికి చిక్కిలిగింతలు పెడుతున్నాయి.

కాస్త తల వంచి చూస్తే గుండె లయ తప్పేంత భయంకరమైన లోయలు!

లోయలనుండి పైకి ఎత్తుగా పెరుగుతూ వచ్చిన పేర్లు తెలియని పెద్ద పెద్ద వృక్షాలు-వాటిపైన దట్టంగా అల్లుకుని వ్రేళ్ళాడుతున్న తీగలూ—

అక్కడక్కడా పసుపు ఆరబోసినట్లుగా అందంగా విరబూసిన అడవి పూలమొక్కలూ—

నాట్యతార నడుములా మెలికలు తిరుగుతూ, నురగలు కక్కుతూ వేగంగా కొండల మధ్యనుండీ క్రిందకు దూకుతున్నట్లుగా ప్రవహిస్తూన్న జలపాతాలూ—

పోటీలు పడి పరుగులు తీస్తున్న నీలిమబ్బులూ—

వాటిని వెంబడిస్తూన్న తెల్లమబ్బులూ—

మోడల్ గరల్ కట్టుకుని చూపిస్తూన్న పట్టుచీరలా, అందంగా, పచ్చగా వున్న తేయాకు గుబుర్లూ—

సౌందర్యానికి నిర్వచనంలా, భూదేవి కిరీటంలోని వజ్రంలాగా మెరిసిపోతోంది ఊటీ ప్రకృతి కన్య!

ఊటీ సందర్శనలో చిన్న రైలులో ప్రయాణించటం ఓ మధురమైన అనుభూతి!

చిన్న రైలు అంటే- అది నిజంగానే చిన్న రైలు! దానికి ఐదంటే ఐదే బోగీలు వుంటాయి! పాత ఇంగ్లీషు సినిమాల్లో కన్పించే రైలుబండిలా అందంగా వుంటుంది!

ఉదయంపూట పడుచుపిల్లలు జాగింగ్ చేస్తున్నట్లు- మెల్లగా, వయ్యారంగా పరుగులు తీస్తుంటుంది!

కొండల మధ్యనుండీ క్రిందకు దిగేటపుడూ, పైకి ఎక్కేటప్పుడూ జారిపోకుండా రెండు పట్టాల మధ్యలో వుండే రంపంలాంటి పట్టాకు సైకిల్ చెయిన్‌లాంటి చెయిన్‌తో ఆధారంగా పట్టుకుంటూ మెల్లిగా కదుల్తూంటుంది! ఆ సమయంలో ఉయ్యాల ఊగినట్లుగా ముందుకూ వెనక్కూ ఊగుతూంటే ఆ ఊపుకు ప్రయాణీకులు కూడా వూగిపోతూ, పెద్దగా కేకలు వేసుకుంటూ, నవ్వుకుంటూ ఆనందిస్తూంటారు.

రైలు అక్కడక్కడా గుహల మధ్యనుండీ వెళుతూంటుంది.

ఆ సమయంలో చీకటిగా వుంటుంది! లైట్లు వేస్తారు. అయినా గోల గోలగా అరిచి, నవ్వుతూ గొడవ చేస్తుంటారు!

అందులో పెద్దా, చిన్నా అనే తారతమ్యాలుండవు!

అదో అందమైన అల్లరి!

ఆ బండిలోని రెండో బోగీలో అల్లరి మరీ ఎక్కువగా ఉన్నది!

అదో పెద్ద కుటుంబంలా ఉన్నారు!

పెద్దలూ, పిల్లలూ కలిసి ఇరవై మందికి పైగానే ఉన్నారు.

చప్పట్లు, కేకలు, నవ్వులూ—

సందడి సందడి చేస్తున్నారు!



ఆ బోగీలో ఉన్న ఇతర ప్రయాణీకులందరూ ఇంచుమించు వాళ్ళనే చూస్తున్నారు.

అంత్యాక్షరి మొదలుపెట్టారు.

పాటలకు అనుగుణంగా చప్పట్లు, నవ్వులు, కేకలు, డాన్సులూ—

కాస్త వెనకాల సీట్లో కిటికీ ప్రక్కగా కూర్చుని పరధ్యానంగా కొండల శిఖరాల్నీ, లోయల లోతుల్నీ పరికిస్తూన్న ఆనంది చప్పున తల తిప్పి ఆ పిల్లలవైపు చూసింది.

ఆ అంత్యాక్షరి ఆనందికి కూడా చాలా ఇష్టమైన ఆట!

వాళ్ళ సందడి, ఆ హడావుడి, ఆ పిల్లల గొడవ—

అలా చూస్తుంటే ఆమె మదిలో చిన్ననాటి జ్ఞాపకాలు తెరలు-తెరలుగా కదుల్తున్నాయి. ఆమె పెదవులు నవ్వుతో విచ్చుకున్నాయి.

తలను కిటికీ అంచుకు ఆనించి కళ్ళు మూసుకుంది ఆనంది.

కనురెప్పల క్రింద కొన్ని సంవత్సరాల అడుగున భద్రంగా దాగి వున్న అనుభూతుల అలలు మెల్లమెల్లగా కదిలి బయటకు వస్తున్నాయి.

అవి—

ఆనంది కాలేజీలో చదువుతున్న రోజులు!

మనిషిగా పుట్టటం అనేది భగవంతుడు ఇచ్చిన ఓ గొప్పవరం.

అందునా విరిసీ విరియని గులాబీలా అప్పుడప్పుడే యవ్వనదశలో అడుగుపెడుతూ ఆనందంగా ఆడుతూ, పాడుతూ స్నేహితుల మధ్య గడుపుతూ చదువుకోవటం ఒక బంగారు దశ—

ఆ తీపి గుర్తులూ- జ్ఞాపకాలూ-

మనిషి జీవించినంతకాలమూ కలిసి వుండే ఓ అద్భుతమయిన టానిక్!

అనిత, ఆనంది, ఇందిర, ఈశ్వరి, ఉమ, ఊహ- ఈ ఆరుగురూ చాలా స్నేహంగా, దగ్గర దగ్గరగా వుండేవారు.

ఎక్కడెక్కడో పుట్టి, ఎవరికెవరో తెలియకుండానే ఈ హాస్టల్‌కు వచ్చిన అతి తక్కువ కాలంలోనే కలిసిపోయారు.

ప్రేమగా మసలుకునేవారు.

ఒకరికొకరుగా ఆత్మీయంగా వుండేవారు.

కుటుంబసభ్యుల ఆప్యాయతను స్నేహంలో చూసుకునేవారు.

హాస్టల్లోని అందరూ కలివిడిగా వున్నా ఈ ఆరుగురూ మాత్రం మరీ సన్నిహితంగా వుండేవారు.

ఎన్నెన్నో కబుర్లు!

చెట్లక్రింద, గుబుర్ల ప్రక్కన, వెన్నెల్లో చిటపట రాలుతూన్న వాన చినుకుల్లో, గదిలో, లైబ్రరీలో, డైనింగు హాల్లో, క్లాసు రూమ్‌లో- ఎక్కడయినా దాదాపు ఆరుగురూ కలిసే కన్పించేవారు.

చదువులో, ఆటల్లో, డిబేటింగులో, డ్రాయింగులో- అన్నింటా పోటీలుగా వుండేవారు. చివరకు అల్లరి చేయటంలో కూడా ముందుగానే వుండేవారు. అలాగే ఏవైనా కల్చరల్ ప్రోగ్రామ్స్ గానీ, టూర్స్ గానీ- ఏమున్నా వాటిల్లోనూ ఫస్టులో నిలబడేవారు.

ఏదైనా సరే 'పని' అనేది జరగాలంటే- 'వాళ్ళకప్పగిస్తే మనం నిశ్చింతగా వుండవచ్చు' అని లెక్చరర్స్ కూడా అనుకునేవారు.

అసలు అందరూ వాళ్ళను "అ ఆ ఇ ఈ ఉ ఊ" అని ఉడికించుతుండేవారు.

ఆ ముద్దుపేరు వాళ్ళకూ ఆనందంగానే వుండేది.

అనిత మళయాళీ! వాళ్ళ నాన్న విజయవాడకు కలెక్టరుగా ఉన్నప్పుడు విజయవాడలోనే చదువుతుండేది. ఆయనకు ట్రాన్స్‌ఫర్ వచ్చి వెళ్ళేటప్పుడు అనిత చదువు దెబ్బతినకుండా ఆమెని ఆ కాలేజి హాస్టల్లో పెట్టి వెళ్ళారు. వాళ్ళకు అనిత ఒక్కతే కూతురు. వదిలి వెళ్ళటం కష్టమే అయినా తప్పనిసరి పరిస్థితై అలా వుంచేయాల్సి వచ్చింది. తల్లితండ్రుల మనస్సుకు ఎంతో కష్టం కలిగించిన ఆ పరిస్థితి అనితకు ఓ వరమయింది. స్నేహంలోని అనురాగం, కలిసిబ్రతకటంలోని మాధుర్యం చవిచూస్తోంది.

ఆనంది- అరవపిల్ల!

ఆమెకు తల్లి-తండ్రి చనిపోతే, పెద్దతల్లి దగ్గరకు తీసింది.

ఆమెకు ఒక్కడే కొడుకు. అతను స్టేట్‌బాంకులో ఉద్యోగం చేస్తూ విజయవాడలో వుంటాడు. అలా ఆమె అన్నదగ్గర ఉండి చదువుతూ కావాలనే ఈ హాస్టల్లో చేరింది. ఆమెకు తెలుగు అసలు రాదు. ఇప్పుడిప్పుడే చిన్న చిన్న మాటల్ని అర్థం చేసుకుంటోంది.



ఇందిర- అచ్చమైన తెలుగింటి ఆడపడుచు. అరవిచ్చిన మల్లెమొగ్గలా, రేకులు విచ్చుకుంటూ మంచులో తడుస్తూన్న గులాబీలా, నాజూకుగా వుండే ఇందిర గుడివాడకు దగ్గర్లోని పల్లెటూరులో పుట్టి పెరిగింది. హైస్కూలు చదువు పూర్తయ్యాక కాలేజీలో చదువుకోవాలనే కోర్కెని తీర్చుకోవటం కోసం నానమ్మ ద్వారా తండ్రిని ఒప్పించి ఈ హాస్టల్లో చేరింది.

ఈశ్వరి- విజయవాడలోని పెద్ద వ్యాపారవేత్త కుమార్తె!

ఉమ- విజయవాడకు దగ్గరలోని ఉయ్యూరునుండి వచ్చింది. ఆమె తల్లిదండ్రులు అమెరికాలో వుండటంవల్ల అమ్మమ్మ-తాతగార్ల దగ్గరవుండి చదువుకుంటోంది. ఉమ చాలా చిన్నప్పుడు సుమారు మూడేళ్ళ వయసులో ఉన్నప్పుడు తల్లి-తండ్రి ఇంచుమించు ఆరునెలల తేడాలో అమెరికా వెళ్ళిపోయారు. ఉమ అమ్మమ్మ దగ్గరే వుండిపోవలసి వచ్చింది.

సినిమాల్లో విలన్‌లా ఉమకో మేనమామ ఉన్నాడు. అతనికి చదువు ఏమాత్రమూ ఒంటబట్టలేదు. అలాగని పొలం పనీ చేయడు. ఏభై ఏళ్ళు దాటిన తండ్రి ఎండలో, వానలో పొలానికి వెళ్ళి పనులు చేయిస్తూంటే అతడు మాత్రం కాలువ గట్టునా, రామాలయం వరండాలోనూ పేకాడుతూ, సిగరెట్లు కాలుస్తూ, చిల్లర వెధవలతో కాలం గడిపేస్తాడు.

తండ్రి భయపెట్టాడు, బ్రతిమలాడాడు- లాభం లేకపోయింది.

తల్లి చచ్చిపోతానని బెదిరించినా ఫలితం కన్పించలేదు. ఇహ ఇంకేమీ చేయలేక దొడ్లోని ఆవులకూ, గేదెలకూ గడ్డివేసి మేపినట్లే కన్న పాపానికి తిండిపెడదామని నిర్ధారించుకుని అతడ్ని అలా వదిలేసారు. అతడు ఉమని పెళ్ళిచేసుకుంటానని అరడి పెడుతుంటాడు. అది భరించలేకనే ఇక్కడి హాస్టల్లో చేరింది. సెలవులొచ్చి ఇంటికి వెళ్ళాలంటే చచ్చేంత బెదురు....భయం.

ఊహ- సన్నగా, పొట్టిగా, చామనఛాయతో చిన్నపిల్లలా వుండే ఊహ తెలుగువారి అమ్మాయి అయినా, పుట్టటం పెరగటం అంతా కర్ణాటక

ప్రాంతం అపటంపల్లి కన్నడం పిల్లలాగే వుంటుంది.

ఆమెను పదేళ్ళ వయసులోనే కిత్తూరులోని సెంట్రల్ గవర్నమెంట్ స్కూల్లో చేర్పించారు. అక్కడ సుమారుగా మూడు వేలమందిదాకా ఎంట్రెన్స్ పరీక్ష వ్రాస్తే ఇరవై అయిదుమందిని మాత్రమే సెలెక్టు చేసుకుంటారు. అక్కడ లంచాలు, సిఫార్సులు, అలాంటివేమీ పనిచేయవు. ఉత్త మార్కుల మీదనే సెలెక్షన్ ఆధారపడి వుంటుంది. అలాంటిచోట ఊహ సెలక్టయ్యేసరికి 'వ్రాయించి చూద్దాం' అనుకుని తీసుకువెళ్ళిన ఆమె తల్లిదండ్రులకు ఓవైపు సంతోషం మరోవైపు వదిలి వెళ్ళాలనే దిగులు.

అలా చిన్న వయసునుండే హాస్టలుకు అలవాటయిపోయిన ఊహ కాలేజి చదువుకు ఈ హాస్టల్లో చేరింది. "నేను కేవలం మీ స్నేహంకోసం ఇంతదూరం వచ్చి వుంటాను. "థాంక్ గాడ్" అంటుండేది.

చాకులా చురుగ్గా, చెలాకీగా వుండే ఊహ కొంచెం యాసగా మాట్లాడే తెలుగుతో నవ్వుతూ, నవ్విస్తూ స్నేహితుల మధ్యలో కూడా చిన్నపిల్లలాగే వుంటుంది.

మొదటి సంవత్సరమంతా ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, క్రొత్తదనం వదిలి దగ్గరపటమూ, అర్థం చేసుకుంటూ ఆత్మీయతలను పెంచుకోవటంతో సరిపోయింది.

* * * *

"ఉమా!"

దూరంగా చెట్టుక్రింద కూర్చుని వున్న ఉమని చూసి కాస్త బిగ్గరగా పిల్చింది ఆనంది.

అప్పుడే గదిలోంచి బయటకు వచ్చిన మిత్రబృందం వరండా అంచున నిలబడి వున్న ఆనందినీ దూరంగా చెట్టుక్రింద ఉన్న ఉమనూ చూసి ప్రశ్నార్థకంగా సైగ చేశారు.

"తెలియలేదు. మూడీగా ఒంటరిగా కూర్చుని వుంది. కనుక్కొందాం" అంటూ ఆనంది అడుగులేస్తూంటే అందరూ అటువైపే కదిలారు.

కొంచెం దగ్గరగా వెళ్ళాక "ఉమా" అంటూ పిల్చింది ఊహ.

ఉలిక్కిపడింది ఉమ.



విస్తుపోయారు స్నేహితులు.

"ఏమైంది ఉమా? ఏమిటలా వున్నావు? ఏం జరిగింది?"

అడగ్గా అడగ్గా ఎప్పటికో చెప్పింది. తన గురించీ, తనకున్న సమస్యలూ, మేనమామ వేధింపులూనూ-

అప్పటివరకూ స్నేహంగా వుండటమేగానీ వ్యక్తిగత జీవితాల గురించీ, కుటుంబ వ్యవహారాల గురించీ ప్రస్తావన రాలేదు.

"పోనీ మీ అమ్మదగ్గరకు వెళ్ళిపోరాదు.

నవ్వింది ఉమ.

ఆ నవ్వులో భాషకందని భావాలు అనేకం.

మనసు లోయల నడుమ గడ్డకట్టి వున్న లావా కరగి ప్రవహిస్తోంది.

ఉమ చెప్పింది.

"అమ్మ అమెరికాలో ఉన్నది అనుకుంటే వున్నది. కాని, నేను వెళ్ళాలి అనుకుంటే మాత్రం నాకక్కడ అమ్మలేదు! నాన్న వున్నారు- కానీ నేనక్కడ ఆశ్రయాన్ని పొందలేను."

అర్థంకాలేదు ఎవ్వరికీను.

అసలు ఉమ చెప్పింది ఏమిటో తెలియలేదు, అయోమయంగా చూసారు.

ఆకాశపు అంచున ఎర్రగా కనిపిస్తూన్న అస్తమయపు సూర్యుడ్ని చూస్తూ అగాధంలోంచి వస్తున్న నవ్వుడిలాగా బలహీనంగా అన్నది-

"నన్ను గురించి మీకు చెబితే అసహ్యించుకుంటారేమో."

తలవంచుకుని దోషిలా మాట్లాడుతున్న ఉమ చేతిని గబుక్కున అందుకుని ఆర్తిగా అన్నది ఆనంది-"ఛ....ఛ....ఎందుకలా అంటావు?"

"అసలేం జరిగింది ఉమా?" ఈశ్వరి అడిగింది.

క్రమంగా వెలుతురు తగ్గి చీకట్లు అలుముకుంటున్నాయి.

ఆకాశంలో పక్షులు బారులుతీరి ఎగురుతున్నాయి.

చెట్లక్రిందా, వరండాలోనూ కూర్చుని చదువుకుంటూన్న వాళ్ళంతా అక్షరాలు మసగ్గా అవుతూంటే పుస్తకాలు మూసి గదుల్లోకి వెళ్ళిపోతున్నారు.

త్రోబాల్ గ్రౌండ్‌లోంచీ ఇంకా శబ్దాలు వినిపిస్తున్నాయి.

మెల్లగా చెబుతూన్న ఉమ మాటల్లో ఒకవిధమైన వదును స్పష్టంగా వినిపిస్తోంది.

"అమ్మా నాన్న ఇద్దరూ మెడికల్ కాలేజీలో చదువుతూ ప్రేమించి పెళ్ళి చేసుకున్నారట! అమ్మకన్నా నాన్న రెండేళ్ళు సీనియర్‌ట! అమ్మ చదువు కూడా కంప్లీట్ అయ్యేసరికి నేను పుట్టానట!"

అంత దూరాన ఒంటరిగా బిడ్డని పెంచుకోవటం కష్టమనో మరి అమ్మా, నాన్న అక్కడ సెటిలవ్వాలి కదా అనో మొత్తంమీద నన్ను అమ్మమ్మ, తాతయ్యల దగ్గర వదిలేసి వాళ్ళు యిద్దరూ అమెరికా వెళ్ళి పోయారు.

అప్పటికి నాకు ఊహలు తెలిసే వయసు లేదు.

నా వయసుకు నాకు తెలిసిన అమ్మ- అమ్మమ్మ.

నాన్న- తాతగారు!

నన్ను అమ్మమ్మ చాలా గారాబంగా పెంచింది. తాతగారైతే నన్నో మెరికలాగా తీర్చిదిద్దే ప్రయత్నంలో నన్ను మగపిల్లవాడిలా పెంచారు. దాంతో నాకొంచెం- కొంచెమేమిటిలే బాగా ఎక్కువగానే పెంకితనం అలవాటయిందిట!

చాలా పొగరుగా, గడుసుతనంగా వుండేదాన్నట!

ఎవర్నిబడితే వాళ్ళని ఎంతమాటబడితే అంతమాట అనేసేదాన్నట! ఎవరికి వాళ్ళు 'అబ్బో! దాంతో మనకెందుకులే' అనుకున్నట్లు తప్పుకుని వెళ్ళిపోయేవారు.

నాకిప్పటికీ బాగా గుర్తు!

అందరూ ఆడరౌడీ అని పిల్చేవారు! మామయ్య ఇప్పటికీ అలాగే పిలుస్తాడు.

అమ్మమ్మ అపుడపుడూ నన్ను చూసి ఏడుస్తుండేది.

"ఎందుకమ్మా?" అనడిగితే-

కంట్లో నలకపడిందనో, తలనొప్పిగా వుందనో సాకులు చెప్పేది.

ఆ వయసులో ఆమె చెప్పే కారణాలు సాకులనీ, నిజమైనవి కావనీ



నాకు తెలిసేది కాదు!

నమ్మేసేదాన్ని!

ఆమెకు దగ్గరగా వెళ్ళి రెండువేళ్ళతో ఆమె కన్ను తెరిచి ఊదే దాన్ని.

అమృతాంజనం రాయనా అమ్మా అంటూంటే దగ్గరగా లాక్కుని ఏడ్చేసేది!

నాకూ ఏడుపొచ్చేది!

నేనూ ఏడ్చేదాన్ని.

తాతగారు కోప్పడేవారు.

అప్పట్లో అవేమీ అర్థమయ్యేవి కావు.

నాకు అయిదారేళ్ళు వచ్చాక స్కూల్లో చేరాక అక్కడ జరిగే గొడవలు మరీ అర్థంకాకుండా ఉండేవి.

నాకంటే కాస్త పెద్దగా వుండే పిల్లలు నన్ను చూసి హేళనగా వెక్కిరింతగా-

"మీ అమ్మ మంచిది కాదంట" అనేవారు.

నాతోటి పిల్లలందరూ అది విని నవ్వేవారు.

అలా అందరూ నన్నుచూసి పరిహాసం చేస్తూంటే నాకు ఉక్రోషం వచ్చేది.

"మా అమ్మ మంచిది! మీ అమ్మే మంచిదికాదు" అంటూ ఎదురు తిరిగి పోట్లాడేదాన్ని.

ఒకటి-రెండుసార్లు ఆ పోట్లాట మాటలతో ఆగకుండా చేతులతో కొట్టుకునే వరకూ వెళ్ళింది. మాటా-మాటా పెరిగిపోయి ఇహ కోపాన్ని ఆపుకోలేక ఆ అమ్మాయి జడపట్టుకుని పీకేసాను! దాని వీపుమీద బడబడా కొట్టేసాను! అక్కడితో ఆగక దాని లంగా పట్టుకుని పీకి లాగి చింపేసాను. ఫలితంగా మాస్టారితో బాగా దెబ్బలు తిన్నాను.

ఇంటికి వెళ్ళాక ఇవేవీ అమ్మతో చెప్పలేదు. అయినా ఏడ్చిన నా ముఖాన్నీ, దెబ్బలుతిని బొబ్బలు కట్టిన నా చేతుల్నీ చూసి అమ్మ ఏడ్చేసింది.

నాన్న-అంటే తాతయ్య స్కూలుకొచ్చి మాస్టారిని అడిగేసారు.

జరిగిన గొడవ అంతా ఇంట్లో తెలిసింది.

మరి ఏమనుకున్నారో ఏమోగానీ అమ్మమ్మా, తాతయ్యా కలిసి నన్ను తీసికెళ్ళి హాస్టల్లో పడేసారు.

ఏడ్చాను! మొత్తుకున్నాను!

ఇంకెప్పుడూ ఎవరితోనూ గొడవపడనని ప్రతిమలాడాను.

తాతయ్య కాళ్ళుపట్టుకుని ఏడ్చేసాను.

అమ్మమ్మ తీసుకొచ్చేసింది.

అంతే!

అప్పట్నుంచీ ఆడరౌడీ అనే పేరుపడ్డ నేను పిల్లిలాగా అయి పోయాను.

స్కూలు పిల్లలు కావాలని ఉడికించేవారు!

వెక్కిరించేవారు!

రెచ్చగొట్టేవారు!

ఉహుం

ఏం చేసినా, ఎవ్వరేమనినా విననట్లుగా ప్రవర్తించేదాన్ని!

కానీ—

మనసులో కోపం!

అంతులేనంత కసి!

అసహ్యం!

వాళ్ళందర్నీ గొలుసులతో కట్టేసి రాళ్ళతో కొట్టాలనీ, గోళ్ళతో పీకేయాలనీ-

ఏదో ఒకరోజున వాళ్ళందర్నీ పీక పిసికి చంపేయాలనీ-

ఉద్రేకం!

ఏమీ చేయలేని అసహాయత!

నన్ను నేనే తిట్టుకునేదాన్ని!

ఆ సంఘర్షణల్లోనే పెరుగుతూన్న నాకు వయసు వచ్చింది!

మనసూ పెరిగింది!



విచక్షణా జ్ఞానం తెలుస్తోంది.

అమ్మా అని పిలుస్తూన్న అమ్మ-అమ్మకాదు....అమ్మమ్మ అనీ, నాన్న-తాతయ్య అని తెలిసింది.

మరి- అమ్మ-

అమ్మేమయింది?

ఆమెనెపుడూ చూసిన జ్ఞాపకమే లేదు.

నాన్న-?

అమ్మమ్మను అడిగాను.

"అమెరికాలో వున్నారు" అని చెప్పింది.

అప్పటికే ఆ సమాధానం చాలాసార్లు వినటం జరిగింది.

ఎప్పటిలా సరే అనటానికి చిన్నపిల్లను కాను! అందుకే అడిగాను.

"మరెప్పుడూ రారేమిటి? ఉత్తరం అయినా వ్రాయరేమి?"

అమ్మమ్మ ఏడ్చేసింది.

ఆమె ఏడుపు చూసి నేనూ ఇంకేమీ అడగలేకపోయాను.

ఇది జరిగిన కొన్ని రోజులకు-

నాకిప్పటికీ ప్రతిక్షణమూ, ప్రతి చిన్న సంఘటనా బాగా గుర్తుంది!

నేనపుడు పదోక్లాసు చదువుతున్నాను. స్కూలునుండి యింటికి వచ్చేసరికి అమ్మమ్మ చాలా హైరానాపడుతూ వంటచేస్తోంది.

"ఏమిటమ్మా? ఏమిటంత హడావుడి?"

"హడావుడే మరి!" నవ్వింది అమ్మ.

"ఏమిటి విశేషం?" కుతూహలంగా అడిగాను.

"మనింటికి బంధువులొస్తున్నారు."

"వస్తున్నారా? వచ్చారా?"

"వస్తున్నారు." ఊరిస్తున్నట్లుగా చెప్పింది.

నేను ఆశ్చర్యంగా చూశాను.

ఎందుకంటే నాకు తెలిసినంతవరకూ మా ఇంటికి వచ్చిపోయే స్నేహితులూ, చుట్టుపక్కల వాళ్ళు తప్ప బంధువులు అంటూ ఎవరూ వచ్చినట్లు గుర్తులేదు.

అమ్మ ముఖంలోని అలసటా అందులోనే మిళితమై ఉన్న ఆనందమూ చూస్తూ అడిగాను.

"అంత గొప్ప బంధువులు ఎవరమ్మా?"

"గొప్ప బంధువులేగానీ స్నానంచేసి కొత్త మంచిబట్టలేసుకో."

'బంధువులొస్తే మంచి బట్టలేసుకోవాలా– పిచ్చి అమ్మమ్మ' అనుకుంటూ లోపలకు వెళ్ళిపోయాను.

స్నానం చేసాను.

అమ్మమ్మ చెప్పినట్లు నేనేమీ క్రొత్తబట్టలు వేసుకోలేదు.

బొట్టు పెట్టుకుని, జడ వేసుకున్నాను.

నా హోమ్‌వర్క్ చేసుకుంటూ నేను గదిలోనే వున్నాను.

నాకు చిన్నప్పట్నుంచీ లెక్కలంటే చాలా యిష్టం. అందులోనూ బండ లెక్కలన్నా, పెద్ద లెక్కలన్నా మరీ ఇష్టంగా వుండేది. వాటిని వర్కవుట్‌చేసి అన్సర్ సాధించటం–

అదో గొప్ప అనుభూతి!

ఆ లెక్కలు చేస్తూ నేను నా పరిసరాల్నే మరిచిపోయాను. కొంచెం సేపటికి మామయ్య కంఠం పెద్దగా వినిపించి పుస్తకాన్ని అంటుకుపోయిన నా దృష్టిని బయటకు సారించాను

మామయ్య అరుస్తున్నాడు.

"ఎవరా వచ్చేది? నన్ను కాదని దాన్ని ఎవరికో ఇచ్చి పెళ్ళి చేస్తావా?"

"ఒరేయ్! అది తల్లి లేని పిల్లరా! దానికి పుట్టిల్లు అత్తిల్లు ఒక్కటేచేసి దాని గొంతు కొయ్యబోకు."

అమ్మమ్మ నచ్చచెబుతోంది.

ఆమె చెబుతున్నకొద్దీ మామయ్య రెచ్చిపోతున్నాడు.

గదిలో వున్న నేను ఆశ్చర్యపోయాను.

అప్పటికి 'పెళ్ళి' అనే ఆలోచనా లేదు.

అంత వయసూ లేదు.

ఆ గొడవేంటో అర్థంగాక తెల్లబోయి వింటున్నాను.



"ఇహ దానికా చదువు చాలు! ఇంకా చదివితే, వాళ్ళమ్మలాగా ఒళ్లు పొగరెక్కి ఎవడితోనో పోతుంది.

మావయ్య తిరస్కారానికి నాకు కోపం వచ్చింది.

అసహ్యం అన్పించింది.

ఒళ్ళంతా గొంగళిపురుగులు పాకుతున్నట్లుగా అయ్యింది.

అప్పుడే నాకో క్రొత్త విషయం—అదికూడా అమ్మను గురించి నాకు తెలీని విషయం ఏదో దాగి వుందనే సంగతి తెలిసింది. అంతేకాకుండా అదేదో మంచిదికాదు అనేది కూడా అర్థమయింది. ఆ రహస్యం తెలుసుకోవాలనే కుతూహలం కూడా కలిగింది.

అప్పటివరకూ మామయ్య అరుపులకూ, హడావుడికీ అసహ్యించుకుంటున్న నేను అవన్నీ మర్చిపోయాను.

కేవలం—అమ్మ జీవితంలో దాగివున్న రహస్యం—

పైగా బలాదూర్‌గా తిరిగే మామయ్య కూడా చులకనగా మాట్లాడటానికి కారణమైన ఆ రహస్యం-

ఊళ్ళోవాళ్ళు నావైపు అదోలా చూసే ఆ చూపులకు కారణమైన ఆ రహస్యం—

అదేదో తెలుసుకోవాలనే తపన నన్ను తొందర పెట్టసాగింది.

గబుక్కున గదిలోంచి బయటకు వచ్చాను.

ఎదురుగా మావయ్య—

కోపంగా, పొగరుగా, పోట్లగిత్తలా ఉన్న మావయ్య—

గడపకు అవతలగా నిలబడి బ్రతిమాలుతున్న ధోరణిలో వున్న అమ్మమ్మ-

ఒక్కక్షణం మావయ్య ముఖంలోకి చూసి నేను అమ్మమ్మ దగ్గరకు వెళ్ళాను

నన్ను చూసి ఏమనుకున్నాడో ఏమో- మావయ్య మాట్లాడకుండా పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ లుంగీని పైకి మడుచుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు.

అమ్మమ్మ క్షణంసేపు బిత్తరబోయినట్లు చూసింది. గబుక్కున ముఖ కవళికలను మార్చేసుకుంటూ రాని నవ్వుని బలవంతాన పెదవులకు పులుము కుంటూ క్రొత్త బట్టలు వేసుకోలేకపోయావా?" అనడిగింది.

"వేసుకుంటాలేగానీ ఇంకా నీ వంటపని అవలేదా?" నేనూ నా గుండెల్లోని తీవ్రతగానీ, నా రక్తంలోని వేగంగానీ, నా శరీరంలోని కంప నంగానీ- నా భావోద్రేకాలేవీ కూడా బయటకు రానీయకుండా ఎంతో మామూలుగా అడిగాను.

ఆవిడ తేలిగ్గా శ్వాస వదిలింది.

'అమ్మయ్య! ఈ రభస అంతా నువ్వు వినలేదన్నమాట.' అనే భావం స్పష్టంగా తెలిసింది.

"అయిపోయింది. ఇదిగో ఈ గిన్నె తీసుకెళ్ళి అక్కడపెట్టి మూత వేయి."

ఆమె చేతులు కడుక్కుంటూ నా వైపు తిరిగి ఏదో చెప్పబోతున్నది.

నా శరీరంలోని ప్రతి అణువూ నన్ను తొందర పెడుతోంది.

"అమ్మమ్మా!" అన్నాను.

ఏదో చెప్పాలనుకున్న అమ్మమ్మ గబుక్కున ఆపేసి నన్ను చూస్తూ ఆప్యాయంగా నవ్వింది.

"ఏమిటి?"

అడగాలనుకుంటున్న ప్రశ్నలు ఎన్ని వున్నా ఒక్కటి కూడా గొంతు దాటి బయటకు రావటంలేదు.

నేనూ బలవంతంగా నవ్వుతూ-

"ఏమీలేదు" అన్నాను.

మళ్ళీ నవ్వింది అమ్మమ్మ.

ఆమె చేతులు తుడుచుకుని చీర సవరించుకుంది. రెండు చేతులూ వెనక్కు పెట్టి జుట్టు ముడిని సవరించుకుంటూ హాల్లోకి నడిచింది. ఆమె వెనకాలే నేనూ వెళ్ళాను.

ఓసారి వీధి వరండావైపు చూసి కుర్చీలు సర్దింది. క్రిందపడి వున్న కాగితం ముక్కను ఏరి కిటికీలోంచి బయట సందులోకి పడేసింది. టేబిల్



పైన చిందరవందరగా వున్న పుస్తకాలు సర్దుతోంది.

ఇహ ఆపుకోలేకపోయాను.

ఆమె చేతిని పట్టుకుని గదిలోకి లాక్కెళ్ళి నా కుర్చీలో కూర్చో బెట్టాను. అంతే వేగంగా తలుపులు మూసి లోపల గడియ పెట్టాను.

నావంక ఆశ్చర్యంగా చూస్తున్న అమ్మమ్మ కాళ్ళ దగ్గరగా క్రింద నేలమీద కూర్చుని ఆమె ఒడిలో చేతులుపెట్టి, ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాను.

"అమ్మను గురించి నాకేమీ తెలీదు. నువ్వూ చెప్పలేదు! ఒకటి రెండు సార్లు అడిగితే ఏడ్చేశావు. అదిచూసి చచ్చిపోయిందేమో అనుకున్నాను. అసలు ఆమెని గూర్చి ఇంట్లో మాట్లాడుకోగా కూడా నేను వినలేదు. అలాంటిది ఇవ్వాళ నేనో క్రొత్త విషయం విన్నాను. ఇందాక మావయ్య ఏదో అన్నాడు. అదేమిటి?"

అమ్మమ్మ క్షణంసేపు నిర్ఘాంతపోయినట్లు చూసింది.

నాకే ఆశ్చర్యం అన్పించింది. అంత ఖచ్చితంగా అడగగలనని నేనూ అనుకోలేదు.

అడిగేశాను.

అమ్మమ్మ తేరుకుంది.

"ఏముంది? ఏంలేదే" సర్దుకోవటానికి ప్రయత్నిస్తోంది.

నేను ఊరుకోలేదు.

"అలా దబాయించి తీసిపారేయకు. ఆ విషయం ఏదైనా, ఎలాంటిదయినా సరే నువ్వు నాకు చెప్పి తీరాలి."

అమ్మమ్మ కళ్ళల్లోకి నీళ్ళు వచ్చేశాయి.

అయినా సరే నేను వెనక్కు తగ్గదల్చుకోలేదు.

పట్టుదలగా ఆమె ముఖంలోకి చూస్తూ ఆమె బుగ్గలపైకి కారుతున్న నీటిని తుడుస్తూ అడిగాను.

"అమ్మమ్మా ప్లీజ్! నాకు చెప్పవూ...."

నువ్వు చిన్న పిల్లవు...." నాకు నచ్చచెప్పటానికి చేస్తూన్న ఆమె ప్రయత్నాన్ని నేను సాగనివ్వలేదు.

తల అడ్డంగా తిప్పుతూ మళ్ళీ అడిగాను.

"ఫర్వాలేదు అమ్మమ్మా! నేనేమీ పాపాయిని కాదు. మామయ్య మాటలు అర్థమయిన నాకు నువ్వు చెప్పే విషయాలు అర్థంకాకపోవు! చెప్పు?"

అలా అడుగుతూన్నపుడు నాకూ గొంతు వణికింది. నా శరీరం ఓ క్షణంపాటు కంపించటం నాకు స్పష్టంగా తెలుస్తూనే వుంది.

ఆమె దుఃఖం చూస్తూంటే నా ప్రమేయం లేకుండా నా కళ్ళల్లోకి నీళ్ళు వచ్చేస్తున్నాయి.

అమ్మమ్మ చెప్పటం ప్రారంభించింది.

"మీ అమ్మ చిన్నప్పట్నుండీ చాలా పట్టుదల గల మనిషి! చిన్న తరగతుల ఎగ్గర్నుంచీ కూడా చక్కగా చదువుకుంది. మంచి మార్కులతో పాసవుతూంటే మీ తాతగారు "నా తల్లిని డాక్టర్ చదివిస్తాను" అంటుండేవారు. దానికి తగినట్లే మీ మామయ్యకు చదువు మీద ఆసక్తి లేక చెడు స్నేహాలకు లోబడిడు పిచ్చి తిరుగు మొదలుపెట్టాడు. వాడిని బాగుచేయటం మా వల్ల కాలేదు. భగవంతుని మీద భారంవేసి వాడిని కాలానికి వదిలేశాము. మీ అమ్మకు ప్రీ యూనివర్సిటీలో మంచి మార్కులొచ్చాయి. మెడికల్ కాలేజీలో సీటుకోసం అప్లికేషన్ పేయించారు. సీటు తేలిగ్గానే దొరికింది. ఐదువేలు కట్టాలన్నారు.

వెనకా ముందూ ఆలోచించమని నేను సతాయించుతూన్నా మీ తాతగారు లెక్కచేయలేదు. డబ్బు కట్టేసి జాయిన్ చేశారు.

పుస్తకాలు కొని, హాస్టల్లో పెట్టి వచ్చేసరికి మీ తాతగారికి బాగానే ఖర్చు అయ్యింది.

అయినా అదిగో ఆ పడక్కుర్చీలో కూర్చుని "ఎంత ఖర్చయినా ఫర్వాలేదు, నాకూతుర్ని డాక్టర్ చేస్తాను. అది డాక్టరయ్యి పది మందికి ప్రాణదానం చేస్తూంటే ఎంత గర్వంగా వుంటుంది. ఆ డాక్టరు ఈయన కూతురే అని చెప్పుకుంటూంటే.... ఆ ఆనందం ముందు ఈ ఖర్చులూ, అప్పులూ, శ్రమా....ఎంత" అని మురిసిపోయేవారు.

మొదట్లో హాస్టల్లో వుండలేక, మమ్మల్ని ఒదిలి వుండటం అలవాటు



లేక ఇబ్బంది పడింది. తర్వాత తర్వాత అలవాటు పడిపోయింది. బాగా చదివేది. ఆ కాలేజీలో కూడా మంచి పేరు తెచ్చుకుంది.

మూడో సంవత్సరంలో పండగా అనుకుంటాను సెలవులకు వస్తూ వస్తూ ఓ కుర్రాడిని వెంబడి తీసుకొచ్చి మీ తాతగారికి చూపించింది.

తను ప్రేమించాననీ, పెళ్ళి చేయమనీ అడిగింది.

మీ అమ్మ పట్టుదల, మొండితనం తెలిసిన మీ తాతగారు ఆ అబ్బాయిని సాదరంగా కూర్చోబెట్టి అతడి కుటుంబం గురించి అన్నీ అడిగి తెలుసుకున్నారు.

ఆ అబ్బాయి ఆ రాత్రి మనింట్లోనే వున్నాడు.

మర్నాడు అతడితో కలిసి మీ తాతగారు అతడి ఊరెళ్ళి అతడి తల్లితండ్రులతో మాట్లాడి పెళ్ళి ఖాయం చేసుకున్నారు.

ఆ వేసవిలో పెళ్ళి జరిగింది.

ఆ మరుసటి సంవత్సరం మీ నాన్న చదువు అయిపోయింది.

ఆయన అమెరికా వెళ్ళటానికి పరీక్షలు వ్రాసారు! సెలెక్టయ్యారు! వెళ్ళిపోయారు!

అప్పటికి నువ్వు మీ అమ్మ కడుపులో వున్నావు.

మీ నాన్నగారు కూడా ఇక్కడ లేరనీ, మీ అమ్మ గర్భవతి అనీ మీ తాతగారూ, నేనూ కూడా ఆమెని చాలా అపురూపంగా చూసే వాళ్ళం!

మీ తాతగారు వారానికోసారి హాస్టల్ కు వెళ్ళి మీ అమ్మకు కావలసిన మందులూ, హార్లిక్సూ అన్నీ కొనిచ్చి మంచీ చెడూ చూస్తుండే వారు.

మీ నాన్నగారు ఉత్తరాలు వ్రాస్తుండేవారు. ఎపుడయినా కాస్త ఆలస్యం అయిందంటే ఇహ మీ అమ్మచేసే రాద్ధాంతం అంతా ఇంతా కాదు....

అమ్మమ్మ చెబుతూంటే అవన్నీ నా కళ్ళెదుట జరుగుతూన్న దృశ్యాల్లాగే అన్పించేది. ఆమె చెబుతూన్న పద్ధతికి నవ్వుకూడా వచ్చింది. ముఖ్యంగా మా అమ్మ పట్టుదల, వ్యక్తిత్వం నాకు నచ్చాయి! నాకు తెలియకుండానే నా కళ్ళల్లోనికి మెరుపూ, నా బుగ్గల్లోనికి వెచ్చని ఆవిరీ,

నా మనసునిండా సంతోషమూ ఆవరించుకున్నాయి.

మా అమ్మ....నాన్న....

నాకు లేరనీ, మంచి వాళ్ళు కారనీ ఊర్లో వాళ్ళూ, తోటి వాళ్ళు వెక్కిరించటం చిన్నప్పట్నించీ జరుగుతోంది!

అలాంటిది–

ఇపుడు —

మా అమ్మ, నాన్న—ఇద్దరూ డాక్టర్లు! పైగా అమెరికాలో!

చదువూ సంస్కారం నిండుగా వున్న వ్యక్తులు! సమాజంలో గుర్తింపు వున్న వాళ్ళు! అదేదో నాకు చాలా క్రెడిట్ ఇచ్చే విషయంలాగా అన్పించింది.

బంగారు పతకం అందుకున్నంతగా సంతోషపడిపోయాను.

కించిత్ గర్వంగా కూడా అన్పించింది.

....నువ్వు పుట్టావు.

నిన్ను నా దగ్గర ఒదిలేసి పరీక్షలు వ్రాయటానికని మీ అమ్మ వెళ్ళింది.

మీ తాతయ్యగారు, నాయనమ్మ వచ్చి చూసి వెళ్ళారు.

మా ఇంట్లో చాలా సంవత్సరాల తర్వాత చిన్న బిడ్డ ఏడుపు విన్పిస్తోంది!

మీ తాతగారు నిన్ను చాలా గారాబంగా చూసేవారు!

నువ్వు నవ్వితే సంగీతం విన్పిస్తోంది అనేవారు! ఏడిస్తే మాకు తిట్లు పడేవి.

"దాన్ని జాగ్రత్తగా చూడటం కన్నా ముఖ్యమయిన పన్లేమిటి నీకు" అని చివాట్లేసేవారు.

మీ అమ్మ అమెరికా వెళ్ళటానికి పరీక్షలు వ్రాసింది. వెళ్ళే రోజు దగ్గర పడుతూన్న కొద్దీ నీ దగ్గర కూర్చుని దిగులుగా, బెంగగా చూసుకునేది.

మీ తాతగారు వెక్కి రించేవారు.

"నీ కూతుర్ని జాగ్రత్తగా నీకప్పగించుతాములే" అని హామీ ఇస్తు



నవ్వేవారు.

కాని—ఆ పని చేయనే లేకపోయాము." అమ్మమ్మ గొంతు జీరపోయింది.

కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకుంది. పమిట చెంగుతో కళ్ళద్దాలు తుడుచుకుంటూంటే నేను చాలా ఆసక్తిగా ఆమె ముఖంలోకి చూస్తున్నాను.

"ఏమయింది తర్వాత? అమ్మమ్మ దుఃఖానికి కారణమేమిటి? ఎందువల్ల నన్ను అప్పజెప్పలేకపోయారు?" అడగాలని తొందరపడుతూన్న నా మనసుని ఏదో శక్తి అడ్డం వచ్చి ఆపింది.

అమ్మమ్మే చెబుతున్నది.

"అక్కడకు వెళ్ళాక రెండేళ్ళు మీ అమ్మ నాన్న బాగానే వున్నారు. ఆ తర్వాత జరిగిన వివరాలు నాకంతగా తెలీవుకానీ తెలిసిన విషయం మాత్రం...."

మళ్ళీ అమ్మమ్మ మాట్లాడటం ఆపేసింది. క్రింది పెదవిని బిగపెట్టి వుంచటంలోనే తెలుస్తోంది–ఆమె ఎంత బాధను అనుభవిస్తోందో....పాత జ్ఞాపకాలన్నీ తవ్వుతూంటే గుండెల్లో వాగిన దుఃఖం ఎంతగా బయటకు తోసుకొస్తోందో–

"ఏమైంది అమ్మమ్మా? అమ్మకేమైంది?"

"మీ అమ్మకేమీ అవలేదమ్మా. రాయిలాగా బాగానే వుంది! మమ్మల్నే నవ్వులపాలు చేసి జీవచ్ఛవాల్లా బ్రతకమని శాసించింది!

అది నా కడుపున ఎందుకు పుట్టిందా అని ఏడవని రోజులేదు! దేవుడెందుకింత కఠినశిక్ష నాకిచ్చాడు అని తల బాదుకున్నాను! ఏ జన్మలో ఎవరికి ఎలాంటి పాపం చేశానో ఈ జన్మలో ఇలా ఒడికట్టుకున్నానను కున్నాను!

నా ముఖాన్ని ఇతరులకు చూపాలంటే సిగ్గుతో చచ్చిపోయేదాన్ని!

నా కాళ్ళకు అడ్డంపడే నువ్వే లేకుంటే ఆనాడే నుయ్యో గొయ్యో చూసుకుని వుండేదాన్ని. ఆనాటి నుండీ ఈనాటివరకూ ఈ గడపదాటి బజారులో అడుగు పెట్టలేకపోయాను! ఒక పెళ్ళి, పేరంటమూ, చావూ, తద్దినమూ-ఏమీలేవు....!"

అమ్మమ్మ మాటలు నన్ను మరింత ఆశ్చర్యంలోకి తోసేశాయి.

ఇందాకటి మామయ్య మాటలకూ ఇప్పుడు అమ్మమ్మ చెబుతున్న దానికీ ఏదో లంకె వున్నట్లుగా బోధపడుతోంది. బడబానలంలాటి రహస్య మేదో ఉంది!

"ఏంజరిగింది అమ్మమ్మా? అమ్మ ఏంచేసింది?"

"అమ్మ....! బంగారంలాంటి నీతో అమ్మ అని పిలిపించుకునే అర్హత పోగొట్టుకున్న దౌర్భాగ్యురాలు! మన ఇంట్లో చెడపుట్టింది.

ఇక్కడ్నుంచీ వెళ్ళాక అక్కడ మరో కుటుంబంతో స్నేహం కలిసిందట! ఉత్తరాలలోకూడా వాళ్ళను గురించి వ్రాస్తుండేది. ఆ దంపతులలో అతడేమో డాక్టరట....ఆవిడ అంత పెద్దగా ఏమీ చదువుకోలేదు. వాళ్ళకో కొడుకుకూడా వున్నాడట. మీ అమ్మ డ్రయివింగ్ నేర్చుకుని కారు కొనుక్కునే వరకూ మీ నాన్నగానీ, ఆ ఇంకో డాక్టర్‌గానీ తీసుకెళ్ళటం, తీసుకురావటం చేస్తుండేవారట. మీ అమ్మ పనిచేసే హాస్పిటల్ పేరూ, మీ నాన్న పనిచేసే హాస్పిటల్ పేరు అవ్వటం కూడా మన దురదృష్టమయ్యింది. మరి ఎలా దగ్గరయ్యారో ఏమో ఆ డాక్టరుకూ మీ అమ్మకూ స్నేహం బాగా ముదిరిపోయింది!

మీ నాన్న కోప్పడినా, బెదిరించినా లాభం లేకపోయింది. ఇహ చేసేదిలేక మీనాన్న మాకు ఉత్తరం వ్రాసాడు.

మాకూ ఏం చేయాలో తోచలేదు.

'మాకు పుట్టనే లేదనుకుంటాము!

చచ్చిపోయిందనుకుంటాము....' అంటూ మీ తాతగారు కేక లేసారు!

నేనూ ఏడ్చాను....

వాటితో సమస్య తీరదుకదా....

మీ నాన్నకు తాతగారు ఉత్తరం వ్రాసారు.

"బాబూ....! నీవు వ్రాసిన ఉత్తరం చూసి చాలా సిగ్గుపడ్డాము.... అలాంటి పాపిష్టిదాన్ని కన్నందుకూ, నీకిచ్చి పెళ్ళి చేసినందుకూ, నీ జీవితంలో నీవనుభవిస్తున్న అవమానాలకూ, అగచాట్లకూ కారణమైనందుకూ-



నీ పాదాలంటి క్షమించమని అడగటంకన్నా ఇంకేమీ చేయగలమో తెలియటం లేదు.

దానికో బిడ్డ ఉన్నదనే సంగతికూడా మర్చిపోయి ఓ బజారు స్త్రీలా ప్రవర్తించుతుందని కలలోకూడా ఊహించలేదు.

నా వైపుగానీ, మీ అమ్మమ్మ వైపుగానీ ఇలాంటి దిక్కుమాలిన తప్పుడు పని ఎవ్వరూ చేయలేదు.

ఇంటి గౌరవాన్ని, కన్నవాళ్ళ పరువునూ, కట్టుకున్నవాడి ప్రతిష్ఠా మర్యాదా ఇంతగా కూల్చేస్తుందని అనుకోలేదు. అలాంటి నీచపు బుద్ధి దానికెలా వచ్చిందో ఆ భగవంతుడికే తెలియాలి!

నా కూతురు చచ్చిపోయిందనుకుంటాను.

నువ్వు మగమహారాజువి!

నీకేం తక్కువ!

చదువూ, అందమూ, ఆస్తీ ముఖ్యంగా మంచిగుణమూ, చక్కని సంస్కారమూ అన్నీ వున్న నీవు ఆ పోయిన దానికోసం విచారించవద్దు!

అసలు దానిగురించిన ఆలోచనలే రానీవ్వబోకు!

నువ్వు నాకు అల్లుడివి కాదు!

నాకు పెద్దకొడుకువి!

నీ జీవితాన్ని వృధాచేసుకోవద్దు!

నీకేది మంచిదనిపిస్తే ఆ మార్గాన్ని ఎన్నుకో! నువ్వు ఎలాటి నిర్ణయం తీసుకున్నా నా ఆశీర్వాదం నీకుంటుంది!

నీకు చెప్పే అర్హతను పోగొట్టుకున్నవాడిని! నీకు నేనేమి సలహా ఇవ్వగలను? నువ్వేంచేసినా నాకానందమే!

నీ బిడ్డకు మేమే తల్లితండ్రులమయి పెంచుతాము. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితుల్లోనూ, ఏకారణంగానూ నీ జీవితంలో జోక్యం చేసుకోను...." అంటూ మీ తాతగారు ఉత్తరం వ్రాసారు.

అదే ఆఖరు!

ఇహ ఆ తర్వాత మీ నాన్నగారి దగ్గర్నుండీ ఎలాంటి బదులూ

రాలేదు. మీ అమ్మ సరేసరి-అంతకు ముందరనుండే ఉత్తరాలు రావటం ఆగిపోయాయి.

దగ్గరా దాపా! వెళ్ళి చూడాలన్నా, మందలించాలన్నా మనవల్ల అయ్యేపని కాదు.

ఏంచేస్తాం?

ఊళ్ళోవాళ్ళ మాటలు, కడుపుకోతను రెట్టింపు చేస్తుంటే క్రుంగిపోయి, చావలేక బ్రతుకుతూ మట్టిబొమ్మలా వుండిపోయాము.

పదమూడేళ్ళు దాటిపోయాయి.

మీ నాయనమ్మగానీ, తాతగారుగానీ రాలేదు. ఏమిటి ఏం జరిగిందీ-అని అడగలేదు. అసలు వాళ్ళకు తెలుసో లేదో—

తెలిస్తే-ఏమని తెలుసో, తెలియకపోతే—ఎందుకు తెలియదో—మాకర్థంకాలేదు.

మేమూ వెళ్ళలేదు.

అంతే!

ఆ బంధుత్వం అక్కడితో అలా తెగిపోయింది.

నువ్వు చిన్నదానివి! అర్థంచేసుకునే వయసు లేదు.

వయసు వచ్చాక ఏనాడో అడుగున పడి పాతబడిపోయిన ఆ విషయాలన్నీ కెలికి నీకు చెప్పి నీ మనసు కష్టపెట్టటం ఇష్టంలేకనే నీకు చెప్పలేదు!

చెబితే కలిగే లాభంకన్నా...."

అమ్మమ్మ ఇంకా ఏమో చెబుతూనే వుంది. ఇహ నాకు వినాలన్పించలేదు.

వినే ఓపిక చచ్చిపోయింది!

జీర్ణం చేసుకునే సహనం చచ్చిపోయింది.

నా మనసంతా చేదుగా, అసహ్యంగా, వికారంగా అయిపోయింది

'ఛట్! నా తల్లి అలాంటిదా?' అని కొన్ని వందలసార్లు అనుకున్నాను.

అలాంటి చరిత్రహీనురాలికి కూతుర్ని అనుకుంటే నామీద నాకే అసహ్యం!

నేనంటే నాకే ఏవగింపు!

కొన్ని నిమిషాల క్రితం అమ్మా నాన్నల వ్యక్తిత్వాల గురించీ, వాళ్ళ వృత్తులగురించీ కొన్ని క్షణాలపాటు గర్వపడిన నా హృదయం నిజమంతా తెలుసుకున్న పిమ్మట కృంగిపోయింది!

ఇహ అప్పట్నుంచీ నాకు ఎవరితో మాట్లాడాలన్నా జంకు!

ఎవరివైపు చూడాలన్నా భయం!

ఎవరు మాట్లాడుకుంటున్నా అది నా గురించేనేమో అని అనుమానం!

రానురానూ వయసు పెరుగుతూన్నకొద్దీ నా మానసిక స్థితి ఇంకా ఇంకా దిగజారిపోతోంది!

ఏ తప్పుకయినా ఏదో ఒక కారణముంటుంది!

పశ్చాత్తాప ముంటుంది! క్షమ ఉంటుంది!

ప్రాయశ్చిత్తమూ ఉంటుంది!

కాని ...

మా అమ్మ చేసిన తప్పుకు ఎలాటి కారణముందో నాకు తెలీదు.

కానీ—అమ్మమ్మనూ, తాతయ్యనూ క్షోభపెట్టిన అమ్మను-

అసలు బ్రతికి వున్నానో లేనో కూడా తెలుసుకోకుండా కన్న బిడ్డను-నన్నిలా గాలికి వదిలేసిన అమ్మను-

బాధ్యతల్ని ఒదిలేసిన అమ్మను-

నా మనసు అమ్మగా అంగీకరించదు!

క్షమించదు!

అందుకే అమ్మమ్మ పెట్లో బట్టలక్రింద భద్రంగా దాచి ఉంచిన పెళ్ళి ఫోటోని పొయ్యిలో పడేసి కాల్చేసాను.

అమ్మమ్మ కోప్పడింది. తప్పు అని వారించింది. మందలించింది!

అయినా నేను వినలేదు.

నాకది తప్పుగా అన్పించలేదు.

నేను చేసింది న్యాయమే అన్పించింది.

అసలా ఫోటో కాలి బూడిదవుతూంటే-నా మనసుకేదో చిత్రమైన ఆనందం కలిగింది.

ఇన్నాళ్ళూ నేనూ చిన్నదాన్నవటం వల్ల-ఏనాడో జరిగిన ఆ చోద్యం అడుగున పడిపోయింది.

ఇప్పుడు నేనూ పెద్దదాన్నయ్యాను. పెళ్ళిచేయాలని తాతయ్యకు తొందర!

అందులో మామయ్య వేధింపు!

అమ్మమ్మ ఏడుపు!

ఇక నేనా ఇంట్లోనే కాదు- ఆ వూర్లోనే వుండటం కష్టమైపోతూంటే తాతయ్యను బ్రతిమలాడి ఇలా హాస్టల్లో చేరాను."

ఉమ చెప్పిందంతా శ్రద్ధగా విన్న స్నేహితులు ఏమీ మాట్లాడలేక పోయారు.

ఏమి మాట్లాడితే ఉమ ఎలా రియాక్టవుతుందో అని భయపడి ఎవ్వరూ నోరు విప్పలేదు

ప్రేమగా, ఆర్తిగా, అనునయంగా ఆమె చేతిని పట్టుకుని నొక్కి పదిలారు.

ఆ స్పర్శలో ఎన్నో భావాలు ఆప్యాయంగా ఆమెని చుట్టుముట్టాయి.

నిశ్శబ్దం నిశ్శబ్దంగా రాజ్యమేలుతున్నది. చీకటి చిక్కడు పొదలా దట్టంగా అల్లుకుని విస్తరించింది.

దూరంగా వరండాలో వెలుగుతున్న లైటు వెలుతురులో అటూ-ఇటూ తిరుగుతున్న తోటి విద్యార్థినులను చూస్తూ ఎవరికి తోచినట్లు వారు ఏదో ఆలోచిస్తూ, వూహిస్తూ పరిసరాలు మర్చిపోయి నీడల్లా, బొమ్మల్లా కూర్చుండిపోయారు.

ఆనంది అనుకుంటోంది.

పిల్లలు తప్పుచేస్తే బాధ్యత తల్లితండ్రులదెలా అవుతుందో అలాగే తల్లితండ్రులు చేసే తప్పుల ఫలితాలు పిల్లలూ అనుభవించాల్సి వస్తుంది.

వాటి నీడలు ఎంతకాలమయినా వెంటాడుతూనే వుంటాయికాబోలు

ఎనిమిది గంటలయినట్లుంది.



డైనింగ్ బెల్ మోగటంతో ఉలిక్కిపడి లేచి నిలబడ్డారు.

* * * *

ఆ రోజు ఆదివారం!

అందరూ ఉదయాన్నే తలస్నానం చేశారు.

బట్టలు ఉతుక్కుని ఆరబెట్టుకున్నారు.

బట్టల పెట్టెలూ, పుస్తకాల అరలూ సర్దుకున్నారు.

టిఫిన్ తిని వస్తున్నారు.

చెట్లక్రింద నిలబడి తమకోసం వచ్చే విజిటర్స్ కోసం ఎదురు చూస్తున్న తోటి విద్యార్థినులను చూసి నవ్వుతూ అన్నది ఊహ.

"మనకు కూడా ఎవరైనా వస్తే బాగుండును."

"ఎవ్వరైనా- అంటే?" కొంటెగా అడిగింది ఈశ్వరి.

"ఎవ్వరైనా ఫర్వాలేదు" నొక్కిపలుకుతూ ఇంకాస్త కొంటెగా నవ్వుతూ అన్నది ఊహ.

"ఎవరైనా ఫర్వాలేదా? పేరెంట్స్ రావాలా? బ్రదర్స్ రావాలా? సిస్టర్స్ రావాలా? అందరూ కలిసి రావాలా? మనలో ఒకరికోసం వచ్చినా చాలా? అందరికీ రావాలా....?"

"స్టాప్! స్టాప్! స్టాప్! ఈ సుత్తి డైలాగులు వద్దుగానీ అటుచూడండి త్రోబాల్ ఆడుతున్నారు. మనం కూడా జాయినవుదామా?"

"యా! గుడ్! గుడ్ సజెషన్! లెటజ్ గో" అందరూ అటువైపు నడిచారు.

ఇందిర, ఊహ వరండా గట్టుపైన కూర్చుని తిలకిస్తున్నారు. మిగిలినవాళ్ళు గ్రౌండులోని జట్టుతో చేరిపోయారు.

ఊహ కబుర్లు చెప్పటంలో మంచి నేర్పరి! తన దగ్గర కూర్చుంటే విసుగు అనేదే తెలియదు. సమయం గడిచిపోతున్నది కూడా తెలియదు.

ఊహ చెబుతూంటే శ్రద్ధగా వింటోంది ఇందిర. ఇంతలో వాళ్ళ ప్రక్కనుండీ మరో స్టూడెంట్స్ గ్రూప్‌గా వెళుతూ "హాయ్" చెబుతూంటే ఇందిర చేయి వూపింది. ఊహ ఉషారుగా "హాయ్" అంటూ బదులు చెబుతోంది. అందులో ఓ కన్నడం అమ్మాయి వుండి ఊహను కన్నడంలో

ఏమో అడిగింది. ఊహ కూడా కళ్ళు పెద్దవిగా చేసి చేతులు తిప్పుతూ మంచి హుషారుగా చెబుతోంది. అలా ఆ అమ్మాయి ఊహ ప్రక్కన సెటిలయిపోయింది. తాత్కాలికంగా ఇందిరను మర్చిపోయి ధారాళంగా ఏవేవో మాట్లాడేసుకుంటున్నారు.

మాతృభాషమీద మమకారం అంతలా వుంటుంది కాబోలు! అలా మాట్లాడేవాళ్ళు దొరకంగానే అన్నీ మర్చిపోయి అలా అల్లుకుపోయి కబుర్లు చెప్పకుంటున్నారు.

మనకు తెలీకుండానే మనలో అంతర్లీనంగా కొన్ని ప్రేమలూ, కొన్ని కోపాలూ, కొన్ని విద్యలూ అన్నీ చోటుచేసుకుని వుంటాయి కాబోలు!

ఏ మనిషీ కూడా వున్న అరవై నాలుగు కళల్లోనూ నిష్ణాతులవ్వలేరు. అలాగే ఏమీ రాని వ్యక్తులూ ఉండరు. ప్రతివాళ్ళలోనూ ఏవో కొన్ని ప్రత్యేకతలు తప్పనిసరిగా చోటుచేసుకుని వుంటాయి.

కొంతమందిలో త్వరగా బహిర్గతమవుతాయి. కొంతమందికి కొన్ని ఉత్ప్రేరకాలు ఉంటే కానీ బయటకు రావు.

పుడుతూనే దేశభక్తులుగానో, కళాకారులుగానో, క్రీడాకారులుగానో, రాజకీయవాదులుగానో, ఖూనీకోరులుగానో పుట్టరు కదా!

కొంత రక్తంలో వుంటే మరికొంత పరిసరాల ప్రభావం, తల్లిదండ్రుల పెంపకం, స్నేహితుల సహచర్యం, తోటివాళ్ళ ప్రోత్సాహం- మంచో-చెడో అదో ప్రవాహం- అందులో కొట్టుకుపోవటం- ఎలాంటి వాళ్ళకూ తప్పని పరిస్థితే అవుతుంది.

మనిషికి ప్రపంచం పాఠశాల అయితే అనుభవాలే టీచర్లవుతారు.

ఈ పాఠశాలలో చదువుకోవటానికి మనిషికి వయసుతో సంబంధం లేదు.

బ్రతికినంతకాలమూ నేర్చుకుంటూనే వుంటారు. తప్పులు జరుగుతూనే వుంటాయి.

దిద్దుకుంటూనే వుంటారు.

ఇవ్వాళ్టి తప్పు రేపటికో అనుభవం అవ్వాలి. అంతేకానీ అలవాటు



కాకూడదు.

ఇందిరకు ఆట చూడటంలో ఆసక్తి సన్నగిల్లిపోతోంది.

ఊహ! వాళ్ళ మాటలూ అర్థంకావటంలేదు.

విసుగేసి—

నెమ్మదిగా లేచి వరండా దిగి రూమ్‌వైపుకు నడిచింది.

ఆరిన బట్టలన్నీ తీసి మడతలు పెట్టి వాళ్ళవాళ్ళ బాప్సులపైన పెట్టింది.

చాప తీసుకుని చెట్టుక్రిందకు వెళ్ళింది

యద్దనపూడి సులోచనారాణి వ్రాసిన నవల 'మీనా' పట్టుకుని కూర్చుంది.

ఇందిరకు పుస్తకాలంటే ఇష్టం. అందులోనూ యద్దనపూడి సృష్టించే హీరోయిన్స్ అంటే ఇంకా ఇష్టం. అమాయకంగా కన్పిస్తూ ఆత్మాభిమానం నిలబెట్టుకోవటానికి చేసే ఎడ్వెంచర్స్‌ను ఎగ్జైర్ చేస్తూ ఆ పుస్తకాల్లో మునిగిపోతుంది. అన్ని పుస్తకాల్లోకీ 'మీనా' అంటే ఇంకా ఇష్టం. అందులోనూ మొదటిభాగం ఇంకా ఇంకా ఇష్టం. అందులోని హీరో పాత్రంటే ఇంకా ఇష్టం.

అతడు సవతి తల్లితో, తమ్ముళ్ళతో, చెల్లెళ్ళతో జీవించే పద్ధతీ, మాట్లాడే తీరూ ఇందిరకెంతో ఇష్టం. అలాటి మనిషి తన జీవితంలో కనిపిస్తే—

అమ్మో- ఎంత బాగుంటుందో అనుకుంటుంది.

ఇందిరకు అన్నలు లేరు. ఇద్దరూ తమ్ముళ్ళే! అ ఇద్దరిలో ఒక్కడయినా ఆ హీరో అంత మంచివాడయితే అనుకుంటుంది.

అలాటి భర్త దొరికితే—

తన వూహకు తనే నవ్వుకుంది.

ఇక ఇందిరకు ఆ పుస్తకం చదవాలనిపించలేదు. ఆమెకు అప్పుడప్పుడూ అలా కళ్ళు మూసుకుని పడుకుని ఆలోచించుకోవటం కూడా మరో ఇష్టమైన చర్య.

ఆ ఆలోచనల్లో, వూహల్లో ఏవేవో దృశ్యాలు కనురెప్పలక్రింద

ప్రాణం పోసుకుని సజీవంగా కన్పిస్తాయి. ఆ పాత్రలతో కాసేపు ముచ్చటించుతూ మురిసిపోతుంది.

ఒక్కోసారి ఆయా పాత్రల ప్రభావం ఒకటి రెండు రోజులవరకూ ఆమెని వదలదు.

అదో వింత అలవాటు.

ఇవ్వాళ కూడా ఆమె అలాంటి వూహలతో రెండు అరచేతులూ కలిపి చెంపక్రింద పెట్టుకుని పడుకుంది.

ఇవ్వాళ ఆమె కళ్ళల్లోకి నవలల్లోని పాత్రలకు బదులుగా అమ్మ, నాన్న, తమ్ముళ్ళు, నాయనమ్మా వరుసగా వస్తున్నారు.

మొన్న సెలవులకు వెళ్ళినప్పుడు నాయనమ్మ నాన్నగారితో అంటోంది.

"నేను బ్రతికివుండగానే దానికి పెళ్ళిచేసెయ్యరా రావుడూ! చూసి చచ్చిపోతాను."

ఇందిర పెద్ద తమ్ముడు ప్రకాష్ నాయనమ్మ దగ్గరకు చేరి నవ్వుతూ అడిగాడు-

"నానమ్మా- ఎందుకంత తొందర?"

"ఎవరికి తొందర? నానమ్మకా, అక్కకా?" చిన్న తమ్ముడు రమేష్ కొంటెగా వేసిన ప్రశ్న!

"చచ్చిపోటానికి! నానమ్మా-అక్క పెళ్ళేమిటి! నా పెళ్ళి, నా కొడుకుపెళ్ళి కూడా చూసి తీరిగ్గా చచ్చిపోదువుగాని ఇప్పుడెందుకంత తొందర?"

ఫక్కున నవ్వింది ఇందిర.

"వెధవల్లారా! వెధవ కబుర్లూ మీరూనూ! పెద్దమనిషితో ఏమిటా పరిహాసాలు! పొండి అవతలకు" విసుక్కుంది ఇందిర తల్లి.

అప్పుడే వచ్చిన ఇందిర తండ్రి-

"ఏమిట్రా-ఏమంటున్నావు మా అమ్మను" చెప్పులు వదులుతూ అన్నారు.

దగ్గరగా ఉన్న మనవడి బుగ్గలు రాస్తూ-"పరిహాసమేముందే! ఐనా



ఆ హక్కు వాడికి కాక ఇంకెవరికుంటుంది చెప్పు! వాడిప్రేమ నన్నంత కాలం బ్రతకమని కోరుకుంటోంది" అంది నానమ్మ.

అవన్నీ గుర్తుకొస్తూంటే చిన్నగా నవ్వుకుంది ఇందిర.

ఆనంది వచ్చింది. వస్తూనే అడిగింది-

"ఏమిటి నీలో నువ్వు నవ్వుకుంటున్నావు?"

"ఏంలేదు. అమ్మా, నాన్నా, తమ్ముళ్ళూ గుర్తుకొచ్చి నవ్వొచ్చింది-ఏం-నువ్వొక్కదానివే వచ్చావు?"

"వాళ్ళింకా ఆడుతున్నారు"

ఇందిర ప్రక్కనే కూర్చుంది.

అలా అలా కబుర్లలో పడిపోయారు.

పుస్తకాలు, అమ్మాయిలు, అబ్బాయిలు-అన్నీ అలా అలా వెళ్ళి అమ్మలూ, నాన్నలూ వరకూ వచ్చింది సంభాషణ.

సడెన్‌గా టాపిక్ ఉమ తల్లిదండ్రుల పైకి వెళ్ళింది.

ఎంత విచిత్రం!

"ప్రేమకు అర్థం, పెళ్ళికి పవిత్రతా మారిపోతున్నాయా లేక అంతరించి పోతున్నాయా అన్పిస్తోంది" అంది ఆనంది.

"అవును! మా సరోజక్క కూడా ఇంచుమించు ఇలాంటి వలయంలోనే ఇరుక్కుంది."

ఆశ్చర్యంగా చూసింది ఆనంది.

"సరోజక్క మా పెదనాన్నగారి అమ్మాయి. నాకన్నా ఆరేళ్ళు పెద్దది! బి.ఏ. మొదటి సంవత్సరం చదువుతూండగానే మంచి సంబంధం కుదిరిందని పెళ్ళి చేసేసారు. చదువు మానేసి అత్తగారి యింటికి వెళ్ళిపోయింది.

ఇంట్లో అమ్మ, నాన్నమ్మ చెప్పుకుంటుండేవారు-గొప్ప సంబంధమనీ ఒక్కడే కొడుకవటంతో కోడల్ని చాలా గారాబంగా చూసుకుంటారనీ అనుకుంటూ వుండేవారు.

నాకు కూడా-'బావగారూ' అనే పిలుపు క్రొత్తగానూ, ఇష్టంగానూ

వుండేది. వాళ్ళు మా ఊరు వస్తే ఎక్కువసేపు బావగారి చుట్టూనే తిరి
దాన్ని. బావగారు కూడా చాలా మంచివారు! హుషారుగా, మంచిగా కబు
చెప్పేవారు. మా అందరితోనూ సరదాగా ఆటలాడేవారు.

అందరం కలిసి పొలానికి వెళ్ళి తాటికాయలు కొట్టించి ముంజె
తినేవాళ్ళం!

కొబ్బరి బొండాలు కొట్టించి నీళ్ళు తాగటం, ఆ తర్వాత లేతకొబ్బ
తినటం-

ఎంతో సరదాగా వుండేది.

పెసరకాయలూ, మినపకాయలూ తెచ్చి మంటవేసి కాల్చు
తింటూంటే మాతోపాటు ఆయనా కూర్చునేవారు.

పెద్దమ్మ, అమ్మ కలిసి రకరకాల వంటలు చేస్తుండేవారు.

పెదనాన్నగారు పండ్లు, బిస్కట్లు, చాక్లెట్లు తెస్తుండేవారు.

మొత్తానికి బావగారు వున్న అన్నిరోజులూ పండగ రోజుల్లా
ఉండేవి.

అక్కని నానమ్మ- "మునిమనవడ్ని ఎపుడిస్తావే?" అంటూ వెక
రించేది.

అక్క బుగ్గలు సిగ్గుతో ఎర్రబడేవి.

అలాంటి అక్క జీవితంలో అనుకోకుండా ఎన్నో మెలికలు!

ఎన్నో మార్పులు!

'పెళ్ళి అయి రెండేళ్ళు గడిచినా పిల్లలు లేరు' అంటుండేవా
నానమ్మా, పెద్దమ్మానూ.

అమ్మ కోప్పడుతుండేది-"అదేదో ముసల్ది అయిపోతున్నట్లు ఎం
కంత తొందర! హాయిగా కొన్నాళ్ళిలాగే వుండనివ్వండి. ఆడపిల్ల
పెళ్ళితో కొంత స్వతంత్రం పోతే పిల్లలు పుట్టాక ఇహ సాంతం జై
జీవితమే" అంటుండేది.

ఒకరోజున నాన్నగార్ని అర్జెంటుగా రమ్మని పెదనాన్నగారు కబు
చేసారు.

తిరిగి వచ్చాక నాన్నగారు ఎవరితోనూ మాట్లాడకుండా ప



కుర్చీలో కళ్ళుమూసుకుని పడుకున్నారు.

నానమ్మ వచ్చి నాన్న ప్రక్కనే స్టూలుపై కూర్చుంటూ అడిగింది-

"ఎందుకురా రావుడూ పెద్దాడు కబురెట్టింది?"

"ఏమీ లేదమ్మా! ఏవో పొలం పనులు గురించి చెప్పాడు."

"ఆహాఁ-"

నానమ్మ నాన్నగారితో ఏవో కబుర్లు చెబుతోంది. కాస్త దూరంగా
దగ్గరగా నించున్న అమ్మ వాళ్ళిద్దర్నీ గమనిస్తోంది.

తమ్ముళ్ళతోపాటు కూర్చుని చదువుకుంటూన్న నాకు అమ్మ అలా
చూడటం చాలా వింతగా అన్పించింది.

"వంటయిందా?" అనడిగారు నాన్న అమ్మనుద్దేశించి.

"అయిపోయింది."

"నాకు వడ్డించు."

"అప్పుడేనా?"

"ఊఁ-అన్నయ్యా, నేనూ రాత్రి బండికి ఊరెళుతున్నాము."

"ఏ ఊరు?" లోపలకు వెళుతూనే అడిగింది అమ్మ.

నాన్నగారు మాట్లాడలేదు.

నాన్నగారి పద్ధతే అంత!

ఆయనకు చెప్పటం ఇష్టంలేకపోతే మాట్లాడరు. అది అందరకూ
తెలుసు!

పైపెచ్చు కోపంగా వున్నారని కూడా అర్థం. అందుకే నానమ్మ
ఆశ్చర్యంగా చూస్తోంది.

నాన్నగారు అమ్మని రెండుజతల బట్టలు కూడా సర్దివ్వమని అడి
గారు.

"ఎన్నిరోజులుంటారేమిటి?" నానమ్మ అడిగింది.

"పనినిబట్టి."

బ్యాగ్ తీసుకుని వెళ్ళిపోయారు.

"చెప్పటం ఇష్టంలేకపోతే ఆ దేవ దేవుడు దిగొచ్చినా చెప్పించలేడు
కదా" అంది నానమ్మ.

రెండు రోజుల తర్వాత తిరిగొచ్చారు నాన్నగారూ, పెదనాన్నగారూనూ.

అప్పుడు తెలిసింది విషయం-

"సరోజక్క ఇంట్లోంచి వెళ్ళిపోయిందని." నాకు అప్పటికి సరిగ్గా అర్థంకాని వయసు.

"అక్క ఇంట్లోంచి వెళ్ళిపోవటమేమిటి? ఎక్కడికి వెళుతుంది?"

ఇంట్లో నానమ్మ ఏడవటం, అమ్మ కళ్ళు తుడుచుకోవటం, నాన్న గంభీరంగా వుండటం, పెదనాన్న-పెద్దమ్మ మా ఇంట్లోనే వుండటం, పెద్దమ్మ గదిలోంచి బయటకేరాకపోవటం-

అదంతా ఏదో పెద్ద గొడవే అయ్యుంటుందని అర్థమయింది.

అవన్నీ తల్చుకుంటూంటే వాటి అర్థం ఇప్పుడు తెలుస్తోంది.

అక్క, బావగారూ కొత్తగా పట్నంలో కాపురం పెట్టారని అందరూ అనుకుంటూంటే నేనూ విన్నాను.

నానమ్మ అంది- "లక్షణంగా అత్తమామల నీడన వుండి కాపురం చేసుకుంటూ మంచీ-చెడూ నేర్చుకోక ఇప్పుడు పట్నం ఎందుకట?"

"అల్లుడుగారు పట్నంలో వ్యాపారం పెడతారట" నాన్నగారి జవాబు.

"అయ్యో! అంత పెద్ద వ్యవసాయము వదిలేసి చేసే వ్యాపారం ఏం వ్యాపారమట?" దీర్ఘం తీసింది నానమ్మ.

"పిల్లనిచ్చుకున్న వాళ్ళం! అవన్నీ మనం అడగగలమా?"

"ఆమాటా నిజమేలే! అయినా ఒక్కగానొక్క కొడుకాయె! ఇక్కడ పొలం పుట్రా వున్నప్పుడు ఎన్ని వ్యవహారాలుంటాయి. అన్నీ ఒదిలేసి పట్నం వెళితే...."

"అమ్మా! మనమేం చెప్పగలమే అమ్మా...." పెదనాన్నగారొచ్చి నానమ్మ ప్రక్కనే కూర్చున్నారు.

"అంతేలేరా!"

అలా అక్క కాపురం ఇంట్లో ఇష్టంలేకుండానే మొదలయింది.

అక్కడేమో—



బావగారు క్రొత్తగా బిజినెస్ మొదలు పెట్టటంతో బిజీగా వుండేవారట.

అక్కకేమో పట్నం వెళ్ళేసరికి క్రొత్త క్రొత్త కోరికలు, సినిమాలు, షికార్లు-

బావగారికి తీరిక సమయం తక్కువ! అక్కడికీ పదిరోజులకో, పదిహేను రోజులకో బావగారు బయటకు తీసుకెళ్ళటమో, మా ఇంటికో లేక వాళ్ళింటికో తీసుకెళ్ళటమో జరుగుతూనే వుండేది. అయినా ఆమెకు తృప్తి లేక బావగారితో పేచీలు పెట్టేదట! ఆయన పరిస్థితిని అర్థంచేసుకోకుండా సతాయించుతుండేదిట.

అలాంటి పరిస్థితుల్లో ఇంటి ప్రక్కన వున్న వాటాలోకి క్రొత్తగా వచ్చిన ఓ యువకుడితో అక్కకు పరిచయం ఏర్పడిందట!

అతడు తరచూరావటం—

గంటలకొద్దీ మాట్లాడటం-

నువ్వు చాలా అందంగా వుంటావనీ, నువ్వు కట్టుకున్న చీర బాగుందనీ, అసలు నువ్వు కట్టుకునేసరికి ఆ చీరకు అందం వచ్చిందనీ—

నువ్వు మాట్లాడుతూంటే లతామంగేష్కర్ పాట పాడినట్లుందనీ—

వాడి బొందనీ-

అదనీ ఇదనీ చెత్తవాగుడంతా వాగటం-

దానికి అక్క పొంగిపోవటం-

అక్క ఎప్పుడయితే అభ్యంతరం చెప్పకుండా వాడి దరిద్రపు వాగుడికి సంతోషించిందో అది అతడ్ని ఇంకాస్త ప్రోత్సహించినట్లే అయింది.

బావగారు ఆఫీసుకెళ్ళిన సమయంలో అతడి రాకపోకలు చుట్టుప్రక్కల ఇళ్ళ వాళ్ళు గమనిస్తూనే వున్నారట.

ఓ పెద్ద వయసావిడ బావగారితో చెప్పిందిట.

మొదట బావగారు నిర్ఘాంతపోయినా తర్వాత గమనించి మందలించారట.

అక్క వినలేదు!

ఓ రోజున అతడితో కలిసి వెళ్ళిపోయింది.

బావగారు పెదనాన్నగారికి కబురుచేసారు. అప్పుడే నాన్నగారు పెదనాన్నగారు కలిసి వెళ్ళారు.

ఎంక్వయిరీ చేస్తే తెలిసిందిట—

వాడో రౌడీ!

ఎందుకూ పనికిరాని జులాయి వెధవ!

ఉత్త బజారు పోకిరీ!

ఖర్మగానీ-అలాంటి వాడితో అక్కకు స్నేహమేమిటో, దాని కోసం ఇల్లు వదిలి వెళ్ళిపోవటమేమిటో-

పైగా చాలా ప్రేమగా చూసుకునే భర్తనూ, అత్తమామల్నీ వదిలేసి ఒక బికారి వెధవతో వెళ్ళటం-

లంకంత ఇల్లు. జమీందారీలాంటి ఆస్థిపాస్తులు అన్నీ వదిలి ఒక బికారి వెధవతో వెళ్ళటం-

కేవలం బావగారు తనను నిర్లక్ష్యం చేస్తున్నారనే అనుమానంతో, అక్కసుతో వున్న అక్క మనసుని తీపి తీపి మాటలతో, వెకిలి చేష్టలతో ఆకర్షించి లొంగదీసుకోవటం—

నిజంగా ఖర్మే!

వాళ్ళ ఆచూకీ తెలుసుకుని ఎలాగో కష్టపడి వాళ్ళను కలుసుకున్నారు.

పెదనాన్నగారు వీధిచివర వుండిపోయారట. నాన్నగారు మాత్రం అక్క దగ్గరకు వెళ్ళారట.

ఎన్నో రకాలుగా చెప్పారట.

మన కుటుంబ పరువూ ప్రతిష్టా మంటకలుస్తాయని చెప్పారట.

వినలేదట!

పెద్దమ్మ మంచం పట్టిందని చెప్పినా రానందట.

పైగా- "ఆయనకు డబ్బే ముఖ్యంగానీ నేనూ, నా ఆనందంకావు. ఆ డబ్బుతోనే కాపురం చేసుకోమను. అలాంటి మూర్ఖుడికిచ్చి పెళ్ళిచేసి నా సంతోషాన్ని సమాధి చేసినందుకు అమ్మనింకా ఏడవమనండి...." అంటూ మొండితనంగా తిరస్కరించింది.



ఏం చేయలేక తిరిగొచ్చేసారు.

ఆ తీసుకెళ్ళినవాడు ఓ వారం రోజులు అక్కను అనుభవించాడు.

వాడి మోజు తీరిపోయింది.

అక్క దగ్గరున్న నగలూ, డబ్బూ తీసుకుని పారిపోయాడు.

అక్క వాస్తవంలోకి వచ్చింది.

అప్పటిగ్గానీ వాడి మోసం ఆమెకర్థంకాలేదు. ఏంచేయాలో తెలియలేదు.

భర్త దగ్గరకు వెళ్ళలేక, తల్లి తండ్రుల దగ్గరకు రాలేక, అవమానం మింగలేక, ముఖం చెల్లక ఆత్మహత్య చేసుకుంది.

"ఎంత దారుణం!" తెల్లబోయింది ఆనంది. ఇలాంటి కథలు ఎన్నో విన్నది. కానీ బాగా తెలిసిన వాళ్ళింట్లో జరగటం, అందునా చదువుకున్న అమ్మాయి-మంచి కుటుంబంలోని అమ్మాయి ఇలా ప్రవర్తించటం త్వరగా జీర్ణం చేసుకోలేని విషయం!

"అవును! పండంటి కాపురాన్ని చేతులారా నాశనం చేసుకున్నది" అని నానమ్మ ఓ వేయిసార్లయినా అని వుంటుంది.

ఆనంది ఇంకా ఆ నమ్మలేని నిజాన్ని హరాయించుకోనిదానిలా చూసింది.

మళ్ళీ అన్నది ఇందిర.

అమ్మ అంటుంది-"ఇది తలరాత అని సరిపెట్టుకోలేము. వెనకాల మందలించే పెద్దవాళ్ళులేక తెలిసీ తెలియని వయసులో అతి తెలివితేటలతో చేసుకున్న తప్పు! అత్త మామల దగ్గరే వుంటే ఇలాంటి ఆపద సంభవించి వుండేదికాదు అని."

"అవునేమో! ఆ పల్లెలోనే వుంటే బాగుండేది."

"మొత్తానికి సరోజక్క జీవితం అంతా కలిసి నాలుగేళ్ళల్లో సమసిపోయింది. కాని ఆ బెంగతో పెద్దమ్మా, అవమానంతో పెదనాన్నగారూ మళ్ళీ మనుష్యులుగా అవ్వలేకపోయారు."

అవును మరి!

కూతురు పోయిందనే బాధ గుండెని తొలిచేస్తుంటే, కుటుంబానికి

వచ్చిన పచ్చ కొండంత అయి గుండెమీద బాదినట్లు అయిపోయారు.

* * * *

ఆనంది పడుకున్నదన్నమాటేగానీ నిద్రపట్టటంలేదు.

కళ్ళు మూసుకుంటే రెప్పలక్రింద సరోజ ముఖమే కదులుతోంది.

అమాయకంగా, ఆలోచించే మెదడులేని అభాగ్యురాలిగా, అరా
నికి నిచ్చెనవేసి కాళ్ళకింద బల్లను తోసేసుకున్న అవివేకిగా, అ
హత్యకు బలైపోయిన ఓ సగటు ఆడదానిగా పదే పదే కళ్ళల్లో మెదు
తోంది.

జీవితం, పెళ్ళి, సంసారం, కుటుంబగౌరవం....సరైన అవగాహ
లేకుండా సినిమాల్లోని వెర్రి ఎక్కించే సన్నివేశాలూ, పని పాడూ లేకు
అమ్మాయిల బుర్రల్లోకి తెల్లగుర్రంమీద వచ్చే రాజకుమారుడ్ని చూపి
వ్రాసే పిచ్చిరాతలు చూసి పెడదారులు పెట్టించే ఆలోచనల్ని నడ
తున్నంతకాలమూ ఇలాంటి అన్యాయాలు ఆగవు.

ఏమిటో——

పెళ్ళి అనేది జీవితంలో అత్యవసరమయిన ఓ ఘట్టం అని ఆనా
నుండీ ఈనాటివరకూ అనుకుంటూనే వున్నారు.

కాస్త వయసు పెరుగుతూ పరికిణీమీద ఓణీ వేయటం ఆలస్యం—
అమ్మాయికి పెళ్ళెప్పుడు చేస్తారని అడగటం మొదలెడతారు చుట్టుపక్క
వాళ్ళు! అసలు ఎవరో అడగటమే అని కాకుండా తల్లిదండ్రులు కూ
ఆడపిల్లకు ఎంత త్వరగా పెళ్ళిచేసి పంపించేద్దామా అనే తొందరపడతా

పెళ్ళి అనేసరికి కన్నె మనసు కూడా సిగ్గుపడుతూ కలలు కనేస్తు
టుంది.

వయసు వంకరలుపోతూ వన్నెలు కురిపిస్తూంటుంది.

మనసు ఊహల పందిరిలో చుక్కల నడుమ జాబిల్లితో అల్లిబి
ఆటలాడుకుంటూ జిలిబిలి ఊసులు చెబుతుంది.

పెళ్ళి చేద్దామనుకున్న నాటినుండీ వరుడు దొరికి, నచ్చి, బే
కుదిరి లగ్నాలు పెట్టుకునేసరికి నలభయ్యేళ్ళ తల్లి మానసికంగా అ
వయ్యేళ్ళ దానిలాగానూ, నలభై ఐదేళ్ళ తండ్రి డెభ్భై ఏళ్ళవాడిలాగా



అయిపోతారు.

ఇహ పసుపుకొట్టి పెళ్ళి పనులు ప్రారంభించి అన్నీ పూర్తిచేసి
పసుపు కుంకుమలతో కూతుర్ని అత్తవారింటికి పంపేసరికి శారీరకంగా
కూడా నీరసపడి ఆర్థికంగా డీలా పడిపోతారు!

పెద్దమ్మ అంటూ వుంటుంది.

వెనకటి రోజుల్లో 'పెళ్ళిచేసి చూడు, ఇల్లుకట్టి చూడు అనేవారట.

ఆ రెండూ అంత కష్టమైన పనులుగా వుండేవట! ఈ రోజుల్లో
అవేమంత కష్టమైన పనులుగాలేవు" అని.

ఒక రకంగా నిజమే అన్పిస్తుంది.

డబ్బుండాలేగానీ——

కొనలేనివి ఏముంటాయి!

జీవితానికేమి కావాలో అవన్నీ ఓ గంటలో కొనేసుకోవచ్చు!

తినటానికి తిండి!

కట్టటానికి బట్ట——

ఉండటానికి ఇల్లు——

చదువుకోవటానికి ఓ సీటు——

సంఘంలో ఫలానా అని చెలామణీ అయ్యేందుకు ఓ అంతస్తు-

ఇదీ అదీ అని లేకుండా 'డబ్బు' అనే మాయాజాలపు మంత్రదండం
మన చేతిలో వుంటే మనకు దొరకనివి ఏమీ ఉండవు.

బజారుకెళ్ళి సామానులన్నీ కొనుక్కుని, నచ్చిన చీర, నచ్చిన నగ
కొనుక్కున్నట్లే నచ్చిన ఇల్లు కూడా కొనేసుకోవచ్చు!

అలాగే ముందు ముందు ఎంచక్కా నచ్చిన మొగుడ్ని కూడా
కొనేసుకుని కార్లో కూర్చోబెట్టుకుని ఇంటికి తెచ్చుకునే రోజులొస్తే ఎంత
బాగుండునో!

ప్చ్! ఇప్పటికి మాత్రం ఎంత డబ్బిచ్చి కొనుక్కున్న మొగుడ్నై
యినా ఇంటికి తెచ్చుకునే హక్కు ఇంకా మనదేశపు ఆడపిల్లకు రాలేదు.

తెల్లచీర కట్టుకుని, తాళి కట్టించుకుని, తలంబ్రాలు పోయించుకుని,
వడిలో బియ్యం పోసుకుని, భర్త చిటికెనవేలు పట్టుకుని అత్తగారి ఇంటికి

వెళ్ళవలసిందే!

అదృష్టం బాగుండి కట్టుకున్నవాడు మంచివాడయితే అత్త మనసు వెన్నయితే దాని రాత మంచిదవుతుంది.

లేకుంటే-

లేకుంటే ఏముంది!

రోజూ కోపాలూ, పోట్లాటలూ, ఏడుపులూ, మొత్తుకోళ్ళూ-

గొడవలూ, విడాకులూ-

అదృష్టం తారుమారై క్వశ్చన్‌మార్కు జీవితమైపోతుంది.

జీవితంలో వచ్చిపోతుండే సమస్యలు వేరు. జీవితమే సమస్య అవటం వేరు!!

ఆలోచనలతో అలసిన ఆనందిని నిద్రాదేవి మెల్లగా ఆక్రమించుకుంది.

* * * *

అనితకు కాస్త కవిత్వం పిచ్చి!

ఒంటరిగా ఏ చెట్టుక్రిందో, ఏ గుబురుప్రక్కనో కూర్చుని నీలి ఆకాశంలో తెల్ల మబ్బుల మధ్యనుండి ఎర్రగా గుండ్రంగా భూదేవిని ముద్దెట్టుకోవటానికి వడివడిగా పరుగెత్తుకొస్తున్న సూర్యభగవానుణ్ని చూస్తూ కవితలు అల్లుకుంటుంది.

వర్షం పడుతూంటే వరండా అంచునుండిపడే చుక్కల్ని అరచేతిలో పడుతూ అవి పగిలి చిందుతూన్నప్పుడు ఉండే అందాల్ని ఆనందంగా వర్ణించుతూ పల్లవి పాడేస్తుంది.

అనితకు ఆంగ్ల భాషలో మంచి కమాండ్ వున్నది. చిన్నప్పట్నుండీ కాన్వెంట్‌లో చదవటమూ, తండ్రి కూడా విద్యావంతుడవటమూ, మొత్తంమీద ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడేస్తుంది. ఆమె వ్రాసే కవితలు కూడా ఆంగ్లంలోనే వుంటాయి.

పదాల కూర్పు, ప్రాస, లయ-

చాలా చక్కగా వ్రాస్తుంది.

స్కూల్లో చదువుతుండగా ప్రతి సంవత్సరం స్కూల్ మేగజైన్‌లో



వ్రాస్తుండేది.

తర్వాత తర్వాత తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బయటి మేగజైన్లకు పంపటం-వెంటనే ప్రచురణ జరగటం-

మొట్టమొదటిసారిగా అచ్చులో తన పేరు చూసుకున్నప్పుడు అనిత సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బయింది!

మనసు రెక్కలు కట్టుకుని అలా అలా ఎగిరి వచ్చింది!

ఆ దివ్యానుభూతి ఆమెను చాలాకాలం ఆవరించుకుని వున్నది. తర్వాత తర్వాత కూడా ప్రతిసారీ వ్రాస్తున్న కవిత పూర్తి చేసినప్పుడు కలిగే సంతృప్తీ, ప్రచురణ అయినప్పుడు కలిగే ఆనందమూ నిత్య నూతనం!

అలాగే వ్రాస్తున్నప్పుడు వుండే తపనా, ప్రచురణకు పంపి ఫలితం కోసం ఎదురుచూస్తున్నప్పుడు కలిగే ఆదుర్దా....అన్నీ నిత్యనూతనాలే!

ఆమెది స్వతహాగా క్రియేటివ్ నేచర్!

దానికితోడు మంచి స్కూల్!

తల్లిదండ్రుల తోడ్పాటు, ప్రోత్సాహం!

కొంత అదృష్టం కూడా వరించేసరికి ఆమెలోని రచనా శక్తి మంచి తోటమాలి చేతిలోని పూలమొక్కలాగా పెరగసాగింది!

'ఉషోదయపువేళ భాస్కరేంద్రుని అరుణకిరణాల సులివెచ్చని తాకిడికి విడిపోతున్న మంచుపొరల మధ్యనుండి స్వచ్ఛందంగా నవ్వుతూ పలకరిస్తున్న సుమణాల అందానికి ముగ్ధుడవ్వలేని ఓ మానవుడా....నీవు ఎవరిని ప్రేమించగలవు!' అంటూ వ్రాసిన అనిత కవిత బహుమతిని పొందింది.

ఆ రోజున అనిత సంతోషంతో ఏదీ సరితూగలేదు!

ఆమె భాషలో చెపితే....

ఆమె మనసు ఎగిరే పక్షులకన్నా, వీచే గాలికన్నా, కదిలే మేఘాలకన్నా, ఎగసిపడే కెరటాలకన్నా వేగంగా ఎక్కలేని శిఖరాలూ దిగలేని లోయల్నీ చుట్టి వచ్చింది.

ఆ తర్వాత చాలా రోజులకు మరలా ఇవ్వాళ ఎందుకో ఆమె మనసు

కదిలి వ్రాయాలన్పిస్తోంది.

'అలవోకగా నాట్యం చేస్తూ నీ స్పర్శ కోసం పరితపిస్తున్న చిగురుటాకులనూ, తమ సొగసులకు సువాసనలను జోడించి విరజల్లుతూ నీ కౌగిలికోసం కలవరిస్తున్న కుసుమాలనూ తప్పుకుంటూ వచ్చి ఎక్కడో ఓ చెట్టుక్రింద ఉన్న నన్ను తాకుతూ నీ ప్రేమను పంచిపెడుతూంటే నా శరీరంలోని ప్రతి అణువూ పరవశించింది! నీ స్పర్శతో పులకరించింది! ఓ నా ప్రియాతి ప్రియమయిన చిరుగాలీ....తిరిగి నీకు నేనేమి ఇవ్వగలను. నన్ను నేను సమర్పించుకుంటున్నాను-స్వీకరించవూ!'

అనిత భుజం మీంచి చూసి చదువుతూ చప్పట్లు కొడుతూ నవ్వుతూ అన్నది ఈశ్వరి.

"మార్వలెస్! ఎంత బాగా వ్రాస్తున్నావు అనితా! ఎంత సింపుల్ వర్డ్స్! నీలోని ఈ కళకు మా జోహార్లు!"

"నువ్వు మా స్నేహితురాలివని చెప్పుకోవటం ఓ గర్వంగా వుంటుంది."

"ఓహ్! చాల్చాలు! మరీ అంతలా పొగడవద్దు."

"ఇది పొగడ్తకాదు! మనిషిగా పుట్టుక పొందటం ఓ వరమైతే ఇలాంటి కళలు స్వంతం చేసుకోవటమనేది అందరికీ సాధ్యపడని ఓ అపురూపమైన అద్భుతం!

అది నీకు దక్కటం....ఆ నీవు మాకు స్నేహితురాలవ్వటం గొప్ప కాదూ!"

"నీ కవితలన్నీ నాకివ్వు అనితా! నేను అనువాదంచేసి తెలుగు పత్రికలకు పంపుతాను.

అందర్లోకీ ఎక్కువ చలాకీగా వుండి గలగలా మాట్లాడుతూ ఓ చైతన్యంలాగా, ఓ మిస్ సైక్లోన్ లాగా వుండేది ఈశ్వరి!

అతి తక్కువగా మాట్లాడుతూ కళ్ళతోనే భావాలు పలికించుతూ ముగ్ధలా మెత్తగా అందరితోనూ అలా అలా అల్లుకుపోయేది ఇందిర!

అతని ఊహల పందిరయితే ఆనంది ఎప్పుడూ కాలెక్యులేటెడ్!

ఉమ వయసుకు మించిన గంభీరతతో వుంటుంది! ఊహ వయసు



వచ్చినా మనసు పెరగని చిన్నపిల్లలా అల్లరి చేస్తుంటుంది.

* * * *

ఈశ్వరి నాన్నగారు, అమ్మ వచ్చారు. అది ఆదివారమూకాదు! విజిటర్స్ డే అంతకన్నా కాదు.

వాళ్ళు వచ్చేసరికి ఈశ్వరి బాడ్‌మింటన్ ఆడుతోంది. సాయంత్రం వేళ ఎండలో వమిటచెంగు దోపి బాట్ పట్టుకుని ఎగిరెగిరి ఆడుతోన్న ఈశ్వరికి ప్యూన్ వచ్చి చెప్పాడు.

అలాగే పరుగెత్తుకొచ్చింది ఈశ్వరి. జుట్టు రేగిపోయి, ముఖమంతా చెమటతో తడిసి—

ఈశ్వరికి తల్లి దగ్గరకంటే తండ్రి దగ్గరే చనువెక్కువ. ఒక్కతే కూతురవటంతో ఆయన కూడా ఈశ్వరిని బాగా గారాబం చేస్తారు. ఆయన వ్యాపార నిమిత్తం నెలలో ఇరవైరోజులు ప్రయాణం చేస్తూనో, వేరే ఊర్లలోనో వుంటారు. రెండేళ్ళక్రితం సడెన్‌గా గుండెల్లో నొప్పి లాటిది వచ్చి డాక్టరు ప్రయాణాలు తగ్గించమని స్ట్రిక్టుగా చెప్పటంతో కాస్త ఇంటి పట్టున వుంటున్నారు. ఎంతయినా మొదట్లో వున్న భయం ఆరోగ్యం కుదుటబడి కాస్త పుంజుకోగానే తగ్గిపోతుంది. ధైర్యం వచ్చేస్తుంది.

దినచర్యా, వ్యాపారం, వత్తిడీ అన్నీ మళ్ళీ మామూలయిపోతాయి.

ఆయన పరిస్థితీ అలాగే అయింది. కాకపోతే ఇప్పుడెక్కడకు వెళ్ళినా మందులవీ సక్రమంగా వాడటానికీ, ఏ సమయంలో ఏ అవసరం వచ్చినా అయిన మనిషి ఆసరా అవసరంకదా అని డాక్టర్ల సూచనమేరకు భార్యను కూడా తీసుకువెళుతున్నారు. అలా వెళ్ళినప్పుడు ఇంట్లో ఈశ్వరి ఒక్కర్తే వుండాల్సి వస్తోంది.

రౌడీయిజం పెరిగిపోతున్న విజయవాడలో కేవలం నౌకర్ల మీద నమ్మకంతో కూతుర్ని ఇంట్లో వుంచి వెళ్ళటం ఏమాత్రం క్షేమం కాదని ఆమెని ఆడపిల్లల కాలేజీలో హాస్టల్లో పెట్టేశారు! లేకుంటే ఈశ్వరిని దూరంగా వుంచటమనేది ఆయనకో పెద్ద పనిష్మెంట్ లాంటిది.

ఆయాసపడుతూ పగరుస్తూ వచ్చిన కూతుర్ని చేయిచాచి దగ్గరకు తీసుకుని భుజం చుట్టూ చేయి వేసారాయన.

"ఏమిటివ్వాళ వచ్చారు?"

"నిన్ను చూడాలనిపించింది."

నవ్వింది ఈశ్వరి.

అప్పుడే గమనించింది....అమ్మ ప్రక్కన మరో యువతి కూడా వుండటం!

ఆమె ఈశ్వరిని పరిశీలనగా చూస్తోంది.

"ఈమె అరుణ ఆంటీ" పరిచయం చేసింది.

"నమస్తే."

ఆవిడ తిరిగి నమస్కారం చేయలేదు.

ప్రతిగా నవ్వింది.

ఆ నవ్వు చాలా హుందాగా వుంది.

కాస్త గర్వంగా ఇంకా స్త పొగరుగా కూడా వుందేమో అన్పించింది.

కాసేపు చదువు గురించి, హాస్టలు గురించి, కాలేజి గురించి ప్రశ్నలూ, సమాధానాలూ జరిగాయి.

"నువ్వు చెప్పిన మీ ఫ్రెండ్సంతా ఎలా వున్నారు?"

"బాగున్నారు. పిలవనా? పరిచయం చెయ్యనా?" హుషారుగా అడిగింది.

"ఇప్పుడొద్దులే! ఈసారి వచ్చినప్పుడు చూస్తాము."

"మళ్ళీ ఎప్పుడు వస్తారోకదా" గోముగా అన్నది.

"ఎల్లుండి" నవ్వుతూ అన్నారు.

ఈశ్వరి కూడా నవ్వేసింది.

అన్నట్లే ఆయన నిజంగానే ఆదివారం ఉదయం పదకొండు అవుతుండగా వచ్చారు,

ఆశ్చర్యపోయింది ఈశ్వరి.

"ఈ నెల ఇరవై నుండి హాలిడేస్....అని చెప్పానుగా నాన్నగారూ."

ఆ అడగటంలో "మళ్ళీ ఎందుకువచ్చారు" అనే ప్రశ్న వినిపించటంతో ఆయన నవ్వుతూ అన్నారు-



"నిన్నూ, నీ ఫ్రెండ్స్‌ని చూడాలని వచ్చాము."

ఈశ్వరికూడా నవ్వింది.

కానీ ఆమెకు ఆశ్చర్యం ఇంకా ఎక్కువైంది. దానికి కారణం అమ్మకూడా రావటం-పైగా ఈసారికూడా అమ్మా నాన్నలతోపాటు మొన్న వచ్చిన యువతి రావటం—అంతేకాకుండా మరో యువకుడు కూడా రావటం-

ఆశ్చర్యం మాట అలా వుంచి వీళ్ళు రావటంమాత్రం అస్సలు నచ్చలేదు. ఆ చిరాకును పైకి కన్పించనీయకుండా బలవంతంగా నవ్వింది.

ఉమ, ఆనంది రూమ్‌నుండి రెండు కుర్చీలు తెచ్చి చెట్టుక్రింద వేసారు.

తల్లికీ-తండ్రికీ ఫ్రెండ్సందర్నీ పరిచయం చేసింది.

కొంచెంసేపు వాళ్ళ-వాళ్ళ పేర్లూ, ఊర్లూ పరిచయాలతో సందడిగా గడిచింది.

ఈశ్వరి తండ్రి ప్రిన్సిపాల్ దగ్గర పర్మిషన్ తీసుకుని ఈశ్వరిని బయటకు తీసుకువెళ్ళారు.

వాళ్ళు వెళ్ళాక ఆనంది అన్నది-

"ఇదేదో పెళ్ళిచూపుల తతంగంలాగా వున్నది."

"అవునా?" ఆశ్చర్యంగా అడిగారు.

"అవుననుకుంటాను."

"నీకెలా తెలుసు?"

"నాకూ తెలియదు.... వాళ్ళ ప్రొసీజర్ చూస్తే నాకాలా అనిపించింది."

కాసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది.

"ఆ అబ్బాయి అంతగా బాగుండలేదు కదూ?" మొహమాటంగా అన్నది ఇందిర.

"అస్సలు బాగుండలేదు" ఠక్కున అన్నది ఊహ.

"అంత అనాకారి కాదుగానీ నలుపు" ఉమ కామెంట్.

"ఈశ్వరి కలర్‌కి మంచి మాచింగ్."

"యా! జస్ట్ అపోజిట్! నాకు నచ్చలేదబ్బా...." ఊహ ఉద్దేశం.

"అబ్బాయిలకు రంగు, అందమూ ముఖ్యంకాదు. మంచి గుణముంటే చాలు" ఆనంది వ్యాఖ్య.

"అవునవును! ఆ మాట నిజమే! కాని కొంచెం అందంకూడా ఉంటే బాగుంటుంది కదా" అనిత ఆలోచన.

"ఈశ్వరి చాలా ఫ్రెండ్లీటైపు!

మంచి ప్రేమమూర్తి....తనకు మంచి భర్త దొరికితే బాగుంటుంది." నెమ్మదిగా, నొక్కిచెబుతున్నట్లుగా, దేవుడికి విన్నవించుతూన్నట్లుగా అంది ఇందిర.

"ఓ గాడ్....! ఈశ్వరి ఒక్కతే మంచిదా! తనకుమాత్రమేనా మంచి మొగుడు. నేనూ మంచిదాన్నే....నాక్కూడా మంచి మొగుడు కావాలబ్బా!" అల్లరిగా అన్నది ఊహ.

అందరూ సరదాగా నవ్వుతున్నారు.

ఈశ్వరి వచ్చాక అడిగింది ఆనంది.

నిజమేనంది ఈశ్వరి.

"మరి నీకతను నచ్చాడా?" కుతూహలంగా అడిగారు.

"నాన్నగారికి నచ్చాడు."

"మీ నాన్నగారికి సరేనోయ్....ఆయన కాదుకదా పెళ్ళిచేసుకునేది-నువ్వు! నువ్వు పెళ్ళి చేసుకుంటున్నావు. నీకు నచ్చాడా?" రెట్టించినట్లుగా అడిగింది ఊహ.

"నాకేం తెలుస్తుంది! మీరు చెప్పండి. మీరూ చూసారుగా! మీకేమనిపించింది?" కాస్త ఇబ్బందిగా అడిగింది ఈశ్వరి.

"ఏమిటే తెలియంది. అతన్ని డైరెక్టుగా చూసావు. బాగున్నాడో లేదో చెప్పటం తెలీదా? కొట్టబోకు గాస్" దబాయింపుగా అన్నది ఊహ.

నవ్వేసింది ఈశ్వరి.

"నేనేం చెప్పనే తల్లీ! అతను నల్లగా వున్నాడు. నాకా నలుపు నచ్చలేదు."



ఆమె మాట పూర్తి అయ్యీ అవ్వకమునుపే ఠక్కున అన్నది హ.

"మరి ఆ మాట చెప్పకపోయావా?"

"చెప్పాను."

"అమ్మయ్య! అయితే ఒప్పుకోలేదన్నమాట." తేలిగ్గా నవ్వుతూ న్నది.

ఏదో కొండంత భారం దించుకున్నట్లుగా సంతోషంగా ఫీలయ్యారు.

"కాని, నాన్నగారు అది ఒక పాయింట్‌గా తీసుకోవటంలేదు.... మంచి కుటుంబం-ఆ అబ్బాయి ఆల్‌రెడీ బిజినెస్‌లో సెటిలయ్యాడు. నాకు చ్చిందీ సంబంధం" అంటున్నారు. ఆయనకెలా ఎదురు చెప్పాలో నాకు లియటంలేదు."

"పెద్దవాళ్ళు అలాగే అంటారు ఈశ్వరీ! కుటుంబంతోపాటు వ్యక్తి ణగణాలు ఎంతముఖ్యమో అందచందాలూ అంత ముఖ్యమే."

"నిజమే! కాని నేనేం చేయలేకపోతున్నాను. నాన్నగారేం చేసినా గా ఆలోచించే చేస్తారుకదా. నా మంచిని గురించి నాకంటే ఆయనకే బాగా ల్సుకదా!"

ఎవరూ ఏమీ అనలేకపోయారు.

నిజమే! ఆ మాట నిజమే!

పిల్లల గురించీ, వాళ్ళ బాగోగుల గురించీ, వాళ్ళ భవిష్యత్తు రించీ తల్లిదండ్రులు ఎన్ని విధాలుగానో ఆలోచిస్తారు.

"అసలు నీకిప్పుడే పెళ్ళేమిటి? కనీసం డిగ్రీ అయినా పూర్తి చేయండా."

"అదీ అన్నాను....దానికీ నాన్నగారు ఒప్పుకోవటంలేదు. 'నా ఆరోగ్యం అంత మంచిదికాదు తల్లీ. మంచి సంబంధం కావాలనుకున్నప్పుడల్లా రకదు. నువ్వు చదివేది విజ్ఞానంకోసమే గానీ డిగ్రీలు సంపాదించి ఉద్యోగాలు చేయటానికికాదు' అంటున్నారు. ఇహ నేను ఎదురు చెప్పలేక సరే నేసాను."

"ఏమిటీ-ఒప్పేసుకున్నావా?"

"ఊఁ-ఇంచుమించుగా అంతే."

"తప్పు చేసావేమో ఇందులో. మరో రెండు రోజులు ఆలోచి
చెప్పి వుండాల్సింది."

"ఎన్నిరోజులు ఆలోచించినా ఇందులో మార్పేమి వుంట
ఆనందీ! నాన్నగారితో వాదించి ఆయనకు ఆయాసం తెప్పించటం నాకి
లేదు."

"నా అభిప్రాయం ఆయనతో గొడవపడమని కాదు."

"ఛ! ఛ! అలా ఎందుకు చెబుతావు."

"అవును ఈశ్వరీ! రెండు రోజులాగితే నాన్నగారు ఒప్పు
వారేమో."

"నా జాతకంలో ఎలా రాసుంటే అలా జరుగుతుంది. పోనీయం

"అమ్మయ్యో! అంత వేదాంతంలోకి వెళ్ళిపోబోకు తల్లీ.
భరించలేము."

అందరూ నవ్వేసారు.

"సో! పెళ్ళి సెటిల్ అన్నమాట."

"ఇంచుమించుగా."

"ఎనీవే-ఆల్ ది బెస్ట్! మై హార్టీ కంగ్రాచ్యులేషన్స్." చేయి
కుని ముంజేతిమీద ముద్దు పెట్టుకుంటూ అన్నది అనిత.

ఊహ గబుక్కున ఈశ్వరి బుగ్గమీద ముద్దు పెట్టుకుని? "
ముద్దు పెట్టుకుంటే మైలపడిపోతుందా?" అంటూ అడిగింది.

ఫక్కున నవ్వారందరూను.

ఛ! కొంటెపిల్లా!" అందంగా సిగ్గుపడింది ఈశ్వరి.

"ఏయ్! నువ్వలా సిగ్గుపడుతూంటే నిన్నో ఆట పట్టించా
స్తోంది."

"ఏంచేస్తావు?" కళ్ళెత్తి గాభరాగా చూస్తూ అడిగింది ఈశ్వరి.

అందరూ నవ్వుతూంటే ఊహకూడా నవ్వుతూ అంది.

"ఏంచేయనులేగానీ అతనిదే వూరు? ఏం బిజినెస్? అతను నీతో



మాట్లాడాడు?" ప్రేక్కు మడుస్తూ ఒత్తి-ఒత్తి పలుకుతూ అడిగింది.

"అన్ని ప్రశ్నలూ ఒక్కసారే అడిగితే ఎలా? అసలే ఈశ్వరి
మనసు మనదగ్గర లేదు."

"ఏయ్....మీరిలా టీజ్ చేస్తూంటే నేనేం చెప్పను పొండి" వుడు
క్కుంటూ అన్నది.

"అమ్మ....మ్మ....మ్మ....మ్మ....ఎంతమాట! నువ్వు వివరాలేమీ
చెప్పలేదనుకో-నాకు నిద్రపట్టదు. నిన్నూ నిద్రపోనీయను. నువ్వు నిద్ర
పోకపోతే అతను నీ కలలోకి రాలేడు."

"అదిగో మళ్ళీ...."

అందరితోపాటు ఈశ్వరికూడా నవ్వేసింది.

"ఊహా! కొంచెంసేపు నోరుమూసుకో! ఈశ్వరిని చెప్పనివ్వు."

ఊహ నిజంగానే పెదవులమీద చూపుడువేలిని పెట్టుకుని చేతులు
మడిచి బుద్ధిగా కూర్చుంది.

ఆ ఫోజు చూడగానే ఫక్కున నవ్వింది ఈశ్వరి.

"వాళ్ళ వూరు మద్రాసు! కాకపోతే అతడుండేది అమెరికాలో.
ఏదో బిజినెస్ చేస్తున్నాడని నాన్నగారన్నారు. ఏం బిజినెస్ అని నేనూ
అడగలేదు. నాన్నగారూ చెప్పలేదు."

"అతని పేరు?"

"అరే! నేనూ అడగలేదు."

"అబద్ధం."

"లేదు! నిజం."

"అతను చెప్పలేదూ?"

"ఉహూ! చెప్పలేదు."

నువ్వు అడగలేదా?"

"ఉహూఁ! అడగలేదు."

"పోనీ నీ పేరు అతనికి చెప్పావా?"

"ఉహూఁ....!"

"పోనీ అతనేం మాట్లాడాడు?"

"ఉహూఁ అతడేం మాట్లాడలేదు."

"నిజంగా?"

"నిజంగా ఊహా! నిజమంత నిజం."

"ఎలా నమ్మటం! పోనీ నువ్వేం మాట్లాడావు?"

"ప్లీజ్ ఊహా! ఇహ నన్ను ఒదిలేసెయ్యవా?"

"ఓ.కె! ఈ ఒక్కదానికీ చెప్పెయ్యి."

"నిజంగా! నేనూ ఏమీ మాట్లాడలేదు" దీనంగా ముఖంపెట్టి చెబుతూన్న ఈశ్వరిని చూసి అందరితోపాటు ఊహ కూడా నవ్వేసింది.

"మిగిలిన ఒన్నండహాఫ్ ఇయర్ సంగతి ఏం చేస్తావు? సశేషమా, సమాప్తమా?"

"పిచ్చి బుజ్జీ! నాకు మాత్రం ఏం తెలుసు. మీరిక్కడే వున్నారు.... నేను కొంచెంసేపు అలా వెళ్ళి వచ్చాను. మీకూ నాకూ తేడా అంతే."

* * * *

సోమవారం మధ్యాహ్నం ఈశ్వరి వాళ్ళ నాన్నగారొచ్చారు.

డిసెంబర్ పదిహేనో తేదీ తర్వాత మంచిరోజులు కావట. పైగా అతడు మరలా అమెరికా వెళ్ళిపోవాలట. అందువల్ల ఎల్లుండి బుధవారం నిశ్చయ తాంబూలాలు పుచ్చుకుంటున్నారట. ఈశ్వరిని తీసుకు వెళ్ళటానికి వచ్చారు.

ప్రిన్సిపల్ దగ్గర పర్మిషన్ తీసుకున్నారు.

బుధవారంనాటి ఫంక్షన్‌కు పంపేందుకు అ ఆ ఇ ఈ ఉ ఊ లకు కూడా పర్మిషన్ తీసుకున్నారు.

"కారు పంపిస్తాను....తప్పకుండా రండి" అని చెప్పి వెళ్ళారు.

"అరెరె! ఎంతలో ఎంత మార్పు. ఆరివారం పెళ్ళిచూపుల సమయం వరకూ పెళ్ళి ప్రస్తావనే లేదు. అలాంటిది ఈ రెండు రోజుల్లో సెటిల్ కూడా అయిపోతోంది."

ఆనంది మనసులో ఆమె పెద్దమ్మ అనే మాటలు మెదిలాయి.

'పెళ్ళి అనేది నూరేళ్ళ జీవితం! ఆ విషయంలో నిర్ణయం తీసుకునేటపుడు నింపాదిగా ఆలోచించి ఆచి తూచి అడుగేయాలి. దేనిలో తప్పు



జరిగినా సరిదిద్దుకోగలంగానీ పెళ్ళి విషయంలో మాత్రం అవకాశమే వుండదు.'

అవును....!

కానీ ఈశ్వరి విషయంలో అన్నీ ఎంత వడివడిగా జరుగుతోందో. దేవుడు ఆమెకి అండగా వుండి అంతా మంచి జరిగేట్లుగా ఆశీర్వదించాలి.

చెప్పినట్లుగానే కారు పంపించారు.

అందరూ వెళ్ళారు.

ఫంక్షన్ చాలా బాగా జరిగింది.

అది పెళ్ళికి ముందు జరుగుతూన్న ఎంగేజ్‌మెంట్‌లాగా లేదు.

అదే పెళ్ళిలాగా వుంది.

బంధువులూ, మిత్రులూ, పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకు తరపునా కలిసి చాలామందే వున్నారు.

అంతటా సందడి!

అంతటా సంతోషం!

అంతటా ఉత్సాహం!

అంతటా కోలాహలం!

అంత సందడిలోనూ ఒక్క పెళ్ళికొడుకు ముఖమే చిరాగ్గా వున్నది. అతడి చుట్టూ చాలామంది వున్నా అతడేదో ఒంటరిగా, అనీజీగా వున్నట్లుగా అపిపించింది

అనిత, ఆనంది, ఇందిర, ఉమ, ఊహ ఎవ్వరూ కూడా ఇంత వరకూ ఇంత గ్రాండ్‌గా జరిగిన ఫంక్షన్ చూడలేదు.

ఫంక్షన్స్-పెళ్ళిళ్ళ-ఇంతింత ఘనంగా చేస్తారని కూడా తెలీదు వాళ్ళకు.

'అమ్మయ్యో! ఇదే యింత గొప్పగా వుంటే అసలు పెళ్ళి ఇంకెంత గొప్పగా జరుగుతుందో' అని కూడా అనుకున్నారు.

ఈశ్వరి తన ఫ్రెండ్స్‌ని తీసుకెళ్ళి తన కాబోయే భర్తకు పరిచయం చేసింది.

అతడ్ని ఏమేమో అడగాలనుకున్న ఊహ కూడా అతడి ముఖా

వమూ, చిరాకూ చూసి ఏం మాట్లాడకుండా ఓ నమస్తే పారేసి ఇవతలక
వచ్చేసింది.

ఈశ్వరి తండ్రి బిజినెస్ చేస్తారని తెలుసు. ధనవంతులనీ తెలుసు.
మరీ ఇంత ధనవంతులని మాత్రం వాళ్ళు అనుకోలేదు. ఆ ఇల్లు,
ఆ ఫర్నిచర్ చూసి చాలా ఆశ్చర్యపోయారు. పైగా అంత సిరిసంపదల్లో
నుండి వచ్చిన ఈశ్వరి ఏమాత్రం అతిశయంలేకుండా తమతో ఎంతో కలి
విడిగా వుండటం ఇంకా ఎంతో ఆశ్చర్యం అనిపిస్తుంది.

దానితో ఈశ్వరి పట్లవున్న ప్రేమా, సద్భావమూ ఇంకా స్త పెరి
గాయి.

వాళ్ళ ప్రక్కన కూర్చుని వున్న బంధువుల మాటలు వీళ్ళకూ విని
పడుతున్నాయి. వాటి సారాంశం 'ఈశ్వరి అత్తమామలకు ఇంతకన్నా
ఎక్కువ ఆస్తి వుందనీ, వాళ్ళకు ఒక్కడే కొడుకనీ, ఈశ్వరికి చాలా
నగలు పెట్టారనీ. ఐశ్వర్యానికీ ఐశ్వర్యానికీ జరుగుతూన్న పెళ్ళి ఇ
అనీ....'

బంధువుల మధ్యనుండి మెల్లిగా తప్పించుకుని మిత్రులవద్ద
వచ్చింది ఈశ్వరి.

"ఈశ్వరి అచ్చు పెళికూతురులానే వుంది."

"నీ మొహం! పెళ్ళికూతురు పెళ్ళికూతురిలా కాకుండా ఇంకెలా
వుంటుంది."

నవ్వుకున్నారు.

అందరూ భోజనాలకు లేస్తున్నారు.

"ఈశ్వరీ! మళ్ళీ నువ్వు బిజీ అయిపోతావేమో....భోజనాలవ్వగానే
మేము వెళ్ళిపోతాము."

"నేనూ మీతోనే వస్తున్నాను. రండి."

"ఎక్కడికి వస్తున్నావు?" నిటారుగా నిలబడిపోయి ఆశ్చర్యంగా
అడిగింది.

"భోజనానికి" నవ్వుతూ చెప్పింది ఈశ్వరి.

"ఎక్కడికి అనుకున్నావు?"



"ఎక్కడికీ అనుకోలేదులే."

ఇంటికి ముందువైపున వున్న లాన్ అంతా షామియానా వేసి
బల్లలూ, కుర్చీలూ అమర్చి భోజనాలు వడ్డించుతున్నారు.

స్నేహితులందరూ వరుసగా కూర్చున్నారు.

కబుర్లు వింటూ, నవ్వుతూ అందర్నీ గమనిస్తూన్న ఆనంది అంది-

"ఈశ్వరీ! మీ అత్తగారు నిన్నే చూస్తున్నారు."

చటుక్కున తలెత్తి అడిగింది "ఎక్కడ?"

"మనకెదురు వరుసలో కాస్త అవతలగా ఉన్నారు చూడు."

అందరూ తలలు తిప్పి చూసారు.

ఆవిడ, ఆవిడ ప్రక్కనే కూర్చుని వున్న మరో ఆవిడ కూడా
వీళ్ళవైపే చూస్తుండటంతో గబుక్కున తల దించుకుంది ఈశ్వరి.

అనిత వాళ్ళనే చూస్తూ అన్నది-

"మీ అత్తగారి కళ్ళల్లో నువ్వంటే ఎంతో ఇష్టం కన్పిస్తోంది. యూ
ఆర్ లక్కీ."

అందరూ నవ్వుతూంటే ఈశ్వరి కళ్ళు గమ్మత్తుగా మెరిసాయి.

భోజనాలయ్యాయి.

"ఇంక వెళతాము ఈశ్వరీ" ఆమె చేతిని అందుకుని స్నేహ
పూర్వకంగా నొక్కుతూ అన్నారు.

"ఉండండి-నాన్నగార్కి కారు సంగతి గుర్తుచేసి వస్తాను."

"ఈశ్వరీ కాస్త ఆగు" వెళుతున్న ఈశ్వరి చేతినిపట్టి ఆపారు.

"ఇంత హడావుడిలో ఆయనగార్ని ఇబ్బంది పెట్టటమెందుకు?
మేము బస్సులో వెళ్ళిపోతాము" అన్నారు.

"నో! నో! తర్వాత నాన్నగారు చాలా కోపం తెచ్చుకుంటారు.
అసలు ఉదయమే చెప్పారు-మీరెప్పుడు బయలుదేరితే అప్పుడు తనకు చెప్ప
మని" అంటూనే అవతలకు వెళ్ళింది.

చుట్టూ చూసారు.

భోజనాలు చేయటంతోటే కొంతమంది ఈశ్వరి వాళ్ళ అమ్మకూ,
నాన్నకూ చెప్పి వెళ్ళిపోతున్నారు.

మరికొంతమంది తాంబూలం నములుతూ అక్కడ వేసి ఉన్న
లలో కూర్చుని విశ్రాంతిగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

అనితా వాళ్ళుకూడా కుర్చీలు గుండ్రంగా వేసుకుని కూర్చు

ఐదు నిముషాల తర్వాత దూరంగా వస్తున్న ఈశ్వరి కనిపిం

ఒకవైపున వాళ్ళ అత్తగారు, మరోవైపున ఇంకో యువతి-వా
మాట్లాడుతూ వస్తోంది.

కాలేజీలో వుండగా చుడీదారుల్లోనూ, పావడాల్లోనూ చిన్న
గడుగ్గాయిలా కన్పించే ఈశ్వరి పట్టుచీర కట్టుకుని వడ్డాణం పెట్టుకు
నిండా పూలతో నిండుగా వుంటే-కొంచెం లావుగా కన్పిస్తూ పెద్దరి
వుంది.

ఆ పెద్దరికంలో యవ్వనం అందంగా, ఆకర్షణీయంగా కన్పి
కాబోలు!

రోజూ చూసే ఈశ్వరిలో ఇన్నాళ్ళూ కనిపించని క్రొత్త అ
తొంగి-తొంగి చూస్తున్నాయి.

స్నేహితులను పేరు—పేరునా పరిచయం చేసింది అత్తగారికి.

అందరూ నించుని నమస్కారం చేసారు.

"కూర్చోండి."

ఈశ్వరి అత్తగారు అందమైనదే!

ఆమెలో అందంకంటే ఏదో ఆకర్షణ వున్నది. అది ఆవిడ
కున్న మేకప్‌దో, ఆమె కట్టుకున్న ఖరీదైన బట్టలదో, పెట్టుకున్న
వయిన నగలదో తేల్చి చెప్పటం కష్టం!

ఈశ్వరీ, ఆవిడా ప్రక్క ప్రక్క కూర్చుని వుంటే అత్తాకోడళ్ళ
లేరు.

మొత్తంమీద వయస్సును దాచేసే మేకప్‌తో మంచి ఆకర్ష
వున్నారు.

"ఈమె నా ఫ్రెండ్ స్వర్ణ! మద్రాసు నుండి వచ్చింది."

ఆకాశపు నీలిరంగు వెంకటగిరి జరీచీర, మెడలో నల్లపూ
రవ్వలపోగులు, ఎడమచేతికి వాచీ, కుడిచేతికి బంగారుగాజులూ, మెడ



వేసుకున్న ముడి, కళ్ళకు జోడూ-

అనిత ఆమెవైపు కుతూహలంగా చూస్తూ అడిగింది-

"ఆర్ యూ ఏ డాక్టర్?"

"హౌ డూ యూ నో?" ఆశ్చర్యంగా అడిగారామె.

"జస్ట్ గెస్సింగ్" చిన్నగా నవ్వింది.

ఈశ్వరి అత్తగారు కూడా నవ్వుతూ అన్నారు-"అవును! డాక్టరే! తను కూడా తెలుగే! మీరు మాట్లాడుతూండండి."

ఆమె వెళ్ళిపోయారు.

ఊహకు డాక్టర్లంటే పిచ్చి క్రేజ్! అందునా లేడీ డాక్టర్లంటే ఇక చెప్పనవసరం లేదు. తనకసలు మెడిసిన్ చదవాలని పిచ్చికోరిక. ఎంట్రెన్స్ వ్రాసి సీటు వచ్చాక వాళ్ళ నాన్నగారు ఒప్పుకోలేదు.

'అబ్బో! అది ఏ పదేళ్ళో చదివితేగానీ సరైన డాక్టర్‌వి అవ్వలేవు' అన్నారు. ఇక చేసేదిలేక ఈ డిగ్రీలో చేరింది.

ఆ వచ్చినావిడ డాక్టరని తెలిసేసరికి ఎంతో ఎడ్మిరేషన్‌తో ఆవిడ్ని చూస్తూ కుతూహలంగా ఏవేవో ప్రశ్నలడిగేస్తోంది.

ఆవిడా ఓపిగ్గా నవ్వుతూ సమాధానాలిస్తున్నది.

మొత్తంమీద కాసేపట్లో అందరూ మొహమాటం లేకుండా ఆమెతో మాట్లాడేస్తున్నారు. అలా అనేకంటే ఆవిడ వాళ్ళలోని క్రొత్తదనాన్ని పోగొట్టి ఫ్రీగా మాట్లాడేట్లు చేసారనటం సమంజసం!

మృదువుగా నెమ్మదిగా నవ్వుతూ ఆమె మాట్లాడుతూంటే ఎప్పటి నుంచో బాగా పరిచయమున్న వ్యక్తిలాగా అన్పించింది.

సడెన్‌గా ఆవిడ తన పర్స్‌లోనుండి చిన్న పుస్తకం తీసి-"మీ ఆటోగ్రాఫ్" అంది.

ఆశ్చర్యపోయారందరూను.

"మీ ఆటోగ్రాఫ్ మేము తీసుకోవాలిగానీ మీకు మేము ఇవ్వటం ఏమిటి?"

"వైనాట్! నా చదువైపోయి జీవితంలో సెటిల్ అయిపోయాను కాబట్టి నేనో డాక్టర్‌గా మీకు పరిచయమయ్యాను. రేపు భవిష్యత్‌లో మీరు

చదువులు పూర్తిచేసి ఎవరెవరు ఎంతెంత గొప్పవాళ్ళవుతారో ఇవ్వాళేం తెలుస్తుంది? అప్పుడు ఈ పెద్ద పెద్ద వాళ్ళందరూ ఒకప్పుడు నాకు తెలిసిన వాళ్ళే అని గర్వంగా అనుకుంటూ మీ ఆటోగ్రాఫ్ చూసుకుంటాను."

అనితకు ఒళ్ళు పులకరించింది.

అందరి ముఖాలూ ఓ విధమైన గగుర్పాటుతోనూ, ఆనందంతోనూ కందిపోయాయి.

ఉమ చటుక్కున వంగి కుడిచేతిని చాపి వ్రేళ్ళతో ఆమె పాదాలను తాకింది.

"అరరే....ఏమిటిది?" ఖంగారుపడిందావిడ.

"మా భవిష్యత్తు ఎలా వుంటుందో మాకు తెలీదు! ఎపుడూ ఆలోచించనూ లేదు. అలాంటిది కొన్ని సెకండ్లపాటు మమ్మల్ని అలా-అలా ఎక్కడెక్కడికో తిప్పి తీసుకొచ్చేసారు. మిమ్మల్ని జన్మలో మర్చిపోలేము."

ఆ పుస్తకం అందుకుని అందరూ పేర్లూ, అడ్రస్‌లూ వ్రాసారు.

ఆనంది ఆమె ముఖంలోకి చూస్తూ అడిగింది- "ఈ బుక్‌లోంచి ఒక పేపర్ తీసి మీరేదైనా వ్రాసి మాకివ్వండి."

"ఏమి వ్రాయమంటారు?" నవ్వుతూ అడిగిందామె.

"ఏమైనాసరే! మీ గుర్తుగా."

బాగ్‌లోంచి వేరే బుక్ తీసింది. అది ఆమె ప్రిస్క్రిప్షన్ వ్రాసే పాడ్‌లాగా వుంది. ఒక పేపర్‌పై అందరిపేర్లూ వ్రాసి, క్రింద "ఐ లవ్ ఆల్ ఆఫ్ యూ వెరీ మచ్! మీ అందరకూ మంచి జీవితాల్నివ్వమని భగవంతుని ప్రార్థిస్తున్నాను" అని వ్రాసి సంతకం పెట్టిందావిడ.

"మరి నన్నూ మర్చిపోకూడదు" పేపరందిస్తూ అన్నదావిడ.

"మీరు మద్రాసు వెళ్ళాక మీ రెగ్యులర్ బిజీలైఫ్‌లో మమ్మల్ని త్వరగా మర్చిపోతారు! మేమంత త్వరగా మిమ్మల్ని మర్చిపోలేము."

"త్వరగా కాదు! ఆలస్యంగా కూడా మర్చిపోవద్దు."

ఆవిడ అన్న పద్ధతికి అందరూ నవ్వేసారు.

ఆవిడ వెళుతూంటే ఊహతోపాటు అందరూ కూడా ఆరాధనగా చూసారు.



ప్రేమించటం అనేది ఓ కళ అయితే ప్రేమించబడటం అనేది ఒక వరం!

అది అందరకూ దక్కదు.

ఈ ప్రపంచంలో చెడు లేనిదే మంచికి విలువ లేనట్లే ప్రతి విషయానికీ ప్రతి చర్యకూ అనుకూలత, ప్రతికూలత రెండూ వుంటాయి!

ప్రతి మనిషిలోనూ మంచీ-చెడూ, సమర్థతా-అసమర్థతా, బలహీనతా ప్రేమ, దయ, కోపమూ, కక్ష, పొగరూ అన్నీ వుంటాయి. కాకపోతే ఒక్కొక్కరిలో ఒక్కో గుణం ఎక్కువ-తక్కువలలో ఉంటుంది!

ఏది ఎక్కువ వుంటే వాళ్ళు ఆ రకంగా ఫోకస్ అవటం సహజం!

కొంతమంది వుంటారు-

వీళ్ళు చాలా ప్రత్యేకం!

ఒక్కొక్కరికి ఒక్కోరకంగా కనిపిస్తారు.

ముఖ్యంగా-మగవాళ్ళు!

బయటి ప్రపంచానికి చాలా గొప్పవాడుగా కనిపించే వ్యక్తి ఇంట్లో భార్యా పిల్లలకు రాక్షసుడులాగా, నిరంకుశుడుగా అనిపించవచ్చు!

అలాగే ఇంట్లో చాలా మంచివాడు, ప్రయోజకుడు అనిపించే వ్యక్తి బయటి ప్రపంచంలో అతి దారుణమైన దుర్మార్గుడిగా, మోసగాడిగా అయ్యుండవచ్చు!

అలాగే మోసపోవటం అనేది ఎక్కువగా ఆడవాళ్ళే అవుతారు! అదేదో వాళ్ళ జన్మహక్కులా త్వరగా లొంగిపోతారు!

ఎందుకూ పనికిరాని ఓ జులాయి వెధవకూడా రజనీకాంత్ స్టయిల్లో సిగరెట్ కాలుస్తూ, సంజయ్‌దత్ స్టయిల్లో జుట్టు పెంచుతూ అమ్మాయిల గుండెల్లో గులాబీలు పూయించగలడు!

*          *          *          *

ఫిబ్రవరిలో ఈశ్వరికి పెళ్ళి జరగటమూ, మద్రాసు వెళ్ళటమూ వెంట వెంటనే జరిగిపోయాయి.

ఈశ్వరి లేనిలోటు ప్రతి చిన్న విషయంలోనూ ఎంతో స్పష్టంగా తెలుస్తోంది.

ఇందిర అన్నది.

"ఆఫ్టరాల్- ఇంత స్వల్ప కాలంలోనే ఈశ్వరి ఎడబాటు మనకిం బాధను కలిగిస్తుంటే పుట్టినప్పటి నుంచీ పెంచిన తల్లిదండ్రులకు ఇంకెం వెల్తిగా వుంటుందో కదా!"

"అందుకేనేమో- ఆడపిల్లకు పెళ్ళిచేసి పంపేటప్పుడు తల్లిదండ్రు ఏడ్చేది!"

"అసలు ఆడపిల్లలను అంత గారాబంగా చూసేది కూడా అందు అయ్యుంటుంది" అన్నది అనిత.

"ఏయ్ అనితా! నీతో చెప్పటం మర్చిపోయాను. నీకో లెటర్ వ నీ బాక్స్ మీద పెట్టాను. చూసుకున్నావా?"

"అవునా! అరె- చూడనేలేదే" పరుగుతీసింది అనిత.

ఇంచుమించుగా ఫిబ్రవరి ఆరంభం నుండీ స్కూళ్ళలోనూ, కా ల్లోనూ సందడి మొదలవుతుంది.

వార్షికోత్సవాలూ, ఆటలపోటీలూ, పరీక్షలూ—

వరుసగా అంతా హడావుడే!

సహజంగా ఫస్టుటరమ్ అంతా క్రొత్త అడ్మిషన్‌లూ, క్రొత్త లె రర్లూ, క్రొత్త గదులూ, క్రొత్త ఎలక్షన్లూ.... వీటితోటే సరిపోతుంది.

సెకండ్ టరమ్ చాలా చిన్నది. అలా వచ్చి ఇలా వెళ్ళిపోతుం

ఇహ లాస్ట్ టరమ్ ఇలాంటి యాక్టివిటీస్‌తో అయిపోతుంది.

* * * *

పరీక్షలయిపోయాయి.

రెండు సంవత్సరాలు జరిగిపోయాయి.

ఎన్ని రోజులో- ఎన్ని గంటలో— ఎన్ని నిమిషాలో- ఎన్ని క్షణాలో—

"అమ్మో! చాలా కాలం కలిసి వున్నాము సెలబ్రేట్ చేసుకోవ సిందే" అన్నది అనిత

అందరూ నవ్వుకున్నారు.

ఇంకొన్ని కోట్ల క్షణాలు కలిసి వుండాలని ప్రార్థన కూడ చే



కోవాలి."

"ఊహూఁ.... మన ఈ స్నేహం క్షణాల్లో లెక్కబెట్టవద్దు! జీవిత కాలమంతా వుండాలి. కష్టాల్లో, సుఖాల్లో, మంచికీ, చెడుకీ, అన్ని సమయా ల్లోనూ మన స్నేహం గుర్తుకురావాలి" గంభీరంగా అన్నది ఉమ.

"అవును! ఎవరూ ఎవర్నీ మర్చిపోకూడదు. నామట్టుకు నేను మర్చి పోను బాబూ! మీరు పిల్చినా పిలవకపోయినా అప్పుడప్పుడూ మీ ఇళ్ళకు వచ్చి మీ మొగుళ్ళనూ, మీ బుజ్జిబుజ్జి పాపలనూ చూసి హలో చెప్పి పొట్ట నిండా ఫుడ్‌కొట్టి మరీ వెడతాను."

ఊహ అలా అంటూండగానే డైనింగ్ బెల్ మ్రోగింది.

"చూశారా నా మాటలో ఎంత నిజం వుందో!"

"గంట మోగిందనా" ఊహ ముక్కుపట్టి అటూ ఇటూ వూపుతూ నవ్వింది ఆనంది.

"అవునూ! మీ అందరూ మా వూరు రాకూడదూ! మా పల్లెటూరు చూసినట్లుగా కూడా వుంటుంది" చటుక్కున అడిగింది ఇందిర.

అనుకోకుండా వచ్చిన ఆ ప్రపోజల్‌కు ఎవరూ వెంటనే సమాధానం చెప్పలేకపోయారు.

మొదటగా అనిత అన్నది.

"వెళదామా!" ఆమె పల్లెటూర్లను గురించి వినటమే గానీ ఎప్పుడూ చూడలేదు.

"నేను రెడీ" అన్నది ఊహ.

"నేను తాతయ్యను అడగాలి" అన్నది ఉమ.

"సారీ ఫ్రెండ్స్. నేను రాలేను" చెప్పింది ఆనంది.

"వైవైవైవై వాటీజ్‌ది ప్రాబ్లెమ్?" కుడిచేతి అరచేతిని ముడిచి ముందుకూ వెనక్కూ వూగిస్తూ అడుగుతూన్న ఊహ తలపై మెల్లిగా తట్టి నవ్వుతూ చెప్పింది.

"నో ప్రాబ్లెమ్ మేడమ్."

"దెన్ వ్వాట్?"

"ఊహ నిజంగానే మేడమ్ అవుతుందేమో! మనిషి చిన్నదిగా

వున్నా కూత ఘనంగా వుంటుంది."

"నేనేమయినా రైలుబండినా కూత కూయటానికి?"

"నో మేడమ్. తెలుగులో ఓ సామెత వుంది. 'పిట్టకొంచెం కూత ఘనం' అని."

"ఘనం అంటే?"

"యాక్చువల్ మీనింగ్ చెప్పాలంటే బరువు అని అర్థం! కాకపోతే ఇక్కడ సందర్భాన్ని బట్టి దాని అర్థం షార్ప్‌నెస్ అని వస్తుంది."

ఉష మాటలకు నవ్వుతూ చప్పట్లు కొట్టింది అనిత.

"కరెక్టు! ఊహ వాయిస్ నిజంగా అలాగే వుంటుంది. మీ దాడీ ఎలాగూ నీకిష్టమైన మెడిసిన్ కోర్సులో చేర్చారు కాబట్టి లెక్చరర్‌గా వెళ్ళు! నీ పీరియడ్ అంటే చాలు— స్టూడెంట్స్ అంతా గప్ చుప్ అయిపోతారు."

"నన్ను నీ అసిస్టెంట్‌గా పెట్టుకో ఊహా" అడిగింగి ఆనంది.

"అసిస్టెంటా! ఎందుకూ?"

"నీకు బ్లాక్‌బోర్డ్ అందదుకదా! నేనెత్తుకుంటే నువ్వు వ్రాద్దువుగాని."

"ఏయ్! నువ్వు.... నిన్ను...." ఆనంది వైపు వస్తూన్నది.

చటుక్కున లేచి పరుగు తీసింది ఆనంది. ఆ దృశ్యం చూస్తూ అనిత, ఇందిర చప్పట్లు కొడుతున్నారు.

పొగడచెట్టు చుట్టూ పరుగు తీస్తూన్న ఆనంది "ప్లీజ్ ఊహా! జస్ట్ జోక్ చేశాను అంతే" అంటూ వచ్చి అనిత ప్రక్కన కూర్చుంది.

ఊహ కూడా వచ్చి ఆయాసంతో రొప్పుతూ ఆనంది ఒడిలో పడుకుంది.

ఉమ అడుగుతోంది. "ఈ కాస్త పరుగుకే అంతగా అలసిపోయావేమిటి?"

అనిత నవ్వుతూ అన్నది. "పోనీ టీచింగ్ ప్రొఫెషన్ వద్దుగానీ పాలిటిక్స్‌లో చేరు. నువ్వుగానీ మీటింగు పెట్టావనుకో- నేల కన్పించనంత జనం వచ్చేస్తారు. ఇందిరా గాంధీకి వారసురాలివై పోతావు."

"ఆమెకున్న ఇద్దరు కోడళ్ళూ చాల్లా కొట్టుకుచావటానికి! మధ్యలో నన్ను కూడా దూరమంటారన్నమాట!"



"ఏమో! ఆ కుర్చీకోసం ఆవిడా ఆవిడా కొట్టుకుంటూన్న హడావుడిలో గప్ చుప్‌గా నువ్వెళ్ళిపోయి ఆ కుర్చీని ఆక్రమించుకోవచ్చునేమో!"

నవ్వుతూ లేచింది ఇందిర.

"ఏమంటావు ఉషా! అమ్మ దగ్గరకు వెళతావా? మా వూరు వస్తావా? లేక ఢిల్లీ వెళతావా?"

అందరూ పకపకా నవ్వుతూంటే ఉష కూడా నవ్వేసింది.

* * * *

ఇందిర కోరినట్లుగా ఆ పల్లెకు వెళ్ళాలనీ అవన్నీ చూడాలనీ ఆనందికి కూడా చాలా కోరికగా వున్నది.

కానీ పెద్దమ్మను చూడాలనే కోర్కె ఇంకా బలంగా వుండటంతో సెలవులు ఇవ్వంగానే ఇంటికి వచ్చేసింది.

ఆనంది అప్పటానికి అరవ అమ్మాయి అయినా ఆమె పెదతండ్రి స్టేట్‌బ్యాంకులో ఉద్యోగం చేస్తూ చాలాకాలం ఆంధ్రప్రాంతాల్లో వుండటంతో ఇంచుమించు తెలుగు కుటుంబంలా అయిపోయారు. ఆయన తర్వాత ఆయన కొడుకు విశ్వనాథానికి కూడా అదే ఉద్యోగం దొరకటం-అదే ప్రాంతంలో వుండటం—

ఆనంది తల్లిదండ్రులు పూర్తి తమిళులు! ఉండటం కూడా మధురై అవ్వటంతో ఆ కుటుంబం స్వచ్ఛమైన అరవ కుటుంబం! ఆయన నూనె, నెయ్యి వ్యాపారం చేస్తుండేవారు. వాళ్ళకు ఆనంది ఒక్కర్తే సంతానం! ఆమె ఇంటర్ చదువుతూండగా విశ్వనాథం పెళ్ళి జరిగింది. ఆ పెళ్ళి తిరుపతిలో చేసారు. ఆనందికి పరీక్షలు జరుగుతూండటంవల్ల ఆమెని వదిలేసి ఆమె తల్లిదండ్రులు మాత్రం కారులో బయలుదేరి తిరుపతికి వెళ్ళారు.

పెళ్ళి జరిగింది.

ఆ తర్వాత దైవదర్శనం చేసుకున్నారు. పెళ్ళికొడుకునూ, పెళ్ళికూతుర్నీ విజయవాడకు పంపించి ఆనంది తల్లిదండ్రులు తమ కారులో మధురైకు బయలుదేరారు.

క్రొత్త దంపతులు ఇంటికి చేరుకోకముందే ఆనంది తల్లిదండ్రులు ప్రయాణం చేస్తున్న కారు లారీకి ఢీకొని అక్కడికక్కడే డ్రైవర్‌తోసహా

మరణించారనే వార్త చేరుకుంది.

ఆనంది దిక్కులేనిదైపోయింది.

ఆమెకు ప్రపంచమే శూన్యంలాగా మారిపోయింది.

చాలా మందికి తల్లిపోతే తండ్రి, తండ్రిపోతే తల్లి, ఇద్దరూపోతే కనీసం తాత ముత్తతలయినా వుంటారు.

ఇలా మరీ ఎవ్వరూ లేని ఏకాకిలా-అనాధలా-ఇలా మిగలటానికి ఎంత పెద్ద తప్పు చేసివుంటానో అంటూ ఏడ్చింది ఆనంది.

కనిపించని భగవంతుడ్ని తిట్టింది.

తల గోడకేసి కొట్టుకుంటూ, జుట్టు పీక్కుంటూ భోరుభోరున ఏడ్చింది.

ఏంచేసినా పోయినవాళ్ళు తిరిగి రాలేరుకదా!

ఆనందికి పెద్దమ్మే ఆశ్రమం అయ్యింది.

వయసుతక్కువ. అంతకన్నా అనుభవం ఇంకాతక్కువ. లోకజ్ఞానం అసలేలేదు....

అలాటి ఆనందికి తల్లిదండ్రులు పోయారనీ, తాను ఓ దిక్కులేని పక్షిలా అయిపోయాననీ తెలుసు.

ఈ ప్రపంచంలో ఎలా బ్రతకాలనీ, తనుకూడా చచ్చిపోతే బాగుండేదని ఏడవటం తెలుసు.

నాన్నమీదేనా అమ్మా నీకంత ప్రేమ....నామీద లేదా అని అమ్మనూ, నన్నిలా ఒంటరిగా ఒదిలేసి అమ్మనుమాత్రం నీతో తీసుకెళ్ళిపోయావా డాడీ అని తండ్రినీ-ఏనాడు ఎవరికి ఏ పాపం చేస్తే నాకీశాపం ఇచ్చావని భగవంతుడ్ని నిలదీసి అడగటంవరకూ తెలుసు.

వ్యాపారమూ, ఇల్లూ, ఆస్థిపాస్తులు, లావాదేవీలు-ఇవన్నీ ఆనందికి తెలీవు.

పెద్దమ్మ, ఆమె కొడుకు విశ్వనాధమే ఆ వ్యవహారం అంతా చక్కబెట్టారు.

కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి అంటారు. పైగా ఇలాంటి సమయాల్లో మరీను.



ఆనంది తండ్రి సుమారుగా ఓ ఇరవై అయిదేళ్ళు కష్టపడి అభివృద్ధి చేసిన ఆ వ్యాపారాన్ని అమ్మబోతే సరైన ధరే రాలేదు.

అయినకాడికి ఇల్లు, వాకిలి, వ్యాపారమూ అంతా అమ్మేసి విజయవాడకు వచ్చేసారు.

విశ్వనాధం క్రొత్తభార్య సుజాతకు పెళ్ళి అవ్వగానే వచ్చిన మొట్టమొదటి కోపం అదే.

విశ్వనాధానికి తండ్రినుంచీ సంక్రమించిన ఆస్థి–డిగ్రీ....దానితోపాటు బ్యాంకు ఉద్యోగమూ. ఈ రెంటినీ మించి మంచితనమూనూ.

వెనకాల స్థిరాస్థి అంటూ ఏమీలేకపోయినా నెలకు ఆరేడువేల రూపాయల జీతం వచ్చే గవర్నమెంట్ ఉద్యోగం వుంది. అతని మీద ఆధారపడ్డవాళ్ళంటూ ఎవరూ లేరు. ముసలి తల్లి తప్పించి బాధ్యతలు లేని జీవితం! అని ఆలోచించి సుజాతను విశ్వనాధానికిచ్చి పెళ్ళి చేశారు.

నిజానికి అది అతడికి సరిపోయిన సంబంధం కానేకాదు. దేవుని లీలలకు ఇదో వుదాహరణ....

అతనిది చాలా మెత్తని స్వభావం.

ఎదుటి మనిషిని మన్నించే పద్ధతి గలవాడు.

ఆడవారంటే మరీ గౌరవం.

సంపదలు లేకపోయినా సంస్కారంతో బ్రతుకుతున్నవాడు.

పనిలో నిజాయితీ ఉన్న విశ్వనాధానికి ఆఫీసులోనూ, పై అధికార్ల మధ్యనా మంచి గుర్తింపు వుంది.

తోటి ఉద్యోగులందరితోనూ అలా అల్లుకుపోయి నవ్వుతూ నవ్విస్తూ 'మంచివాడు' అనే ఉత్తమ బిరుదును సంపాదించుకున్న వాడు విశ్వనాధం!

నిజమే!

అతను ఎవ్వరితో అయినా కలిసిపోగలడు. పనేదైవం అనే నమ్మకమున్నవాడు.

తల్లి, బ్యాంకు–అదే అతడి లోకం!

అంతకుమించి అతగాడికి వేరే వ్యాపకమే లేదు.

అతనితో పనిచేసే అందరూ అతనికి మిత్రులే....బంధువులే.

తామరాకు మీది నీటిబొట్టులా అందరితోటీ ఎంతవరకూ వుండాలో అంతవరకే వుండేవాడు.

ఇంతకాలం అందరితో మన్ననలు పొందుతూ మంచిగా వున్నాడంటే అదే కారణం.

అతని పరిధి అతనికి తెలుసు!

పరమశివుడి మెడపై దర్జాగా కూర్చున్న పాము దేగను చూ దర్పంగా అడిగిందట-

'క్షేమమేనా?' అని.

'వారి-వారి స్థానాల్లో వున్నంతవరకూ అందరూ క్షేమంగానే ఉంటారు' అని సమాధానం చెప్పిందిట.

దేవుని లీలలు బహు విచిత్రం!

శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు.

అదే నిజమైతే-ప్రతిచర్యా దేవుని ఆజ్ఞే అయితే—ఆయనగార్ని ఓ ఏడాదిపాటు ఈ భూమిమీదకు దిగివచ్చి అందరితోపాటు తానూ ఓ మామూలు మనిషిగా బ్రతకమని అడగాలి. అపుడే ఈ పాట్లు అర్థమవు తాయి.

లేకుంటే అక్సిజనులో కలిసిపోయి వుండే నత్రజనిలా హాయిగా ఏ గొడవా, ఇబ్బందీ లేకుండా బ్రతుకుతూన్న విశ్వనాథం జీవితంలోకి సుజా తను ఎందుకు ప్రవేశపెట్టాడో అర్థంకాదు.

మంకుతనం, పెంకెతనం, పొగరు, కోపం, అహంకారం, అహం భావం—అన్నీను-ఓ మనిషికి ఏమేమి వుండకూడదనీ కోరుకుంటామో అవన్నీ ఓ కుప్పగా పోసి బొమ్మనుచేసి ప్రాణంపోసి దాని నుదుటిపై విశ్వ నాధం భార్య అనే ముద్రవేసి మరీ పంపించాడు సృష్టికర్త!

లేకుంటే-ఎక్కడో తమిళనాడులో పుట్టి ఉద్యోగరీత్యా ఆంధ్రలో స్థిరపడిన విశ్వనాధం తూర్పుగోదావరి అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడా!

అతడుగానీ, అతడి తల్లిగానీ ఎప్పుడూ కలలోకూడా అలా జరుగు తుందని వూహించలేదు.



కొడుక్కి ఇరవై ఆరేళ్ళు వచ్చాయి. ఉద్యోగంలో సెటిలయ్యాడు. ఇహ ఇంట్లో దీపం వెలిగించే కోడల్ని తెచ్చుకుంటే బాగుంటుందనే కోరికతో ఆవిడ మధురైలోవున్న చెల్లికి ఉత్తరం వ్రాసింది.

ఆవిడ నాలుగైదు సంబంధాలు చూసింది.

కొన్ని జాతకాలు కుదరలేదనీ, కొన్ని అమ్మాయి బాగుండలేదనీ.... మరొకటి విశ్వనాధానికి నికరమైన ఆస్థిగా ఏమీ లేదనీ-అలా వెనక్కి వెళ్ళిపోయాయి.

ఈలోపునే ప్రక్కింటివాళ్ళ అమ్మాయికి వరుడ్ని చూస్తూన్న పెళ్ళిళ్ళ శాస్త్రిగారితో పరిచయమవటమూ- మాటల సందర్భంలో చెప్పటమూ జరిగింది. ఆవిడ చెప్పిన పదిరోజుల్లోనే ఓ ఫోటో తెచ్చి చూపించాడాయన.

అమ్మాయి అందంగానే వున్నది. కాస్తో కూస్తో చదువుకున్నది. ముగ్గురమ్మాయిల్లో మధ్య అమ్మాయి. పెద్ద అల్లుడు పోలీసు డిపార్టుమెంట్‌లో పని చేస్తున్నాడట! ఆఖరి అమ్మాయి ఇంకా చదువుతోందిట. ఐదు లక్షలు ఖరీదు చేసే మామిడితోటను అమ్మాయి పేరిట రిజిష్టరు చేయించుతామన్నారుట! తమిళులనే అభ్యంతరాలు గానీ, జాతకాలు చూసే నమ్మకాలు గానీ ఏవీ లేవన్నారుట!

పెద్దమ్మ సందేహించింది.

జాతకాల మీద నమ్మకం వాళ్ళకు లేకపోవచ్చు! కానీ తనకున్నదే! ఆ నమ్మకంతో ఓకదా వచ్చిన సంబంధాలు వదులుకున్నది?

పైగా మన ప్రాంతమూ కాదు! మన భాషా కాదు! మన పద్ధతీకాదు!

ఆమె ఒప్పుకోలేదు.

విశ్వనాథం— "నీ ఇష్టమే నా ఇష్టం అమ్మా! నాకంటూ వేరే ఉద్దేశాలు ఏమీ లేవు! నీ మనసుకు ఏమనిపిస్తే అది చెయ్యి! నన్ను గురించీ నా మంచిని గురించీ నాకంటే ఎక్కువ ఆలోచించేది నువ్వే" అన్నాడు.

చెల్లెలిని పిలిపించింది.

ఆమె ఆ అమ్మాయి ఫోటో చూసి అక్క సందేహాలన్నీ త్రోసిపుచ్చేసింది.

"అమ్మాయి లక్షణంగా వుంది. స్థిరాస్థి ఇస్తామంటున్నారు. మీరా-

ఇక్కడే వుండవలసిన వాళ్ళు! ఇవ్వాళ మన ప్రాంతంనుండీ- అమ్మాయి తెచ్చుకుంటే భాష తెలియక ఎంత కష్టమవుతుంది! ఇంకా ఈ రోజుల్లో ఈ కులాలు, జాతులు అంటూ ఆలోచనేమిటి! పిచ్చిపిచ్చి అనుమానా పెట్టుకోక హాయిగా ఒప్పేసుకో."

అంతే!

'మాంగల్యం తంతునానేన' అంటూ సుజాత మెడలో మూడుము వేయించేశారు విశ్వనాథంతోటి!

అతడు కూడా హృదయపూర్వకంగా

'నా శాంతి, సుఖం, జీవితం-అంతా నీతోటే! ఇహనుండీ నీవు బ్రతికినంత కాలమూ నీ చేయి పట్టుకుని నడిపించే బాధ్యత నాది! అని అ సాక్షిగా ప్రమాణం చేశాడు.

తలంబ్రాలు పోశాడు!!

ఏడడుగులూ నడిచాడు!

అరుంధతీ నక్షత్రమూ చూశాడు!

చిటికెనవేలు పట్టుకుని ఇంటికి తీసుకొచ్చాడు!

విధి విన్యాసం!

ఆనంది తల్లిదండ్రుల్ని కోల్పోయి ఆ ఇంటికే చేరుకుంది.

పదహారు రోజుల పండగనీ, నెలరోజుల లోపలనీ, వ్రతా నోములనీ, మధ్యలో పండగలనీ, ఆ మధ్యలో బెంగ అనీ— అలా అయి ఎనిమిది నెలలు కావస్తున్నా ఆవిడ అత్తవారింట్లో వున్నది మాత్ర పట్టుమని పదిరోజులు కూడా లేవు.

ఏమిటి? ఎందుకు? అనేలాటి ప్రశ్నలడిగే తత్వంకాదు విశ్వనాథ

అత్తగారు కూడా "పోనీలే క్రొత్తచోటు, క్రొత్తమనుషుల్తో ఇమి పోవటానికి కొంత సమయం పడుతుందిలే" అని సమర్థించుకునేది.

సంక్రాంతి పండగ వచ్చింది.

మామగారింటి నుండి అల్లుడ్ని పండక్కి రమ్మనికబురు వచ్చిం

"నేనెందుకమ్మా" అన్నాడు విశ్వనాథం.

"పోనీలే! వెళ్ళు! మనము దీపావళి పండగకు ఎంత ప్రాధాన్య



ఇస్తామో వీళ్ళు సంక్రాంతి పండగను అంత బాగా జరుపుకుంటారట! వాళ్ళు మర్యాదగా పిల్చినప్పుడు వెళ్ళకపోతే బాగుండదేమో! ఈ నాలుగురోజులూ నీకు సెలవేగా! పైగా వచ్చేటప్పుడు అమ్మాయిని కూడా తీసుకొచ్చినట్లు వుంటుంది ఈసారి సుజాత వెళ్ళి చాలా రోజులయింది."

నవ్వుకున్నాడు విశ్వనాథం.

'రోజులా— దసరా అని వెళ్ళింది! వెంటనే దీపావళి వస్తోంది.... అది అయ్యాక వస్తాను అంది. ఆ తర్వాత వాళ్ళ అమ్మకు జ్వరం అంది. ఆ తర్వాత సంక్రాంతి వస్తోంది అంది' ఆ తర్వాత ఇంకేమి వస్తుందో....'

సుజాతలోని వెంకితనం అత్తగారికింకా అర్థమవ్వలేదు గానీ విశ్వనాథం బాగానే గ్రహించాడు. మొదటి మూడురోజుల్లోనే అతడనుకున్నాడు- ఇది పూజకు పనికిరాని కాగితం పువ్వులాంటిదనీ, పంటపండేందుకు పనికిరాని బంకమట్టి అనీ, తాను కోరుకున్న లక్షణాలు మచ్చుకు కూడా లేవనీ, తను జాగ్రత్తగా హాండిల్ చేసుకోకపోతే ఇంటి పరువు బజారులోనూ, మనశ్శాంతి కాశీకీ మారక తప్పదనీ బాగానే తెలుసుకున్నాడు.

* * * *

ఆనంది స్కూలు నుండి ఇంటికి వచ్చేసరికి పెద్దమ్మ పప్పురుబ్బుతోంది.

చెప్పులు వదిలి, పుస్తకాలు బల్లపై పెట్టి చేతులు కడుక్కుని చప్పున వచ్చి పెద్దమ్మ చేతిలోని పత్రం అందుకుంది.

"ఇప్పుడేకదా వచ్చావు. నేను రుబ్బేస్తానులే! నువ్వెళ్ళి కాఫీ తాగు."

ఆనందికి తెలుగు రాదు. ఇప్పుడిప్పుడే చిన్న చిన్న మాటలు నేర్చుకుంటోంది.

పెద్దమ్మ, విశ్వనాథం, ఆనంది–ముగ్గురూ తమిళమే మాట్లాడుకుంటారు.

"ఫర్వాలేదు పెద్దమ్మా! గాడిదలా వున్నాను. నువ్వొక్కదానివే పని చేసుకుంటూంటే నేనెనా చూస్తూ వూరుకుంటాను."

ఇంటి పనులు చేయటానికి మనిషినెవర్నీ పెట్టుకోలేదు పెద్దమ్మ. రెండు పందల జీతమూ, ఒకపూట అన్నమూ అడుగుతున్నారు.

పైగా ఉదయం సాయంత్రం కాఫీ! ఉదయం పూట టిఫిను పెట్టాలిట.

చుట్టాలకు చేసినట్లు అంత మర్యాదలు చేసి పని చేయించుకో టానికి ఇద్దరు మనుషులకు ఎంతపని వుంటుంది? పద్దులే తల్లీ! అని ఎప్పు పెట్టుకోలేదు.

అది మేడమీద రెండు గదుల పోర్షను. ముందర వెనుక వరండా ఉంటాయి.

వెనుక వరండానానుకుని వంటగది, దానిప్రక్కనే బాత్‌రూ ఉంటాయి. ఆ వరండాలోనే ఓ ప్రక్కగా రోలు, బట్టలుతుక్కోటాని బండరాయీ, నీళ్ళు కొట్టుకోవటానికి ఓ బోరింగు పంపూ—దానికే పన్నెం వందల రూపాయల అద్దె కడుతున్నాడు.

అతనికి ఏడువేల ఎనిమిది వందలా ఏభై రూపాయల జీతం వస్తే మాట నిజమే! కాని ఎల్.ఐ.సి. అనీ, పి.ఎఫ్.అనీ, స్కూటర్ లోను అ అవీ-ఇవీ పోను నాలుగువేల చిల్లర వస్తుంది. ఐదువందలు చిట్‌ఫండు కడతాడు. మరో ఐదువందలు ఫిక్సెడ్ డిపాజిట్ లో వేస్తాడు. అద్దెడబ్బు పోను మిగిలింది వాళ్ళకు చాలా హాపీగా సరిపోతుంది. అందులోనే ప్ర నెలా పొదుపుచేసి మిగిల్చినదాన్ని పోస్టుఆఫీసులో దాస్తుంది పెద్దమ్మ.

అతడికెలాంటి అలవాట్లూ లేక స్వంత ఖర్చు అనేదే వుండదు.

చక్కటి క్రమశిక్షణలో వుండే బడ్జెట్ కుటుంబం అది!

ప్రొద్దుటే ఇల్లు వూడ్చి తడిబట్టతో తుడవడమూ, దేవుడి సామా కడిగి పూజ చేయటమూ ఆనంది పని.

పాత్రలు కడిగి వంటచేయటం పెద్దమ్మ పని.

ఆనంది బట్టలు ఉతికి, నీళ్ళు కొడుతూంటే జాడించి ఆరవేయట పెద్దమ్మ చేస్తుంది.

ఉదయం పూట విశ్వనాథం నీళ్ళుకొట్టి నింపుతాడు.

అదో క్రమమైన పద్ధతులకు అలవాటుపడి అభిమానాలతో అల్లు పోయిన ఆనంద లహరి!

ఆ ఇంటి కోడలుగా రావటం సుజాత చేసుకున్న అదృష్టమో విశ్వనాథం దురదృష్టమో కాలమే తీర్పు చెప్పాలి!



పెద్దమ్మ పిండిని గిన్నెలోకి తీసాక ఆనంది నీళ్ళతో రోలు, పత్రం కడిగేసి క్రింద గచ్చుచేసిన ప్రదేశమంతా చీపురుతో కడిగి శుభ్రం చేసే సింది.

చేతులు కడుక్కుంటూండగా సుజాత బయటకు వచ్చింది.

"హల్లో వదినా! ఎప్పుడొచ్చారు?" సుజాతను చూసిన ఆనందాన్ని కళ్ళనిండా నింపుకుని గబుక్కున అడిగింది. ఆ సమయంలో తను తమి ళంలో అడుగుతున్నానని ఆ అమ్మాయికి తెలియలేదు.

నిజానికి ఆనంది అడిగింది సుజాతకు అర్థంకాలేదు.

అవమానంగా భావించి, చిరాగ్గా చూసింది.

అప్పుడుగాని ఆనందికి తన తప్పు తెలిసిరాలేదు.

వెంటనే సారీ చెప్పి—అపుడప్పుడే నేర్చుకుంటున్న తెలుగులో అడిగింది-

"బాగున్నారా?"

"ఊఁ...."

ఆనందికి సుజాతతో చాలాకబుర్లు చెప్పాలని వున్నా భాష పెద్ద సమస్య అయింది.

నాలుగైదు సంవత్సరాల తేడావున్నా ఆ తేడా వయసుకేకాని మన సుకు కాదు అన్నట్లు, వదిన అనేసరికే ఇష్టమూ, స్నేహభావమూ వాటం తట అవే పుట్టుకొచ్చేస్తాయి!

కాని నోరు వుండీ మాట్లాడలేని అవస్థ!

చాలా ఇబ్బందిగా చూస్తూ చనువుగా సుజాత చేతిని పట్టుకుని ప్రేళ్ళు చూస్తూ ప్రేమగా అన్నది-

"నువ్వు నాకు తెలుగు నేర్పు! లేదా నేను నీకు తమిళం నేర్పిస్తాను! లేకుంటే మనకు సైగలే గతి."

"నువ్వు తెలుగు నేర్చుకో....అరవం నాకవసరంలేదు." చాలా పొడిగా అంది. అందులోని జాడింపుని లెక్కచేయకుండా నవ్వేస్తూ మళ్ళీ అడిగింది ఆనంది-

"మీ అమ్మా, నాన్నా బాగున్నారా?"

"ఊఁ–"

"మీ చెల్లెలు బాగా చదువుతోందా?"

"ఊఁ-"

"పొంగల్‌కి మీ అక్కగారుకూడా వచ్చారా?"

"ఊఁ-"

"పొంగల్‌ని బాగా ఎంజాయ్ చేసారా?"

"ఊఁ-"

ఆనంది కొంత ఇబ్బందిగా చూసింది. సుజాత పొడిపొడిగా సమాధానాలివ్వటం గ్రహించి తనేమైనా ఇబ్బంది పెడుతున్నట్లుగా ఫీలవుతున్నదేమో అని అనుమానంకూడా కలిగింది.

పెద్దమ్మ రెండు గ్లాసులతో కాఫీతెచ్చి ఒకటి కోడలికిచ్చి రెండోది ఆనందికిచ్చింది.

"మీ ఇంట్లో కప్పులు లేవా?"

చటుక్కున తలఎత్తి చూసింది ఆనంది.

అప్పటికే సుజాత కాఫీగ్లాసు తీసుకుని గదిలోకి వెళ్ళిపోతున్నది.

ఒక్కసారి ఆమెని వెనక్కి పిల్చి "ఒదినా ఇది మనఇల్లు...." అని చెప్పాలనిపించింది.

బలవంతాన మనసు నిగ్రహించుకుని పెద్దమ్మ వెనకాల వంటగదిలోకి వెళ్ళింది.

*     *     *     *

సుజాత వచ్చి మూడురోజులయింది.

ఆరోజు ఆదివారం!

ఆనంది ఎప్పటిలా ఉదయమే ఇల్లు వూడ్చి తుడిచేసింది.

పూజ సామానులు కడిగేసింది.

ఆదివారం స్కూలు లేదు కాబట్టి బట్టలపని పూర్తిగా ఆనందే చేస్తుంది.

బట్టలు ఉతికి జాడించేసింది. త్రాడుమీద ఆరబెడుతోంది.

సుజాత బయటకు వచ్చింది.



"నా గది వూడవటం లేదేమిటి?"

ఆనందికి క్షణంసేపు అర్థంకాలేదు.

విశ్వనాథం ఉదయమే లేచి వాకింగుకెళతాడు. సుజాత లేనిరోజుల్లో అన్నింటితోపాటు ఆ గదీ శుభ్రం చేసేది.

ఇప్పుడూ విశ్వనాథం ఉదయమే లేచి వాకింగుకెళ్ళిపోతున్నాడు. కాని ఆనంది ఇల్లు శుభ్రంచేసే సమయానికి సుజాత నిద్రలేవదు! ఆమె ఆ గదిలో వుండగా ఆనంది ఆ ఛాయలకుకూడా వెళ్ళదు. ఆమె నిద్ర లేచేసరికి ఆనంది స్కూలుకెళ్ళిపోతుంది.

బట్టలన్నీ ఆరవేసాక చీపురు, చాట తీసుకుని ఆ గదిలోకి వెళ్ళింది.

బాప్ రే-

ఈ రెండు మూడురోజులూ ఆ గదిని వూడ్చినట్లే లేదు.....నేను స్కూలుకెళ్ళిపోతే తను వూడ్చుకోవచ్చుగదా!

లోపలకు అడుగు పెట్టటానికే వీలులేకుండా వుంది.

ఓ ప్రక్కన బట్టల కుప్ప-

టేబిల్ పైన కాఫీ తాగిన గ్లాసు ఎప్పటిదో ఏమో—ఎండిపోయి ఉంది.

మంచంమీద నలిగి అస్తావిస్తంగా వున్న దుప్పటి, మంచంమీంచి క్రింద నేలమీదకు వ్రేళ్ళాడుతున్న నైటీ, మంచంమీద తెరచి పడేసిన వార పత్రికలూ. సగం బట్టలు బయటకు కనిపిస్తున్న సూట్‌కేసూ, ఆ ప్రక్కనే చెప్పులూ- 'ఛ! సంతలాగా వుంది.'

వంటగదిలో పై అల్మారాలో వున్న క్రొత్త ప్లాస్టిక్‌బకెట్ తెచ్చి ఉతకాల్సిన బట్టలన్నీ అందులోవేసి బయట పంపుదగ్గర పెట్టింది.

చీపురు తీసుకుని వూడుస్తోంది. మంచం క్రిందకు చీపురు వెళ్ళటం లేదు. ఏమిటా అని క్రిందకు చూస్తే సామానులు వున్నాయి. పెద్దవిగావున్న అల్యూమినియం కేన్‌లూ, అరటిపండ్ల బుట్టా-

కొంచెంసేపు ఆనందికి అవి అక్కడెందుకున్నాయో అర్థంకాలేదు.

బయటకు వచ్చి "వదినా" అంటూ పిల్చింది.

పెద్దమ్మ పలికింది.

"ఎందుకే! స్నానానికెళ్ళింది. ఏంకావాలి?"

"పెద్దమ్మా! ఆ గదిలో మంచంక్రింద కేన్‌లూ, పండ్లూ వున్నా ఏమిటి?"

"ష్!వాటినలాగే వుంచేసెయ్యి."

ఆనందికి అర్థంకాలేదు.

పెద్దమ్మ టిఫిను తయారుచేసే ప్రయత్నంలో వుంది.

క్షణంలో సగంసేపు ఆమెపంక చూసిన ఆనంది భుజాలెగురే పెదవి విరుస్తూ అదేదో బేతాళ మాంత్రికుడి రహస్యం లాంటిది కాబోలు అనుకుంటూ వచ్చేసింది.

గది అంతా వూడ్చేసింది.

మంచంక్రింద వున్న అరటిపండ్ల తొక్కలూ, జుట్టూ, ఎం పోయిన పూలూ—

ఆనందికి సూజాత పట్ల సద్భావం కలగలేదు.

అసలీ మూడు రోజుల్నుండీ గమనిస్తోంది-

ఆమెలో స్నేహభావం వున్నట్లే అనిపించదు.

పెద్దమ్మతో కూడా మర్యాదగా గానీ, ప్రేమగా గానీ మాట్లాడ చూడలేదు.

మరి అన్నయ్యతో ఎలా ప్రవర్తిస్తుందో-ఏమో!

అసలెప్పుడూ గదిలోనే వుంటుంది!

అదేమి అలవాటో-

ఈ గది ఇలావుంటే పాపం అన్నయ్యకెలా నిద్రపడుతున్నదో...

ఆనంది బయటకు వచ్చేసింది.

చెత్త బయట పారబోసింది.

తడిబట్టతో గది తుడుస్తున్నది. ఆ పని పూర్తికాకుండానే సుజా వచ్చింది.

"ఇంకా అవ్వలేదా?"

ఆ అడగటంలో ధ్వనించిన భావానికి గది తుడుస్తున్న ఆనందితో పాటు వంట గదిలోని పెద్దమ్మా, అప్పుడే బయటినుండి వచ్చి కాళ్ళు క



క్కుంటున్న విశ్వనాథం కూడా బిత్తరపోయారు.

తలెత్తి చూసింది ఆనంది.

ఏదైనా ఘాటుగా అనాలనిపించింది.

కాని, తన మనసులోని భావాన్ని పైకి చెప్పగలిగేంత భాష రాదు.

'ఛ!' ఏమీ అనలేక చేతిలో పని పూర్తిచేసి బయటకు వస్తోంది.

"ఇదిగో.... ఆ బట్టలతో పాటు ఈ టవల్ కూడా ఉతికేసెయ్యి" విసిరేసింది.

అది ఆనంది ముఖానికి తగిలి క్రింద పడబోతే పట్టుకుంది.

బయట పంపు దగ్గర పిట్టగోట మీంచి క్రింద రోడ్డు మీదకు చూస్తూ నించున్న విశ్వనాథం బక్కెట్‌లోని మురికినీళ్ళను పారబోస్తున్న ఆనంది జబ్బను పట్టుకుని పైకి లేపాడు.

ఆమె కళ్ళల్లోకి చూస్తూ ఏమో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు.

అమాయకంగా, స్వచ్ఛంగా, నిర్మలంగా మెరుస్తూన్న ఆమె కళ్ళను చూస్తూ అతనికి నోట్లోంచి మాటలు బయటకు రాలేక గొంతులోనే వుండి పోయాయి.

ఆమె చేతిని గట్టిగా పట్టుకున్న అతని వ్రేళ్ళు క్రమంగా నెమ్మదిగా వదులయ్యాయి.

తల వంచుకుని బయటకు వెళ్ళిపోయాడు.

ఆనంది వెంటనే గ్రహించుకుంది.

అన్నయ్య ఇబ్బంది పడుతున్నాడు.

అది నిజం!

ఆ ఇబ్బంది బహుశా వదిన ప్రవర్తనకే అయ్యుంటుంది.

సుజాత బయటకు వచ్చింది.

తలెత్తి ఆమెని చూడాలనిపించలేదు.

పట్టనట్లుగా వూరుకుంది.

తోటకూర బాగుచేస్తున్న పెద్దమ్మ దగ్గరకు వెళ్ళి సహాయం చేద్దామని కూర్చోబోయింది.

ఇంతలో తపీమని మీద ఏదో పడేసరికి గబుక్కున కళ్ళు మూసి

తెరిచింది.

కాళ్ళమీద బట్టలున్నాయి

"వాటితోపాటు ఇవి కూడా ఉతికేసెయ్యి" గదిలోకెళ్ళిపోయింది.

ఒక్కక్షణం ఏం చేయాలో తెలియనిదానిలా, అసలేం జరిగిందో గ్రహించలేనిదానిలా-

స్థాణువులా నించుంది ఆనంది.

ఆవిడ పని చెప్పటం తప్పుకాదు.

తను చేయటమూ తప్పుకాదు.

కాని—కాని—

ఆ చెప్పిన పద్ధతి తనకు నచ్చలేదు. ప్రేమవున్న చోట బాధ్యత వుంటుంది. బాధ్యత హక్కును ప్రసాదించుతుంది.

వంగి బట్టలు తీసింది ఆనంది.

చటుక్కున లేచి వచ్చింది పెద్దమ్మ.

ఆనంది చేయి పట్టుకుంది.

ఆమె కళ్ళలో సుళ్ళు తిరుగుతున్న నీళ్ళు! అది చూడగానే అప్పటి వరకూ కాస్త తిరుగుబాటు ధోరణిలో వున్న ఆనంది మనసు చప్పున మెత్తబడిపోయింది.

"ఫర్వాలేదు పెద్దమ్మా! మన వదినేకదా!"

"ఊరబెట్టు! నేనూ వస్తాను."

"ఒద్దు! నువ్వు వంటపని చూడు. ఎన్ని! కొన్ని బట్టలేకదా! నేను ఉతికేస్తాను."

"ఆనందీ!" ఆమె గొంతులో జీర ధ్వనించింది.

"వదిన చూస్తే బాగుండదు. అన్నయ్య చూస్తే బాధపడతాడు" పెద్దమ్మ చేతిని ఆప్యాయంగా నొక్కుతూ ఆరిందాలా చెబుతూన్న ఆనంది తలపై చేయివేసి అంది పెద్దమ్మ.

"నీకన్యాయం జరుగుతుందేమో అని భయంగా వుంది" ఆమె గొంతు దాదాపు ఏడుస్తున్నట్లే వుంది.

"ఉహుం.... అలా ఎన్నటికీ జరగదు. ఆ నమ్మకం నాకుంది.



నువ్వేమిటో, అన్నయ్య మనసేమిటో నాకు బాగా తెలుసు. ఇహ వదినంటావా— క్రొత్తకదా! కొన్నాళ్ళుపోతే తనే తెలుసుకుంటుంది."

బట్టలు తీసుకుని పంపు దగ్గరకు వెళ్ళింది.

* * * *

ఆనంది ఇంటర్ పరీక్షలు వ్రాసింది.

సెలవలు.

ఎప్పుడొస్తాయి ఎప్పుడొస్తాయి అని ఎదురుచూసిన సెలవలు తీరా వచ్చాక రెండు రోజులు బాగానే వుంటాయి.

బద్ధకంగా పడుకోవటానికీ, ఆలస్యంగా నిద్రలేవటానికీను.

ఆ తర్వాత నుండీ మొదలవుతుంది—

బోరుకొట్టటం!

ఇదివరకటి పన్నెండు గంటలే ఇప్పుడు ముప్పైఆరు గంటలగానూ, సూర్యుడు ఆకాశం మీద ఎక్కడో ట్రాఫిక్కులో చిక్కుకుపోయి కదలటం ఆగిపోయినట్లూ అనిపిస్తుంది.

ఓ రోజు విశ్వనాధం అడిగాడు.

"పరీక్షలు ఎలా వ్రాశావు?"

"చాలా బాగా రాశానన్నయ్యా."

"తర్వాత ఏం చేస్తావు?"

"నువ్వు చెప్పు! నువ్వేం చేయమంటే అదే చేస్తాను."

"పిచ్చిః నేను చెప్పటం కాదమ్మా! నీకేం చదవాలని కోర్కెగా వుంటే అదే చదువుదువుగాని."

"సీటు దొరికితే మెడిసిన్ చేయాలని వుందన్నయ్యా! అది కాకపోతే డిజైనింగ్ ఇంజనీరు చదవాలని వుంది."

"వెరీగుడ్!"

"ఏమిగుడ్డో! ఇప్పుడు మాత్రం పిచ్చిబోర్ కొడుతోంది."

నవ్వాడు విశ్వనాధం.

"అది చదవాలి ఇది చదవాలి అనుకునే వాళ్ళకు బోర్ కొట్టకూడదు. ఎంట్రెన్స్‌లకు ప్రిపేర్ అవ్వు. ఇంకా సమయం ఉంటే కంప్యూటర్

కోర్సులో చేరు. ఇంకా బోర్‌గా వుంటే లైబ్రరీకి వెళ్ళు."

"థాంక్స్ అన్నయ్యా! చాలా చాలా థాంక్స్! నిజంగా నాకీ ఆలోచనలే రాలేదు సుమా!"

వెంటనే కంప్యూటర్ కోర్సులో చేరింది. అది ఉదయం ఏడు గంటల నుండీ పదిగంటల వరకూ జరుగుతుంది.

ఉదయంపూట ఒక గంట ముందుగా లేచి తను చేయవలసిన పనులన్నీ ముగించి క్లాస్‌కు వెళ్ళేది.

వచ్చాక ఎంట్రెన్స్‌లకు తయారవుతుండేది.

ఇహ ఇప్పుడు 'బోర్' అనుకోవటానికి కూడా టైమ్ లేనంత బిజీ అయిపోయింది ఆనంది.

క్లాస్‌కి వచ్చేవాళ్ళలో ఎక్కువమంది తనలాగా హాలిడేస్‌లో చేరిన స్టూడెంట్సే వున్నారు.

నాలుగు రోజులు గడిచేసరికి పరిచయాలు కూడా పెరిగాయి.

నీ పేరేమిటంటే నీ పేరేమిటనే పరిచయం నుండీ నువ్వేం చదువుతున్నావంటే నువ్వేం చదువుతున్నావనీ, మీ ఇల్లెక్కడంటే మీ ఇల్లెక్కడనీ మా ఇంటికి రమ్మంటే మా ఇంటికోసారి రండనేంత వరకూ పెరిగింది వారి పరిచయం.

స్కూల్లో పరిచయాలకూ, ఇక్కడి పరిచయాలకూ తేడా కూడా తెలుస్తోంది ఆనందికి.

ఇంట్లోని వ్యక్తులమధ్య మసలినట్లే. స్కూల్లో క్లాస్‌లో తోటిపిల్లల మధ్య మసలినట్లు వుంటుంది! పెద్ద తేడా తెలిసేది కాదు! కాని ఇక్కడలా లేదు!

ఏదో విశాలమైనచోట వూహించని బంగారు ప్రపంచం అరచేతిలో కన్పించినట్లుగా వుంది! అందరూ క్రొత్తవాళ్ళే! కొత్త అనుభవాలు! అంత మందిలో తిరుగుతూంటే జీవితానికి అవసరమయిన ఎన్నో నిజాలు తెలుస్తున్నాయి.

ముఖ్యంగా ప్రపంచంలో వున్న అనేక కోట్ల జనాభాలో సగంమందికంటే తను చాలా అదృష్టవంతురాలనీ, తనకు కనీస అవసరాలు ఏ కష్టం



లేకుండా తీరుతున్నాయనీ తెలుస్తోంది!

ఇన్నాళ్ళూ తనొక అనాథ అనేది మర్చిపోకూడదని నిజమని, అన్నయ్య మంచితనం మీదా, పెద్దమ్మ ఆప్యాయత మీదా ఆధారపడి పెరుగుతున్న ఓ చిన్న మొలకలాంటిదే తన జీవితం అనీ-ఏదో కొన్ని సందేహాలతో, భద్రతారాహిత్యంతో వున్న ఆనందికి తన భయాలు కేవలం భ్రమలని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది!

అప్పుడప్పుడే గూడునుండి బయటకు వచ్చిన పిల్లపక్షికి ఆ చెట్టు ఎంత విశాలంగా, అందంగా కనిపిస్తుందో ఆనంది పరిస్థితీ ప్రస్తుతం అలాగే వుంది!

ఆమెతోపాటు కంప్యూటర్ క్లాస్‌కు వస్తూన్న పరిమళ అనే అమ్మాయి ఓ టీచర్ కూతురట! ఆమెకు తండ్రిలేడు! పరిమళ స్కాలర్‌షిప్‌లతో చదువుతోందిట! మార్కులు బాగా వస్తున్నాయి కాబట్టి తను ఏం చదవాలనుకుంటే అది చెప్పించటానికి సిద్ధంగా వున్నారట! అయినా పరిమళకు ఏవో పెద్ద చదువులు చదవాలనే కోరికలేదు.

త్వరగా ఉద్యోగం దొరికే చదువు చదవాలని ఆమె ఆరాటం! తన కాళ్ళమీద తాను నిలబడాలనే తపన! తల్లిగా ఆమె బాధ్యతలను నెరవేర్చింది-ఇహ కూతురుగా తన బాధ్యతలు కూడా నిర్వర్తించాలి కదా అంటుంది.

"నా చిన్నతనంనుండీ నన్ను పెంచటానికీ, చదివించటానికీ మా అమ్మ ఎంత కష్టపడిందో, జీవితంతో, ఈ ప్రపంచంతో ఎంతగా యుద్ధం చేసిందో నాకు బాగా తెలుసు! ఇహ ఆమె అలసిపోయింది! ఇప్పుడు నేను తల్లినయి ఆమెను నా బిడ్డగా చూసుకోవాలి! ఆ రోజుకోసం ఎదురుచూస్తున్నాను" అంటుంది.

"ఏ చదువులు చదివినా మన లక్ష్యం ఒక్కటే-అది ఉద్యోగం-సంపాదన! భవిష్యత్‌లో ఈ కంప్యూటర్ స్థానం చాలా స్ట్రాంగ్ అవుతుందని నా నమ్మకం! నా ఫ్యూచర్ కూడా బాగుంటుందనే విశ్వాసంతోనే ఇందులో చేరాను" అంటుంది.

పరిమళతో మాట్లాడుతూంటే ఆమె ఉద్దేశాలు వింటూంటే ఆనంది

ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

నిజమే సుమా అన్పిస్తుంది!

ఊరకే ఏ పని చేయకూడదు.

ఏ పనిచేసినా దానికో అర్థమూ, విలువా, సార్థకత వుండాలి!

అన్నయ్య అన్నాడుకదా అని ఈ కోర్సులో చేరానుగాని పరిమళ[...] నాకెలాంటి లక్ష్యమూ లేదుకదా!

అలా వుండకూడదు!

అవును!

ఇంచుమించు తన వయసే వున్న పరిమళలో వున్న మెచ్యూరి[...] తనలో ఎందుకు లేదు?

'కన్నతల్లికే బరువుగా వుండకూడదు అని పరిమళ ఆలోచిస్తుం[...] ఇహ నేను ఎలా ఆలోచించాలి' అనుకుంది ఆనంది.

పరిమళతో మాట్లాడుతూంటే కత్తి అంచున వుండే పదునులా[...] నిజాలు ఎన్నో తెలుస్తున్నాయి!

అప్పుడే ఆనంది గ్రహించుకుంది.

'మనకు తెలిసిన ప్రపంచం ఆవగింజంత! తెలుసుకోవలసిం[...] కొబ్బరికాయంత' అని.

ఆ తర్వాత ఆనంది ఆలోచనల్లో చాలా మార్పు చోటుచేసుకుం[...]

అన్నయ్య ఏం చదువుకుంటావు అని అడిగినప్పుడు 'ఇదీ' అ[...] తనెందుకు ఖచ్చితంగా చెప్పలేకపోయింది?

అంటే తనకు ఒక నిశ్చలమైన అభిప్రాయం లేదన్నమాట!

అయితే డాక్టరు లేకుంటే ఇంజనీరు అన్నట్లుగా-అవే చదువు[...] అన్నట్లుగా ఎందుకు చెప్పింది? అంటే పరిమళలా తను ఆలోచించలే[...] పోయింది.

అంతేగా!

అవును!

మనిషి అన్నాక ఏ పనిచేసినా దానికో లక్ష్యం వుండాలి.

ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేయాలి! అపుడే ఆ వ్యక్తికీ, ఆ[...]



పనికీ సార్థకత!

ఇపుడే రిక్షా తొక్కుతున్నవాడు ఈరోజుకి ఇంత సంపాదించాలని, ఎందుకో ఖర్చుపెట్టాలని అనుకుంటూ వుంటాడు.

వాడికో అవసరమూ, దానికో పద్ధతీ ఉండే వుంటుంది.

అది వాడి లక్ష్యం!

ఆ చెప్పులు కుట్టేవాడికీ ఏదో లక్ష్యం ఉండే వుంటుంది.

ఆ బిడ్డ పుచ్చుకుని వెళుతూన్న మామ్మగారూ, ఆ గొడుగులో వెళుతున్న తాతగారూ-

వాళ్ళా ఏదో లక్ష్యంతోనే వెళ్తూండి వుంటారు.

ఆ సూర్యుడు కూడా ఈ తూర్పునుండి ఆ పడమటికి చేరాలనే లక్ష్యంతోనే కదా కదులుతున్నాడు!

ఛ! ఛ! సూర్యుడు కదలటమేమిటి? మనమేకదా అతడిచుట్టూ తిరుగుతున్నాము!

నవ్వుకుంది ఆనంది.

నిజమే!

చాలామందికి వాళ్ళు ఏం చేస్తున్నారో ఎందుకు చేస్తున్నారో తెలీదు!

ఏ పనికయినా ఓ పద్ధతీ, ఓ అర్థమూ, ఓ గమ్యమూ, ఓ లక్ష్యమూ, ఓ ప్రయోజనమూ వుంటేగాని సార్థకత వుండదు.

ఏదో గాలివాటుకు కొట్టుకుపోయే చిత్తుకాగితాల్లా వుండకూడదు-జీవితాలు.

జీవితం అనేది దేవుడిచ్చిన వరం.

దాన్ని కర్త, కర్మ, క్రియలేని వాక్యంలా చేసుకోకూడదు.

ఈత ఎలా ఈదాలి అనేది క్లాసులో పాఠంలా చెప్పేకంటే నీళ్ళల్లో పడేస్తే నేర్చుకునే పద్ధతి చాలా సులభమైనది.

అలాగే పిల్లలు అమ్మా-నాన్నల పరిధిలోంచి బయటి ప్రపంచంలోకి వచ్చి మంచీ-చెడూ చిన్న-చిన్న అనుభవాలతో తెలుసుకుంటూంటే అంతకంటే గొప్ప కళాశాలలు ఎక్కడా ఉండవు.

కాకపోతే వాళ్ళకు కాస్త గయిడెన్స్ వుండాలి! అదికూడా దంపుడు ఉపన్యాసంగానూ వుండకూడదు! తుమ్మజిగురులాగా బాధ్య గానూ వుండకూడదు.

తప్పటడుగులు వేసే పిల్లలకు నడక నేర్పినట్లు ప్రేమతో శిక్షణకు తప్పకుండా మంచి ఫలితాలు దక్కుతాయి.

* * * *

ఊరునుండి సుజాత నాన్నగారు వచ్చారు. వస్తూవస్తూ రెండు బు లతో మామిడిపండ్లు తెచ్చారు.

సాధారణంగా తమిళులకు రసంపండ్లు గురించి తెలీదు. అక్కడ కోసుకుతినే పండ్లరకాలే వుంటాయి. వాళ్ళూ వాటినే ఇష్టపడతారు. అల ఆంధ్ర బంగినపల్లి మామిడిపండ్లు అంటే చాలా ఇష్టపడి తింటారు.

ఆనంది ఇవికూడా అలాంటివే అనుకుంది.

తీరా బుట్టలు విప్పితే అవేవో చిన్నచిన్నవిగా, పచ్చిగా వున్నా

చెట్లక్రింద రాలిపడినవన్నీ ఏరినట్లుగా వున్నాయి. అలాటి చిన్న పచ్చికాయలతో ఊరగాయ పట్టుకుంటారు.

అందుకోసం వచ్చినవేమో అనుకుని పెద్దమ్మతో అంది- "అమ్మ అన్ని కాయలతో పచ్చడా?"

"ఉష్!" అంది పెద్దమ్మ.

గప్‌చుప్‌గా అవతలకు వెళ్ళిపోయింది ఆనంది.

"మా నాన్న రెండు బుట్టలతో పండ్లు తెచ్చారు." అని ఓ పదిసా అయినా అటు వెళుతూ ఓ మాటా ఇటు వెళుతూ ఓ మాటా అంట ఉన్నది సుజాత.

విశ్వనాథంగానీ, పెద్దమ్మగానీ, ఆనందిగానీ ఎవ్వరూ ఏమీ బదు పలకలేదు.

తనే చేయిపెట్టి చూసింది.

"ఇంకా పండలేదు! రేపటికి పండుతాయి. పండితే మా తోట పండ్లంత తియ్యగా ఈ జిల్లాలోనే ఎక్కడా దొరకవు." అని రెండుమూ సార్లు 'అందరూ విన్నారా?' అన్నట్లుగా చెప్పింది.



"మా నాన్నగారితో కలిసి వూరెళుతున్నాను" అంది విశ్వనాథంతో.

"ఇప్పుడెందుకు?" అన్నాడు.

"నా ఇష్టం" అన్నది.

ఓ క్షణం ఆమె ముఖంలోకి సూటిగా చూసిన విశ్వనాథం "నీ ఇష్టం" అనిచెప్పి బయటకు వెళ్ళిపోయాడు.

ఓ గంటసేపు ఇటు ఇటూ చిరాగ్గా తిరిగిన విశ్వనాథం ఇంటికి వచ్చే సరికి ఇల్లు ప్రశాంతంగా వున్నది.

ఆనంది చదువుకుంటోంది.

పెద్దమ్మకూడా అక్కడే కూర్చునివుంది.

గదిలోకి వెళ్ళాడు.

బట్టలన్నీ చిందర వందరగావున్నాయి.

మంచంమీది దుప్పటి అస్తవ్యస్తంగా వున్నది.

సుజాత సూట్‌కేస్ లేదు.

విశ్వనాథానికి చాలా అలసటగా అన్పించింది.

అతడిలోని ప్రాణవాయువులో నత్రజని లోపించి భగ్గుమని మంట మండుతున్నట్లుగా వున్నది.

నీరసంగా మంచానికి అడ్డంగా పడుకున్నాడు.

కళ్ళు మూసుకున్నాడు.

కుడిచేయి పొట్టపైకీ, ఎడమచేయి నుదుటిమీదకూ అప్రయత్నంగానే చేరుకున్నాయి.

అతడి మనసు మూగగా రోధిస్తోంది.

ఏమిటీ జీవితం!

తనేదో గొప్ప జీవితం కావాలని కలలు కనలేదు.

ఆకాశంలోని జాబిల్లినో, ప్రబంధ నాయకినో కావాలని కోరుకో లేదు.

ఓ సామాన్య సంసారం!

హాయిగా సాగే బ్రతుకు!

కళకళలాడుతుండే కుటుంబం!

నవ్వుతూ సరదాగా వుండే భార్య!
ఇద్దరంటే ఇద్దరే పిల్లలు!
అమ్మ, పిల్లలు, భార్య—శాంతినివాసం లాంటి ఇల్లు!
ఊహూఁ-
అవన్నీ గగన కుసుమాలై వెక్కిరిస్తున్నాయి!
ఎందువల్ల?
ఎక్కడ జరిగిందీ తప్పు?
దీనికి కారణం ఎవరు?
తన మెతకదనమా లేక ఆమె గడుసుతనమా—అర్థంకావటంలే
మొదట్లో అనుకున్నాడు-

వేరే ఇంటినుండి వచ్చింది! తన పద్ధతులూ, అలవాట్లూ అ ఒక్కరోజులో మార్చుకోవాలంటే మాటలు కాదుగదా! ఓ చిన్న మొ లాంటి దాన్నే ఒకచోటనుండి మరో చోటకు మార్చి నాటితే వేరు భూ పట్టుకుని బ్రతకటానికి కొంత సమయం పడుతుంది. అలాంటిది ఇర ఏళ్ళు అలవాటైన పద్ధతులూ, భాష, అలవాట్లూ మార్చుకోవటానికి తన సమయం కావాలి!

పైగా మొండిపిల్ల కూడాను!

కొంతకాలం అయితే తనే మారుతుందిలే! అప్పటివరకూ ఓపిక తనే సరిపెట్టుకోవాలి' అనుకున్నాడు.

అలాగే ఎదురుచూసాడు.
కాని-
ఊహూఁ-ఆ చూపు ఎండమావి అవుతోంది!
ఇది మారే పద్ధతిగా కన్పించటంలేదు.
అసలు మారటానికి ప్రయత్నిస్తున్నట్లుగా కూడా లేదు!
తన ఓర్పుకు పరీక్షలా చిరాకు తెప్పిస్తోంది!
అమ్మను లెక్కచేయటం లేదనీ తెలుసు!
ఆనందిని పురుగులా చూస్తోందనీ తెలుసు!
తనకు కనీసపు మర్యాదైనా ఇవ్వటంలేదనీ తెలుసు!



అయినా ఓపికతో, తెచ్చిపెట్టుకుంటున్న సహనంతో, ఆమెలో మార్పు రావాలని ఎదురుచూస్తున్నాడు.

ఎవరంతట వారు తెలుసుకునే బాధ్యత ఎంతో ఆనందంగా వుంటుంది,

ఇది నీ బాధ్యత అని ఎవరయినా గుర్తుచేస్తే అది చాలా బరువుగా అన్పిస్తుంది.

తప్పులు చేయటం సహజం!

తప్పు చేయని వాళ్ళంటూ ఎవరూ వుండరు. అది తెలుసుకుని సరి దిద్దుకుంటేనే జీవితం!

ఎదిగిన వయస్సులో కూడా తప్పుని తప్పుగా గ్రహించనప్పుడూ, దిద్దుకోవటానికి ప్రయత్నం చేయనప్పుడూ, ఎదుటివారితో వేలెత్తి చూపించు కున్నప్పుడూ-ఇహ ఆ జీవితం నరక సదృశ్యమే!

విశ్వనాధం పరిస్థితీ అలాగే అయిపోతోంది!

అతడు ఎదురుచూసే మార్పు కొండమీది జాబిల్లిలాగా వెక్కి రిస్తూంటే అతడి హృదయం వేటగాడి బాణందెబ్బకు గురైన లేడిపిల్లలా విలవిలలాడుతోంది!

'కాలమా! ఓ మంచి మార్పును తెచ్చిపెట్టవా' అని అతడి మనసు ప్రాధేయపడుతోంది!

'భగవంతుడా! నీ తీర్పు నాకనుకూలంగా ఇవ్వవూ' అతనిలోని అణువణువూ ప్రార్థించుతోంది.

విశ్వనాధం లేచి బట్టలు మార్చుకుని బయటకు వచ్చాడు.

బాత్‌రూమ్ వైపుకు వెళ్ళాడు.

అతడనుభవిస్తున్న మానసిక చిత్రవధ అతడు నోరువిప్పి చెప్పక పోయినా తల్లి మనసుకు అర్థమవుతూనే వుంది.

ఆమెకే కాదు-ఆనందికీ తెలుస్తోంది!

విశ్వనాధంలాంటి మనిషి మనసు కష్టపడితే భూమాతకూడా భరించ లేదు.

ఆనంది లేచి గదిలోకి వెళ్ళింది.

కూరల మార్కెట్‌లాగా వున్న ఆ గదిని ఐదు నిమిషాల్లో సర్ది

బెడ్‌షీటు మార్చి, శుభ్రం చేసింది.

కాళ్ళూ చేతులూ ముఖమూ కడుక్కుని వచ్చిన విశ్వనాథం గ[illegible] అడుగుపెట్టి క్షణంసేపు అలాగే నిలబడ్డాడు.

గుండెలనిండా గాలి పీల్చుకుని నెమ్మదిగా, బరువుగా బ[illegible] వదిలాడు.

చిత్రమైన ప్రశాంతత అతడి శరీరాన్ని తాకి, నెమ్మదిగా మన[illegible] కూడా తాకుతోంది.

ఓ మనిషీ–

జరిగింది మర్చిపో! రేపటిపై ఆశ నింపుకో!

నీ ఆశ ఫలించే క్షణమూ, నీ నమ్మకం నిజమయ్యే రోజూ వస్తు[illegible]

అది నీ కృషిలోనే వుంటుంది.

తల విదిలించుకున్నాడు.

వెధవ సమస్యలూ, వెధవ తలనొప్పి!

తెచ్చుకుంటే పెంపుడు కుక్కలా తోకాడించుకుంటూ మనవె[illegible] వుంటాయి.

కాస్త ధైర్యంగా ఎదురు తిరిగితే తోక ముడుచుకుని పారిపో[illegible] అనుకున్నాడు.

చాలా రోజుల తర్వాత ముగ్గురూ నవ్వుకుంటూ కబుర్లు [illegible] వంటూ భోజనాలు చేశారు.

* * * *

వారం రోజులయింది.

రెండు రోజుల్లో వస్తానని వెళ్ళిన సుజాత ఇంకా రాలేదు.

వాళ్ళ నాన్న తెచ్చిన మామిడికాయలు పండలేదు సరికదా [illegible] పడుతున్నాయి. ఏం చేయాలో తెలియక అసలే బాధ పడుతున్న [illegible] కుతో ఏమీ చెప్పలేక ఆనందితోచెప్పి వీధిలోని చెత్తకుండీలో పారబో[illegible] చింది.

కొడుకుతో మాట్లాడేటపుడు పొరపాటున కూడా సుజాత ప్రస్తా[illegible] రాకుండా ఉండేట్లు జాగ్రత్త పడేది.



ఆనంది కూడా హెచ్చరించింది.

విశ్వనాథం ఏమయినా చిన్నపిల్లడా–తల్లి జోల పాడితే నిద్ర పోవ టానికీనూ, మరిపిస్తే మర్చిపోవటానికీనూ!

ఆనందిని చేసే ప్రతి పనిలోని పొందికతనూ, చేసే పనిపై చూపే శ్రద్ధా-

తల్లిచేసే పొదుపూ, పనిలోని దక్షతా- ప్రతిచర్యా అతడికి సుజా తనూ, ఆమెలోని నిర్లక్ష్యాన్ని, అహంభావాన్ని, మరీ మరీ గుర్తుకు తెస్తుం టాయి.

'ఆమె కూడా ఇలా ఓ మామూలు స్త్రీలా ఎందుకుండదు?' అని కొన్ని లక్షలసార్లు అనుకుని ఉంటాడు.

సరే! సుజాత చిన్నది! పోనీ ఇంకా పరిపక్వత రాలేదని సర్దిచెప్పుకో వచ్చు.

కాని వాళ్ళ అమ్మ-ఆవిడయినా చెప్పి నేర్పవచ్చుగా!

వాళ్ళ నాన్న—

ఆయనకేమైంది? ఆయన పెద్దాయనేగా! ఆయనకైనా బుద్ధి వుండక్క ర్లేదూ? ఆ పనికిరాని మామిడికాయలు తీసుకొచ్చి నా ముఖాన కొట్టటానికి నేనెలా కనిపిస్తున్నాను.

కూతురికి బుద్ధి లేకపోతే కన్నవాళ్ళు చెప్పొద్దా? నేర్చుకోనక్కర లేదూ?

వెధవ పెంపకం!

వెధవ మనుషులూ!

వెధవ కుటుంబం!

ప్రపంచంలో అదొక్కతే కూతురు!

వాళ్ళొక్కళ్ళే తల్లిదండ్రులు!

వాళ్ళదే ప్రేమ!

"చావండి!" కసిగా అనుకున్నాడు విశ్వనాథం. అతడు ఎంత వద్దను కున్నా ఆమె ఆలోచనలు అతడ్ని వదలటంలేదు.

ఆలోచించినకొద్దీ కోపమూ, అందులోంచి అసహ్యమూ పుట్టుకొస్తు

న్నాయి.

అది మంచిదికాదని అతనికి తెలుసు.

అతని అంతరాత్మ ప్రతిసారీ హెచ్చరిస్తూనే వుంటుంది.

ఇది——

నచ్చకపోతే తీసిపారేసే షర్టులాంటిది కాదు.

ఇష్టం లేకపోతే ఒదిలిపారేసే వంకాయకూర కాదు!

అసహ్యమనిపించగానే చెప్పుతో నలిపిపారేసే సాలెపురుగు అల్ల కన్నా కాదు.

జీవితం....!

జీవితంలో చాలా శ్రద్ధ వహించి, ఎంతో జాగ్రత్తగా ఆలోచించి, ఆచితూచి చేయాల్సిన పని-భాగస్వామిని ఎన్నుకోవటం.

దానికి ఎందుకో ప్రాధాన్యత ఇవ్వకుండా తన జీవితాన్ని తానే పాడు చేసుకున్నాడు. తన నెత్తిమీద ఏ శని నాట్యమాడిందో, ఆ సమయంలో తనచేత ఎందుకలా తప్పు నిర్ణయం తీసుకునేలా చేసిందో-

మొత్తంమీద జరగకూడనిది జరిగిపోయింది. దాని గురించి విచా రించి లాభంలేదు.

ఇహ ఎలా సరిచేసుకోవాలి అనే ఆలోచించాలి

ఈసారి సుజాత వచ్చాక ఆమెని తానే మారుస్తుందిలే- తానే తెలుసు కుంటుందిలే అనుకుంటూ వదలకూడదు.

చెప్పాలి!

ఆమెకు అర్థమయ్యేలా చెప్పాలి.

తన కిష్టమైనట్లుగా మార్చుకోవాలి.

ఓ చక్కని ఇల్లాలుగా తీర్చిదిద్దాలి.

ప్రేమతో మారలేని మనుషులుంటారా?

మనసుంటే మార్గం అదే కన్పిస్తుందంటారు.

తనలో తనే బాధపడుతూ, తనను తానే మందలించుకుంటూ, తనను తానే ఓదార్చుకుంటూ- తనకుతానే ధైర్యం చెప్పుకుంటూ-

భవిష్యత్తులో వచ్చే గొప్ప మార్పుకోసం ఎంతో ఆశతో కోటలు



కట్టుకుంటున్నాడు.

చీకూ చింతా లేకుండా ప్రశాంతంగా బ్రతుకుతున్న అతడి జీవితాన్ని అకాలంలో అనవసరంగా వచ్చే తుఫాన్‌లా చెల్లాచెదురుచేసి నాశనం చేస్తోంది సుజాత.

* * * *

ఆనందికి తొంభై ఏడు పర్సెంటు వచ్చింది.

అప్లికేషన్ వేసి ఎంట్రెన్స్ పరీక్ష వ్రాస్తే మెడికల్ సీటు ఖచ్చితంగా వస్తుంది.

అదే అన్నాడు విశ్వనాథం.

పెద్దమ్మ కూడా బలపర్చింది.

కాని- ఆనంది ఒప్పుకోలేదు.

మెడికల్ కోర్సు మాటలు కాదు. సీటు తేలిగ్గా సంపాదించినా ఫీజులు, పుస్తకాలు, హాస్టలు- అది చాలా ఖరీదైన చదువు.

పైగా చాలా సంవత్సరాలు ఇంకా అన్నయ్యపైనే ఆధారపడవలసి వస్తుంది.

అది ఆనందికి సుతారమూ ఇష్టంలేదు. ఇప్పటికే ఈ ఇంట్లో తనుండటం సుజాతకిష్టం లేదనే విషయం కొద్దికొద్దిగా తెలుస్తోంది. పరోక్షంగా సూటిపోటిగా ఆ విషయాన్ని ఆమె చాలాసార్లు వెల్లడించింది.

ఆడపిల్లలకు చక్కగా, తేలిగ్గా వుండే పని టీచరు ఉద్యోగం.

పనిగంటలు తక్కువ! సెలవు దినాలు ఎక్కువ. కల్మషంలేని పిల్లలతో గడపటం హాయిగా వుంటుంది.

ఆ జీవితం బాగుందని ఆనంది మనసు బాగా నమ్ముతోంది. పైగా ఆమె చూసిన క్రొత్త ప్రపంచంలోంచి క్రొత్తగా నేర్చుకున్న జీవిత సత్యాలు పదే పదే నొక్కిచెప్పినట్లుగా ఆమె ఆ చదువునే ఎన్నుకున్నది.

ఆనందికి స్ఫూర్తి పరిమళ!

విశ్వనాథం అసంతృప్తిగానే ఒప్పుకున్నాడు.

"డిగ్రీ అయినా చదువు. తర్వాత బి.ఇడి. చేద్దువుగాని" అన్నాడు.

ఆనంది హాస్టల్లో ఉంటానంది.

"అదేమిటే?" అంది పెద్దమ్మ.

"ఏంలేదు పెద్దమ్మా! నాకూ హాస్టల్ జీవితం ఎలా వుంటుం చూడాలని వుంది."

"అంతేనా! లేక వదిన...." ఆమె మాటను పూర్తి చేయనీయలే ఆనంది.

"పెద్దమ్మా! వదిన గూర్చి మనం ఆలోచించటమేగానీ మాట్లా కూడదు. ఆ అర్హత, అధికారం మనకు ముఖ్యంగా నాకు లేవు. అయి స్వంత తల్లిదండ్రులే భారం అనుకునే ఈ రోజుల్లో ఎక్కడో పిన్ని కూతురు బరువు బాధ్యతలన్నీ నెత్తికెక్కించుకోవలసిన అవసరం ఎ కెందుకుండాలి? ఇందులో వదిన తప్పు లేదనే అనుకుందాం. అన్నయ వింటే ఎంతో బాధ పడతాడు. అసలే అన్నయ్య మనసు బాగాలేదు.

"నిజమే! వాడి రాత బాగుపడే రోజులెప్పుడు వస్తాయో!"

"చూద్దాము పెద్దమ్మా! మనం కూడా ప్రయత్నం చెయ్యాలి. వాళ్ళిద్దరే వుంటే ఆమె తన పద్ధతిని ఏమయినా మార్చుకుంటుందే చూస్దాము."

"నువ్వు హాస్టల్ కెళతావు. బాగానే వుంది. మరి నేను-? నేనెక్క కెళ్ళను?

"నా పిచ్చి పెద్దమ్మా! నువ్వు ఎక్కడకూ వెళ్ళనవసరంలే కొన్నాళ్ళు అన్నయ్య దగ్గర వుండక తప్పదు. ఆ తర్వాత నాకు ఉద్యో రాగానే ఎంచక్కా నువ్వూ నేనూ కలిసి వెళదాము."

"ఆఁ....ఆఁ.... వెళదాము! అప్పుడు నేనెక్కడికి రాగలనే త తల్లీ! అన్నయ్యంటే మగవాడు, కొడుకు. వాడికి నా బాధ్యతా తప్ప నేనిక్కడ వుండకా తప్పదు. నువ్వు అలా కాదురా పిచ్చితల్లీ! నిన్ను అయ్య చేతిలో పెట్టి పంపాల్సిన వాళ్ళం నీతో నన్నెక్కడకు తీసుకె తావు చెప్పు? కొడుకు దగ్గర వుండలేని నేను, అల్లుడి దగ్గర వుండగల తానా పిచ్చితల్లీ. ఎలాంటి ఆలోచనలు పెట్టుకోకుండా నీ జీవితానికి చదువు ఉపయోగపడుతుందో నీ కోరిక ప్రకారం నిర్ణయించుకో. నా కోసం అని ఆలోచన చేయకూడదు."



అలా ఆనంది ఆడపిల్లల కాలేజీలో చేరి హాస్టల్లో వుండిపోయింది.

మొదటి సంవత్సరం సెప్టెంబరు పరీక్షలయ్యాక ఇంటికి వచ్చిన ఆనందికి సుజాతను చూడటానికే వీలుకాలేదు.

ఆమె హాస్టల్ నుండి వచ్చేసరికి సుజాత పుట్టింట్లో వున్నది.

ఆనంది వున్న అన్ని రోజులూ ఆమె రాలేదు.

"ఇవన్నీ ఏమిటి పెద్దమ్మా?" గదుల్లో అడ్డదిడ్డంగా వున్న పెద్ద అట్టపెట్టెలను చూసి అడిగింది.

"అవన్నీ వదిన కొన్నది."

"ఎందుకు? అసలేమిటివి?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఆ పెట్టెల్లో ఏం ఉన్నాయో నాకూ తెలియదు. ఎందుకంటే ఏం చెప్పమంటావు?"

పెద్దమ్మ మాటల్లోని నిరాశ, నిస్పృహ, బాధ— ఎప్పుడూ ఉన్న సమస్యలే కాకుండా ఇంకేవో క్రొత్తవి తలెత్తినట్లుగా అన్పించింది.

"ఏమైంది పెద్దమ్మా.... ఏం జరిగింది?"

"ఏదో నాలుగు రోజులు గడపటానికి వచ్చినదానివి. హాయిగా ఉండు. ఇవి ఎప్పుడూ ఉండేవేకదా" తీసిపారేయటానికి ప్రయత్నించింది పెద్దమ్మ.

ఆనంది వదలలేదు. " అదేమిటి పెద్దమ్మా! నా దగ్గర దాపరికమా! నాతో చెబితే నేనేదో చేయగలనని కాదు. నీ గుండెల్లోని భారం కాస్త తగ్గుతుంది."

ఒకరోజున విశ్వనాథందీ, ఆనందిదీ బ్యాంకు పాస్ బుక్‌లు ఆవిడ కంటపడ్డాయి.

ఇంకేముంది! మొగుడి సంపాదనంతా ఆనందికి దోచిపెడుతున్నారనీ నానా హడావుడి చేసి అత్తగారినీ, ఆడపడుచునీ అనరాని మాటలన్నీ అన్నదిట.

మొదట సుజాతకు అసలు విషయం ఏమిటో వివరించి చెప్పటానికి ప్రయత్నించింది పెద్దమ్మ.

కానీ సుజాత వినలేదు.

ఈసడించిపారేసింది.

చాలా అవమానకరంగా మాట్లాడింది.

దాంతో ఆవిడ మౌనం వహించింది.

సుజాత కల్లుతాగిన కోతిలా ఆ రోజంతా కేకలు వేసి అట్టహాసం చేస్తూనే ఉన్నదిట. పెద్దమ్మ పట్టించుకోలేదు.

నోరు విప్పకుండా తన పనులు తాను చేసుకుంటూ వుండిపోయింది.

ఆ సాయంత్రం విశ్వనాథం ఇంటికి చేరుకునే వరకూ ఆ ఇల్లు ఇల్లులాగా లేదు.

నానా భీభత్సం చేసేసింది.

అతడు ఇంటికి వచ్చాక ఏమి గొడవ చేస్తుందో, ఎంత రభస జరుగుతుందో అని భయపడుతూన్న పెద్దమ్మ ఆలోచన తారుమారు చేస్తూ చిన్న మాట కూడా బయటకు రానీయలేదు సుజాత.

అతడ్ని ఆరోజే బజారుకు తీసుకువెళ్ళే అవసరమున్నా, లేకపోయినా ఆ సామానులన్నీ కొనిపించేసింది.

అప్పటిగ్గానీ ఆమె మనసు శాంతించలేదు. విషయం తెలిసి విశ్వనాథం సుజాత పెడుతున్న ఖర్చు చూసి అగ్గగ్గలాడిపోయాడు.

వారించుతూన్నట్లుగా "ఇప్పుడు వద్దులే తర్వాత కొందాము" అన్నా వినటంలేదు.

ఇహ పదిమంది మధ్యా అక్కడ సీను క్రియేట్ చేయటం ఇష్టంలేక నోరుమూసుకుని వుండిపోయాడు

ఆ మర్నాడే వూరు వెళ్ళిపోయింది.

ఆ విషయాలు వింటూనే ఆనంది మనసు బాధగా మూలిగింది.

పెద్దమ్మ కళ్ళు తడిఅవుతూంటే మరీ బాధ అన్పించింది.

* * * *

ఆనందికి సంక్రాంతి సెలవులు ఇచ్చారు.

ఇంటికి రావటం ఆనందికి ఏమాత్రం ఇష్టంలేదు. కాని, అందరూ వెళ్ళిపోతూంటే తప్పనిసరయి ఇంటికి వచ్చేసింది.

సుజాత ఇంట్లోనే వుంది.

అప్పటికామె నాలుగోనెల గర్భవతి.



ఆ విషయం తెలియగానే సుజాత చేసిన తప్పులూ, నిర్లక్ష్యంగా ప్రవర్తించిన తీరూ అన్నీ మర్చిపోయారు.

ఎంతో సంతోషంగా, అభిమానంగా, అపురూపంగా సుజాతని చూస్తున్నారు.

విశ్వనాధానికి పిల్లలంటే చాలా ఇష్టం! ఆ ఇష్టంతోనే సుజాతవల్ల అనుభవించిన క్లేశాన్నంతటినీ మర్చిపోయి అనురాగంతో అక్కున చేర్చుకున్నాడు.

కుక్కతోక వంకరను భగవంతుడు కూడా సరిచేయలేడు.

సుజాతనుండి ఎలాంటి రెస్పాన్స్ వుండేదికాదు.

సుజాత అందమైనదే!

ఆ అందానికి తోడు మంచి మనసుకూడా ఉండి వుంటే ఎంత బాగుండేది?

అన్నయ్య జీవితం నిండు విస్తరిలా వుండేది. ప్చ్! ఆ భగవంతుడు రూపం తీర్చిదిద్దుతూ మనసుని గురించి మర్చిపోయి వుంటాడు' అని కనీసం ఓ లక్షసార్లయినా అనుకుని వుంటుంది ఆనంది.

అసలే సుజాత గదిలోనుంచి బయటకి వచ్చేదికాదు. ఇహ ఇపుడు చెప్పనే అవసరం లేదు.

భోజనానికి పిలవాలన్నా, టిఫిన్ తినటానికి పిలవాలన్నా పెద్దమ్మ భయం-భయంగా ఆ గదిముందు తచ్చాడుతుంటుంది.

ఆ పిల్ల తినకుండా ఆవిడ తినలేదు.

ఆ పిల్ల రాదు!

పాపం-పెద్దమ్మకు వారంలో మూడు రోజులపాటు ఉపవాసం అయిపోతోంది.

బంధుత్వంలోంచి ఉద్భవించే ప్రేమానురాగాలు ఆమెపట్ల సద్భావం కల్పించుతూంటే-ఇలాంటి ప్రవర్తనేమో జుగుప్సను కలిగిస్తుంది.

* * * *

వేసవిలో ఆనంది ఇంటికి వచ్చేసరికి సుజాత పురిటికి పుట్టింటికి వెళ్ళింది.

ఓసారి వెళ్ళి చూసిరావాలి అన్పించింది ఆనందికి.

ఆమె అహంభావం, పొగరు గుర్తుకొస్తున్నా నిండు నెలలతో భారంగా నడుస్తున్న ఒదినను చూడాలని మనసు ఇష్టపడుతోంది.

అదే మనిషికీ, మానవత్వానికీ మధ్య వుండే ప్రేమ అనే పదానికి ఉన్న కొండంత శక్తి!

కోపాలు, చిరాకులూ, విసుగులూ-ఇవన్ని తాత్కాలికం! ఆయా పరిస్థితులనుబట్టి వస్తూంటాయి, పోతుంటాయి!

మన నీడలా ఎప్పుడూ మనల్ని అంటిపెట్టుకుని వుండే అనుభూతి ఆ ఒక్క 'ప్రేమ' మాత్రమే!

ఆ శక్తే ఆనందిని ప్రేరేపించుతోంది.

సుజాతను చూడాలనే కోరికను బలపరుస్తోంది!

పెద్దమ్మతో అంటే నవ్వేసి వూరుకుండేగాని సమాధానం చెప్ప లేదు.

మరోసారి అడిగింది పెద్దమ్మను.

పెద్దమ్మ అంది....

"ఆనందీ! మనం ఇంతవరకూ ఎపుడూ వాళ్ళింటికి వెళ్ళలేదు. ఇప్పుడు ఏం వెళతాము? అసలే మనమంటే ఆవిడకు మంచి అభిప్రాయం లేదు. పైగా మొన్న మరో సంఘటన కూడా జరిగింది" గబుక్కున నాలిక్కరుచుకుంటూ ఆపేసింది.

వింతగా చూసింది ఆనంది.

"ఏమయింది? ఎందుకు ఆపేశావు??"

"ఒద్దులే. అసలీ విషయం నీకు చెప్పొద్దు అనుకున్నాను. వెధవ నోరు! ఈ మధ్య మరీ కంట్రోల్ లేకుండా పోయింది."

చిన్నగా నవ్వింది ఆనంది.

"ఫర్వాలేదు పెద్దమ్మా. నేను నీకు, నువ్వు నాకు తప్ప వేరెవరికి చెప్పుకుంటాము. చెప్పు? ఏం జరిగింది?"

"సుజాత నాన్న ఎక్కడో ఓ మేడ చూసాడుట. దాన్ని కొనాలని పట్టు బట్టింది. అన్నయ్య తెల్లబోయాడు. ఇల్లు కొనటం అంటే మాటలా!



అంత డబ్బు మనకెక్కడిది అన్నాడట! రుసరుసలాడుతూ నీ పాస్‌బుక్ తెచ్చి అన్నయ్య మీదికి విసిరి కొట్టిందిట! 'అది దాని అమ్మానాన్నలు చచ్చిపోయాక వాళ్ళ ఆస్థి అంతా అమ్మేసి తెచ్చిన డబ్బు' అని ఎంత చెప్పినా విన్పించుకోలేదట.

అరచి గోలపెట్టి నానా హంగామా చేసింది. అయినా అన్నయ్య పట్టించుకోలేదు!

ఇహ అలిగి పుట్టింటికి వెళ్ళిపోయింది.

ఈ సమయంలో మనం అక్కడికి వెళ్ళామనుకో—ఆవిడ ఏమంటుందో—అక్కడ ఎంత గొడవ చేస్తారో—ఏమో బాబూ- నాకు భయంగా వుంది."

వింటూనే ఆనంది తెల్లబోయింది. ఆమెకు నోట్లోంచి మాటలే రాలేదు.

అసలు సుజాతలో ఆడమనసు ఉందా అన్పించింది! ఎప్పుడూ కోపాలూ, అలకలేనా?

ఏదైనా కావాలంటే నెమ్మదిగా అడిగి నచ్చజెప్పుకోవాల్సిందిపోయి ప్రతి దానికీ ఇలా పోట్లాడి, ఏడ్చి, జులుం చేసి సాధించుకోవటం-

అంత పంతం, అంత మొండితనం....ఏం బాగుంటుంది?

అసలు మనిషి ఆరోగ్యానికి కూడా మంచిది కాదు!

ఆడదానికి అసలే మంచిది కాదు!

ఆనందికి ఇక సుజాత దగ్గరకు వెళ్ళాలనే కోరిక చచ్చిపోయింది.

పెద్దమ్మతో మాత్రం అంది.

"ఆ డబ్బు నేనేం చేసుకుంటాను పెద్దమ్మా! నాకవసరమయితే అన్నయ్య ఉండనే వున్నాడు! పోనీ ఆవిడ కోరినట్లుగా చేస్తేపోలా."

"పిచ్చి తల్లీ! చేసేపనిలో అర్థం వుండాలి. ఇవ్వాళ ఇది అంది. రేపు మరోటి అంటుంది. దానికి అంతెక్కడ! మొన్నటికి మొన్న అన్నయ్య అకౌంటు ఖాళీ చేయించింది! ఎన్నాళ్ళు కష్టపడి కూడబెట్టుకుంటున్నాడు! ఒక్కరోజు....ఒక్కరోజంటే ఒక్కరోజు అట్లా వెళ్ళి ఇట్లా ఖర్చుపెట్టేసింది. పోనీ అవన్నీ చాలా ఉపయోగమైన వస్తువులా అంటే

అదీ లేదు! రేపెప్పుడయినా అవసరానికి ఉపయోగపడే బంగారం కొన్నా అంటే అదీ కాదు! అవిగో ఆ అట్ట పెట్టెలు చూసినప్పుడల్లా కడుపు తరుక్కుపోతుంది. అయినా తనేమి చిన్న పిల్ల కాదు. మన తహతు తెలుసుకుని ప్రవర్తించాలి గానీ అదేమయినా చిన్న పిల్లలు అడిగే గిలక్కాయ లాంటిదా మేడలు కొనటమంటే! అయినా ఇల్లు కావాలనుకుంటే వాళ్ళ పెళ్ళినాడు మామిడితోట కట్నంగా ఇస్తామన్నారు. ఇన్నాళ్ళూ మనమేమీ అడగలేదు. పోనీ అది తెచ్చుకుని కొనుక్కోవచ్చుగా. అయినా గది శుభ్రం చేసుకోవటానికి ఒళ్ళు ఒంగని మనిషి మేడలూ మిద్దెలూ కొనుక్కుని ఏం చేసుకుంటుంది! ఏమీలేదు! నీ అకౌంటు చూసింది! ఇహ ఇప్పుడు ఎలాగయినా అది ఖర్చుపెట్టేయాలి. పంతం తప్పించి మరేమీ లేదు.

అవి చక్కని తెలివి తేటలతో మాట్లాడే మాటలు కాదు. పిచ్చి ఆలోచనలూను, పిచ్చి మాటలూను. పొరపాటున కూడా ఆవిడగారి దగ్గర ఎప్పుడూ నోరు జారి అనబోకు!"

* * * *

జులైలో విశ్వనాథానికి కొడుకు పుట్టాడు.

అప్పటికి ఆనంది హాస్టలుకు వెళ్ళిపోయింది. అబ్బాయి పుట్టిన రెండో రోజున విశ్వనాథంకు బ్యాంకుకు ఫోన్‌చేసి చెప్పారు.

విశ్వనాథం చాలా సంతోషించాడు. అతనికి ఆ కబురు వినగానే పట్టలేని ఆనందాన్ని ఎవరితోటయినా పంచుకోవాలి అన్పించింది.

నిన్న కూడా లేని పెద్దరికం ఏదో హఠాత్తుగా ఇవ్వాళ ఇపుడు వచ్చేసినట్లుగా, క్రొత్తగా ఏదో హోదా పెరిగినట్లుగా అన్పిస్తోంది.

అంతలోనే కించిత్ సిగ్గూ, మరికొంత గర్వమూ కూడా కలిగాయి.

ఆ సాయంత్రం ఇంటికి వచ్చేవరకూ బలవంతాన నిగ్రహించుకుని ఇంటికి రాగానే తల్లితో చెప్పాడు.

ఇహ ఆవిడ ఆనందం అంతా ఇంతా కాదు. ఆవిడకు విశ్వనాథం ఒక్కడే కొడుకు. అతడి తర్వాత మళ్ళీ ఇన్నేళ్ళకు ఇంట్లో చిన్న బిడ్డ ఉద్భవించాడు.

తనకు వారసుడు.



పైగా కొడుకు కొడుకు!

తన రక్తంలో రక్తం!

ఆవిడకు వెంటనే ఆ చిన్ని విశ్వనాథాన్ని చూడాలన్పించింది.

అదే అడిగింది కొడుకుని.

నవ్వేసి వూరుకున్నాడు.

భోజనం చేస్తున్న విశ్వనాథాన్ని మళ్ళీ అడిగింది-

"చూద్దాంలేమ్మా" అన్నాడు.

"చూద్దామేమిట్రా? నాకెంత ఆనందంగా ఉందో తెలుసా! వాడ్ని చూడాలని నా మనసు ఎంతో ఆరాటపడుతోంది" అంది.

'నిజమే! తన మనసు మాత్రం ఆరాటపడటంలేదూ! తనకుమాత్రం రెక్కలు కట్టుకువెళ్ళి తన కొడుకుని చూడాలనిలేదూ!

ఉంది....

గంపెడంత!

ఆకాశమంత !!

ఏం లాభం....?

పిల్లాడు పుట్టిన రెండురోజుల తర్వాతగాని తనకు తెలియజేయాలని వాళ్ళకు గుర్తుకొచ్చింది.

సుజాత వెళ్ళి మూడునెలలకు పైగానే అయింది. ఇంతవరకూ ఒక్క ఉత్తరం కూడా వ్రాయలేదు. తనే రెండుసార్లు వ్రాశాడు. కనీసం వాటికి జవాబుగా కూడా వ్రాయలేదు. ఇప్పుడుకూడా తెలియజేశారేగాని, మాటవరసకయినా 'ఎప్పుడొస్తారు' అని అడగలేదు. అలాంటి చోటుకు వెళ్ళాలంటే మనసుకో సంతోషమూ, ఉత్సాహమూ ఎలా కలుగుతాయి!

అసలిష్టమేలేదు! కావాలంటే నువ్వెళ్ళు. నేను మాత్రం రానంటే రాను' అని అంతరాత్మ, మనసు కలిసి భౌతికదేహంతో పోట్లాడుతున్నాయి.

అల్లుడ్ని, కూతురికి మొగుడ్ని— నాకే అక్కడ అంత గొప్పస్థానం వుంటే ఇహ అమ్మను వాళ్ళెట్లా ఆదరిస్తారో తను బాగానే వూహించ

గలడు.

కోరి అవమానం తెచ్చుకోవటమే అవుతుంది.

వాళ్ళసలు మనుషులేకాదు.

ఖర్మకొద్దీ మనకు దొరికారు.

వాళ్ళకు అల్లుడూ అవసరంలేదు-

దానికో మొగుడూ అవసరంలేదు.

పెళ్ళి అనేది ఒకటి చేసుకోవాలికాబట్టి చేసుకున్నారు.

బలిపశువులా వాళ్ళకు నేను దొరికాను.

అసలు తప్పంతా నాది!

ఆలోచిస్తున్న విశ్వనాధంకు కణతలు నొప్పిచేశాయి.

అలసటగా, భారంగా కళ్ళు మూసుకున్నాడు.

రెప్పలక్రింద చిన్ని చిన్ని చేతులూ, చిన్నికాళ్ళూ, బుల్లినోరు, బలవంతంగా తెరుస్తున్న కళ్ళూ— వాడే కనిపిస్తున్నాడు.

తన రక్తంలో రక్తం, తన ప్రాణంలో ప్రాణం, తన ఊపిరి, తన కలలపంట- తన జీవితానికర్థంచెబుతూ తనకో కొడుకు పుట్టాడు!

తననో తండ్రిని చేశాడు.

తండ్రి అనే పదం ఎంత గొప్పది!

ఇహమీదట సుజాతకు తనెంతో, తనకూ సుజాత అంతేకదా అను కోవటానికి వీల్లేదు. తమ మధ్య వుండే చెత్తగొడవల్లో పువ్వులాంటి వాడు నలిగిపోకూడదు.

సుజాత మూర్ఖత్వానికి తన జీవితం ఎలాగూ బలైపోయింది.

వాడి భవిష్యత్తు మాత్రం అలా అవ్వకూడదు.

ఇప్పుడు వాడు ముఖ్యం!

వాడికోసమయినా సుజాతను భరించాలి.

* * * *

ఐదో నెల వచ్చాక సుజాత కొడుకుని ఎత్తుకుని వచ్చింది.

అప్పటికి ఆనంది కూడా ఇంట్లోనే వుంది.

హారతి వెలిగించి దృష్టి తీసి అవతల పారబోసి ఇంట్లోకి తీసు



కొచ్చారు.

ప్రపంచంలోకెల్లా ఇంతకంటె విలువైనది ఇంకేమీ లేదన్నంత అపురూపంగా చూస్తూ చేతులు చాచింది పెద్దమ్మ.

సుజాతతోపాటు వచ్చిన ఆమె తల్లి వెంటనే అన్నది "మొట్ట మొదటిగా మీరెందుకులెండి ఎత్తుకోవటం...."

అంతే....

కొరడాతో ఈడ్చికొట్టినంత పనయ్యింది. చాచిన చేతులు చప్పున దించేసింది.

ఆమె పెద్దరికం ఎంత హుందాగా వుండాలని ప్రయత్నించినా విఫలమై అక్కడ నిలబడలేక వంటగదిలోకి వెళ్ళిపోయింది.

సలసలాకాగే నూనెను గిన్నెతో తీసి ముఖాన పోసినా ఇంత బాధ వుండకపోవచ్చు.

ఆవిడ మనసుని ఎవరో బలవంతాన రెండుచేతులతోనూ మెలిపెట్టి తిప్పుతూన్నట్లుగా గిలగిలా కొట్టుకుంటోంది.

ఆవిడన్న ఆ మాటను పెద్దమ్మ మనసు జీర్ణించుకోలేకపోతూన్నది. ఎప్పటిలా 'పోనీలే' అని తుడిచిపెట్టుకోలేక పోతున్నది.

హృదయం లోపలిపొరల్లో కదిలిన ఆ ఆవేదన అక్కడ ఆగలేక కళ్ళద్వారా బయటకు వచ్చేస్తున్నది.

వెనుక వరండాలో అలా గోడకు ఆనుకుని నిలబడిపోయింది ఆనంది.

'పిచ్చి మనుషులేనా!

తోటి మనిషిని అంత నిర్ధాక్షిణ్యంగా ఎలా బాధపెట్టగలుగు తున్నారు?

అంతరాత్మ అడ్డురాదా?

ఎంత అన్యాయం! ఎంత దారుణం!

తన మనుమడిని ఎత్తుకోవటానికి ఆమెకు దేవుడిచ్చిన శాపం అడ్డు తగిలిందా?

బిడ్డని ఆశీర్వదించటానికి కావలసింది మనసా లేక పసుపు-

కుంకుమలా !'

సుజాత తల్లి బాత్‌రూమ్‌కి వెళ్ళటానికని వచ్చింది.

వరండాలో బిక్కు బిక్కున చూస్తూ నిలుచున్న ఆనందిని చూస్తూ ముందరకు వెళ్ళింది.

వంటగదిలో కళ్ళు తుడుచుకుంటూన్న వియ్యపురాలిని చూసింది.

అంతే! ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా, తడుముకోకుండా అనేసింది-

"శుభమా అని చంటిబిడ్డనెత్తుకుని అదొస్తే చచ్చినింట్లో ఏడ్చినట్లు ఈ ఏడుపులేమిటి?"

అదిరిపడింది పెద్దమ్మ.

హడలిపోయింది ఆనంది.

ఈ భూమి పగిలి అందులో నేను కూరుకుపోతే ఎంత బావుంటుంది! భగవంతుడా- ఇన్నేళ్ళు నన్నెందుకు బ్రతికించావు? ఇంకా ఏం చూడాలని?

నరకం అంటే మరేదో కాదు-

ఇలాంటిదే.... ఇదే!

ఆ సమయానికి విశ్వనాథం ఇంకా ఆఫీసునుండి రాలేదు.

గబుక్కున లేచి నించుంది పెద్దమ్మ. ఎక్కడ వుండాలో, ఏం చేయాలో, ఏం చేస్తే ఏం తప్పు అవుతుందో ఆవిడకేమీ పాలుపోవటం లేదు.

ఎంత ఆపుకుందామని ప్రయత్నించినా ఆగకుండా బయటకు ఉబికి వస్తున్న ఆ దుఃఖాన్ని ఎలా మింగాలో తెలియనిదానిలా నిలబడిపోయింది.

"తల పగిలిపోతోంది. కాసిని కాఫీనీళ్ళు పోస్తారా?" కఠినంగా వుంది ఆమె స్వరం.

ఆవిడ మాటల్లో, చూపుల్లో, నడకలో స్పష్టంగా కనిపిస్తున్న వ్యంగ్యాన్ని, అసహ్యతనూ భరించలేకపోతూన్నది పెద్దమ్మ మనసు!

ఆనంది చప్పున వంటగదిలోకి వచ్చింది.

ఏదో నేరం చేసిన దానిలా తలవంచుకుని గోడకానుకుని నిలబడిన పెద్దమ్మను చూడగానే ఆనందికి సుజాతపైన పట్టలేనంత కోపం వచ్చింది.



ఆ చెంపా ఈ చెంపా వాయించి "నీకు ఈమే తల్లి" అని చెప్పాలనిపించింది.

నీ చదువుకున్న సంస్కారం ఇదేనా అని అడగాలనిపించింది.

పెద్దమ్మకు దగ్గరగావచ్చి ఆమె చేతిని ఓదార్పుగా తట్టి- "కొంచెం సేపు మేడమీదకు వెళ్ళు పెద్దమ్మా! కాఫీ చేసిచ్చిన తర్వాత నేనూ వస్తాను" అంది.

అవును!

ఆమెకూ కొంచెంసేపు ఒంటరిగా ఉండాలనిపిస్తోంది.

లేదా ఇదిగో ఈ గోడమీంచి క్రిందకు దూకి చచ్చిపోవాలనిపిస్తోంది.

ఆ సాయంత్రం విశ్వనాథం వచ్చే సమయం వరకూపైనే వుండిపోయారు.

విశ్వనాథం వచ్చాడు.

కొడుకుని చూస్తూనే అప్పటివరకూ మనసునిండా పేరుకుని ఉన్న కోపం అంతా మర్చిపోయాడు.

సుజాత చేసిన హఠం అంతా మర్చిపోయాడు.

అతడి పెదవుల పైకి చిరునవ్వు, కళ్ళల్లోకి మెరుపూ వచ్చాయి.

అతడి గుండెలు చిత్రంగా స్పందించాయి.

హృదయంలో ఒకేసారి వేయి వీణలు సున్నితంగా శృతి చేసినట్లుగా ఆనందరాగం ఆలాపన చేస్తోంది.

"మీ నాన్న ఇతడేరా" అని భగవంతుడే చెప్పినట్లు రెండు చేతులూ చాస్తూ నోరంతా తెరచి నవ్వుతూన్న కొడుకుని గబుక్కున చేతుల్లోకి తీసుకున్నాడు విశ్వనాథం.

ఆ స్పర్శ అతడి ఆపాదమస్తకమూ ఓ విధమైన మత్తులో ముంచేసింది.

అతడి శరీరంమీది రోమాలు నిటారుగా నిక్కబొడుచుకున్నాయి.

ఏదో గగుర్పాటు!

మరేదో తన్మయత్వం!

అల్లుడ్ని చూసిన సుజాత తల్లి బయటకు వచ్చి ముందర వరండా

లోకి వెళ్ళింది.

"నీ ఆరోగ్యం బాగుందా?" మృదువుగా అడిగాడు భార్యను.

"ఊఁ!"

ఏ కళనుందోగానీ విసుక్కోకుండా, ముడుచుకోకుండా సమాధా
చెప్పింది.

భార్య బుగ్గమీద చిటికెవేసి కొడుకుని ముద్దు పెట్టుకుంటూ బయట
వచ్చాడు.

వంటగదిలో కొడుకుకోసం కాఫీ కలుపుతున్న తల్లికి దగ్గరగావె
"అమ్మా! నీ మనుమడు" అన్నాడు.

ఆమెకు గొంతులో ఏదో అడ్డం పడినట్లయింది. కళ్ళల్లో గుప్పె
ఇసుక చల్లినట్లుగా ఎర్రబారి వున్నాయి.

గ్లాసు ఆనందికిచ్చింది.

చేతులు పమిటచెంగుకి తుడుచుకుని వాడిని అందుకుంది.

ఆమె శరీరం జలదరించినట్లయింది.

అలా వాడు ఆ చేతుల్లో వుంటే అప్పటివరకూ అక్కడ జరి
విశేషాలన్నీ అలా అలా దూదిపింజల్లా ఎగిరిపోయాయి. హాయిగా వుం

రక్తం గుండె కవాటాలను పగలగొట్టుకుని బయటకు వచ్చేస్తోం

ఆమెలోని మాతృత్వం పొంగిపొరలుతోంది.

ఆమెలోని అనురాగం పాదరసంలా అణువణువునా ప్రసరిం
తోంది.

ఆమె కళ్ళల్లో అంతులేనంత ఆపేక్ష!

అపురూపంగా ఎత్తుకుని గుండెకు హత్తుకుంది.

వాడు నాయనమ్మ రెండు చెంపలూ పట్టుకుని ఆవిడ కళ్ళజోడు
అందుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

మళ్ళీ ఇలాంటి ఛాన్స్ దొరుకుతుందో లేదో అన్నట్టు ఆనంది "నేను
నీ అత్తనురా" అంటూ లాక్కుంది.

ముగ్గురూ కొంచెంసేపు పరిసరాలే మర్చిపోయారు.

ఈ భూమిమీద తాము మాత్రమే నిజం!



ఈ బిడ్డ నెత్తుకున్నదే నిజం!

మిగిలిందంతా మిథ్య అన్నట్లు వాడిని మధ్యలో వుంచుకుని కబు
ర్లలో మునిగిపోయారు. వాడి పోలికలూ, రంగూ, జుట్టూ, నవ్వూ- ఒక్క
టని కాకుండా వాడిని గురించి ఏవేవో కబుర్లు, వాడి వయసంత ఉన్నప్పుడు
విశ్వనాథం ఎలా వుండేవాడో, ఆ కబుర్లన్నీ కలగలిపి గబగబా చెప్పేసు
కుంటున్నారు.

అంత ధారాళంగా మాట్లాడుకునేటపుడు వాళ్ళకు తెలియకుండానే
తమిళంలోకి వెళ్ళిపోతారు.

పైగా ఆనందికి తెలుగు రాదు! రాదంటే అంత ధారాళంగా మాట్లాడ
టానికి చేతకాదు.

కొంచెం పెద్దగా తమిళంలో గలగలా మాట్లాడేస్తున్నది ఆనంది.

విశ్వనాథం కాఫీ తాగి ఆనంది వేసిన దోసెలు తిని బయటకు వెళ్ళి
పోయాడు.

అతడు ఈ మధ్యనే సాయంత్రాలు ఐదున్నరనుండీ ఎనిమిదిన్నర
వరకూ ఓ సూపర్ మార్కెట్లో అకౌంటెంటుగా చేరాడు.

అదనంగా డబ్బు అవసరమనేది సగం కారణమయితే, సుజాత అవ
సరంగా చేసే అనవసరపు ఖర్చుకోసం కొంతా, ఇంట్లో వుండి ఆవిడ చిరు
బురలు భరించలేక బయట గడపటమే మేలనుకుని అతడు ఆ ఉద్యోగంలో
చేరాడు.

ఇంకా మనవడి మైకంలోనే వున్నవాళ్ళు సుజాత గడపలోకి వచ్చే
సరికి కీ ఇచ్చిన బొమ్మలా కదిలి బాబుని అందచేసింది ఆనంది.

పెద్దమ్మని మెల్లిగా అడిగింది.

"బాబుకు పేరు పెట్టారా?"

"తెలియదు. అన్నయ్య వచ్చాక అడుగుదాం."

సుజాత గొంతు ఖంగుమంది.

"ఏమిటా గుసగుసలు?"

"ఏంలేదు వదినా!"

ఆనందిని చెప్పనివ్వలేదు. ఆమెకా అవకాశం ఇవ్వకుండా "ఒదినట

ఒదిన! నాకు తమిళం రాదుకదాని నామీద ఉన్నవీ లేనివీ కలిపి ఆయన
చెప్పి నా కాపురాన్ని పాడుచేయాలని చూస్తావా?"

"నీ కాపురం నేను పాడుచేయటం ఏమిటి?" దిగ్భ్రాంతితో క
పెద్దవిచేసి చూసింది ఆనంది.

"సుజాతా! ఎంత మాటన్నావు. నువ్వు మాత్రం నా బిడ్డవు కా
నీ కాపురం చల్లగా వుండాలని కోరుకుంటాముగానీ...."

"చాల్లే! నంగనాచి కబుర్లు చెప్పకు. అల్లుడితో పితూరీలు చెప్ప
నేనూ విన్నాను."

సుజాత తల్లి రంగంలోకి దిగింది.

ఇహ పెద్దమ్మకు సమాధానం చెప్పాలనిగాని, అసలు మాట్లాడా
గానీ అన్పించలేదు.

సుజాత తల్లి నోటి పదును పెద్దమ్మకు పెళ్ళితోనే పరిచయమై అర్థ
చేసుకుంది.

ఆ నోటికి పని కల్పించకుండా ప్రక్కకు వెళ్ళిపోయింది పెద్దమ్మ.

తామేదో తప్పు చేసినట్లుగా ఆ తల్లీకూతుళ్ళు అలా నిలదీసి అడగ
టమూ, నిష్ఠూరాలు వేయటమూ-

ఊహుఁ!

వాళ్ళు ఏం మాట్లాడినా మౌనమే శరణ్యం అన్నట్లు ఆనంది కూడా
పెద్దమ్మ వెనకాల వంటగదిలోకి వెళ్ళింది.

"దిక్కూ మొక్కూ లేనిదానివని జాలిపడి చేరదీస్తే నామీదే చాడీలు
చెబుతావా?"

'తనేం చెప్పింది? ఎవరికి చెప్పింది?'

అసలావిడ మనసులో ఏదో పెట్టుకుని ఇలా మాట్లాడుతోందా?

గుమ్మడికాయల దొంగ భుజాలు తడుముకున్నట్లుగా వుంది.

చేయని తప్పు నామీద రుద్ది కాసిని కేకలువేస్తే ఆవిడ తప్పులు
కప్పడిపోతాయని అనుకుంటోందో ఏమిటో!

రోషంగా తలెత్తి చూసింది.

ఏదో అనబోయిన ఆనందిని గబుక్కున చేయిచాచి ఆనంది నోరు



మూసేసింది పెద్దమ్మ.

బజారు మనుషుల్లాగా మాటకు మాట అనుకుంటూ ఘర్షణ పడటం
ఆవిడకు సుతరామూ ఇష్టంలేదు.

"వద్దు! ఏం మాట్లాడవద్దు. రెండు చేతులూ కలిస్తేనే చప్పుడు.
మనం మాట్లాడకుండా వుంటే కాసేపటికి వాళ్ళే ఆగిపోతారు."

"అదిగో! మళ్ళీ మామీద విరుచుకుపడుతున్నారు" కయ్యమంది
సుజాత.

"బాగుంది! విరుచుకుపడేది మీరూనూ- అనేది మమ్మల్నినా?"
రోషంగా అనుకుంటూ తలెత్తి చూసింది.

"ఏమిటా చూపు? ఏం కొడతావా?"

"ఛ!"

మూర్ఖులతో మాట్లాడటం మురుగుడుపైన రాళ్ళు వేయటమే!

ఆనందికి సుజాత ముఖంవైపు కూడా చూడాలన్పించలేదు.

ఆవిడ మాటలు, ప్రవర్తనా....

ఒళ్ళంతా గొంగళి పురుగులు పాకుతూన్నట్లు కంపరంగా అన్పి
స్తోంది.

కత్తిపీట ముందర కూర్చుని బీన్స్ కోయటంలో మనస్సు లగ్నం
చేయాలని విఫల ప్రయత్నం చేస్తోంది ఆనంది.

* * * *

సుజాత వచ్చి పదిరోజులయింది.

ఏ మూడు రోజులో వుండి వాళ్ళ అమ్మ వెళ్ళిపోతుందేమో అను
కున్నారు.

కాని ఆవిడ అలా వెళ్ళలేదు.

ప్రతిరోజూ కనీసం రెండు మూడు సార్లయినా ఏదో ఒక నెపంతో
పెద్దమ్మనూ, ఆనందినీ అవమానకరంగా మాట్లాడేది.

కారణం లేకుండా గొడవ లేవదీసేది.

అసలావిడి ఉద్దేశమేమిటో అర్థంకాదు.

ఎందుకలా ప్రవర్తిస్తోంది?

పెద్దమ్మకు ఓ అనుమానం పట్టుకుంది. అదేమంటే—ఇలా అ
దానికీ, కానిదానికీ గొడవచేసి రాద్ధాంతంచేసి పెద్దమ్మనూ అనంద్
ఇంట్లోంచి తరిమివేయాలని పథకమా!

పోనీ అలా అనుకున్నా ఇంట్లో పనీ పాటా చేసుకోపటానికి ఒక
పంగాలికదా!

అటు వస్తువు తీసి ఇటు పెట్టుకోలేరు! మంచినీళ్ళు ముంచుకొ
తాగటం ఇంత వరకూ చూడలేదు.

కనీసం భర్త భోజనానికి వస్తే వడ్డించటానికి కూడా మంచం ది
రాదు!

అలాంటి కోడలిదగ్గర ఇల్లూ, కొడుకునీ వదిలేస్తే....ఏం జరుగు
తుంది.

ఇల్లు కొల్లేరుచేసి, కొడుకుని కడుపు మాడ్చటం తప్ప మరేం చే
కాదు!

నిజమే!

సుజాత అసలు పనిచేయదు!

ఇదివరకే చేసేది కాదు!

ఇహ ఇప్పుడు ఇంకేం చేస్తుంది!

పిల్లవాడికి స్నానం చేయించటమే బాగుండదు! ప్లాస్టిక్ బేసిన్‌లో వేడినీళ్ళుపోసి అందులో కూర్చొబెట్టి సోపుతో ఒళ్ళు తోముతారు! ఆ తర్వాత బయటనించోబెట్టి రెండు మగ్‌ల నీళ్ళతో కడుగుతారు.

అంతే!

స్నానం అయిపోతుంది!

సాయంత్రాలు సాన్నం చేయించే పనేలేదు.

అదేమి స్నానమో—

ఎక్కడా చూడలేదు!

ఒక నలుగు పెట్టటమూ, తలస్నానం చేయించటమూ, సాంబ్రాణి పొగ వేయటమూ—

ఏమీ వుండవు.



వచ్చిన క్రొత్తలో ఆ పద్ధతులు చూడలేక, వుండబట్టలేక పెద్దమ్మ ఒకసారి అడిగింది

"ఛత్! అవన్నీ పల్లెటూరి గబ్బిలాయిలు ఆచరించే పద్ధతులు!" అని కొట్టిపారేశారు.

బాబు ఒకటికి వెళ్ళే బట్టలు కూడా అలా నీళ్ళల్లో పిండేసి ఆరవేస్తారు.

వాటిని కాస్త వేడినీళ్ళల్లో ఊరబెట్టి శుభ్రంగా ఉతికి ఆరవేసే పద్ధతే లేదు.

ఈ కాలపు అధునాతన పెంపకం చూసి చాలా సార్లు అనుకుంటా రావిడ.

'ఇలాంటి పెంపకం ఎక్కడా చూడలేదు. నేను పల్లెటూరి గబ్బిలాయినయినా, చదువు రాని మొద్దునయినా, నా కొడుకుని ఆరోగ్యంగా పద్ధతిగా పెంచుకున్నాను. వెనుకబడిన తరగతులవారు కూడా ఇంత మడ్డిగా పెంచుకోరు.'

బాబుకు పాలుపట్టే బాటిల్స్ కూడా ఎక్కడ బడితే అక్కడ పడేసి వుంచుతారు.

వాటిని వెంటనే కడుక్కొని వుంచుకోపటమే జరగదు.

పండ్లరసం పట్టటంగానీ, బిస్కెట్ పెట్టటం గానీ ఏమీ వుండదు.

ఏదో....వాడు ఏడిస్తే కాసిని పాలు పట్టటం—అంతే!

అదేమి పద్ధతో....ఏమిటో....

సవతి తల్లులూ, పని వాళ్ళు కూడా అంత నిర్లక్ష్యంగా పెంచరు.

చేతగాకనా లేక సోమరితనమా?

అర్థంకాదు!

అంత అజాగ్రత్తగా చూస్తుండటంవల్ల బాబుకు ఎలాంటి అనారోగ్యం వాటిల్లుతుందో అని ఆవిడకు భయం!

ఏమైనా చెబుదామంటే వినరు సరికదా ఎదురు హేళన చేస్తారు.

ఈ మధ్య క్రొత్తగా పురో మాట జోడించారు. 'పెద్ద పండితులు చెప్పొచ్చారు' అంటూ.

'అందుకే అరవమేళం అంటారు' అని వెక్కిరించటం!

'సాంబారు చేసుకుని తినటం తప్ప ఇంకేం తెలుసు' అంటా
ఆనందికి ఒళ్ళు మండుతుంది!

ఏముంటాయో ఏమిటో! ఎప్పుడూ ఆ తల్లీ కూతురు గది
కూర్చుని మాట్లాడుకుంటూనే వుంటారు. లేదా అంత చంటివాడినీ తీసు
తిరగటానికయినా వెళ్ళిపోతారు.

వాళ్ళా ఆడవాళ్ళే!

మరి అదేమి జాతి ఆడవాళ్ళోగానీ తిండి తిన్న కంచాలు
కడగటం కూడా చేయని ఆడవాళ్ళు!

పెద్దమ్మ చేసిన వంటలకు ఇరవై నాలుగు వంకలు పెడు
ముక్కుదాకా మింగటం తెలుసు!

ఆనందిపై అజమాయిషీ చేస్తూ అధికారం వెలగబెట్టటం తెలుసు
అంతకు తప్పించి మరేమీ చేతకాదు.

అసలు మనిషిగా ప్రవర్తించటం గానీ, మృదువుగా మాట్లాడటం
గానీ—వాళ్ళ రక్తంలోనే లేదేమో అన్పిస్తుంది.

కాస్తంతయినా మానవత్వంలేని మనుషులుంటారు అని చాటటాని
ఉదాహరణలు!

అదో రకమయిన రాక్షసజాతి మనుషులనుకోవాలి. "అసలు మన
ఇంట్లో వుంటూ మనం పెట్టే తిండి తింటూ మన మీద అధికారం చెలా
యించుతుందేమిటావిడ!

సుజాతకు ఈ ఇంటి కోడలిగా హక్కూ, అధికారమూ వున్నాయి.
కాని, ఆవిడెవరు?

ఆవిడకేమి అధికారముందని నోరుబెట్టి రాజ్యమేలుతుంది?

సుజాత ముఖం చూసి ఊరుకుంటున్నానుగానీ లేకపోతేనా....
చెప్పుతో చావ చితక్కొట్టి బయటకు పంపించి వుండేదాన్ని."

ఆనంది మనసు బుసలు కొట్టే నాగుపాములా కస్సు బుస్సు
మనేది.

* * * *



సుజాత పాలు కావాలని అడిగింది.

పెద్దమ్మ అప్పుడే పాలుతెచ్చి స్టవ్వుపైన పెట్టింది.

మళ్ళీ అడిగింది సుజాత.

'అయ్యో! ఇవి ఇంకా కాగి చావలేదు. ఉత్తప్పుడయితే అలా పెట్టి
ఇలా తిరగంగానే పొంగి స్టవ్వు అంతా ఖరాబవుతుంది. అలాంటిది ఇవ్వాళ
అవసరం అనేసరికి అవికూడా తాపీగా కాగుతున్నాయి. నన్ను చూస్తే వాటికి
కూడా ఏడ్పించి ఆట పట్టించాలనిపిస్తోంది కాబోలు!

కప్పులో పంచదార, కాంప్లాన్ వేసి ఆత్రుతగా, ఆందోళనగా
పాలగిన్నెవంకే చూస్తోంది ఆనంది.

పొంగు వచ్చాయి.

దించి కప్పులోకి పంచబోయింది.

మళ్ళీ సుజాత కంఠం ఖంగుమంది.

"అయిందా?"

"ఇదిగో, తెస్తున్నాను."

"అవసరంగా బయటికెళ్ళాలి. కాస్త వేళ్ళ తక్కువతో తీసుకురా."

ఆవిడ అరుపులూ, ఈవిడ ఖంగారూ అంతా పెద్దమ్మ గమనిస్తూనే
వుంది.

పెద్దమ్మ చెప్పింది-

"ఆ గిన్నెలో కాసిని చన్నీళ్ళు పట్టి అందులో పాలగిన్నె పెట్టు
తొందరగా చల్లారుతాయి."

ఆనంది అలాగే చేసింది.

"ఇంత ఆలస్యమేమిటి?" చీర సవరించుకుంటూ సుజాత వంటగది
గడప దగ్గరకు వచ్చింది.

సరిగ్గా అదే సమయంలో నీళ్ళ గిన్నెలోంచి పాలగిన్నె తీసి
కప్పులో పోస్తోంది ఆనంది.

"ఏమిటీ పాలల్లో నీళ్ళు కలుపుతున్నావా?"

తెల్లబోయింది ఆనంది.

అసలు ఆ పిల్లకు ఓ క్షణం ఏం చెప్పాలో, ఏం చేయాలో తెలియక

గుడ్లప్పగించి చూస్తూ నిలబడింది.

దాంతో సుజాత ఇంకా రెచ్చిపోయింది.

"ఏమిటలా గుడ్లగూబలా చూస్తావు? ఏం- పట్టుబడిపోయానని గా రాగా వుందా?"

కాదు అని ఖండించి జరిగింది చెప్పటానికి ప్రయత్నించేలోపునే "ఏమిటి? ఏం జరిగింది?" అంటూ వాళ్ళ అమ్మ వచ్చేసింది.

ఇంకేముంది!

ఇక ఎలాటి సంజాయిషీలు, సమాధానాలూ పనిచేయవు.

ఆవిడకున్న గొప్ప ఆయుధం-నోరు.

దానితో ఇష్టమొచ్చిన పద్ధతిలో యుద్ధం చేస్తోంది!

ఆవిడతోపాటు కూతురు వాగుతోంది.

'నా ఇంట్లో పడి నా ఉప్పు తింటూ నాకే పాలల్లో నీళ్ళు కలుపు తావా?'

"ఎంత ధైర్యం నీకు? ఇవ్వాళ నీళ్ళు కలిపినదానివి- రేపు ఏ విషమో కలపవని నమ్మకమేమిటి?"

"నీలాటి విశ్వాసఘాతకురాల్ని ఏం చేసినా పాపముండదు."

అసలు జరిగింది చెప్పటానికి ఆనంది చేసే ప్రయత్నాలు ఫలించనే లేదు, ఆమెకు మాట్లాడే అవకాశమే ఇవ్వకుండా దబదబాపడే వడగళ్ళ వర్షంలాగా అరుస్తూనే వుంది.

పెద్దమ్మ చెప్పబోయినా వినలేదు.

చేసేది లేక అసహాయంగా అలా చూస్తూ వాళ్ళు అనే శూలాల్లాంటి మాటలను భరిస్తూ రాతిబొమ్మల్లా నిలబడిపోయారు.

"దున్నపోతుమీద వర్షం కురిసనట్లే! ఏమి జాలే తల్లీ— మీ అత్తది."

ఈసడించినట్లుగా అసహ్యించుకుంటున్నట్లుగా అనేసి మనవడ్ని తీసు కుని బయటకు వెళ్ళింది.

రుసరుసలాడుతూ సుజాత కూడా వెళ్ళింది.

బయటకు వెళ్ళిపోయారు.



అప్పటివరకూ భయంభయంగా ఒదిగి వున్న దుఃఖం నెమ్మదిగా బయటకు వచ్చేస్తున్నది.

పెద్దమ్మ ఒడిలో తలపెట్టి పడుకుంది.

ఆవిడ గుండె బండబారినట్లుగా ఉంది.

రోజూ జరుగుతున్న ఇలాటి భాగవతాలకు అలవాటుపడిపోతున్నా రావిడ!

ప్రస్తుతం ఆవిడ మస్తిష్కంలో తలెత్తి నించున్న ప్రశ్న ఒక్కటే—

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?

'ముల్లును ముల్లుతోటే తీయాలంటారు. అలా తను కూడా పరుషంగా మాట్లాడి వాళ్ళ నోర్లు మూయించటమే సరైన పద్ధతి అవుతుందేమో!'

పెద్దమ్మ ఇలా ఆలోచిస్తూంటే ఆనంది మరోలా ఆలోచిస్తోంది.

'వీళ్ళు నిజంగానే పొరపాటు పడి ఇలా మాట్లాడుతున్నారా లేక కావాలనే నిందలు మోపి బయటకు పంపేయాలని చూస్తున్నారా! ఒకవేళ అదే నిజమయితే ప్రతిరోజూ జరిగే ఈ గొడవలతో ఇక్కడే వుండేకంటే వాళ్ళిష్టప్రకారం దూరంగా వెళ్ళిపోవటం మంచిది కదా! కనీసం బంధుత్వ మయినా మిగుల్తుంది."

పెద్దమ్మతో అంటే ఆమె ఓ పిచ్చినవ్వు నవ్వింది.

"నీకు తెలీదు ఆనందీ! వాళ్ళ స్వభావమే అంత అన్పిస్తోంది. మొండి పిల్లాడ్ని బెత్తంతోనే దారికి తేవాలంటారు. అలాగే రేపట్నుంచీ వాళ్ళ బాణీ లోనే వాళ్ళకు పాఠం చెబుదాము."

"వద్దు పెద్దమ్మా! వద్దు! అలా చేయవద్దు" ఖంగారుగా అన్నది ఆనంది.

"లేకపోతే వాళ్ళు దారికిరారు."

"అలా చేస్తే వస్తారంటావా?"

"వస్తారో రారో తెలీదుకానీ మనం నోరు మూసుకుని వూరుకున్న కొద్దీ వాళ్ళ ఆగడాలు ఇంకా పెరిగిపోతున్నాయి. వాళ్ళ దృష్టిలో మన మెందుకూ పనికిరాని అసమర్థుల మవుతున్నాము."

ఆనంది మాట్లాడలేదు.

నిజమే!

పెద్దమ్మ చెప్పేదాంట్లో చాలావరకు యదార్థమే! అయినా వ వాళ్ళతో సమానంగా నోరు పారేసుకుని అరవటం, ఘర్షణ పడటం మంచి పద్ధతిగా అనిపించటంలేదు. అల్లరవటం తప్ప ఫలితముంటుందని నమ్మకం లేదు. ఇక వాళ్ళకూ, మనకూ తేడా ఏమిటి?

"మధ్యలో అన్నయ్య నలిగిపోతాడు."

"అవును ఆనందీ! అది దృష్టిలో వుంచుకునే ఇన్నాళ్ళూ ఓపిక పట్టాను. మనకు మర్యాద ఇవ్వకపోయినా, సాటి మనుషులనే కనీసపు గుర్తింపు లేకపోయినా, పనివాళ్ళకన్నా హీనంచేసి ప్రవర్తించుతున్నా నోరు విప్పకుండా సహించుతున్నది కేవలం వాడికోసమే ఆనందీ! కాని- ఇలా ఎన్నాళ్ళు! ఎన్నేళ్ళు?!"

"పోనీ మనమిద్దరం వేరుగా వెళ్ళిపోతే."

"లాభంలేదు ఆనందీ! ఆవిడ వాలకం చూస్తూనే వున్నాంగా. నెలలో ఇరవయ్యయిదు రోజులు పుట్టింట్లో వుంటుంది. ఉన్న నాలుగయిదు రోజుల్లో అయినా వంటచేసి అన్నయ్యకు భోజనం పెడతారని నాకు నమ్మకంలేదు."

"అవును! ఆ మాటా నిజమే! నువ్వు దూరంగా వుంటే ఈ ఇల్లు అడవిగా మారి అన్నయ్య పిచ్చివాడే అయిపోతాడు."

"ఇపుడు మాత్రం వాడు మంచిగా సంతోషంగా వున్నాడంటావా? వాడి వైవాహిక జీవితం ఇంత దుర్భరం అవుతుందని కలలో కూడా వూహించలేదు. ఏనాటి శనో ఇప్పుడు ఇలా ఏడిపిస్తోంది. ఇందుకు కారణం నాదే అవుతుంది. పరిష్కారం కూడా నేనే ఆలోచించాలి."

అలా కొంచెంసేపు ఇద్దరిమధ్యా సంభాషణ జరిగేసరికి మనసుల్లోని భారం వాళ్ళకు తెలీకుండానే కాస్తకాస్తగా తగ్గింది.

* * * *

ఆనందికి సెలవులు అయిపోతున్నాయి. రేపు హాస్టల్‌కు వెళ్ళిపోవాలి.

ఇప్పుడు తనేదో కాస్త సహాయం చేస్తుంటేనే పెద్దమ్మకు ఉదయం



నిద్రలేచిన దగ్గర్నుండీ రాత్రి పడుకునేవరకూ కాసేపయినా విశ్రాంతి దొరకటంలేదు. ఇక తను కూడా వెళ్ళిపోతే ఎంతో కష్టమవుతుంది.

పనికి ఓ మనిషిని పెట్టుకుందామా అని ఆనంది ఓసారి అడిగింది. "ఇప్పుడున్న ఈ పరిస్థితుల్లో ఆ పనివాళ్ళు కూడా వుంటే ఇక మన ఇంటి పరువు గోడలమీద వాల్‌పోస్టర్లు అంటించినట్లే వాడవాడంతా ప్రచారమయిపోతుంది. మన ఇంటికి వేరే ఎవరితోనూ సంబంధాలు లేకుండా సెపరేట్ పోర్షన్ అవటం మూలంగానూ, పనివాళ్ళంటూ ఎవరూలేని కారణంగానే కాస్త గుట్టుగా బ్రతకగలుగుతున్నాం" అని పెద్దమ్మ అంటూంటే-

'నిజమే సుమా!' అనుకుంది ఆనంది.

అసలు ఇంట్లో పనిచేసుకోవటం అనేది పెద్ద కష్టం కాదు ఇదేమీ రాళ్ళు కొట్టేదో, బండలు మోసేదో కాదు. మనసు బాగుంటే అందరూ అరమరికలు లేకుండా హాయిగా, ప్రేమగా మసలుతూంటే ఎంత పని అయినా చేసుకోవచ్చు. కొండంత ప్రేమతో, అనురాగంతో కోడలికీ, మనుమడికీ ఏ పని చేయటమయినా పెద్దమ్మకెంతో ఆనందం కలిగించే విషయమే!

కానీ—ఆమెకు ఆ అర్హత వున్నదా!

తల్లీ కూతుళ్ళు స్నానాలు చేసారు.

'ఏదో ప్రోగ్రాం ఉండి వుంటుంది. అందుకే తయారవుతున్నారు' అనుకుంది పెద్దమ్మ.

లేకపోతే ఆ స్నానానికి ఒక సమయమంటూ వుండదు.

వాళ్ళిష్టం! ఒక్కొక్కసారి మధ్యాహ్నం ఏ మూడింటికో నాలుగింటికో తయారవుతారు.

మధ్యాహ్నం పన్నెండింటికి నీళ్ళు ఆగిపోతాయి. ఎన్ని నీళ్ళని కొట్టి నిల్వ వుంచగలుగుతారు. స్నానాలు అందరివీ అయిపోయి, బట్టలపని అయిపోతే మిగిలిన అవసరాలకు అన్ని బకెట్లకూ, కాగులకూ, అండాలకూ నీళ్ళుకొట్టి వుంచుతారు.

అది వాళ్ళకు అర్థంకాదో, అయినా లెక్కచేయరో తెలియదు. నీళ్ళు ఆగిపోయాక స్నానానికి వెళ్ళి సగం పైగా నీళ్ళు ఖాళీ చేసేసింది. మళ్ళీ

నీళ్ళు సాయంకాలం ఏడు అయితేగాని రావు. అది కూడా ఓ... మాత్రమే వస్తాయి. ఆ ఇబ్బంది వాళ్ళకు పట్టదు. అక్కడికీ ఆనంది ... చెప్పింది.

"అందుకని ఏం చేయమంటావ్? నాకెప్పుడు చేయాలన్పిస్తే అప్పుడు చేస్తాను. నా ఇష్టం! నన్నూరికే సతాయించకు. వెధవ ఆడబిడ్డ పెత్తనం... దగ్గర వెలగబెట్టబోకు" అంది.

ఇక ఆనందిగాని, పెద్దమ్మగాని ఆ విషయాన్ని మళ్ళీ వాళ్ళ ... ప్రస్తావించలేదు.

పిల్ల వాడికి తొట్టి స్నానం కూడా అయింది.

సుజాత తల్లి సామానులు వరండాలోకి చేరవేస్తున్నది.

మేడపైన ఎండలో గోధుమలు పోసి వస్తున్న ఆనంది ... చేస్తున్న పనిని ఆశ్చర్యంగా చూస్తూ లోపలకు వచ్చింది.

"పెద్దమ్మా!"

సుజాత గదిలోంచి బయటకు వచ్చింది. ఆనంది కేక విని పెద్దమ్మ కూడా అప్పుడే వంటగది గడప దగ్గరకు వచ్చింది.

"ఏమిటి ఆనందీ?"

ఆనంది ఏమో చెప్పబోయేలోపునే సుజాత అన్నది-

"మేము వెళుతున్నాము."

"ఎక్కడికి?" అప్రయత్నంగా ఆశ్చర్యంగా అడిగింది పెద్దమ్మ.

"ఎక్కడికేమిటి? మా ఊరికి" చిరాగ్గా కనుబొమలు ముడిచి చెప్పింది.

"అదేమిటమ్మా! అలా సడెన్‌గా చెపితే ఎలా?"

"ఏం....నాలుగురోజులు ముందరగా అప్లికేషన్ వ్రాయాలా?"

అలా సుజాత అనటం ఆనందికి చాలా అసహ్యంగా అన్పించింది.

అసలావిడ నోటి వెంబడి ఒక్కమాట కూడా తీపుగా రాదుకదా!

"అబ్బాయితో చెప్పావా?"

"నా ఇష్టం! నా మొగుడితో చెబితే చెబుతాను-లేకుంటే లేదు. ఆ విషయం నీకు చెప్పాల్సిన అవసరం నాకులేదు" పొగరుగా అంది.



అంతలో సుజాత తల్లి వచ్చింది.

"ఏమిటీ?"

"ఆమెకు ముందరగా చెప్పలేదట! నిలదీస్తోంది."

"నాకు చెప్పాలని కాదమ్మా! కాస్త ముందుగా తెలిస్తే కొంచెం పండ్లూ, స్వీట్లూ తెప్పించేవాళ్ళం కదా అని."

"నువ్విచ్చే ముండమోపి స్వీట్లకోసం అక్కడెవరూ కాచుక్కూర్చో లేదులే" చేతులు తిప్పుతూ ఈసడింపుగా అన్నది సుజాత తల్లి.

ఈడ్చి చెంపమీద బలంగా కొట్టాలన్పించింది ఆనందికి.

ఇహ పెద్దమ్మకు మాట్లాడాలన్పించలేదు. అసలు తలెత్తి వాళ్ళ మోహంలోకి కూడా చూడలేదు.

కోడలికి బొట్టు పెట్టాలనిగానీ, మనుమనుడిని ఓసారి చూడాలనిగానీ, వరండావరకూవెళ్ళి సాగనంపాలనిగానీ....ఏమీ అన్పించలేదు.

మనసంతా....ఏమిటో తెలీని బాధతో కకావికలమైపోయింది.

ఆ ఇంట్లో మాట్లాడుకుంటే పోట్లాట!

తలెత్తిచూస్తే అపనింద!

మనసుకు బాధ!

అందుకే పెద్దమ్మగానీ ఆనందిగానీ సుజాతతో వాళ్ళంతట వాళ్ళు మాట్లాడటం తగ్గించేసారు. అనవసరంగా కందిరీగల తుట్టిమీద రాయివేసినట్లే అవుతుంది.

ఇంతింత చేదు అనుభవాలు పొందాల్సి వస్తుందని ఆమె వూహామాత్రంగా కూడా అనుకోలేదు.

ఎంత భయంకరమైన పీడకలల్లాటి సంఘటనలు!

పుట్టి బుద్దెరిగిన తర్వాత ఎవరితోటీ ఇంతింత మాటలు అన్పించుకోలేదు.

అసలు ఏ కోడలూ ఏ అత్తనూ ఇలా అనటం కూడా వినలేదు.

తను కూడా ఓ ఇంటికి కోడలుగానే వచ్చింది. చాలాకాలం అత్తగారితోనే కలిసి వున్నది. కాని ఇలాంటి అనుభవాలు మాత్రం ఎదురవ్వలేదు.

ఎంతో అన్యోన్యంగా వుండేవారు. ఇలా విజయవాడకు
అత్తగారూ బాధపడ్డారు. తానూ ఎంతో ఏడ్చింది.

కానీ—ఇంత ఘోరమయిన మనుషులను, రవ్వంత కూడా
తమూ మానవత్వమూలేని మనుషులను చూడలేదు. అసలు వు
తెలియదు!

ఏదో సినిమాల్లో చూడటం, కథల్లో చదవటంవరకేగాని
తంలో ఇలాటి వ్యక్తులుంటారని ఆవిడకు తెలీదు. అలాంటిది తన
తన కళ్ళముందరే తన కోడలే తననింత ఘాటైన మాటలంటుంటే
కునే శక్తీ, తట్టుకునే వయసూ ఆమెకులేవు.

సంపదల్లో పుట్టి పెరగక పోవచ్చునేమోగానీ-కన్నతండ్రీ,
కున్న భర్తా, రక్తం పంచుకుని పుట్టిన కన్నబిడ్డా, చివరకు ఇరుగు పొ
లతో కూడా ఎప్పుడూ పల్లెత్తు మాటైనా అన్పించుకోలేదు.

అలాంటిది 'కూతురిలా వస్తుంది! కళాకాంతులు తెస్తుంది!
అందర్నీ ఆప్యాయంగా చూసి చివరి ఒళలో ఆదరించి నోట్లో
తులసి నీళ్ళుపోసి సాగనంపుతుంది' అని ఆశించిన కోడలుపిల్ల ఇలా
దెయ్యంలా ప్రవర్తిస్తుందని అసలు అనుమానంగా కూడా అనుకోలేదు.

ఏనాటి పాప ఫలమో—

సుజాత బాబుని తీసుకుని వెళ్ళిపోయింది.

సుజాత అలా వెళ్ళటం పెద్దమ్మకూ, ఆనందికే కాకుండా
నాథానికి కూడా చాలా బాధనిపించింది.

ముఖ్యంగా చెప్పకుండా వెళ్ళటం.

విశ్వనాథం మంచంమీద పడుకుని పొట్టమీద కొడుకుని
బెట్టుకుంటే వాడు నోరంతా తెరచి విశ్వనాథం చెంపల మీద కొరు
నవ్వుతుండేవాడు.

వాడి పొట్టమీద తలపెట్టి అటూ ఇటూ కదుపుతూంటే జుట్టు
కుని పైకెగిరేవాడు.

సుజాత సృష్టించే అమావాస్య చీకట్లో వాడో పున్నమి చంద్రు
ఆ ఆనందం విశ్వనాథానికి మాత్రమే పరిమితం! అతడు ఇం



వున్న సమయంలో అతడు తీసుకొచ్చి ఇస్తే పెద్దమ్మకుగానీ, ఆనందికిగానీ
ముట్టుకునే అదృష్టం.

విశ్వనాథం ఇంట్లో వున్నప్పుడు సుజాత అసలు బయటకురాదు.

ఓసారి ఆనంది అడిగింది-

"పెద్దమ్మా! ప్రతిపనికీ మాట మాటకూ మా ఇంటా వంటా ఇలాంటి
పనులు చేసుకునే అలవాటులేదు అంటుందికదా-వాళ్ళు ధనవంతులా?"

నవ్వింది పెద్దమ్మ.

"తెలీదమ్మా! కాకపోతే మీ ఒదిన ఒంటిమీద ఉన్న నగలన్నీ మనం
చేయించినవే! అదిగాక సుజాత క్రొత్తవేమయినా తగిలించుకోవటం నేను
చూడలేదు."

"అన్నం తిన్న కంచాలు కూడా పనివాళ్ళు చేస్తారంటూ గొప్పలు
పోతుందావిడ. వాళ్ళింట్లో అంతమంది పనివాళ్ళుంటారా? చాలా పెద్ద
ఇల్లా? మన ఇల్లు బొమ్మరిల్లుగా వుందనీ ఎటు వెళితే ఏం తగులుతుందో
అని విసుక్కుంటుంది కదా!"

"ఎవరు చూశారు తల్లీ! మనకెవరికీ తెలీదు. పెళ్ళి తిరుపతిలో జరి
గింది. ఆ తర్వాత ఇంతవరకూ పేరంటం అంటూ కూడా దేనికీ పిలవనూ
లేదు, మనమూ వెళ్ళలేదు."

ఆశ్చర్యపోయింది ఆనంది.

"అదేమిటి పెద్దమ్మా! అసలు వాళ్ళింటికి వెళ్ళకుండా, వాళ్ళ మంచి
చెడ్డలు విచారించకుండా, అమ్మాయిని చూడకుండా ఎలా ఒప్పుకున్నారు?"

"చిన్నదానివయినా మంచిప్రశ్న వేసావు! నీకున్నపాటి ముందర
ఆలోచన నాకు తట్టినాదలేదు. ఫోటోచూసి బాగానే ఉందికదా అనేసి ఒప్పు
కున్నాము."

"ఎంత పొరపాటు చేసావు పెద్దమ్మా? ఒక్కసారి ఆ ఇంటికెళ్ళి ఆ
అమ్మాయిని చూసి వుంటే వాళ్ళ పద్ధతీ అదీ నీకప్పుడే తెలిసి వుండేది!"

"అవును ఆనందీ! శాస్త్ర నిదానంగా కూడా ఆలోచించలేదు. అన్నీ
అలా కలసుకొస్తున్నట్లు ఏమిటో చాలా హడావుడి పడిపోయి చేసేసాము.
కళ్యాణం వచ్చినా కక్కువచ్చినా ఆగవు అనుకున్నానేగానీ అంత తొందర

పాటు మంచిదికాదు. కాస్త నిదానంగా ఆలోచించి నిర్ణయం తీసుకుందామన్న బుద్ధి తట్టలేదు.

చేతులారా చేసుకున్న తప్పులకు ఫలితం అనుభవించి తీరాల్సిందేగా!

అంతా స్వయంకృతాపరాధం.

*　　*　　*　　*

ఏప్రిల్ మాసం!

కమ్మరి కొలిమిలోని నిప్పులా ఎండ చెలరేగి పోతున్నది!

మధ్యాహ్నం పన్నెండయింది.

"అమ్మడూ!"

బయటనుండి వచ్చిన ఆ కేక వింటూనే పెద్దతమ్ముడికి స్లేట్ మీద బొమ్మలు గీసి చూపిస్తూన్న ఇందిర చటుక్కున లేచి బయటకు వచ్చింది.

వరండాలో చెప్పులు వదులుతూన్న పెదనాన్నను చూసి దగ్గరగా వెళ్ళి ఆయన చేతిని పట్టుకుంటూ అన్నది-

"రండి పెదనాన్నా! మీ ఆరోగ్యం ఎలా వుంది?"

"ఊఁ నేను బాగానే వున్నాను నువ్వేమిటి ఇలా నల్లబడిపోయావ్! పరీక్షలు బాగా వ్రాసావా?"

"ఎవరూ—పెద్దాడా?" అంటూ లోపలినుండి వస్తూన్న తల్లినిచూసి. "రావే అమ్మా" అన్నారాయన.

ఐస్ ముక్కలు వేసిన నిమ్మరసం గ్లాసుతో తెచ్చిచ్చాడు రమేష్.

ప్రేమలకూ, ఆప్యాయతలకూ, అనుబంధాలకూ, చల్లదనానికీ, వెన్నెలకూ, గాలికీ, హృదయానికీ-ఇలా కొన్ని కొన్ని ప్రత్యేక అనుభూతులకూ నిర్వచనాలు చెప్పడం కష్టం!

మన శరీరంలోని ప్రతి అవయవమూ మన చెప్పుచేతల్లో ఉండదు!

మనమాట వినదు!

మనం చెబుతున్నా విన్పించుకోదు!

మనల్ని అసలు లెక్కే చేయదు!

కాసేపు గుండెని ఆగమంటే ఆగుతుందా?



రక్తాన్ని రెస్ట్ తీసుకోమంటే తీసుకుంటుందా?

ప్రేమి-చమంటే ప్రేమిస్తుందా?

ఒద్దూ-మానేయమంటే వింటుందా?

ఊహూఁ

మనకు తెలియకుండానే ప్రేమపుడుతుంది!

ఉక్రోషం పుడుతుంది!

అలాగే ఉద్రేకమూ పుడుతుంది!

అలాంటి అనుభవాల పరంపరలు ప్రతిమనిషి జీవితంలోనూ నిగూఢంగా నిక్షిప్తమై వుంటాయి.

పట్నం జీవితపు పరుగులలో వాటి ప్రదర్శనకు అవకాశం తక్కువ.

పల్లెటూర్లలోని వారికి ఇంకా అంతటి కృత్రిమం అలవాటుకాక వారి పలకరింపులోనూ, మాటతీరులోనూ, చూపులలోనూ కనిపించే ఆపేక్ష, అభిమానమూ మన మనసును మృదువుగా తాకి పులకింపు కలగజేస్తాయి.

"భోజనం అయిందా?"

"ఊఁ అయింది! రావుడింకా ఇంటికి రాలేదా?"

"రావాలి! వొచ్చేవేళయింది. అమ్మడొచ్చిందిగా? ఒకవేళ తాటికాయలేమన్నా కొట్టించి తేవటానికి తోపుకెళ్ళాడేమో?"

"వాళ్ళ పెద్దమ్మ దానికోసం జున్ను పండుతోందట! పాలేరొచ్చాక పంపించమంది"

"నేనే వెళ్ళి తెచ్చుకుంటానులే పెదనాన్నా! పెద్దమ్మను కూడా చూడాలి."

ఆయన వెళ్ళిపోయాక.

భుజంమీద కండువాని సరిచేసుకుంటూ వెళుతూన్న పెద్దకొడుకుని చూస్తూ వరండాలో నించున్న నానమ్మ ఇందిర చేతిని తన చేతిలోకి తీసుకుని ఆమె వ్రేళ్ళు సవరించుతూ అన్నది—

"ఆ పిచ్చిముండ చచ్చిపోయాక పెదనాన్న ఇపుడిపుడే కాస్త మనుషుల్లో పడుతున్నాడు. పెద్దమ్మయితే పగటివేళ బయటకు రాలేకపోతోంది

ఏమిటో-బిడ్డల్ని కనగలంగానీ రాతల్ని కనలేముకదా అని ఎంత చెప్పినా దాని మనసుని ఓదార్చలేకపోతున్నాము.

పిల్లలు తప్పుచేస్తే ఆ బాధ్యత తల్లిదే అవుతుంది. ముఖ్యంగా ఆడ పిల్లలు!

మంచి తల్లిని కాలేకపోయానత్తయ్యా! అందుకే దేవుడు ఒక్క ర్తినే ఇచ్చి వుంటాడు. దాన్నికూడా సరిగా పెంచలేదని కోపంవచ్చి తీసుక వెళ్ళిపోయాడు అని ఏడుస్తుంది.

ఆ ఇంటికీ ఈ ఇంటికీ కూడా నువ్వే కంటిపాపవు! ఎలా చూసుకుం టావో! కోడలు కూతురు కాదు! అల్లుడు కొడుకూ అవ్వడు."

నాన్నమ్మ చెబుతూంటే ఇందిర మనసు దేవిరించినట్లయింది.

తెలిసి ముట్టుకున్నా, తెలియక ముట్టుకున్నా నిప్పు కాలి తీరుతుంది! ఫలితంగా మచ్చ మిగులుతుంది.

అది దాని లక్షణం!

తప్పుకూడా అలాంటిదే.

*   *   *   *

సాయంకాలం చల్లబడినాక తమ్ముళ్ళిద్దర్నీ వెంబడిపెట్టుకుని పెద్దమ్మ గారి ఇంటికి బయలుదేరింది ఇందిర.

సరోజ బ్రతికి వుండగా అన్నదమ్ములు యిద్దరూ కలిసే వుండే వారు.

అదో పెద్ద మండువా ఇల్లు! ఒకవేపున పెద్దతనూ, మరోవేపున చిన్నతనూ వుండేవారు. మధ్యలో ధాన్యం నిల్వ వుంచే గదులు అడ్డు గోడగా ఉండేవి.

సరోజ పోయాక ఆ పిల్ల పెరిగిన ఆ ఇల్లూ, అది తిరిగిన ఆ పరిసరాలూ, ఆ జ్ఞాపకాలూ నేను భరించలేకుండా వున్నాను అని ఏడు స్తూన్న భార్యకోసం పొలం మధ్యలో చిన్నదిగా పెంకుటిల్లు కట్టించాడు. ఒక పడకగది, ఒక వంటగది.

అంతే!

ఆ ఇంటిచుట్టూ వరండా వుంటుంది.



చాలా చిన్న ఇల్లు!

చుట్టూ రకరకాల పూలమొక్కలతో, పండ్లచెట్లతో, ఆదరాభిమాన లతో, అదో ఆశ్రమంలోని కుటీరంలా వుంటుంది

కాలువగట్టుకు తోలుకెళ్ళిన గేదెలు ఇళ్ళకు తిరిగివస్తున్నాయి.

అపుడే స్నానంచేసి వస్తున్నాయేమో చక్కగా శుభ్రంగా నల్లగా నిగనిగలాడుతున్నాయి.

పాలేర్లు చెరువునుండీ కావిళ్ళతో నీళ్ళు మోసుకొస్తున్నారు.

పాడిగేదెల కోసం పచ్చగడ్డి మోపులు నెత్తిన పెట్టుకుని వస్తు న్నారు.

వేసవికాలంలో పొలంపనులు తక్కువగా వుండటంవల్లా, పగలంతా బాగా ఎండగా వుండటంవల్లా ఆ ఊరి పెద్దలంతా సాయంకాలం అయ్యేసరికి ఇళ్ళల్లోంచి బయటకు వచ్చి ఊరి మధ్యలో వున్న పంచాయతీ ఆఫీసు అరుగుల మీదకూ, దానిప్రక్కనే మర్రిచెట్టు క్రింద వున్న రచ్చబండ దగ్గ రకూ చేరతారు. అదో చిన్నసైజు రిక్రియేషన్ క్లబ్బులాంటిది. బాగా చీకటి పడి వీధిలైట్లు వెలిగి రామాలయంలో గంటలు మోగేవరకూ అక్కడ దేశం నలువైపులనుండీ జరుగుతున్న విషయాలు, అధికార అనధికార పార్టీల వ్యవహారాలూ, పంటలూ, ఎరువులూ, ధరలూ- అన్నీ ఒక్కటని కాకుండా రేడియో వార్తల్లాగా, ఈనాడు పేపర్‌లాగా అక్కడ అన్ని సంభా షణలూ చోటు చేసుకుంటాయి.

కరణంగారి ఆవు-దూడ వీధిలో గంతులు వేస్తోంది. చూడడానికి తెల్లగా- ముద్దుగా ఉన్నా అదెక్కడ మీదికొస్తుందో నన్నట్లు భయపడుతూ పక్కకు తప్పుకుంది ఇందిర.

అందర్నీ దాటుకుంటూ ఇద్దరు తమ్ముళ్ళూ చెరోవైపునా నడుస్తుం డగా తల వంచుకుని పొందికగా, ఒద్దికగా వెళుతున్న ఇందిరను ముచ్చ టగా చూస్తూ "రావుడి కూతురివా" అనీ "హాస్టల్లో ఉండి చదువుతూన్నది నువ్వేకదూ" అనీ, "ఏమ్మా బాగున్నావా?" అనీ- "ఎప్పుడొచ్చావు" అనీ- "పరీక్షలు అయిపోయాయా?" అని రకరకాల ప్రశ్నలతో పలకరిస్తున్న ఆ ఊరి పెద్దలకు వినయంగా జవాబులు చెబుతూ ఊరుదాటి పొలాల దగ్గరకు

# మాంగల్యం తంతునానేనా...



శ్రీమతి హాజరా

వచ్చారు.

"హమ్మయ్య" అన్నాడు రమేష్.

"ఏమైందిరా?" అడిగాడు ప్రకాష్.

"ఇప్పటివరకూ మీరు కుశలప్రశ్నలు విన్నారు. ఇంతటితో యిక్క సమాప్తం! మరికాసేపట్లో పెద్దమ్మ ఇల్లు వచ్చేస్తుంది. అప్పటివరకూ పొలాల అందాలు చూడవచ్చు" రేడియో ఎనౌన్స్‌మెంట్ లాగా చెప్పిన వాడి సమా ధానం వింటూ బిగ్గరగా నవ్వింది ఇందిర.

నిజంగానే ఎటు చూసినా పచ్చని పొలాలు! అందంగా వున్నాయి.

వరి కోసిన తర్వాత జనుము వేసినట్లున్నారు. జనుము కూడా బాగ ఎత్తుగా పెరిగి పూలతో నిండుగా ఉంది.

సూర్యుడు పశ్చిమాద్రికి వంగుతున్నాడు.

చేల మధ్యనుండి ఉన్న గట్టుమీద నడుస్తున్నారు.

మెడలోని గంటలు నెమ్మదిగా కదుల్తూ లయబద్ధంగా మోగుతుంటే అడుగులో అడుగులు వేస్తూ జీవితంలోని భాగస్వామ్యానికి నిర్వచనంలా ఎదురుచూస్తున్న ఎడ్లబండి చూడగానే రమేష్ అన్నాడు.

"అక్కా! ఇది మన పెద్దనాన్నగారిదే. దాంట్లో వెళదామా?"

నవ్వింది ఇందిర.

చుట్టూ కనుచూపుమేర ఆకుపచ్చని ఆకులమధ్య, పసుపు పచ్చని పూవులతో నిండిన పొలాలు కనువిందు చేస్తున్నాయి.

నిర్మలంగా వున్న ఆకాశం!

శరీరాన్ని మృదువుగా స్పృశించిపోతూన్న చల్లనిగాలీ—

ప్రశాంతంగా ఉన్న ఆ వాతావరణంలో నడిచి వెళ్ళాలనిపించింది.

"నడిచే వెళ్దాము రమేష్! అయినా వచ్చేశాం కదా."

తమ్ముళ్ళిద్దరూ పోటీలుపడి మరీ చెబుతున్న వాళ్ళ స్కూలు విష యాలూ, స్నేహితుల కబుర్లూ వింటూ నడుస్తున్న ఇందిరతో "అక్కా! అక్కా! అటు చూడు. సూర్యుడు ఎర్రగా, గుండ్రంగా ఎంత బాగున్నాడో" అన్నాడు.

తల తిప్పి చూసింది ఇందిర.



అవును!

ఆకాశం ఎంత బాగుంది!

భూమి ఆకాశం చేరువై చేయీ-చేయీ కలుపుకుంటున్నచోట పగ లంతా ఉరుమురిమి చూసిన ఆ సూర్యుడేనా ఇతడు అని ఆశ్చర్యపడేంత సౌమ్యంగా తల్లి ఒడిలో ఒద్దికగా ఒదిగిపోయిన పసిపాపలా హాయిగా నవ్వుతున్నాడు.

ప్రకృతిమాత ఆకుపచ్చని పట్టుచీర కట్టుకుని, పసుపుపచ్చని జాకెట్టు వేసుకుని, ఎర్రని కుంకుమ బొట్టుతో పేరంటానికి వస్తున్న నిండు ముత్తైదువలా స్వచ్ఛంగా సుందరంగా వుంది.

ఇంటి ముందర పందిరి దగ్గర మల్లెమొగ్గల్ని కోస్తున్న పెద్దమ్మను చూడగానే ప్రకాష్ గట్టిగా కేకవేశాడు.

"పెద్దమ్మా!"

తలతిప్పి చూసిన ఆవిడ నవ్వుతూ రెండడుగులు ఇవతలకు వేసి ఆహ్వానం పలుకుతున్నట్లుగా చూస్తూ నిలుచుంది.

ఇంకో నాలుగు అడుగులువేస్తే ఇల్లు!

ఇంతలో "అమ్మాయిగారూ! అమ్మాయిగారూ!" బిగ్గరగా విన్పించిన కేకలకు ఆగి చటుక్కున వెనక్కి తిరిగి చూశారు.

పాలేరు పడుతూ-లేస్తూ పరుగెత్తుకొస్తున్నాడు.

వాడి ఆయాసం, వాడి వగర్పు, ఆశ్చర్యంగా చూస్తోంది ఇందిర.

దగ్గరగా వచ్చేశాడు

మోకాళ్ళమీద చేతులేసి కాస్త వంగుని ఆయాసం తీర్చుకుంటున్నాడు.

"ఏమిట్రా? ఎందుకింత హడావుడిగా పరిగెత్తుకొచ్చావు?"

వాడు వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.

చేయెత్తి 'ఆగు' అన్నట్లు సైగ చేశాడు.

ఎగిరెగిరి పడుతున్న వాడి శరీరం క్రమంగా సర్దుకున్నాక చెప్పాడు-

"అమ్మాయిగారూ! మీకోసం పట్నంనుండి కారేసుకుని ఎవరో వచ్చారండి. మిమ్మల్ని ఉన్నపళంగా అర్జెంట్ గా వచ్చేయమన్నారు."

నివ్వెరపోయింది ఇందిర.

"నాకోసం– కారులో వచ్చేవాళ్ళు- ఎవరై వుంటారబ్బా" అనకుంటూ పెద్దమ్మవైపుకు అడుగులు వేసింది.

"అమ్మాయిగారూ! మిమ్మల్ని ఇంటికి రమ్మంటుంటే అటెల్తారేంటి!"

"వస్తానురా- పెద్దమ్మ చూస్తోంది కదా! చెప్పేసి వెళదాము."

"త్వరగా వచ్చేయండి."

"ఎవరొచ్చార్రా?"

"ఎవరో నాకేం తెలుస్తుందండీ?"

"ఛ! వెధవా. నేనడిగేది వాళ్ళ ఊరూ, పేరూ కాదు. ఎలా ఉన్నారు అని."

"ఆడాళ్ళా? మగాళ్ళా?" రమేష్ అడిగాడు.

"అదాండీ! మరేమో....ఒకరేమోనండీ మన అమ్మగారిలాగా ఉంటారండీ. ఆరితోపాటు మన పెద్దయ్యవారిలాగా ఒకాయన, ఇంకో ఆయన... మరేమో...."

"చాల్లేరా! చాల్లే పద."

ఇందిరకు అర్థంకాలేదు.

తనకోసం ఎవరో వచ్చారనగానే తన ఫ్రెండ్సేమో ననుకుంది. కానీ ఇలా వీడు చెబుతుంటే-'తనకోసం' అయివుండదు, ఎవరైనా బంధువులొచ్చి వుంటారు' అనుకుంది.

పెద్దమ్మతోచెప్పి వెంటనే వెనక్కు తిరిగాడు.

పెద్దమ్మ పాలేరుని పిల్చింది.

"ఒరేయ్! కాస్త ఆగు. ఈ మల్లెమొగ్గలూనూ, ఈ జున్ను గిన్నెనీ తీసుకెళ్ళు."

ఇంటికి వచ్చారు.

ముందరవైపు వాకిలి అంతా ఊడ్చి నీళ్ళు చల్లినట్లున్నారు.

చల్లగా వుంది.

అక్కడే నాలుగు కుర్చీలు, ఒక నవ్వారుమంచం వేసి వున్నాయి.

నాన్న మంచంమీద కూర్చుని వున్నారు. కుర్చీల్లో కూర్చుని వున్న



వాళ్ళలో పెదనాన్న ఒకరు. మిగిలిన ఇద్దరూ ఎవరో ఇందిరకు తెలియలేదు. చూసినట్లు కూడా గుర్తులేదు.

"రామ్మా!" అన్నారు పెదనాన్న.

ఇంట్లోకెళ్ళబోతున్న ఇందిర తక్కున ఆగిపోయింది. అంత పెద్దవాళ్ళు-మగవాళ్ళు-అందునా తెలియని వాళ్ళు.

వాళ్ళ ఎదుటికి వెళ్ళాలంటే—

కాళ్ళు తడబడ్డాయి!

కాలేజీలో చదువుతూన్నా చిన్నప్పట్నుండీ రక్తంలో జీర్ణించుకుపోయిన అలవాట్లు, పద్ధతులు అంత త్వరగా మారిపోవు. పైగా ఎస్.ఎస్.-ఎల్.సి. వరకూ అదే వూరు. అదే ఇల్లు- అవే అలవాట్లు!

కాలేజీకి వెళ్ళాక- అది కూడా ఉత్త ఆడపిల్లల కాలేజీ అవటం-ఆ హాస్టలూ, ఆ వాతావరణమూ అంతా అచ్చు మధ్య తరగతి కుటుంబాల కట్టుబొట్లకూ, తెలుగువారి సంప్రదాయానికీ అనుగుణంగా, కేవలం వాళ్ళకోసమే అన్నట్లుగా వుండటం.

అన్నింటినీ మించి ఆమెకు అక్కడ దొరికిన స్నేహితులు అ ఆ ఈ ఉ ఊలు కూడా అదే పరిధిలోని పిల్లలవటంతో ఇందిరలోని 'ఆడతనం' నాగరికత అనే ముసుగులోకి, కల్చర్ అనే రొచ్చులోకి వెళ్ళకుండా తళతళలాడుతూ చెరువు నీటిలో మెరుస్తూ కనిపించే సూర్యకిరణంలా స్వచ్ఛంగా వుంది.

"మా అమ్మాయి" అన్నారు పెదనాన్న.

మెల్లగా తలెత్తింది ఇందిర.

వాళ్ళంతా తననే చూస్తున్నారు.

వాళ్ళ ముఖాల్లో నవ్వూ, వాళ్ళ కళ్ళల్లోని ఆప్యాయతా-

"నమస్తే" మర్యాదగా రెండు చేతులూ జోడించింది.

"కూర్చోమ్మా" అన్నారు.

ఇందిర కూర్చోలేదు.

"ఏం చదువుతున్నావమ్మా?"

చెప్పింది.

"సబ్జెక్టేమిటి?"

చెప్పింది.

"ఆ గ్రూపునే ఎందుకు ఎన్నుకున్నావు? తర్వాత ఏం చదవాలి?"

ఏమో! అంత దూరం ఎప్పుడూ ఆలోచించలేదు ఇందిర. సమాధానం చెప్పలేనిదానిలా చిన్నగా నవ్వింది.

ఆయన కూడా నవ్వుతూ అడిగారు.

"సెలవలు ఎప్పటివరకు?"

చెప్పింది.

మరో ఆయన అన్నారు.

"లోపల మీ ఆంటీ నీ కోసం ఎదురుచూస్తోంది. లోపలకు వెళ్ళు."

విస్తుపోయింది ఇందిర.

అంటే- ఈ వచ్చినవాళ్ళు తనకు తెలిసిన వాళ్ళేనా!

ఎవరయి వుంటారు?

ఆంటీ అంటున్నారు.

ఎవరా ఆంటీ—-

లోపలకు వచ్చింది.

అమ్మ, నానమ్మ కాకుండా ఇంకో ఇద్దరు ఆడవాళ్ళు క్రొత్తగా వున్నారు.

ఎవరు వీళ్ళు?

ఉహూఁ— తెలియలేదు.

ఆశ్చర్యంగా వాళ్ళవైపే చూస్తోంది.

"అమ్మడూ! నీ కోసమే వచ్చారు."

మొదటగా ఇందిరను చూసిన నానమ్మ అంది.

చటుక్కున తలలెత్తారు అందరూ.

ఎవరు వీళ్ళు! నా కోసం రావటమేమిటి? వాళ్ళెవరో నాకు తెలియటంలేదే!

విచిత్రంగా వుంది.

నిస్సహాయంగా చూసింది ఇందిర.



అందులో ఒకావిడ నవ్వుతూ అడిగింది.

"నన్ను గుర్తుపట్టలేదు కదూ!"

ఎన్నడూ లేనిది ఇందిరకు క్షణంలో సగంసేపు చిరాకన్పించింది.

"ఇదేదో పజిల్‌లాగా నేనెవర్ని అని అడగకపోతే ఎవరో ఏమిటో వాళ్ళే చెప్పవచ్చుగా" విసుగ్గా అనుకుంది.

ఉదయాన్నే పశుపక్ష్యాదులు నిద్రలేచి ఒళ్ళు విరుచుకునే సమయంలో ఆకులచాటునుండీ తొంగిచూస్తున్న సూర్యకిరణాలు తట్టి లేపుతూంటే ఉలిక్కిపడి లేచి కళ్ళు తెరచి అరవిచ్చిన గులాబీల అందం చూసి పరవశంతో తన్మయురాలయిన ప్రకృతికన్య మదిలో మెదిలి అలా అలా గీసివదేసిన బాపూగారి బొమ్మకు ప్రాణం వచ్చి లేచొచ్చినట్లుగా నిలబడి చూస్తున్న ఆమె పెద్ద కళ్ళల్లోని "మీరెవరు?" అనే ప్రశ్న హిందూ పేపర్‌లోని ఫ్రంట్ పేజీ హెడ్‌లైన్‌లాగా కనపడుతూంటే ఎడమచేతి మధ్యవేలితో కళ్ళజోడుని సవరించుకుంటూ "నేను" అని చెప్పబోయింది.

చటుక్కున ఇందిర మెదడులో ఫ్లాష్ వెలిగినట్లయింది.

అవును! ఆమెనెక్కడో చూశాను. అలా ఆ ఎడమచేతివేలితో కళ్ళజోడు సవరించుకోవటం-

అవును!

ఆమెనెక్కడో చూశాను.

ఎవరీమె?

ఎక్కడ చూశాను?

ఎక్కడ? ఎక్కడ?

క్షణంలోని సగంసేపులోనే వేయిసార్లు మ్రోగుతూన్న ప్రశ్న-

ఎవరు?

"మీరు" సందేహంగా మొదలుపెట్టింది ఇందిర.

ఇందిర అలా అనేసరికి తనెవరో చెప్పబోయిన ఆవిడ కూడా మాటలు ఆపేసి చిరునవ్వుతో ఇందిరనే చూస్తోంది.

ఇందిర కళ్ళల్లో అనేక భావాలు!

మనసులో అనేక తరంగాలు!

చెప్పలేని మధనం!

ఆ నవ్వుని ఎక్కడో చూశాను.

ఈమె తనకు తెలుసు!

అది నిజం!

కానీ—ఎవరీమె?

అదే గుర్తుకురావటంలేదు.

ఇందిర శరీరంలోని రక్తం గాలికన్నా వేగంగా ప్రసరిస్తోంది.

ఆమె గుండె మైపు మిషన్‌లాగా కొట్టుకుంటోంది.

తను మెచ్చిన- తనకు నచ్చిన—

ఈ వ్యక్తి ఎవరు?

మనసులో గట్టిగా గంటలు కొట్టినట్లు అదే ప్రశ్న- ప్రశ్న... ప్రమోగుతోంది.

ఉహూఁ—

ఇందిర తన ప్రమేయం ఏమాత్రం లేకుండానే గబుక్కున ... చేతిని పైకి లేపి నెత్తిపై కొట్టుకుంది.

ఆమె చర్యకు అందరూ నవ్వేశారు.

నానమ్మయితే మరీ మరీ నవ్వుతూ మురిపెంగా చూస్తూ "... అమ్మడూ! గుర్తురాలేదా?" అంది.

ఇందిర ఆమెకు దగ్గరగా నడిచి అప్రయత్నంగా ఆమె ప్ర... నేలమీదకు వంగి మోకాలిపై కూర్చుని ఆమె వడిలో చేయివేసి అన్న...

"అయామ్ సో సారీ! మిమ్మల్ని చూశాను. అది గుర్తుంది. కా... ఎక్కడ అనేది గుర్తుకురావటంలేదు."

ఆవిడ నవ్వింది.

ఆ నవ్వు ఎంత బాగుంది- మెత్తగా, హాయిగా, ప్రేమగా—

"మీ ఫ్రెండు ఈశ్వరి...."

ఇక ఆవిడను వాక్యం పూర్తిచేయనీయలేదు.

"ఎస్! మీరు డాక్టరాంటీ" అరచినట్లుగా అన్నది ఇందిర.

నవ్విందావిడ.



"చూశావా! నేను మర్చిపోతానని ఆనాడు మీరంతా అన్నారు. కాని, మన పరిచయాన్ని గుర్తుపెట్టుకుని ఇంత దూరం వస్తే నువ్వే నన్ను మర్చిపోయావు."

ఆవిడ ప్రేమగా అన్నా, నిష్టూరంగా అన్నా- అసలావిడ అన్న మాటలు ఇందిర చెవుల్లోకి ఎక్కనేలేదు.

అసలు ఇందిర మనసు మనసులో లేదు.

ఇందిర ఇందిరలా లేదు.

ఆమె మనసు రెక్కలు కట్టుకుని పక్షికన్నా వేగంగా, దూదిపింజె కన్నా తేలిగ్గా ముల్లోకాలూ విహరించేస్తోంది.

ఇందిర ఈ పంథొమ్మిదేళ్ళ జీవితంలో ఇంత థ్రిల్ ఎప్పుడూ పొందలేదు. తెలీని సందడి ఏదో గుండెల్లో మొదలై శరీరమంతా క్రమక్రమంగా వ్యాపించి ఓ అపురూపమైన అనుభూతిని అందిస్తోంది. ఆమె ముఖంలో, కళ్ళల్లో, చెంపల్లో సంధ్యాకాంతి ప్రతిఫలిస్తోంది.

అసలు పరిచయమే లేని ఓ క్రొత్తవ్యక్తి ఓ పావుగంటసేపు తనతో గడిపిన ఓ జ్ఞాపకం- ఇంత గాఢంగా తన మనస్సులో చోటుచేసుకుందనిగానీ, ఆ వ్యక్తి రాక తనకి సంతోషాన్ని కలగజేస్తుందనిగానీ ఇందిరకు తెలియలేదు.

అసలా రోజుకు గానీ, ఆ పరిచయానికిగానీ తన మనసు ఇంత ప్రాధాన్యతనిచ్చిందనే తెలియదు!

"ఏమిటిలా సడెన్‌గా! ఎక్కడినుండి వచ్చారు?"

"గుడివాడకు ఓ పెళ్ళికి వచ్చాము. నువ్వు గుర్తుకొచ్చావు. చూడాలని వచ్చాము."

ఆమె చెప్పింది నిజమో, కాదో తెలీదుగానీ ఆమె చెప్పిన సమాధానం మాత్రం ఇందిర గుండె లోపలి భాగాలను వెచ్చగా తాకింది.

"థాంక్యూ! థాంక్యూ వెరీమచ్!"

గంతులేస్తున్న ఇందిర మనసు క్రమంగా సర్దుకున్నది.

"అమ్మా ఈమె...." పరిచయం చేయబోయింది ఇందిర.

నానమ్మ నవ్వుతూ చెప్పింది.

"ఆ పరిచయాలు ఎప్పుడో అయిపోయాయి. అసలు వాళ్ళ బంధువులే అవుతారు."

అయిపోయింది.

నానమ్మ ఎవరితో అయినా కాసేపు మాట్లాడిందంటే బీరకాయ పీచులాంటి సంబంధం ఒకటి బయటకు వచ్చి తీరుతుంది.

"ఈమె నా చెల్లెలు." ప్రక్కనున్నావిడను చూపిస్తూ డాక్టర్ స్వర్ణ.

అలా ఆమె చెప్పేవరకూ అసలక్కడ మరో మనిషి వున్న సంగతే మర్చిపోయింది ఇందిర.

చప్పున తల తిప్పి చూసి అభివాదం చేసింది.

లేచి ప్రక్కన వున్న కుర్చీలో కూర్చుంటూ అడిగింది.

"ఈశ్వరి ఎలా వుంది?"

"తను అమెరికా వెళ్ళిపోయింది కదా! మీకు తెలీదూ?"

"లేదు! పెళ్ళి అయ్యాక కలవలేదు."

"బహుశా వీలయి వుండదులే. ఆ వెంటనే వెళ్ళిపోయింది క

ఆమెతో ఏం మాట్లాడాలో ఇందిరకు తెలియటంలేదు. ఈశ్వరి ఇంట్లో కూడా ఆరోజున ఊహ మాట్లాడుతూంటే కూర్చుంది. అందుకే తొందరగా గుర్తుపట్టలేకపోయింది.

"ఏం తీసుకుంటారు? మీకేమి ఇష్టం? కాఫీ, టీ, మజ్జిగ, పా నవ్విందావిడ.

"ఏమీ వద్దు."

"మీకు జున్ను ఇష్టమా?"

"చాలా ఇష్టం."

"జస్ట్ ఒన్ మినిట్."

గబగబా లోపలకు వెళ్ళింది.

అప్పటికే వాళ్ళ అమ్మ గిన్నెల్లోకి సర్దుతూండటం చూసి నవ్వి ఇందిర ముఖంలో స్పష్టంగా చిందులేస్తూన్న ఆనందం ఆమె



కన్న తల్లికి కూడా ఎంతో ఆశ్చర్యం కలగజేసింది.

*  *  *  *

డాక్టర్ స్వర్ణ ఇందిర దగ్గరకు వచ్చి వెళ్ళి వారం రోజులయింది.

ఈ వారం రోజుల్లోనూ కనీసం ఓ వంద సార్లయినా ఆమెనీ, ఆమె రాకనీ, ఆ సమయంలో తను పొందిన అనుభూతినీ తలచుకున్నది.

అసలిప్పటికీ ఆమె రావటం, వెళ్ళటం నిజంగానే జరిగిందా అనుకుంటూ వుంటుంది.

అదో నమ్మలేని నిజం!

గుండెల్లో భద్రంగా దాచుకుని జీవితమంతా గుర్తుంచుకుని ఎప్పుడయినా తలచుకుని ఆనందించాల్సిన అపురూపమయిన జ్ఞాపకాల్లో ఇదీ ఒకటి!

ఆమెకో విషయం ఇప్పటికీ ఆశ్చర్యమే! అంత చిన్న పరిచయాన్ని గుర్తుపెట్టుకుని 'ఇంత దూరం కేవలం నిన్ను చూస్తానికే వచ్చానని' ఆమె అనటం నిజంగానే ఓ అద్భుతం!

ఫ్రెండ్సందరకూ ఈ విషయాన్ని తెలియజేస్తూ ఉత్తరాలు వ్రాసింది ఇందిర.

వేసవి కాలమంతా సామాన్యంగా పల్లెటూర్లలో సాయంత్రమయ్యాక పెరడంతా వూడ్చి చిక్కగా నీళ్ళు చల్లుతారు. కాసేపట్లో ఆ నీళ్ళన్నీ ఇంకిపోయి నేల తడిగా వుండి గాలి చల్లగా వీస్తూ శరీరానికి హాయినిస్తుంది. అక్కడ నవ్వారు మంచాలు వేసుకుని, కుర్చీలు వేసుకుని కూర్చుంటారు. చాలామంది రాత్రిళ్ళు అక్కడే నిద్రపోతారు కూడాను.

పగలంతా వేడికి ఉడికినట్లుగా అయిపోయిన శరీరాలు ఆ చల్లదనానికి సేదతీరుతాయి.

మంచం మధ్యలో బాసింపట్టు వేసుకుని మల్లె మొగ్గలను మాలకడుతోంది ఇందిర.

రమేష్ ప్రకాష్‌లు స్నేహితులతో ఆడుకోవటానికి వెళ్ళారు.

మంచం ప్రక్కనే పడక్కుర్చీలో కూర్చున్న నానమ్మ వెనక్కి

ఆనుకుని ఆకాశంలోకి చూస్తోంది.

"నానమ్మా! ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"నీ గురించే."

"నా గురించా! నాగురించి ఏమి ఆలోచిస్తున్నావు?" నవ్వుతూ కాస్త వెక్కిరించినట్లుగా అడిగింది

లోపలినుండి ఇందిర తల్లి వచ్చింది.

జీడీ ఒకటి తెచ్చి ఇందిరకిస్తూ అత్తగార్ని ఉద్దేశించి అడిగింది.

"ఇవ్వాళ మరీ వడగా వున్నట్లుంది. కాస్త నిమ్మరసం చేసివ్వనా అత్తయ్యా."

"వద్దమ్మా! కాస్త పల్చగా మజ్జిగ తాగుతాను."

ఆమె లోపలకు వెళ్ళింది.

బుగ్గన జీడీ పెట్టుకుని చప్పరిస్తూన్న మనుమరాలిని చూస్తూ నవ్వింది.

"ఇంకా జీడీల మీద మోజు పోలేదటే!"

"ఊహూఁ....ఇంకా ఎక్కువైంది." ఇందిర కూడా నవ్వుతూ చెప్పింది.

మాల కట్టటం పూర్తి అయ్యాక చుట్టచుట్టి మంచం ప్రక్కనే వున్న స్టూలుమీద పెట్టి జడ విప్పుకుంటూ అన్నది.

"నానమ్మా! నేను స్నానంచేసి వస్తాను."

"అలాగే."

వీరమ్మ వచ్చింది. ఆమె చేతిలోని బాదం ఆకుపైన రుబ్బిన గోరింటాకు ఉండను చూస్తూ ఆనందంగా నవ్వింది.

"థాంక్స్ వీరమ్మా. నేనే ఇవ్వాళ వీడితో చెప్పి పంపుదామనుకుంటున్నాను. నువ్వే తెచ్చావు."

"నిన్నటాల నానమ్మగోరు కబురెట్టారమ్మా. నిన్నే తెచ్చేదాన్ని, గోరింటాకు కొయ్యటానికి వెళితే ఆరి అమ్మాయిగోరు కూడా పూరినుంచి వచ్చారంట. పాలతాలికల కోసం కాసిని బియ్యం పోసాను....కొట్టమన్నారు. అక్కడ ఆలస్యమయిపోనాది."



"ఎవరే? నాగబాబు కూతురా?" నానమ్మ అడిగింది.

"అవునండీ! ఆ అమ్మాయిగార్కి ఏడో మాసం కదండీ! పురిటికి తీసుకొచ్చారు."

వీరమ్మ నానమ్మ ప్రక్కన నేలమీద కూర్చోవటం చూసి 'ఊరి విశేషాలన్నీ చెప్పేదాకా ఇదే కదలదు, ఆవిడా వదలదు!' అనుకుంటూ నవ్వుకుంది ఇందిర.

టవలు భుజాన వేసుకుని స్నానాల గదివైపు వెళ్ళబోతూ వంట గదిలో వున్న తల్లి దగ్గరకు వెళ్ళింది.

"ఏం చేస్తున్నావు?"

"పీకిష్టమని కోడిగ్రుడ్లు పొరిటి చేస్తున్నాను. నువ్వు స్నానం చేసొచ్చేసరికి తమ్ముళ్ళు కూడా వచ్చేస్తారు. వాళ్ళు స్నానాలు చేసాక పెందలకాడ తినేద్దురుగాని."

"అప్పుడేనా! ఇప్పుడు భోజనమేమిటి ! నాన్నగారు వచ్చాక తింటాను."

"మరి గోరింటాకు ఎప్పుడు పెట్టుకుంటావు?"

ఇందిర నవ్వింది.

"ఇవ్వాళ నువ్వు తినిపించుదువుగాని."

"చిన్న పాపాయివి. ఉత్తనే తినిపించితే ఏం బాగుంటుంది! చంకలో కూర్చోబెట్టుకుని చందమామని పిలుస్తూ మరీ తినిపిస్తాను."

"ఓ. ఎస్. నాకేం అభ్యంతరంలేదబ్బా."

"ఇదిగో....ఈ మజ్జిగ గ్లాసు తీసుకెళ్ళి నానమ్మకివ్వు. అట్లాగే ఆ జాకీలో పాలకోవలుంటాయి. రెండు తీసుకెళ్ళి వీరమ్మ చేతిలో పెట్టు."

*　　*　　*　　*

ఇందిర స్నానం చేసి వచ్చేసరికి నిజంగానే ప్రకాష్ వాళ్ళు రావటమూ, స్నానాలు చేయటం కూడా అయిపోయింది.

దొడ్లో జాజి పందిరి ప్రక్కన పీటలు వేసి మంచి నీళ్ళు పెడుతున్నాడు రమేష్.

జడలో మల్లెలు పెట్టుకుంటూ వచ్చింది ఇందిర.

"అక్కా రెడీ" కొద్దిగా తలవంచి ఎడమ చేతిని మడిచి పొట్ట దగ్గరగా పెట్టి నాటకీయంగా అంటూన్న తమ్ముడ్ని చూసి నవ్వింది.

సంధ్యాదేవి జలతారు ముసుగు వేసుకుని షికారుకు వచ్చినట్లుగా ఉంది.

చీకట్లు అలుముకుంటూన్న పలుచని వెలుతురులో కూర్చుని తమ్ముళ్ళ కబుర్లు వింటూ భోజనం చేస్తోంది ఇందిర.

గేదెలకు గడ్డివేసి వెనకవైపు గేటుమూసి తాళంవేసి వచ్చాడు పాలేరు.

"అమ్మగారూ నేను వెళుతున్నాను."

"రేపు ఉలవనీళ్ళు కావాలిరా?"

"అలాగేనండీ."

తాళంచెవుల గుత్తి అరుగుమీద పెట్టి వెళ్ళిపోయాడు.

మరునిమిషం రివ్వున దూసుకొచ్చి చెప్పాడు-

"అమ్మాయిగార్ని అయ్యగారు పిలుస్తున్నారు."

తల్లి వంక చూసింది ఇందిర.

"ఇపుడే వెళ్ళనా?" సందేహంగా అడిగింది.

"అయిపోవచ్చిందిగా. పెరుగన్నం కూడా తినేసి వెళ్ళు" ప్రకాష్‌కు పెరుగువేస్తూ అన్నది.

రమేష్‌కూ, ఇందిరకూ కూడా పెరుగు వడ్డించి గిన్నెలన్నీ లోపల సర్దేసి చేతులు తుడుచుకుంటూ ముందరవేపున వున్న భర్త దగ్గరకు వెళ్ళింది.

తల్లీకొడుకులు మాట్లాడుకుంటున్నారు.

'బహుశా రాత్రి తనతో చెప్పిన విషయమే అయ్యుంటుంది' అనుకుంది.

ఇందిర భోజనం పూర్తిచేసి కంచాలుతీసి పంపుదగ్గర పెట్టేసి వంట గది తలుపులుమూసి గడియపెట్టి తండ్రి దగ్గరకు వచ్చింది.

"పిలిచారా నాన్నా!"

"ఏంలేదమ్మా! ఏంచేస్తున్నావో అని పిలిపించాను. అంతే!" నవ్వాడాయన.



ఆయన నవ్వూ, ఆయన చెప్పిన విధమూ చూస్తుంటే ఇందిరకు అనిపించింది-

"ఆయన చెప్పింది నిజంకాదనీ, మరేదో చెప్పాలని అనుకుంటున్నారనీ."

ఏం మాటాడకుండా వచ్చి తండ్రిప్రక్కనే కూర్చుంది.

"గోరింటాకు పెట్టనా?"

అప్పటికే ఆమె ఆకులోని ఉండను మెత్తగా కలుపుతూ అడిగింది ఇందిర.

"మైనపు చుక్కలతో పెట్టించుకోవే అమ్మడూ, చాలా అందంగా ఉంటుంది."

"అమ్మో నాన్నమ్మా! వద్దుబాబూ! చురుక్కు చురుక్కుమంటుంది"

"ములగాకు బాగుంటుందక్కా! కదమ్మా"

రమేష్ వెళ్ళి ములగాకు చిగురు తీసుకొచ్చాడు.

నవమి చంద్రుడు నిర్మలంగా వున్న ఆకాశంలోంచి తన వన్నెలు చూపిస్తూ వగలుపోతున్నాడు.

మసక వెలుతురులో కబుర్లు చెబుతూ రమేష్ ఎడమచేతి గోళ్ళకు గోరింటాకు పెడుతూన్న కూతుర్ని ఆప్యాయంగా చూస్తూ—

"అమ్మా! ఇందిరా" అన్నారు.

గబుక్కున తలెత్తింది.

"మొన్న మద్రాసునుండి నీకు తెలిసిన ఆంటీవాళ్ళు వచ్చారు కదమ్మా!"

"ఊఁ—డాక్టరాంటీవాళ్ళు" ఆసక్తిగా చూసింది.

"ఆవిడ ఉత్తరం వ్రాసిందమ్మా!"

"అవునా! ఏదీ?" మెరిసే కళ్ళతో అడిగింది.

కొబ్బరి ఆకుల సందుల్లోంచి పచ్చిపడుతూన్న ఆ లేతవెన్నెల్లో మెరుస్తూన్న ఇందిర ముఖంలోకి చూస్తూ తన చేతుల్లో వున్న పేపర్ చూపిస్తూ అంది నానమ్మ-

"ఇదిగో."

ఎడమ చేతిలో వున్న రమేష్ చేతిని వదిలి ఆ కాగితాన్ని అందుకోబోయిన ఇందిర రెప్పపాటులో ఆ నిర్ణయాన్ని మార్చుకుని నానమ్మవైపు చూస్తూ ముందు నువ్వు చదువు" అంది నవ్వుతూ.

తల్లితో గోరింటాకు పెట్టించుకుంటూన్న ప్రకాష్ అన్నాడు.

"అక్కా! నానమ్మ ఇంగ్లీషు నేర్చుకుంటోంది."

"అలాగా! వెరీగుడ్."

"నానమ్మకు మాస్టరెవరో తెలుసా! వీడేనక్కా!"

"ఓ! వెరీగుడ్ నానమ్మా! ఏమేమి నేర్చుకుంటున్నావు?"

"నీమొహం! వాళ్ళు చెప్పటానికీ, నువ్వు అడగటానికీను"

నాన్నమ్మ ముద్దుగా కోప్పడుతూంటే రావుగారు లేచారు.

"నేను స్నానంచేసి వస్తాను. ఏయ్ పిల్లలూ మా అమ్మను ఏమన్నా అన్నారో-జాగ్రత్త."

"మీకేం భయంలేదులే నాన్నా! మేము జాగ్రత్తగానే చూసుకుంటాము."

తండ్రి లోపలకు వెళ్ళగానే పిల్లలు అక్కదగ్గరచేరి ఏదో అడగబోతుండగా మళ్ళీ ఆయనే బయటకు వచ్చి "నువ్వు చెప్పవే అమ్మా." అని అన్నాడు.

"ఏమిటి నానమ్మా? ఏమిటి నాన్నగారు చెప్పమంటున్నారు?" అడిగారు పిల్లలు.

"ఏదో చెప్పాడు! నా కొడుకు నాకేదో చెబుతాడు మధ్యలో మీకెందుకు?"

ఇందిర నవ్వేసింది.

"ఓకె. ఓకె. అలాగే కానీ కాస్త నా మెడమీద గోకవా?"

"ఎక్కడా?" ముందుకు వంగుతూ అడిగింది.

మెడను భుజంపైకి వంచుతూ...."ఇదిగో....ఇక్కడ...." అని అంటోంది.

"చిన్నప్పట్నుంచీ నీకిదే జబ్బు."



"నేనేంచేయను చెప్పు? వెధవది! గోరింటాకు వేయించుకోగానే ఎక్కడలేని దురదలూ వచ్చేస్తాయి."

ఇందిర తన స్నేహితుల గురించి చెబుతోంది.

ఈశ్వరి గురించి చెబుతూంటే ఇందిరకు చప్పున డాక్టర్ స్వర్ణ వ్రాసిన ఉత్తరం సంగతి గుర్తుకొచ్చింది.

"నానమ్మా ఆంటీ వ్రాసిన ఉత్తరం ఏదీ?"

"ఇదిగో."

కుడిచేతికి తల్లితో గోరింటాకు పెట్టించుకుంటూన్న ఇందిర ఎడమ చేతిని చాపింది.

"ఈ ఉత్తరం నీకు వ్రాయలేదే అమ్మడూ?"

"నాక్కాదా? మరి?"

"మీ నాన్నకు"

"అవునా? నిజమా నానమ్మా?" నమ్మలేనట్లుగా అడిగింది.

"నిజమేరా అమ్మా!"

"ఏమని?"

"మీ ఇంటికి వచ్చినపుడు మీరిచ్చిన ఆతిథ్యం మాకెంతో సంతోషాన్నిచ్చింది. మీ అమ్మాయి చిరంజీవి సౌభాగ్యవతి ఇందిర మాకు నచ్చింది. మా వివరాలన్నీ మీకు ఆరోజునే స్వయంగా వివరించితిమి. మీకూ మీ కుటుంబ సభ్యులకూ ముఖ్యంగా ఇందిరకూ ఇష్టమైతే మిగిలిన విషయాలు తర్వాత మాట్లాడుకుందాము అని వ్రాసారు."

ఇందిరకు చప్పున అర్థంకాలేదు.

చప్పున అనికాదు. అసలు నానమ్మ వివరించి చెప్పేవరకూ అర్థంకాలేదు,

అర్థమయ్యాక ఆమె మనసు ఆలోచించటం మానేసింది.

"అప్పుడే పెళ్ళేమిటి నాన్నమ్మా" కొంచెంసేపటికి నెమ్మదిగా అన్నది.

"ఎప్పటికయినా చేసుకోవలసిందేగా అమ్మడూ! వాళ్ళు చాలా మంచివాళ్ళలాగా వున్నారు. పైగా కావాలని కోరి చేసుకుంటూంటే."

ఇందిర మాట్లాడలేదు.

గోరింటాకు పెట్టించుకోవటం అయిపోయింది. కాళ్ళకు పెట్టించుకున్న గోరింటాకు పాడైపోకుండా అక్కడే ముడుచుకున్నట్లుగా కూర్చుంది.

నిశ్శబ్దం ప్రశాంతంగా వుంది.

జాబిలమ్మ కట్టుకున్న తెల్లచీర జారి భూమి అంతా కప్పుకున్నట్లు వెన్నెల విరగబడి నవ్వుతోంది.

నానమ్మ కుర్చీలోనే నిద్రపోయింది.

రమేష్, ప్రకాష్‌లు వరండాలో చాపలపై పడుకున్నారు.

ఇందిర తల్లి తండ్రి భోజనం చేస్తూ చెప్పుకుంటున్న కబుర్లు ఇందిరకు అస్పష్టంగా విన్పిస్తూనే వున్నాయి.

డాక్టర్ స్వర్ణ రాకలోని అంతరార్థం ఇదా అనుకుంది.

అలా అనుకున్న ఇందిర మనసు పూర్తి సంతోషాన్ని అనుభవించలేకపోతున్నది.

ఎందుకో....ఏమిటో....

ఇదీ అని ప్రత్యేకంగా చెప్పుకోవటానికి తెలీని అసంతృప్తి ఆమెని ఆవరించింది.

పెళ్ళి అనే వార్తగానీ.... తను వాళ్ళకు నచ్చిందనే వార్తగానీ ఇందిరలో సంతోషాన్నీ, ఓ అనుభూతినీ, ఓ స్పందననూ దేన్నీ కలిగించలేకపోయాయి.

స్తబ్దుగా వుండిపోయింది.

ఎందువల్ల ....?

ఎదురుచూడకుండా, కనీసం వూహించనయినా వూహించకుండా గబుక్కున ఆ ప్రస్తావన రావటం-

ఆమె అందుకు సిద్ధంగాలేదు.

పెళ్ళి చేస్తారని తెలుసు. కాని ఇప్పుడు ఇలా....పైగా డాక్టరాంటీ కొడుకుతో-

అతడేం చదివాడో, ఏం చేస్తున్నాడో, ఎలా వుంటాడో, అసలు ఎలాంటివాడో....



ఇంటి వరకూ—

ఓ వ్యక్తిగా ఆమె మాట, పద్ధతి, నవ్వూ, ఆ గంభీరతా తనకు నచ్చాయి! ఆమె కొడుకూ అలాగే వుంటాడని అనుకోగలమా—!

ఈశ్వరి అత్తగారు పర్వాలేదు. బాగానే వుంటారు! కాని-అతడు-

అమ్మో! ఇతడూ అలాగే వుంటే-

రూపం సంగతి అలా ఉంచి అతని గుణగణాలేమిటో-

అసలు నాన్నగారు ఏమనుకున్నారో-

అమ్మ-అమ్మ ఏమనుకుందో....

వాళ్ళ నిర్ణయం ఎలా వుంటుందో....

తనేమి చెప్పగలుగుతుంది!

వాళ్ళెలా చెపితే తనలా చేస్తుంది.

ఇందిర అచ్చమైన పల్లెటూరిలో పుట్టి మధ్యతరగతి కుటుంబంలో తల్లితండ్రుల చాటున సంప్రదాయపునీడలో పెరుగుతున్న స్వచ్ఛమైన కలువ పూవులాంటి ఆడపిల్ల!

పెళ్ళి గురించి అంతకన్నా ఎక్కువ ఆలోచించలేదు.

మొత్తం మీద ఇందిర జీవితం మద్రాసులోని స్వర్ణ నారాయణ రావుగారి పెద్ద కొడుకు అనిల్ కుమార్‌కు భార్యగా స్థిరపడాలని ఆ బ్రహ్మదేవుడు వ్రాసిపడేసిన ఫైల్‌ని మార్చటం ఎవరివల్లా కాలేదు.

'సర్వ మంగళ మాంగల్యే

శివే సర్వార్థ సాధికే శరణ్యే....' అంటూ ఇచ్చిన తాళిబొట్టుని తీసుకుని-

'మాంగల్యం తంతునానేన

మమ జీవన హేతునాం....అంటూ ఇందిర మెడలో మూడుముళ్ళు వేశాడు అనిల్‌కుమార్.

ఇందిరను అనిల్‌కుమార్‌కు ఎదురుగా కూర్చోబెట్టి తలంబ్రాలు పోయించారు.

అత్త మామల మధ్య కూర్చోబెట్టి పాలతో అప్పగింతలు పెట్టి—

"అమ్మా ఇకనుండి నీకు అమ్మా నాన్నా వీళ్ళే తల్లీ" అన్నారు.

అమ్మడూ అంటూ ఆప్యాయంగా పిలిచే నానమ్మ, పెదనాన్న, పెద్దమ్మా—

అమ్మా ఇందిరా అంటూ ఇన్నేళ్ళొచ్చినా ఇంకా చిన్నపిల్లలా గారాబం చేసే నాన్నగారూ—

అక్కా అక్కా అంటూ ప్రాణం పంచే తమ్ముళ్ళూ—

కళ్ళతోనే పాఠాలు నేర్పించే అమ్మా—

ప్రపంచాన్ని చూపిన కాలేజీ—

హాస్టలూ, స్నేహితులూ—

అందర్నీ వదిలి అనిల్‌కుమార్ చిటికెనవేలు పట్టుకుని వెళ్ళి వెళ్ళిపోయింది ఇందిర.

ఈశ్వరి లేనిలోటు భర్తీ అవ్వకుండానే ఇందిర కూడా వెళ్ళిపోయింది.

అ ఆ కి ఉ ఊ కు మధ్య ఎంత గ్యాప్ వచ్చిందో-

చదువు మధ్యలో పైగా ఇంచు మించు ఇంకొన్నాళ్ళు చదివితే డిగ్రీ చేతికి వచ్చేస్తుంది అనుకునే సమయంలో పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయిన ఇద్దర్నీ చూస్తుంటే మిగిలిన వాళ్ళకు చాలా ఆశ్చర్యం అన్పించింది.

* * * *

"అనితా!"

ఊహ చెబుతున్న జోక్ విని పగలబడి నవ్వుతున్న అనిత వెనక్కి తిరిగి చూసింది.

"నీకు లెటర్...."

"థాంక్యూ" ఉత్తరం అందుకుని అటు ఇటూ తిప్పి చూస్తోంది.

"ఫాదరా?" ఉమ అడిగింది.

"కాదు....ఆయన రైటింగ్ కాదిది. ఎవరై ఉంటారబ్బ?" ఆశ్చర్యంగా చూస్తూ కవరు చింపింది.

"డియర్ అనితా!

సంబోధన చూస్తూనే ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవయ్యాయి.

ఎవరిది? అంటూనే క్రింద సంతకం కోసం చూసింది.

శ్రీనివాస్....!



చప్పున గుర్తుకురాలేదు అనితకు.

"ఎవరీ శ్రీనివాస్?" పైకే అనేసింది.

"ఉత్తరం అంతా చదువు. తెలుస్తుందేమో!" అంది ఆనంది.

పొంతం చదివిన ఆనంది ఆశ్చర్యం, ఆనందం, అనుమానం.... అనేకరకాల భావాలతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

శ్రీనివాస్....!

శ్రీనివాస్ తనకు ఉత్తరం వ్రాయటం....

ఓహ్! వాట్ ఏ వండర్!

అసలిది నిజమేనా?

ఉత్తరాన్ని అటు ఇటూ తిప్పుకుని మరోసారి చదువుకుంది.

ఆమె కళ్ళల్లోని మెరుపూ, ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్న ఆనందమూ చూసి మిగిలిన ముగ్గురూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"ఎవరా శ్రీనివాస్? మీ బంధువా?" ఆనంది అడిగింది.

"నో! లాస్టియర్ కాలేజి డేకి మాజిక్ షో జరిగింది గుర్తుందా?"

"అవును" గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

"అతడే ఈ శ్రీనివాస్! ఆ మాజిక్ చేసినతడే ఇతను."

ఆ రోజు అతడు మాజిక్ బాగా చేశాడని చాలా చాలా మెచ్చుకుంది అనిత.

అందరకూ నచ్చింది.

కాకపోతే అనిత అతని దగ్గరకు వెళ్ళి స్వయంగా అభినందించి, అతని దగ్గర ఆటోగ్రాఫ్ కూడా తీసుకుంది.

అతడూ అనిత అడ్రస్ తీసుకున్నాడు.

అయిపోయింది....!

అదో బ్రైన్ పరిచయంలాటి సంఘటన అనుకుని అప్పుడే ఆ విషయం మర్చిపోయింది.

ఇప్పుడు అతని దగ్గర నుండి ఉత్తరం వస్తే....

నిజంగానే ఆశ్చర్యం.

అంతకు మించి ఆనందం....

అంతటి ఓ పాపులర్ వ్యక్తి తనను గుర్తు పెట్టుకుని ఉత్తరం...
డనే భావన ఆమెను చాలా ఆనందాన్ని కలగజేసింది.

తన మనస్పందనను తెలియజేస్తూ, గుర్తుపెట్టుకుని ఉత్తరం...
నందుకు కృతజ్ఞతలు తెల్పుతూ వెంటనే జవాబు కూడా వ్రాసేసింది.

*   *   *   *

ఈశ్వరి వచ్చింది.

"హాయ్ ఈశ్వరీ! ఎలా ఉన్నావు? ఎక్కడ్నుంచి వచ్చావ్!...
డొచ్చావు? అమెరికా లైఫ్ ఎలా వుంది?" కామా, ఫుల్‌స్టాపు లే...
టకటకా ప్రశ్నలవర్షం కురిపించేస్తున్నది ఊహ.

"స్టాప్ ప్లీజ్."

పరస్పర కుశలప్రశ్నలూ, జవాబులూ జరుగుతున్నాయి.

"మన క్లాస్‌మేట్స్, లెక్చరర్స్ అందరూ ఎలా వున్నారు?"

"అందరూ ఓ.కె. నవ్వింది అనిత.

"ఓసారి అందర్నీ చూసివస్తాను" అంది ఈశ్వరి.

"పద! నేనూ వస్తాను" ఊహ కూడా లేచింది.

వార్డెన్‌నీ, అసిస్టెంటు ప్రిన్సిపాల్‌నీ, హాస్టల్ టీచర్స్‌ను...
వస్తూ కన్పించిన అందర్నీ పలకరించుతోంది.

"ఫర్వాలేదు. అందరూ గుర్తున్నారే."

నవ్వింది ఊహ.

"అరే పగ్లీ! ఇక్కడ వున్నది ఎక్కువ రోజులు! లేనిది తక్కువ...
రోజులు! అప్పుడే ఎలా మర్చిపోతాను?"

"ఈశ్వరీ! మాతోపాటు హాస్టల్ భోజనం చేసెయ్యి."

"అలాగే! మన హాస్టల్ పప్పుచారు నెంబర్ వన్. అమెరికాలో...
వుండగా ఎన్నిసార్లు తల్చుకున్నానో."

"అంటే మేము గుర్తురాలేదన్నమాట."

నిష్టూరంగా అన్నది అనిత.

"అహఁ- పోనీ నువ్వు గుర్తుకొచ్చాకనే పప్పుచారు గుర్తుకొచ్చి...
దేమో" ఊహ సమర్థించబోయింది.



"ఏమిటోయ్! ఈశ్వర్ వచ్చినప్పటి నుండి చూస్తున్నాను. ఏమిటి
విషయం? ప్రతిదానికీ ఆమెని వెనకేసుకు వస్తున్నావు."

ఈశ్వరి నవ్వింది. అందరూ నవ్వుతూంటే మొదట కాస్త కోరగా
చూసినా మరుక్షణంలో తను కూడా నవ్వేస్తూ చిలిపిగా కళ్ళు చికిలించి
రహస్యం చెబుతూన్నట్లు గొంతు తగ్గించి ముందుకు వంగి చెప్పింది.

"లంచం! లంచం తీసుకున్నాను."

అనిత కూడా అదే రకంగా ఊహను అనుకరిస్తూ అడిగింది.

"ఏమిటా లంచం?"

"నన్నూ అమెరికా తీసుకువెళతుందిట."

"అవునా! అరరే! ఎంత పని జరిగింది?" విచారం వ్యక్తం చేసింది
అనంది.

"ఏమిటి? ఏమయింది?" ఆశ్చర్యం నటించింది అనిత.

"మన భారతదేశం ఏమైపోతుంది? నువ్వు లేని లోటు ఎవరు తీరు
స్తారు?"

"అంతేనా! ఆమె ప్రవేశంతో అమెరికా ఏమైపోతుందో అని భయ
పడుతున్నావేమో అనుకున్నాను."

"వెక్కిరించండి- వెక్కిరించండి."

భోజనాలు అయ్యాక అంతా చెట్టు క్రింద కూర్చున్నారు.

ఇందిర కబుర్లు చెబుతూంటే ఆసక్తిగా వింటోంది ఈశ్వరి.

"ఇందిర మద్రాసులో వున్నదని నీకు తెలుసా?"

"ఉహుఁ- తెలియదు. ఇప్పుడు మీరు చెప్పేవరకూ తనకు పెళ్ళ
యిన సంగతే తెలియదు."

"నిజమా?"

"కన్పించకపోతే ఒకవేళ ఇంటికి వెళ్ళిందేమో అనుకుంటున్నాను."

"మీ అత్తగారి ఫ్రెండుకు కొడుకు....అంటూ ఆ వివరాలన్నీ చెబు
తున్నారు.

నవ్వులతో, హాస్యోక్తులతో సరదాగా గడుపుతున్నారు.

"అమెరికా కబుర్లు చెప్పు" అంది ఊహ.

"ఏం చెప్పను?"

"అన్నీ చెప్పు! అమెరికాలో ఏం చేసేదానివి? నీ లైఫ్‌స్టయిల్ ఎలా వుండేది?" కుతూహలంగా అడిగింది.

ఆనంది అడిగింది- "ఎన్ని రోజులుంటావిక్కడ?"

"ఇంకా డిసైడ్ చేసుకోలేదు."

"అక్కడ ఏమైనా చదువుతున్నావా? ఉత్త హౌస్‌వైఫ్‌వేనా?"

"ఏం! హౌస్‌వైఫ్ జాబ్ చిన్నదా?" అన్నది ఉమ.

"అలాగని కాదు! కాని ఇంత చదువుకుని ఉత్త పెళ్ళాంగా వుండి పోతే ఏం బాగుంటుంది" ఊహ మాటలకు ఈశ్వరి నవ్వింది.

"అక్కడ పెళ్ళాం జాబ్ చాలా రిస్కీ. మామూలు ఉద్యోగం బోలెడు! చాలా తేలిక కూడాను."

నవ్వుకున్నారందరూను.

"నువ్వొక్కదానివే వచ్చావా, మీ హజ్బెండ్ కూడా వచ్చారా?"

"నేనొక్కదాన్నే వచ్చాను."

"ఏమిటి- అప్పుడే అమ్మ మీద బెంగపుట్టిందా పాపాయికి" ఆట పట్టించారు.

"అహఁ. తనకు అమ్మ మీదకంటే నాన్నమీద బెంగపట్టుకు వుండివుంటుంది.

వాళ్ళలా మాట్లాడుకుంటే నవ్వేసింది ఈశ్వరి. ఈశ్వరి చేతి మెత్తగా నొక్కుతూ ఆప్యాయంగా అడిగింది ఆనంది.

"ఆర్ యూ హేపీ విత్ హిమ్."

నవ్వింది ఈశ్వరి.

"ఎవరితో?" ఉమ చిలిపిగా అడిగింది.

"యూ నాట్" ఊహ జడపట్టుకుని తలమీద చిన్నగా మొట్టింది.

"నువ్వు మరీ ఎక్కువగా మాట్లాడుతున్నావులా వుంది. అట్ల వూడిపోయి సన్నబడ్డాయి జడలు."

"ఊహకు జుట్టు ఎక్కువ. నల్లగా, లావుగా, పొడవుగా వుంటుంది. ఒక్క జడగా వేయటానికి చేతిలో అమరదని రెండు జడలుగా వేసు



కుంటుంది.

ఈశ్వరి మాటలు విని కళ్ళు చక్రాల్లా గుండ్రంగా తిప్పుతూ అడిగింది. "నిజంగా చెబుతున్నావా ఈశ్వరీ! నాకు వాగుడెక్కువే అనుకో! అయినా చాలా జుట్టు వూడిపోతూంటే ఇదే కారణమని నాకు తెలియలేదు."

"తెలిస్తే ఏం చేసేదావి?"

"వాగుడు మానేస్తానుగా" సిన్సియర్‌గా చెప్పింది ఊహ.

"పుష్పక విమానం సినిమా చూశాం గుర్తుందా?"

"ఇప్పుడు ఆ ప్రస్తావన ఎందుకు?"

"అందులో అతడు రైల్వేట్రాక్ వగ్గర శబ్దాలన్నీ రికార్డుచేసుకుని వెళ్ళి హోటల్ గదిలో పెట్టుకుని వింటూంటేగాని నిద్రపట్టదు. అలాగే నీ మాటలు, నీ నవ్వులు లేకుండా మాకూ నిద్రపట్టదు సుమా."

ఫక్కున నవ్వింది ఈశ్వరి.

"ఈ సమయంలో అమెరికాలో ఏం చేస్తుండేదానివి? నీకక్కడ టైమెలా పాసయ్యేది?"

"నిజం ఊహా! నేనేమీ చేయలేదు. చాలా బోర్ కొట్టేది."

"అక్కడ నీకు తెలిసినవాళ్ళూ, రిలేషన్సూ ఎవరయినా వున్నారా?"

ఉహూఁ- ఉన్నా లేరనే చెప్పాలి. చాలా దూరం. పైగా నేనెవరితోనూ ఫ్రీగా కలవలేకపోయాను."

"నువ్వా! నువ్వు కలవలేకపోవటమేమిటి? రాళ్ళతో కూడా మాట్లాడించగలవు."

ఈశ్వరి పెదవులు విడీవిడకుండా చిన్నగా నవ్వింది.

"ఇక నేను వెళ్ళనా?"

"మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావు? ఉంటావా కొన్ని రోజులు?"

"ఉంటాను."

"అలాగే చెబుతుంది. అమెరికా నుండి ఫోన్ వస్తే ఆ రాత్రే ఉడాయించేస్తుంది.

ఈశ్వరి కూడా నవ్వేసింది.

"ఇక్కడే ఉంటావా? మద్రాసు వెళ్ళే ప్రయాణం వుందా?"

"ఏయ్! నువ్వు మద్రాసు వెళ్ళగానే ఇందిరను కలువు. ఇప్పటి వరకూ ఒక్క ఉత్తరమయినా వ్రాయలేదు."

"అలాగే! వెళితే బాగా చివాట్లు పెట్టివస్తాను. మీ దగ్గర అడ్రస్ వుందా?"

"ఉహూం— లేదు. మీ అత్తగారికి వాళ్ళిల్లు తెలిసే వుంటుంది అలా కనుక్కో."

"సర్లే! ఇక అయినట్లే."

"అదేమిటి- అలా అంటావు."

"ఏంలేదు! మద్రాసు ఎప్పుడు వెళతానో ఏమో కదా! అడ్రస్ వుంటే ఉత్తరం వ్రాసేద్దామనుకున్నాను."

"అమెరికాకు వెళ్ళేటప్పుడయినా మద్రాసు వెళ్ళాలిగా. అప్పుడు కలవవచ్చులే."

"అమెరికాకు వెళ్ళాల్సిన అవసరం వుండకపోతే."

"అదేమిటి?"

"అది అంతేలే! అదో పెద్ద మిస్టరీ."

"మిస్టరీ అంటే....?"

"మిస్టరీ అంటే మిస్టరీయే." తమాషాగా భుజాలెగురవేసి కళ్ళు తిప్పుతూ నవ్వింది.

"ఈ సస్పెన్సు ఆపేసి సరిగ్గా చెప్పు...."

"ఏం చెప్పను....చెప్పటానికేమీలేదు. జీరో!"

కుడిచేతిని కొద్దిగా పైకిలేపి చూపుడువేలితో గాలిలోకి సున్నా చుడుతూ అంది.

"ఏమిటి జీరో....?"

"నథింగ్....ఎట్ ది సేమ్‌టైమ్ ఎవ్విరిథింగ్...."

"ఏమిటీ పిచ్చివాగుడు....?"

"ఇది వాగుడు కాదర్రా....నిజం!"

"ఏమిటి ఈశ్వరీ! నువ్వసలు ఏం చెబుతున్నావు? మాకర్థం కా



లేదు."

"నాకూ అర్థంకాలేదు. అందుకే వచ్చేసాను. ఆమె ముఖంలోకి ఎర్రదనం చేరింది.

"ఏయ్! సరిగ్గా చెప్పు! వచ్చేయటమేమిటి? నువ్వేదో దాస్తున్నావు?"

"దాచటానికేమీ లేదర్రా! వెరీ సింపుల్! నేనతనికి నచ్చలేదట.... వెళ్ళిపొమ్మన్నాడు వచ్చేసాను."

నవ్వటానికి ప్రయత్నించింది గానీ నవ్వు రాలేదు. ఆమెకు తెలీకుండానే కళ్ళల్లోకి సన్నటి నీటిపొర కమ్మింది.

రెండు సెకండ్లు ఎవరూ మాట్లాడలేదు.

ఉన్నట్టుండి వాతావరణం ఎవరూ వూహించని స్థితికి మారిపోయింది

ఎవరి గుండెచప్పుడు వాళ్ళకే భయంకరంగా విన్పిస్తోంది.

"నువ్వు చెప్పేది నిజమేనా?"

నమ్మలేకపోతున్నారు. కానీ....ఆ కళ్ళల్లోని తడి-తమాషాగా అనీ అనుకోలేకపోతున్నారు. ఆమెకు గబుక్కున దుఃఖం వచ్చేసింది.

ఏడ్చేసింది.

ఏడుస్తూనే వుంది!

అసలు ఇన్నిరోజులుగా ఈశ్వరికి తన మనసులో ఇంత దుఃఖం దాగి వున్నదనే తెలియదు.

ఆ సంఘటన తననింత బాధించిందని ఆమె గ్రహించుకోలేదు.

ఎదురుచూడని ఆ పరిస్థితికి అందరికళ్ళూ చెమర్చాయి.

ఊపిరాడనట్లుగా, అక్కడెక్కడా ఆక్సిజన్ అనేదే లేకుండా పోయినట్లుగా ఉక్కిరి బిక్కిరయిపోతున్నారు.

ఈశ్వరి ఇంకా ఏడుస్తోంది!

అసలు ప్రపంచంలో సంతోషం, సరదా, ప్రేమ, అనురాగం తప్ప మరేమీవుండవు....ఒకవేళ వున్నాయంటే అవి మార్చుకోవటం చేతకాని అసమర్థతవల్ల వాటిల్లే అనర్థాలే అనే ఈశ్వరి—ఏడుస్తోంది!

ఆమె అలా ఏడుస్తూంటే ఏంచేయాలో తెలీక, ఎలా ఓదార్చాలో

అర్థంకాక బిక్కముఖాలతో ఈశ్వరినే చూస్తున్నారు

కాసేపటికి ఎగిరెగిరిపడుతూన్న ఈశ్వరి దొక్కలు కాస్త సద్దుకున్నాయి.

పమిటచెంగుతో ముఖం తుడుచుకుంది. కర్చీఫ్‌తో ముక్కు తుడుచుకుంటూ తల ఎత్తి స్నేహితులను చూసింది.

వాళ్ళు తననే చూస్తున్నారు.

వాళ్ళ కళ్ళల్లో-తనపట్ల ఆపేక్ష!

తన ఆవేదనకు స్పందించిన తడి!

నవ్వింది ఈశ్వరి.

తడి ఆరని కళ్ళు, ఎర్రబారిన ముక్కు, కొద్దిగా చెదిరిన ముంగురులు—

నెమ్మదిగా చేయిచాచి ఈశ్వరి చేతిని అందుకుంది ఆనంది.

"అసలేం జరిగింది ఈశ్వరీ?"

"నాకే తెలీటంలేదు. నిజం! మీకెలా చెప్పాలో అసలు తెలియటంలేదు."

క్షణాలు, సెకండ్లు నిశ్శబ్దంగా జరిగిపోతున్నాయి.

"అతనికీ, నీకూ ఏమైనా గొడవ జరిగిందా....?"

"ఊహూఁ-అలాంటిదేంలేదు...."

"మరి....? మరెందుకలా చెప్పాడు....?"

ఈశ్వరి మాట్లాడలేదు.

"నువ్వు నచ్చకపోటమేమిటి....కాలులేదా! చెయ్యిలేదా! ఆస్తిలేదా. అంతస్థులేదా! అందంలేదా! ఎందుకు నచ్చలేదు....? అయినా నచ్చలేదని చెప్పటానికి అమెరికా దాకా తీసుకెళ్ళాడా....ఈడియట్!" కోపంగా అంది ఊహ

"ఊహా! తొందరపడి మాట జారకు." ఆనంది హెచ్చరించినట్లుగా చెప్పింది.

"నచ్చలేదనటం ఇడియాటిక్ కారణం కాదూ! అసలు నచ్చకపోవటమేమిటి! నచ్చలేదా—ఆ విషయం వచ్చి చూసినప్పుడే చెప్పవచ్చుగా....!"



ఎవరూ ఏం మాట్లాడలేకపోతున్నారు.

ఊహను మందలించారేగానీ తనన్నదాంట్లో నిజం లేకపోలేదు.

చేతులు వెనక్కుపెట్టి అటూ-ఇటూ పచార్లుచేస్తున్న ఊహ తనలో తనే అనుకుంటూన్నట్లుగా పైకే అంటోంది.

"నచ్చలేదుట! నచ్చలేదు! తాళి కట్టాక నచ్చలేదని చెప్పటానికి ఇదేమయినా బొమ్మలపెళ్ళా! అమెరికా పెళ్ళా?"

అనిత అడుగుతోంది- "అయినా అతడలా అంటే నువ్వెలా వూరుకున్నావు ఈశ్వరీ?"

"ఏం చేయను....నాకూ అతను నచ్చలేదు. అయినా నాన్నగారు 'రూపానిదేముందమ్మా! మనిషికి కావలసింది గుణంగానీ' అన్నారు. నిజమే! 'వెస్ట్ ఇండీస్ వివిన్ రిచర్డ్స్' అంటే నాకెంతో ఇష్టం....అలాంటిది భర్తను ఇష్టపడలేకపోతానా అని నన్నునేను సమాధానపర్చుకుని పెళ్ళిచేసుకున్నాను. అందరిలాగానే గంపెడు ఆశలతో, బండెడు కోరికలతో అత్తగారింటికి వెళ్ళాను. అక్కడ...."

"ఊఁ—అక్కడ ఏమయింది?"

భావరహితంగా చూసింది ఈశ్వరి.

"అసలు పెళ్ళయ్యాక అత్తగారింటికి వెళ్ళావుగదా! అక్కడేం జరిగింది? మద్రాస్‌లో వుండగా అతడు నీతో బాగానే వున్నాడా?"

"ఊహూఁ-లేదు...."

"లేదా....! మరి అలాంటప్పుడు ఇక్కడ వుండగానే అమ్మానాన్నలతో చెప్పి వుండేవని."

"అప్పుడు నాకూ తెలియలేదు ఆనందీ. నేనూ గమనించుకోలేకపోయాను పైగా అంతా హడావుడి! ఆ వెంటనే అమెరికా వెళ్ళటం—ప్చ్! తెలీలేదు."

"మీ అమ్మగారు కూడా కనిపెట్టలేకపోయారా? ఎవరికీ అనుమానమే రాలేదా?"

"అనుమానమంటే-అక్కడ సత్యన్నారాయణవ్రతం అని నాతో పాటు అమ్మ, నాన్న, నాన్నమ్మ, అత్తయ్య, మామయ్య, పెద్దమ్మ, పెద

నాన్న అందరూ వచ్చారు. నన్ను మాత్రం మా అత్తగారింట్లో వదిలి వాళ్ళంతా హోటల్‌కి వెళ్ళిపోయారు.

ఆరోజు నాకు బాగా గుర్తుంది. మేము ఇంటికి వెళ్ళేసరికి సుమారుగా ఎనిమిది-తొమ్మిది మధ్యలో అయ్యుంటుంది. వెళ్ళగానే నన్నో గదిలోకి తీసుకెళ్ళి వదిలారు. కాసేపటికి ఓ కుర్రాడు నా సూట్‌కేస్ తెచ్చి ఆ గదిలో పెట్టాడు.

మరికొంచెం సేపటికి ఓ పనిమ్మాయి వచ్చి బాత్‌రూం చూపించి హీటర్ ఆన్ చేసింది. గదిలో ఎ.సి. వేస్తుండగా అడిగాను. "నీ పేరేమిటి?"

అదేదో సైగ చేసింది.

నాకర్థంకాలేదు. మూగపిల్ల కాబోలు అనుకున్నాను. పాపం అన్పించింది.

నా ఒంటిమీద చాలా నగలున్నాయి. నా సూట్‌కేస్‌లోనూ ఉన్నాయి.

ఆ ఇల్లు కొత్త! పైగా పనివాళ్ళు తిరుగుతున్నారు. ఎవరయినా వస్తారేమోనని కొంచెంసేపు ఎదురుచూశాను.

ఊహూ—ఎవ్వరూ రాలేదు.

"వెళ్ళగానే స్నానంచేసి త్వరగా తయారవ్వు. లేదంటే వ్రతానికి ఆలస్యమయిపోతుంది...." అని అమ్మ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

ఓసారి గదిలోంచి బయటకు తొంగిచూశాను. తెలిసిన వాళ్ళెవరూ కనిపించలేదు. ఎవరెవరో హడావుడిగా తిరుగుతున్నారు.

గదిలోపల ఒక్కదాన్నే వున్నాను.

తలుపులు మూసి లోపల బోల్టుపెట్టి బిగించేశాను.

నగలన్నీ తీసి టేబిల్‌పైన పెట్టి సూట్‌కేస్ తెరచి బట్టలు తీసుకున్నాను.

తలంతా పసుపు, బియ్యంతో చిక్కులు పడిపోయి వుంది.

అమ్మ చెప్పింది. బహుశా మీ అత్తగారే తలస్నానం చేయించుతారని అలా అమ్మ చెప్పినట్లు ఎవరూ రాలేదు. నేనే చేసేశాను.

అమ్మ ముందరే చెప్పింది. వ్రతం దగ్గర ఏ చీర కట్టుకోవాలో, ఏ



నగలు పెట్టుకోవాలో.

అమ్మ చెప్పినట్లుగానే తయారయ్యాను.

మిగిలిన నగలన్నీ నా సూట్‌కేస్‌లోకి సర్ది తాళం పెట్టేశాను.

మరోసారి అద్దంలో నా ప్రతిబింబాన్ని చూసుకుని గదిలోంచి బయటకు వచ్చాను.

పనమ్మాయి ట్రేలో కాఫీ కప్పులు పెట్టి తీసుకువెళుతుంది.

"అమ్మగారెక్కడ వున్నారు?" అనడిగాను.

అది మాట్లాడలేదు. రమ్మని సైగ చేస్తూ ముందరకు తీసుకెళ్ళింది.

నాకు వింతగా అన్పించింది.

ఇదేమిటి! పని వాళ్ళందరూ మూగవాళ్ళేనా అనుకున్నాను.

నాలుగడుగులు వేస్తే ఓ పెద్ద హాలు!

ఆ హాలునిండా జనం వున్నారు. వ్రతం జరిగే స్థలం అదే కాబోలు. ఓ ప్రక్కగా చక్కగా అలంకరించిన మండపం ఉన్నది. దానికి ఎదురుగా జంపఖానాలు పరిచి వున్నాయి. కొంతమంది కూర్చుని ఉన్నారు. మరికొంతమంది అక్కడక్కడా గుంపులుగా, నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. నన్ను చూడగానే 'పెళ్ళికూతురు పెళ్ళికూతురు' అనుకున్నారు. అలా అందరూ తలలుతిప్పి నావైపు చూస్తుంటే, నాకు నడపటమే చేతకాలేదు.

ఆ హాల్లోనే ఓ ప్రక్కగా ఉన్న మెట్ల దగ్గరకు తీసుకెళ్ళి పైకి చూపించింది.

నేనూ మెల్లిగా మెట్లెక్కి పైకి వెళ్ళాను.

ఎడమ చేతివైపు ఖరీదైన సోఫాలు! కుడిచేతి వైపున రోజ్‌ఉడ్ ఉయ్యాల వున్నది. దానికవతలగా ఓ సందు కన్పించింది. అటువైపుకు వెళ్ళాను.

ఆ సందులో ఎడమవైపుకు విశాలంగా వున్న పెద్ద బాల్కనీ, కుడివైపున తలుపులు మూసి వున్న రెండు గదులూ కనిపించాయి.

అక్కడ మనుషులెవరూ కన్పించలేదు.

ఇల్లు చాలా బాగుంది. ఇంటికన్నా ఆ ఇంటిని అలంకరించిన పద్ధతి ఇంకా బాగుంది' ఆ ఇంటికోసమే చేయించినట్లుగా ఎక్కడికక్కడ సరిగ్గా

అమరిన ఫర్నిచరు, పింగాణీ తొట్టెల్లో గుబుర్లుగా పెరిగిన మొక్కలు చాలా బాగున్నాయి.

ఇల్లంతా అగరువత్తుల పరిమళం కాబోలు కమ్మగా వుంది.

అందంగా వుండే ఇళ్ళన్నా, మొక్కలన్నా నాకిష్టం. అక్కడ ఆ రెండూ నాకు కన్పించగానే కొత్త మర్చిపోయి, ఆ మొక్కలన్నీ చూస్తున్నాను. మట్టితొట్లు కన్పించకుండా రంగు రంగుల క్రోటన్స్‌తో అరేంజ్ చేసిన ఆ ప్రదేశం అందమైన డిజైనుతో ఉన్న కాశ్మీరు కార్పెట్ లా లాగా వుంది.

నాకు చాలా నచ్చింది. ఆ మొక్కల్నే చూస్తున్నాను. ఇంతలో ఓ గది తలుపులు తెరుచుకున్న శబ్దం, వెంటనే మాటలూ విన్పించటంతో మొక్కల పక్కనుండీ తలవంచి చూశాను.

తలుపు సందులో మా అత్తగారున్నారు. లోపల వున్నది ఎవరో నాకు తెలియలేదు.

కాని ఆవిడ అంటోంది-"చూడూ! నీకిప్పటికి చాలాసార్లు చెప్పాను. ఇహ నాకు ఓపికలేదు. నా ఓర్పుని పరీక్షించకు. నీ చిరుబురులు ఆపేసి ఐదు నిమిషాల్లో తయారై క్రిందకు రావాలి. లేకుంటే ఆరో నిమిషంలో ఏం జరుగుతుందో బాగా తెలుసుకదా జాగ్రత్త."

ఆవిడ హైహీల్స్ శబ్దం క్రిందకు వెళుతూన్నట్లు తెలుస్తోంది.

నేనక్కడే నిలబడిపోయాను. ఆవిడ అంత ఖచ్చితంగా, హెచ్చరిస్తూ ఎవరితో మాట్లాడారో నాకు తెలియలేదు.

ఇంతమంది ఇంట్లో వుండగా ఈ సమయంలో ఆవిడ అంత కరాఖండిగా మాట్లాడవలసిన అవసరం ఏమై వుంటుంది. ఆ తలుపులవైపు చూశాను.

అవి అప్పటికే మూసేసుకున్నాయి.

ఓ క్షణం ఆ తలుపులను తోసి లోపల ఎవరున్నారో చూడాలనిపించింది.

వెంటనే నన్ను నేనే మందలించుకుని క్రిందికి దిగి వచ్చేశాను.

ఎటువైపు వెళ్ళాలో, ఎవరి దగ్గరకు వెళ్ళాలో తెలియలేదు. అమ్మ



వాళ్ళు ఇంకా వచ్చినట్లు లేరు.

హఠాత్తుగా నాకెందుకో చాలా నీరసంగా అన్పించింది. ఉదయం నుండీ ఏమీ తాగలేదు-తినలేదు. అసలు ఉదయంనుండీ ఏమిటీ నిన్నరాత్రి కూడా నాకేం పెట్టలేదు. అలా గుర్తుకొచ్చేసరికి చాలా ఆకలన్పించింది.

అక్కడున్నవారెవరూ నాకు తెలియదు.

అంతా కొత్త!

నేనా ఇంటికి కోడలిగా వచ్చాను.

అయినా నన్నెవరూ పట్టించుకోవటంలేదు. ఎవరికివాళ్ళు హడావుడిగా తిరుగుతున్నారు. అక్కడ కూర్చున్న వాళ్లు మాత్రం నన్నేదో ఎగ్జిబిషన్ లోని వస్తువులా చూస్తున్నారు.

నేనూ అక్కడికే వెళ్ళి వాళ్ళకు దగ్గరగా కూర్చున్నారు. నేను కూర్చునేసరికి నా ప్రక్కనే ఉన్న ఓ పాప గబుక్కున లేచి అవతలకు వెళ్ళిపోయింది.

ఇపుడు నేను వేరుగా, ప్రత్యేకంగా కన్పిస్తున్నాను. అప్పటికే అక్కడ వున్న అందరూ నావైపే చూడటం గమనించుతూనే వున్నాను.

ఇదివరకు కాలేజీలో అయితే అలా అందరూ నావైపు చూడటం చాలా ఇష్టంగా వుండేది.

అందరిలో ప్రత్యేకంగా కన్పించాలని కోరుకునేదాన్ని కూడాను.

కానీ ఇపుడు అలా అందరూ నావైపే చూస్తుంటే నాకేదో ఇబ్బందిగా అన్పించింది.

పైగా ఇంత ఖరీదయిన చీర కట్టుకుని, ఒంటినిండా నగలు దిగవేసుకుని ఎలా కనిపిస్తున్నానో, ఏమిటో....అందరూ అలా చూస్తుంటే—ఆ పరిసరాల్నుంచీ ఆ మనుషుల మధ్యనుంచీ ఎక్కడికయినా పారిపోవాలన్పించింది.

కానీ విచిత్రంగా అక్కడ్నుంచీ ఏమాత్రం కదల్లేకపోయాను. అలా ఇంకొంచెంసేపుంటే నేనేమయ్యేదాన్నో, ఏం చేసేదాన్నో ఈలోపున మా అత్తగారి గొంతు ఖంగుమంది.

"గదిలో ఈశ్వరి లేదేమిటి?"

చటుక్కున లేచి నిలబడ్డాను.

ఆవిడ చూపులు నాపై పడ్డాయి.

"నువ్విక్కడున్నావా?" అంటూనే నన్ను పైనుంచీ క్రిందవరకూ ఒక్కసారి ఎక్స్‌రే తీసినట్లు చూసేసింది

'ఇలారా' నాచేయి పట్టుకుని బరబరా అవతలకు లాక్కెళుతోంది.

అక్కడ వరుసగా కూర్చుని టిఫిన్ తింటున్నారు. ఉప్మా, గారెలు, కొబ్బరిపచ్చడి-వాసనలు ఘుమఘుమలాడుతున్నాయి.

అసలే ఆకలిగా వున్న నాకు బ్రహ్మాండంగా వస్తూన్న ఆ వాసనలకు వెంటనే అక్కడకి వెళ్ళిపోయి ఆ పంక్తిలో కూర్చుని కడుపునిండా తినాలని పిస్తోంది.

కానీ నాచేయి ఆవిడ చేతిలో వుంది. ఆవిడ నన్నో మనిషిని తీసు తున్నట్లుగా తీసుకెళ్ళటంలేదు.

ఓ లేగదూడను మెడలో తాడుకట్టి లాక్కుపోతున్నట్లుగా బరబరా లాక్కెళ్ళిపోతూన్నది.

"చూడూ! నీ ఈ నగలు, చీరలెలా తేలిపోతున్నాయి. ఇప్పుడు మద్రాసులోని గొప్పగొప్ప వాళ్ళంతా వస్తారు. అందరిలోకీ నువ్వు ప్రత్యే కంగా కన్పించాలి. కొంచెం మేకప్ వేసుకో! దర్జాగా తయారవ్వాలి తెలి సిందా?"

ఆవిడ వెళ్ళిపోయింది.

మిలటరీ కమాండర్ చెప్పినట్లుగా చెప్పిన ఆమె మాటలకు నాకు చాలా నీరసం వచ్చేసింది.

అసలే ఆకలేస్తూన్నది!

పైగా ఇవన్నీ మార్చుకునేసరికి నాకొంచెం విసుగు కూడా అని పించింది.

అలా ఆ గది మధ్యలో నిలబడిపోయిన నాకు నామీదా, అమ్మమీదా చాలా చిరాకనిపించింది.

బయటకు వచ్చాను.

అమ్మ అప్పుడే వచ్చింది కాబోలు, కన్పించింది.



'అమ్మయ్య' నాక్కాస్త ధైర్యం వచ్చింది.

అమ్మ నన్ను చూడగానే తృప్తిగా నవ్వింది.

కాని మా అత్తగారు ఒప్పుకోలేదే!

అమ్మను గదిలోకి తీసుకెళ్ళి చెప్పాను-

'అలాగా' అంటూ ఆమె నాపెట్టె తెరిచి వేరేబట్టలు తీసింది.

అమ్మ నన్ను తీసుకొచ్చి పీటమీద కూర్చోబెట్టింది.

బ్రాహ్మణుడు నా చేతిలో నీళ్ళుపోసి "కేశవాయస్వాహా" అన న్నాడు.

ఈ రెండురోజులుగా ఈ పూజలూ, మంత్రాలూ బాగా అలవాటయి పోయి కెమిస్ట్రీ కొటేషన్లు లాగా బుర్రలో నాటుకుపోయాయి.

కాసిని అక్షింతలూ, పువ్వులు నా చేతికిచ్చి పట్టుకోమన్నారు.

సడెన్‌గా గుర్తుకొచ్చింది,'అయ్యయ్యో! నేనేమీ తినలేదే' అని.

అలా గుర్తుకొచ్చినపుడల్లా ఆకలి ఒక్కోమెట్టూ పెరిగిపోతోంది.

ఆకలొకటీ, నొప్పులొకటీ గుర్తుకొస్తే చాలు పట్టుకుని జిడ్డులా వద లవు. అలా ఆలోచిస్తూనే శాస్త్రిగారు చెప్పినట్లు చేస్తున్నాను.

అతడూ వచ్చి నా ప్రక్కనే పీటమీద కూర్చున్నాడు.

గణపతి పూజ అయింది. లక్ష్మీపూజ చేయించుతున్నారు. నా పక్కనే వున్న తేజా అటూ ఇటూ కాళ్ళు మార్చుకుంటూ నిమిషానికోసారి కదిలి పోతూ అవస్థపడుతున్నాడు.

'పాపం అలవాటులేక కొంతా, క్రింద కూర్చోవటం కొంతా ఇబ్బం దిగా వుంది కాబోలు' అనుకున్నాను.

అక్కడ ప్రసాదాలుగా పెట్టిన అరటిపండ్లు, బత్తాయిలు, ఆపిల్స్. సీడ్‌లెస్ దానిమ్మలూ-అవన్నీ చూస్తూంటే నా మనసు శాస్త్రిగారి మంత్రాలు వినటం మానేసి ఆకలి గురించి ఆలోచిస్తోంది.

అక్కడ కూర్చోవటంలోనూ, పూజచేసే సందర్భంగా ముందుకు వంగినపుడూ వడ్డాణం గుచ్చుకోవటమూ, తేజాని తాకటమూ జరుగు తోంది.

కొద్దిగా తలతిప్పి అతడివంక చూసాను.

అప్రసన్నంగా, అసహనంగా, చిరాకుగా నిప్పులమీద కూర్చున్నట్లుగా వున్న అతని ముఖం చూడగానే నా మనసు పాలపొంగుమీద నీళ్ళు చిలకరించినట్లుగా ముడుచుకుపోయింది.

అంతలోనే పాపం-ఈ చెమట, ఈ మంత్రాలూ, ఈ పొగ-చిరాగ్గా ఉండేమోలే అని సరిపెట్టుకున్నాను.

పూజ అయిపోయింది!

శాస్త్రిగారు కథ మొదలెట్టారు.

"అమ్మా జాగ్రత్త వినండి" అంటూ కాస్త అక్షింతలు, పువ్వులా చేతుల్లో పెట్టారు.

'ఆహాఁ కాబోలు' అనుకుని నవ్వుకుని కూర్చుని వినటానికి రెడీగా వున్నాను.

"నాన్సెన్స్" విసుక్కుంటున్నాడు తేజ.

నాకు నవ్వు వచ్చింది.

నవ్వబోయి అక్కడ చాలామంది వున్నారన్న సంగతి గుర్తుకొచ్చి ఆగిపోయాను.

శాస్త్రిగారు ఆయనకు వచ్చిన పాండిత్యమంతా ప్రయోగించి దీర్ఘాలు తీస్తూ మధ్య-మధ్యలో పాటలు పాడుతూ కథ చెబుతున్నారు.

మొదట కొంచెం ఇంట్రెస్టుగానే విన్నానుగానీ తర్వాత తర్వాత విసుగనిపిస్తోంది.

నాకు తెలీకుండానే నెమ్మదిగా కళ్ళు మూతలు పడుతున్నాయి.

నేనసలు మామూలుగానే ఆకలికీ, నిద్రకీ కొంచెంసేపు కూడా ఆగలేను. అలాంటిది నిన్నటినుంచీ నాకు ఆ రెండూ కరువైపోయాయి.

చిత్రంగా నిద్ర ముంచుకొచ్చేస్తున్నది.

నన్ను నేను సమ్హాళించుకోవటానికి చేస్తూన్న ప్రయత్నంలో ఓడిపోతున్నాను.

చదువుకునే సమయాల్లో కాస్త నిద్ర అనిపిస్తే అటూ-ఇటూ తిరిగితే నిద్ర తేలిపోతుంది!

ఇపుడు లేవటానికీ లేదు, ఎవరితోటయినా మాట్లాడటానికీ లేదు.



అందుకే-నిద్రాదేవి స్వేచ్ఛగా లొంగదీసుకుంటోంది!

నిద్రకూ, ఆకలికీ- సిగ్గూ, సుఖమూ తెలియదంటారు.

నిజమే అయ్యుంటుంది.

శాస్త్రిగారి మంత్రాలు ఉన్నట్టుండి దూరంగా విన్పిస్తున్నాయి.

మగతగా అన్పిస్తోంది.

కెవ్వున అరవబోయి తమాయించుకుని కళ్ళు బలవంతంగా పెద్దవి చేసుకుని అటూ-ఇటూ చూసాను.

నాక్కాస్త వెనకగా కూర్చున్నావిడ ఎవరోగానీ నా భుజంమీదికి వంగి చెప్పింది-

"నిద్రపోతున్నావు అందుకని గిల్లాను-సారీ! నొప్పిపుట్టిందా?"

ఆమె గిల్లినచోట నిజంగానే నొప్పిగా అన్పించింది. అయినా నవ్వి "థాంక్స్" అన్నాను.

చేతికి తోరణం కట్టించుకున్నాను.

శాస్త్రిగారు నించుని ప్రదక్షిణ నమస్కారం చేయమన్నారు.

లేచి నిలబడ్డాను.

'అమ్మో! కాళ్ళు పట్టేసినట్లున్నాయి'

నాకే ఇలా వుంటే పాపం అతనికెలా వుందో అనుకున్నాను.

ఎవరోగానీ నేను కూర్చున్న పీటను వెనక్కి లాగారు.

థాంక్స్ అనుకున్నాను.

మొదటి చుట్టు తిరగగానే కళ్ళు తిరగటం మొదలై, మూడో చుట్టు తిరిగేసరికి ఆ హాలూ, ఆ మనుషులూ అందరూ గిరగిరా తిరిగేస్తున్నారు.

అమ్మ బట్టలు తెచ్చి బొట్టుపెట్టి ఇచ్చింది. శాస్త్రిగారు-"బట్టలు మార్చుకురామ్మా" అన్నారు. అమ్మ నా చేతిలోని బట్టలు తీసుకుంది.

గదిలోకెళ్ళాక అమ్మ నడిగాను-

"చీర మార్చుకోవాల్సిందేనా?"

అమ్మ నవ్వింది.

"విసుగ్గా వుందా?"

"చాలా....?"

"పోనీలే! ఇహ కొంచెంసేపు ఓపిక పడితే అన్నీ అయిపోతాయి" అంది.

"ఇది మూడోసారి ఎగ్జిబిషన్" అన్నాను అమ్మ ఇచ్చిన బట్టలు వేసుకుని నగలు మార్చి పెట్టుకుంటూ.

అమ్మ నవ్వింది.

పూజ అయిపోయింది.

ప్రసాదం పెట్టారు.

బాగా ఆకలిగా వున్న పొట్టలోకి శాంపిల్‌గా ప్రసాదం వెళ్ళేసరికి వున్నట్టుండి ఆకలి మరీ ఎక్కువైపోయింది.

మా అత్తగారు ఎవరెవర్నో తీసుకొచ్చి పరిచయం చేస్తున్నారు.

కాస్త దూరంలో కూర్చునివున్న వాళ్ళ దగ్గరకు తీసుకెళ్ళి పరిచయం చేస్తున్నారు.

వరుసగా నడుస్తూ ఒక్కొక్కరికీ నమస్తే చెబుతూంటే నా చేతులు ఆ నమస్తే పోజులో బిగుసుకుపోయాయా అన్పించింది.

అంత హడావుడిలోనూ ఆవిడగారు తన మేకప్‌లోనూ, చీర కట్టుకోవటంలోనూ, నగలు పెట్టుకోవటంలోనూ ఎంతో శ్రద్ధ తీసుకున్నట్లుగా గమనించాను.

అందరో భోజనాలకు లేస్తుంటే నేనూ లేచాను. "నువ్వు తేజతో కలిసి భోజనం చేయాలి. ఇక్కడే కూర్చో" అని వెళ్ళిపోయింది అమ్మ.

నాకు ఎక్కడలేని ఉక్రోషమూ, చిరాకూ, ఉడుకుమోత్తనమూ వచ్చేశాయి.

"నాక్కాస్త అన్నం పెట్టండి" అని బిగ్గరగా అరవాలనిపించింది. మామయ్య వచ్చాడు.

"ఏమిటి ఒంటరిగా కూర్చున్నావు?"

అందరూ హడావుడిగా వున్నారు. నాకేం పని లేదుగా" అన్నాడు.

"భోంచేశావా?" అని అడిగాడు మామయ్య.

"లేదు....మీరు చేశారా?"

"ఇంకాలేదు. వెళుతుంటే నువ్వు కన్పించావు. వస్తావా?"



అమ్మ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. వెంటనే నాకేదో తిక్కలాంటిది కూడా కలిగింది.

ఓ పక్క ఆకలీ, మరో పక్క నిద్రా ఎడా పెడా వాయించేస్తూంటే నేనిలా ఎంతసేపు వెయిట్ చేయాలి?

అంతే....!

మామయ్యతో కలిసి వెళ్ళిపోయాను.

అక్కడ నాన్నగారు కూడా కన్పించారు.

అప్పటివరకూ మనసులో ఓ మూల ఎక్కడో కాస్త భయం ఉన్నా అది ఆయన్ని చూడగానే పారిపోయింది.

చప్పున ఆయన దగ్గరకు వెళ్ళాను.

ఓ ప్రక్కన నాన్నగారు మరో ప్రక్కన మామయ్య, మధ్యలో నేను.....

తినటం మొదలుపెట్టేవరకూ నాకు అనుమానమే!

ఎక్కడ ఎవరు వచ్చి నన్ను పిలుస్తారో అని.

నాన్నగారు మామయ్యతో చెబుతున్నారు.

"ఈ రాత్రికి మన వాళ్ళందర్నీ తీసుకుని నువ్వెళ్ళిపో! రేపు ఎర్లీ మార్నింగ్ ఈశ్వరీ అల్లుడుగారూ వెళ్ళాక మేము బయలుదేరి వచ్చేస్తాము."

* * * *

భోజనాలయిపోయాయి.

వచ్చిన వాళ్ళందరూ వెళుతుంటే మా అత్తగారు తాంబూలం ఇస్తున్నారు.

అవేమిటో కుండలు లాగా వున్నాయి. పసుపు కుంకుమలు వేసివున్న ఆ కుండను పట్టుకోటానికి ఓ తాడూ-

నాకు నవ్వొచ్చింది.

'ఇక్కడి ఫ్యాషన్ ప్రపంచంలో ఇదీ ఒక భాగమేమో' అనుకున్నాను.

దాదాపు అందరూ వెళ్ళిపోయారు.

అమ్మ, నాన్నగారూ అత్తగారితో చెప్పి వెళదామని చూస్తే ఆవిడ కన్పించలేదు.

ఇంతలో మా మామగారు వచ్చారు.

"అలాగేనండి. కాసేపు రిలాక్స్ అయ్యాక రండి" అన్నారు.

"రేపు మార్నింగ్ వీళ్ళ ఫ్లైట్ ఎన్నింటికి!"

"తొమ్మిది గంటలకు. కాకపోతే ఏడున్నరకే రిపోర్టివ్వాలి."

"రాత్రికి అందరూ ఇక్కడికి భోజనానికి రండి" అని చెప్పారు ఆయన.

"మళ్ళీ రాత్రికి కూడా ఎందుకులెండి" అన్నారు నాన్న.

"భలేవారు! అంత మొహమాటం అయితే ఎలాగు?"

అమ్మ నా చేయి పట్టుకుంది.

అప్పటివరకూ నాన్నగారినీ, మామగారినీ మార్చి మార్చి చూస్తున్న నేను తలతిప్పి అమ్మ వంక చూశాను.

"జాగ్రత్త! నీ సూట్‌కేస్ అంతా సర్దే వుంది. ఈ నగలన్నీ తీసి బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకో! మీ అత్తగారితో చెపితే ఆవిడ జాగ్రత్త చేస్తారు."

నేను ఊc-అన్నాను.

అమ్మ కళ్ళల్లోనికి నీళ్లు వచ్చాయి.

నాకూ దిగులు అన్పించింది.

వాళ్ళు వెళ్ళిపోతే నేను ఒక్కదాన్నే వుండాలి.

"నేనూ రానా మీతో?"

"నువ్వు ఇక్కడే వుండాలి..... అత్తగారింట్లో నిద్ర చేయాలి అంటారు."

"మీరు మళ్ళీ సాయంత్రం వచ్చేటప్పుడు వస్తానుగా."

"ఉహూc..... మేము రాము."

"అవునా?" నానమ్మ దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంటూ అంది "జాగ్రత్త!"

అత్తయ్య, మామయ్య, పెద్దమ్మ, పెదనాన్న అందరూ పీడ్నోబ్బి తీసుకుని వెళ్ళిపోయారు.



అంత పెద్ద పందిట్లో నేను ఒక్కదాన్నే మిగిలిపోయాను.

మా మామగారు "రామ్మా లోపలకు అన్నారు. లోపలకు వచ్చాను.

పూజ చేసిన స్థలం అంతా శుభ్రం చేస్తున్నారు. హాలంగా ఖాళీగా వుంది.

పని అమ్మాయిని "అత్తమ్మ ఎక్కడ?" అనడిగాను.

అదేదో సైగ చేసింది.

"ఈ మూగ భాషలేమిట్రా బాబూ" అనుకుంటూ గదిలోకి వెళ్ళిపోయాను.

నేనసలు ఒంటరిగా వుండలేను. నలుగురి మధ్య తిరుగుతూ, వాగుతూ వుండాలి. అలాంటిది ఆ కొత్త ఇంట్లో, ఓ గదిలో ఒంటరిగా వుండడమంటే ఏదో జైల్లో వున్నట్లే వుంది.

ఒళ్ళంతా జిడ్డు జిడ్డుగా, చిరాగ్గా వున్నట్లనిపించింది.

నగలన్నీ తీసి అమ్మ చెప్పినట్లు సర్దేశాను. స్నానం చేశాను.

గదిలో ఏ.సి. చల్లదనం హాయిగా వుంది. వదులుగా జడ వేసుకుని బొట్టు పెట్టుకున్నాను. బట్టలన్నీ పెట్టెలోకి సర్దేశాను.

ఏంచేయాలో తోచలేదు

ఆ గదిలోని అన్ని వస్తువులూ చూశాను.

గజ్జెల గుర్రంలా తిరిగే నేను అలా ఒకే గదిలో వుండేసరికి మహా బోర్ అనిపించింది.

ఆవలింతలు వస్తున్నాయి.

ఇహ ఎప్పుడు పడుకున్నానో నాకు తెలియలేదు. మంచి నిద్ర పట్టేసింది.

* * * *

ఎవరో బాగా కుదిపి కుదిపి లేపుతుంటే కళ్ళు తెరిచాను.

ఎదురుగా అత్తగారు.

"లేచి రెడీ అవ్వు."

ఓ క్షణం ఆవిడెవరో నాకర్థంకాలేదు. అసలు.... ఆ గది....ఆ

మంచం....ఆ గోడలు....ఆ కర్టెన్లు అన్నీ కొత్తే!

'ఇక్కడ నే నెందుకున్నాను!'

"త్వరగా రెడీ అవ్వు...." అత్తగారి కంఠం ఖంగుమంది.

అప్పటిగ్గానీ నిద్రమత్తు వదల్లేదు.

ఆ మత్తునీ, బద్ధకాన్నీ వదిలించుకుని చూచేసరికి ఆవిడ వె
పోయారు.

నేను మంచం దిగాను.

టైము చూస్తే అయిదున్నర అవుతోంది.

గదిలో లైటు వెలుగుతోంది.

నేను పడుకునే ముందు టైము చూడలేదుగానీ అమ్మా వా
వెళ్ళేటప్పుడు మూడున్నర దాటినట్లు గుర్తు! అంటే దాదాపు రెండుగంట
నిద్రపోయానన్న మాట' అనుకున్నాను.

బాత్‌రూమ్‌కు వెళ్ళి వచ్చాను.

నాక్కొంచెం వేడిగా టీ తాగాలన్పించింది.

గదిలోంచి బయటకు వచ్చాను.

ఇల్లంతా లైట్లువేసి వున్నాయి.

నాకెవరూ కన్పించలేదు.

ఇంకాస్త ముందుకు వెళ్ళాను.

వంటగది కన్పించింది.

"మామ్మా" స్టీలుగిన్నెలన్నీ సర్దుతూన్న ఓ వయసు మళ్ళిన
అక్కడ వుంటే పిలిచాను. పాపం ఆవిడ ఉలిక్కిపడింది.

నన్ను చూసి నవ్వింది.

నాకు టీ కావాలి అని అడిగాను.

చప్పున స్టౌ వెలిగించి నీళ్ళు పెట్టింది.

"ఎవరూ కన్పించటం లేదేమిటి?" ఇల్లు చాలా నిశ్శబ్దంగా వుండ
గమనించి అడిగాను.

"ఇంకా ఎవరూ లేవలేదమ్మా." నాకు టీ తెచ్చిచ్చింది?

'లేవలేదా!' బయటకు చూశాను.



లేత వెలుతురుగా వుంది.

"లేవకపోవటమేమిటి?" సందేహంగా అడిగాను.

"నిన్నంతా హడావుడిగా పనిచేసి అలసిపోయారు కదమ్మా! అందు
కని ఇంకా ఎవరూ లేచి వుండరు" అంది.

నాకు ఆశ్చర్యం వేసింది. అప్పటికిగాని నాకు కొంచెం కొంచెంగా
అర్థంకాలేదు. అది సాయంకాలం కాదనీ, మరునటిరోజు ఉదయం అనీ
అర్థమయ్యేసరికి హడలిపోయాను.

"అమ్మో! అమ్మా వాళ్ళు ఆరుగంటలకల్లా వస్తామన్నారు." గది
వైపుకు పరుగెత్తాను.

ఎప్పుడూ లేనంత వేగంగా పనులు పూర్తిచేసుకుని తయా
రయ్యాను.

అంతసేపు మంచి నిద్ర పోవటం మూలంగానేమో నా కసలు
అలసట అనేదే తెలియకుండా హుషారుగా అన్పించింది.

సూట్‌కేస్ సర్దేసి గుమ్మం ప్రక్కగా పెట్టాను. హాండ్‌బాగ్ కూడా
సర్దుకున్నాను.

బయటకు వచ్చాను.

ఆకాశం నిర్మలంగా వుంది. ప్రశాంతంగా వున్న ఆ వాతావరణం
చాలా ఆహ్లాదంగా వుంది.

నిశ్చలంగా వున్న మబ్బు పొరల మధ్యనుండి క్రొత్త పెళ్ళి
కూతురిలా నెమ్మదిగా పైకి వస్తోంది సూర్యుడి తాలూకూ ఎర్రదనం.

క్రమంగా వెలుతురు వ్యాపించుతూన్న ఆ ప్రభాత సమయాన గేటు
బయట కారు హారన్ విన్పించటమూ, గేటు తెరుచుకోపటమూ, కారు
లోపలకు రావటమూ వెంట వెంటనే జరిగిపోయాయి.

నేను ఒక అడుగు ముందుకువేసి వాకిట్లో నిలబడ్డాను. నాన్నగారు,
మరో ప్రక్కనుండి అమ్మ కారు దిగారు.

నాన్నగారి కళ్ళల్లో స్పష్టంగా తొణికిసలాడుతూన్న ఆప్యాయత!
అది ఎప్పుడూ చూస్తూనే వుంటాను! అయినా సరే....ఎన్ని సార్లు చూసినా
అన్నిసార్లు క్రొత్తగానే వుంటుంది.

అమ్మ వచ్చి నా చేయి పట్టుకుని నెమ్మదిగా నొక్కింది. ఆ స్పర్శ లోంచి పుట్టుకొచ్చిన అనురాగం నా మనస్సుని సున్నితంగా తాకింది.

"అంతా రెడీయేనా! మేము ఆలస్యం చేశామా?"

నేను నవ్వాను.

నాన్నగారికి ఉదయమే కాఫీ తాగటం ఇష్టం! అదీ వేడి వేడిగా.

"కాఫీ తాగారా?" అడిగాను.

"లేదు రా అమ్మా" అన్నారు.

హాల్లో కూర్చోబెట్టి వంట గదివైపు వెళ్ళాను.

రెండు నిమిషాల్లో మామ్మ తయారు చేసిన కాఫీని రెండు కప్పుల్లోకి పోసి ఆమె తెస్తానంటుంటే వారించి నేనే స్వయంగా తెచ్చి అమ్మకు నాన్నగారికీ ఇచ్చాను.

నాకు తెలుసు! అమ్మా, నాన్నా-

నేనులేని లోటు వాళ్ళనెంత క్రుంగదీస్తుందో!

అందరూ వీడ్కోలు చెబుతూంటే నేను ఆయన వెనకాలే పెళ్ళి విమానం లోపలకు వెళ్ళాను—అమెరికా చేరటం కోసం!

నేను బాగా గమనించిన విషయం-

అమ్మా, నాన్నా వచ్చిన వెంటనే మా అత్తగారుగానీ మామగారు గానీ కన్పించలేదు.

ఆ తర్వాత వాళ్ళు క్రిందికి వచ్చాక కూడా ఎప్పుడొచ్చారు అని మామయ్యగారు అడిగారుగానీ, మర్యాదకోసమయినా మా అత్తగారు అమ్మా వాళ్ళతో మాట్లాడలేదు.

ఆ రోజున ఆ విషయాన్ని నేనంతగా పట్టించుకోలేదు. ఎందుకంటే అంటే అందరి ఆడపిల్లలలాగానే పెళ్ళి అవ్వటంతోటే అత్తగారూ మామగారూ నావాళ్ళు ఆ ఇల్లు నాది అనుకున్నాను!

అలాగే అందరిలాగా పెళ్ళి చేసుకున్నాను!

అందరి ఆడపిల్లల మాదిరిగానే నేను కూడా ఆయనతో కలిసి అమెరికా వెళ్ళాను.

దేశంకాని దేశం!



అర్థంకాని భాష!

అలవాటులేని వాతావరణం!

పరిచయం లేని పరిసరాలు!

క్రొత్తదనం వదలని భర్త సహచర్యం!

చాలా కష్టపడ్డాను.

అక్కడ ఇమడలేక పోయాను.

ఆ పద్ధతులకూ, ఆ జీవితానికీ దగ్గరవ్వలేక దూరంగా రాలేక చాలా కష్ట పడ్డాను.

నాకా రోజుల్లో మీరే గుర్తుకు వచ్చేవారు.

చటుక్కున అడిగింది ఊహ.

"అంతగా తెలియని ఆ పనులతో నువ్విబ్బంది పడుతూంటే మీ ఆయనే మీ గైడెన్స్ ఇవ్వలేదా?"

"నువ్వెప్పుడూ నెగెటివ్‌గా ఎందుకు ఆలోచిస్తావు? అసలు మన ఈశ్వరి అడిగిందో లేదో!"

ఇబ్బందిగా నవ్వింది ఈశ్వరి.

"నిజమే! నేనాయన్ను ఏమీ అడగలేకపోయేదాన్ని."

"ఏమి? ఎందువల్ల?"

"ఎందువల్ల అంటే.....ఏం చెప్పగలను!"

అర్థంకానట్లు చూశారు.

"ఆయన నాకా చనువు ఇవ్వలేదు! నేనూ తీసుకోలేక పోయాను."

"నీ భర్త దగ్గర చనువులేకపోవటమేమిటి?"

"అతన్ని నేను భర్తగా అనుకున్నాను. కాని ఆయన నన్ను భార్యగా అంగీకరించలేదు."

"అదేమిటి?"

"అవునర్రా! నేను గాలిలో మేడలుకట్టలేదు! వాస్తవానికి దూరంగా భవిష్యత్తు అంతా బంగారు బాటలా వుంటుందనో, నేనో మహా రాణీలాగా బ్రతకాలనో కలలు కనలేదు. అందరి ఆడపిల్లల్లా నేనూ అమ్మా నాన్నలు చెప్పినట్లు విని పెళ్ళి చేసుకున్నాను. అతడి చెయ్యి పట్టుకుని జీవితంలోకి

ప్రవేశించాను. కాని.... నా కంతదూరం వెళ్ళాక గానీ—అక్కడ నాకు జీవితం పంచటానికి ఆయన సిద్ధంగా లేరు అని తెలిసిరాలేదు."

"ఈశ్వరీ...."

"అవునమ్రా! ఇప్పటివరకూ చెప్పిన నా జీవితం- కేవలం మనలాటి ఓ కన్నెమనసు ఎంత నిష్కల్మషంగా ఉంటుందో తెలియటానికి చెప్పాను. ఆ వయసులో మన ఆలోచనలూ, ఊహలూ, నమ్మకాలూ ఎంత అమాయకంగా, అపురూపంగా, అందంగా, తెలివితక్కువగా వుంటాయో తెలియజెప్పటానికే చెప్పాను."

అర్థంకానట్లుగా చూసారు.

"అవును! నేనన్నది మీకర్థంకాలేదు కదూ! చూడండి- మనకో నమ్మకం, మనకో భరోసా వుంటాయి. అదేమిటంటే- మన బాగోగులు మనకంటే మన పెద్దవాళ్ళకే బాగా తెలుసు అనే నమ్మకం! మన గురించి మనకన్నా మనల్ని కన్నవాళ్ళే ఎక్కువగా ఆలోచించి మంచి జీవితాన్ని మనకందిస్తారనే భరోసా!

మనకు తెలీకుండానే మన ఒంటిమీదికి ఈడు వచ్చి మనమెలా పెద్దవాళ్ళమవుతున్నామో అలాగే మన ప్రమేయం లేకుండానే ఆ నమ్మకమూ, భరోసా కూడా మనలో బాగా పాతుకుపోయి మన రక్తంలో కలిసిపోయి మనకంటే బాగా పెద్దగా పెరిగిపోతున్నాయి.

ఆ రోజున మీ అందరూ అన్ని రకాలుగా అడిగారు. చెప్పారు. కాని నేను కేవలం నాన్నగారి ఆలోచనలపై ఉన్న నమ్మకంతో ఈ పెళ్ళికి అంగీకరించాను.

ఎంగేజిమెంటు రోజునే చాలామంది చాలా రకాలుగా వ్యాఖ్యానాలు చేసారు.

పెళ్ళికొడుకు చిరబురల దొరగారనీ, కొంచెం కూడా ఓర్పూ, మర్యాదా లేనివాడనీ, పద్ధతులు తెలియనివాడనీ అన్నారు.

మళ్ళీ అంతలోనే చిన్నతనంనుండీ అమెరికాలోనే వున్నందువలన ఈ వాతావరణంలో ఇమడలేకపోయాడులే అని సరిపుచ్చుకున్నారు.

అదేమిటోగానీ అప్పట్లో ఎవరికీ కూడా నెగెటివ్ ఆలోచనే రాలేదు.



అతడి రంగుగానీ, మాటగానీ, పద్ధతిగానీ నచ్చలేదు. మా అత్తగారి ధుబూ, ప్రవర్తనా, మాటతీరూ అయితే అసలు నచ్చలేదు అయినాసరే పెళ్ళిపట్ల ఎవరూ అసంతృప్తిని వెలిబుచ్చలేదు.

ఎవరి సంగతో ఎందుకూ- నేను మాత్రం వ్యతిరేకించానా! లేదే! అందరి అభిప్రాయాలూ విన్నాను. అందరి వాదనలూ విన్నాను. నా కళ్ళారా బాగా చూసాను. నిజమె సుమా-నిజమే సుమా అనుకున్నాను.

కానీ వద్దు అని నేనెందుకు చెప్పలేకపోయానో నాకిప్పటికీ అర్థం కాదు.

ఎవరయినా అభిప్రాయాలు చెబుతారు గానీ నిర్ణయాలు చెప్పరు కదా! అది చెప్పాల్సింది మన తల్లితండ్రులు! ఆ నిర్ణయాలు తీసుకోవలసింది మనమూను.

నేనేమీ చిన్నపిల్లనూ కాదు. తెలియనిదాన్నీ కాదు. స్వతంత్రం లేనిదాన్నీ కాదు. మరి ఎదురుచెప్పలేకపోయాను చూడండి!

అంత అనుభవం వున్న నాన్నగారూ సందేహించలేకపోయారు.

ఏదో తరుముకొస్తూన్నట్లుగా అందరూ అలా మైకంలో పడిపోయారు.

అతడేదో అందుకోలేని చందమామా కాదు, మనం చెల్లని కాణీయూ కాదు. అయినా సరే వాళ్ళ మోజులో పడిపోయాము.

ఒక్కమాట-ఒకే ఒక్కమాట- "వద్దు నాన్నగారూ! నాకీ పెళ్ళి ఇష్టంలేదు అని వుంటే నాన్నగారు ససేమిరా ఈ పెళ్ళి జరిగి వుండేది కాదు. మరి నా నోరు ఎందుకా సమయంలో అలా మూతబడిపోయిందో నాకిప్పటికీ అర్థంకాదు.

ఖర్మ అనుకోవాలి. అంతే!

తల్లి ఒడిలో వుండగా ఎలాంటి భయమూ లేకుండా నిశ్చింతగా నిద్రపోయినట్లే నా జీవితంలో ఏవో చీకటి దెయ్యాల్లాంటివి కాచుకూర్చున్నాయనీ, కాటేస్తాయనీ సర్వనాశనం చేస్తాయనే భయం ఏమాత్రం లేకుండా నాన్నగారి సమక్షంలో అతడితో ముడివేయించుకున్నాను.

ఎంగేజిమెంటు అప్పుడూ, పెళ్ళిపీటలమీద కూర్చున్నప్పుడూ,

మాంగల్యం తంతునానేన అంటూ తాళి కడుతున్నప్పుడూ, సత్యనారాయణ వ్రతం జరిగేటప్పుడూ, చివరకు అమెరికా వెళ్ళేరోజున ఏర్‌పోర్టుకు వెళ్ళేటప్పుడు కూడా అతని ముఖాపం స్పష్టంగా తెలుస్తూనే వుంది. నా మనసు ముడుచుకుపోతూనే వుంది.

మరి మనదేశపు గడ్డమీద వుండగా నేనెందుకు అనుమానించలేదో నాకే అర్థం కాదు.

నన్ను తీసుకెళ్ళి అక్కడ అతడి అపార్టుమెంటులో వదిలేసి అతడు వెంటనే కారు తీసుకుని వెళ్ళిపోయాడు.

అతడు నాకేమీ చెప్పలేదు.

ఎక్కడికెళ్ళాడో తెలియదు.

నాకేం చేయాలో తోచలేదు.

అసలెందుకు నాతో మాట్లాడడు.

ఇంటిదగ్గర అంటే పోనీ క్రొత్త-

ఇంటినిండా బంధువులు అనుకోవచ్చు.

కానీ ఫ్లయిట్‌తో—

అన్ని గంటలు అతడితో ప్రయాణం చేస్తే నిద్రపోవటమూ, మేగజైన్లు చదవటమూ తప్పించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

ఇంటికి వెళ్ళగానే అతడు అలా వెళ్ళిపోయేసరికి గుండెల్లో ఇన్నిసార్లుగా అస్పష్టంగా తిరుగాడుతూన్న ఓ భావం నా బుర్రకు తిన్నగా ఓ ప్రశ్న వేసింది.

'అసలీ పెళ్ళి అతడు ఇష్టపడే చేసుకున్నాడా?'

వెంటనే జవాబులాటి ప్రశ్న.

'ఇష్టం లేకపోతే ఎందుకు చేసుకుంటాడు?' దానికి జవాబుగా నా మనసు ఎదురుతిరిగి నన్నే ప్రశ్నించుతోంది.

"నువ్వెందుకు చేసుకున్నావు?"

నిజమే! నేనెందుకు చేసుకున్నానూ అంటే నాన్నగారికి నచ్చింది. ఆయన అన్నివిధాలా బాగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటారుకదా అని ఒప్పుకున్నాను.



అలాగే అతడూ వాళ్ళ అమ్మకోసమో, నాన్నకోసమో ఒప్పుకుని వుండవచ్చుగా.

ఏమో—

నాకు చాలా భయం వేసింది.

అది మరీ ఎదురుచూడని పరిస్థితి!

అలా వెళ్ళిన అతడు మూడు రోజుల తర్వాత వచ్చాడు.

ఓ అరగంటలోనే అతడు మళ్ళీ బయటకు వెళ్ళటానికి రెడీ అవటం గమనించి అడిగాను.

"మళ్ళీ ఎప్పుడొస్తారు?" అని.

పెళ్ళయ్యాక అతడితో మాట్లాడిన మొట్టమొదటి మాటలు అవే!

అతడూ అదే మొదటిసారిగా మాట్లాడడం- "చూడూ! నేను ఎప్పుడొస్తాను, ఎప్పుడెళతాను, ఎక్కడికెళతాను అని నన్నడగొద్దు. నా ఇష్టమొచ్చినప్పుడు వస్తాను. నా కోసం నువ్వు ఎదురుచూడనవసరంలేదు. నీ ఇష్టమొచ్చినట్లుగా నువ్వుండు. నీ జీవితం నీది. నీ ఇష్టం."

అతడు బయటకు వెళ్ళిపోయాడు.

నాకేం చేయాలో అర్థంకాలేదు.

అసలతడన్న మాటలు సగం అర్థమయ్యీ సగం అర్థమవ్వక నన్ను మరీ అయోమయంలో పడేసాయి.

నా జీవితం నా ఇష్టప్రకారం, అతడి జీవితం అతడిష్టప్రకారం అనుకున్నప్పుడు మధ్య ఈ పెళ్ళి అనేది ఎందుకు?

నేనింతదూరం రావటం ఎందుకు?

అసలతడి మనసులోని ఉద్దేశమేమిటి?

'నా జీవితం ఏమిటి' అనేది స్పష్టంగా కాకపోయినా రేఖామాత్రంగా తెలుస్తోంది.

విచిత్రం ఏమిటంటే నాకు ఏడుపు రాలేదు. కోపం రాలేదు.

విసుగు వస్తోంది.

ఓపక్క ఆకలి వేస్తోంది.

ఏం తినాలో తెలియదు.

అప్పటికి అన్నం తిని మూడు రోజులయింది. ఫ్లయిట్ ఎక్కిన దగ్గర్నుంచీ ఏదో ఒక ఫుడ్ ఇస్తూనే వున్నారు కానీ నాక్కావలసిన అన్నం మాత్రం పెట్టలేదు.

ఇక్కడ ఇంట్లోనూ దొరకలేదు.

ఎప్పుడైనా అన్నం వద్దు అన్నా, పళ్ళెంలో అన్నం వదిలేసినా అమ్మ తిసేది.

"అన్నం సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపం! అలా వదిలేస్తే కోపం వచ్చి భవిష్యత్‌లో దొరక్కుండా పోతుంది" అని కోప్పడేది.

ఆ రోజుల్లో ఆ మాటల విలువ తెలిసి చచ్చేదికాదు! 'ఓ పిచ్చి అమ్మా' అన్నట్లు చూసి నవ్వేసేదాన్ని.

అదేమిటో ఇప్పుడు తెలిసింది.

ఒక్క అన్నమే కాదు!

ఏదయినా అంతే!

నిర్లక్ష్యంగా వద్దు అని ఒక్కసారిగా తోసిపారేస్తే అది ఎలాంటిది అయినా ఇహ జీవితంలో దొరకదు అన్పించింది.

ఇహ జరిగినదాని గురించి ఆలోచించటం, ఏడవటం, మొత్తుకోటం ఇవన్నీ ప్రయోజనం లేని పనులని తెల్సుకున్నాను.

భవిష్యత్ ఏమిటి, ఏంచేయాలి అనేది కూడా తర్వాత చూసుకో వచ్చు.

ప్రస్తుత కర్తవ్యం ఏమిటి?

ఇప్పుడిదే ముఖ్యం!

ఆ ఇంట్లో ఉన్నది నేనొక్కదాన్నే!

అడిగినా, చెప్పినా, విన్నా– అంతా నేనే!

చిందర వందరగా వున్న ఆ ఇల్లంతా శుభ్రంచేసి ఏది ఎక్కడుంటే బాగుంటుందో అలా అలంకరించాను.

నా అంతట నేను ఆ ఇంట్లో, ఆ జీవితంలో ఇమిడిపోవటానికి ప్రయత్నించాను.

నీళ్ళల్లో పడిపోయాను!



ఈదుకుని ఒడ్డుకు రావాలికదా!

వారంరోజులు గడిచాయి.

అతడు రాలేదు.

రానని చెప్పాడు కదా!

నేనూ అతడికోసం ఎదురుచూడటం మానేసాను.

కాకపోతే ప్రస్తుతం నాకున్న ఆలోచనల్లా ఒక్కటే—

అది–

నేనక్కడ వుండాలా, వచ్చేయ్యాలా-

ఉండాలంటే ఏం చేయాలి?

అతడు 'నీకూ-నాకూ ఎలాంటి సంబంధమూ లేదూ, ఉండదూ' అని ఖచ్చితంగా చెప్పేసాడు.

ఇహ వుండి ఏంచేయాలి?

వచ్చేద్దామంటే-వచ్చి ఏం చెప్పాలి?

ఎందుకొచ్చావు అంటే నిజంచెపితే భరించే శక్తి నాన్నగారికి లేదని నాకు స్పష్టంగా తెలుసు.

అలాంటప్పుడు ఏమని చెప్పను?

అమ్మ ఫోన్ చేసింది.

నాకు మాట్లాడాలనిపించలేదు.

డిస్‌కనెక్ట్ చేసేసాను.

ఆ సమయంలో ఎందుకు చేసానో నాకు స్పష్టంగా తెలియలేదు.

అమ్మా–నాన్నలపైన కోపమా అంటే-

అలాంటిదేమీ కాదు.

నా జాతకం అలా వుంటే పాపం వాళ్ళేం చేస్తారు?

ఎవరూ కావాలని కన్నబిడ్డల జీవితాలు నాశనం చేయరు.

ఎందువల్లో తెలియలేదు–

కానీ మాట్లాడాలనిపించలేదు.

మరో రెండ్రోజుల తర్వాత తేజా వచ్చాడు.

ఈసారి అతడ్ని అడిగాను-

"ఈ దేశం నాకు క్రొత్త! నాకేమీ తెలియదు. నాకు తెల్సినవాళ్ళు కూడా ఎవరూ లేరు.

ఇంటిని శుభ్రంచేసుకుని కేవల టీవీ చూస్తూ, మ్యూజిక్ వింటూ రోజులు గడపటం నాకు కష్టంగా వుంది. నాకూ ఏదయినా పని దొరుకుతుందా?"

"ప్రయత్నిస్తాను" అన్నాడు.

అతడా రోజంతా ఇంట్లో వున్నాడు.

"నీకు వంటచేయటం వచ్చా?" అనడిగాడు.

నాకు సరిగా రాదు. అదే చెప్పాను.

"మరి, ఏం తింటున్నావ్?" అడిగాడు.

"బ్రెడ్ వుంది! ఫ్రిజ్‌లో పాలున్నాయి! అల్మారాలో బిస్కెట్‌లు వున్నాయి."

అతడేమనుకున్నాడో ఏమో నన్ను బయటకి తీసికెళ్ళి స్టోర్స్ చూపించాడు.

ఇన్‌స్టంట్ ఫుడ్స్, పండ్లు, పండ్లరసాలు, పాలు-బ్రెడ్, బిస్కెట్లు, పుస్తకాలు కొనుక్కొచ్చాము.

ఆ సాయంత్రం అతని ఫ్రెండ్స్ దగ్గరకు తీసుకెళ్ళాడు. వాళ్ళది కేరళ! ఆ అమ్మాయి నాకు చాలా నచ్చింది. తనపేరు ఉత్తర!

వాళ్ళు కూడా ఒక సంవత్సరం క్రితమే అక్కడకు వెళ్ళారట!

మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లాగా వాళ్ళు చాలా అన్యోన్యంగా వుండేవారు.

ఉత్తర నాకు చాలా మోరల్ సపోర్టుగా వుండేది. నన్ను చదువుకోమని సలహా ఇచ్చేది!

చాలా ఫ్రెండ్లీ గా వుండేది.

ఒకసారి గెట్ టు గెదర్ ఫంక్షన్‌కి వెళుతూ నన్ను తీసికెళ్ళింది.

అక్కడికి వచ్చిన వాళ్ళల్లో డెభ్భైశాతం జంటలుగానే వచ్చారు.

చాలా కొద్దిమంది ఒంటరిగాళ్లు!

తిరిగి వచ్చేటప్పుడు తేజా కూడా వచ్చి వుంటే బాగుండేదని అంది



ఉత్తర.

నేనేమీ సమాధానం చెప్పలేదు. మళ్ళీ తనే అన్నది-

"వెరీ షార్ట్ పీటిస్ కదా! పీలయి వుండదు."

మామూలుగా కబుర్లు చెబుతూన్నట్లుగా చెప్పింది.

అక్కడి జీవితాలూ, క్రొత్తలో ఎదుర్కొనే పరిస్థితులూ, వాళ్ళలో వాళ్ళకున్న జెలసీలూ, మగ అనే ఇగో- వాటివల్ల వస్తూన్న అపార్థాలూ, కలసి వుండలేక విడిపోయిన దంపతులూ-చాలా చెప్పింది.

ముఖ్యంగా నాలాగా పెళ్ళిచేసుకుని అమాయకత్వంతో అమెరికా వెళ్ళి అగచాట్లు పాలయిన అమ్మాయిల జీవితం గురించి కథల్లాంటి నిజాలు ఎన్నో చెప్పింది.

విఫలమైన ఆ జీవితంలోంచి బయటపడి వ్యక్తిగతంతో ఎలా సఫలీకృతులవుతున్నారో కూడా చెప్పింది.

అలాంటి గొడవలకు ఆస్కారమే లేకుండా ఒకరినొకరు అర్థం చేసుకుంటూ చిన్ని చిన్ని చిలిపి తగాదాలతో, పట్టువిడుపులతో, అవగాహనతో అనుబంధాన్ని పటిష్టం చేసుకుంటూ బ్రతికే చిట్కాలూ చెప్పేది!

"రియల్లీ షి ఈజ్ ఎ డార్లింగ్ ఏంజిల్."

నెలరోజులయింది.

అతడిలో ఎలాంటి మార్పూ రాలేదు.

నాకు జీవితంపై విసుగూ, విరక్తీ ఏర్పడుతున్నాయి.

నాపైన నాకే కోపం వస్తోంది.

నా నిస్సహాయతపైన అసహ్యం వేస్తోంది.

అతడు మధ్యలో రెండుసార్లు వచ్చాడు.

ఇన్నిన్ని రోజులు ఇంటికి రాకుండా అతడెక్కడుంటాడో, ఏం చేస్తోడో తెలిసేది కాదు.

అతడి జీవితం అతడిష్టంగా వదిలేసినా అలాంటి ప్రశ్నలు నన్ను నిలదీయకుండా వదిలేవి కావు!

అతడ్ని అడిగితే ఓ చూపు చూసి వెళ్ళిపోయేవాడు తప్ప ఏం చెప్పేవాడు కాదు.

నిలదీసి అడిగే ధైర్యమూ లేదు.

నా పిరికితనం చూసి నన్ను నేనే విసుక్కునేదాన్ని.

ఓ రోజున ఫోన్ చేయకుండా సడెన్‌గా వచ్చింది ఉత్తర!

తను వచ్చేసరికి నేనెందుకో మూడ్ అవుట్‌లో వున్నాను.

ఉత్తరను చూసేసరికి నను నేను కంట్రోల్ చేసుకోలేకపోయాను.

నా రామాయణమంతా చెప్పేసాను.

ఉత్తర ఆశ్చర్యపోలేదు! అసలు క్రొత్త విషయం వింటున్న మనిషిలానే లేదు.

కొంచెంసేపు నావంక అలా ఏం మాట్లాడకుండా చూసింది. తర్వాత నా చేయి అందుకుని చాలా ఫ్రెండ్లీగా అన్నది-

"సారీ ఈశ్వరీ! అసలు నిన్ను గురించి మొదటిసారి చూడగానే అనుకున్నాను. నువ్వు చాలా ఓపెన్ అనీ ఎట్ ది సేమ్ టైమ్ చాలా ఇన్నోసెంట్‌వనీ కూడా అనుకున్నాను. అది నిజమే అని ఇప్పుడు దృఢంగా రూఢి అయింది." అంటూ తేజాని గురించి చెప్పింది. అతడికి అప్పటికే పెళ్ళయిందనీ, ఒక కొడుకు కూడా ఉన్నాడనీ నాకప్పుడే తెలిసింది.

ఆ విషయం తెలియగానే నా మనసు ఓ క్షణంపాటు చివుక్కుమన్న మాట నిజమే కానీ-అందుకు నేనేడవలేదు! అసలు నాకు ఏడవాల్సిన అవసరం కూడా కలగలేదు.

తర్వాత తర్వాత నెమ్మదిగా అతడు సకలగుణాభిరాముడని కూడా తెలిసింది! అసలు ఇక్కడ అందరూ అనుకుంటూన్నట్లుగా అక్కడ అతడేదో బిజినెస్ వెలగబెట్టటం కూడా లేదని నాకనుమానం!

ఏదయినా అతడు ముందరే చెప్పినట్లుగా అతడి జీవితం అతడిది.

అతడిష్టం!

నా జీవితాన్ని నాయిష్టమొచ్చినట్లు మలచుకోమన్నాడు.

అతడి జీవితం మంచో చెడో ఏదో అతడిష్టమొచ్చినట్లుగా ఓ గాడిలో పడి తిరుగుతోంది.

మరి-నేను-?

నా జీవితం ....?



నాకు చాలా బోర్‌గా అన్పించసాగింది. ఓ పద్ధతీ పాడూలేకుండా పనికిరాని ఖాళీ అట్ట పెట్టెలాగా అవుతూన్న నా జీవితాన్ని ఏం చేయాలి?

ఎలా సరిదిద్దుకోవాలి?

ఏం చేయాలి? ఏం చేయాలి?

ఇదే ప్రశ్న రోజులో ఓ వెయ్యిసార్లయినా అనుకుంటూ సమాధానం కోసం వెదుక్కుంటూ-

ఆకాశంలో నక్షత్రాలు లెక్కబెట్టటమూ, గాలికి రెక్కలు చూడటం-

నావల్ల కాలేదు!

నాన్నగారి ఆరోగ్యం మంచిదికాదు.

ఈ విషయం తెలిస్తే ఆయనేమయిపోతారో ఊహించటానికే భయం వేసేది.

అమ్మకు చెబితే తప్పకుండా నాన్నగారి దగ్గరకు వెళ్ళిపోతుంది. ఆమె అసలు దాచుకోలేదు.

కనీసం సలహా అడిగేందుకు కూడా దిక్కులేని ఆ పరిస్థితి నుండీ, నామీద నాకే జాలేసే ఆ నిస్సహాయ స్థితినుండీ బయటపడాలనే నిర్ణయానికి వచ్చాను.

చచ్చిపోవాలనుకున్నాను.

అంతలోనే మళ్ళీ-చచ్చి సాధించేదేముంటుంది అనుకున్నాను.

ఓ.కె. వద్దు! బ్రతికి ఏం చేయాలి?

ఏం సాధించాలి?

నేనేదో లోకంకోసమో, ప్రపంచంకోసమో బ్రతకనవసరం లేదు.

ఎవర్నీ ఉద్ధరించనవసరమూ లేదు!

ఓ మామూలు ఆడపిల్లలలా బ్రతకాలని ఆశపడ్డాను. ఓ ఇల్లాలిగా-తల్లిగా-

ఆ ఆశ ఎండమావి అయింది!

ఓడిపోయి బ్రతకటానికీ లేదు!

ఇంతటి విషమ సమస్య పెళ్ళికి చుట్టుపక్కల కాపువేసి వుందని అనుకోలేదు.

పెళ్ళి అనేది జీవితానికి మొదటి మెట్టు అనుకున్నాను. కాని అది నా విషయంలో ఆఖరిమెట్టుగా పరిణమిస్తుందని అనుకోలేదు.

మరో రెండు నెలలు గడిచాయి.

అప్పుడప్పుడూ అమ్మ ఫోన్‌లో మాట్లాడుతూనే వుంది. ఆమె అలా మాట్లాడినప్పుడల్లా అబద్ధాలను నిజాల్లా చెప్పలేక ఎక్కడ బయటపడి పోతానో అని భయపడేదాన్ని.

నాన్నగారు ఎప్పటిలా ఓ మంచి స్నేహితుడిలా మాట్లాడేవారు.

అందరి దృష్టిలో నేను చాలా అదృష్టవంతురాల్ని. కాని నిజానికి—

నా జీవితం ఏమిటి అనేది ఆ దేవుడికే తెలియాలి!

తేజ ప్రవర్తనలో ఎలాంటి మార్పులేదు! వస్తుందనే ఆశ కూడా లేదు.

భర్తగా అనుబంధాన్ని పంచి ఇవ్వకపోయినా ఓ స్నేహితుడుగా కూడా ప్రవర్తించడు!

నేను కూడా ఆ వివాహ జీవితంలోంచి బయటకు వచ్చేయటం మంచిదనే అభిప్రాయానికి వస్తున్నాను. అదే సంగతి ఉత్తరతో చెబితే "చాలా మంచిది! నువ్వు చదువుకుంటానంటే మంచి కాలేజీలో చేరదువుగాని, లేదూ ఉద్యోగం చేస్తానంటే ఆ ప్రయత్నం చేద్దామా" అంది.

"ఏం చేస్తే బాగుంటుందో చెప్పు! ఓక్షణం కూడా ఖాళీలేకుండా నన్నో మెషీన్‌గా చేసి పుణ్యం కట్టుకో" అన్నాను.

"ఒక్క వారం రోజులు గడువు ఇవ్వు" అంది ఉత్తర.

నేను అలాంటి ప్రయత్నంలో వుండగానే నాన్నగారికి మళ్ళీ హార్ట్ ఎటాక్ వచ్చిందని ఫోన్ చేసారు. వెంటనే వచ్చేసాను.

"ఇప్పుడు మీ నాన్నగారెలా వున్నారు?" ఆతృతగా అడిగారు.

"ఫర్వాలేదు! బాగానే వున్నారు. ఆయన ఇప్పుడు చక్కగా కోలుకుంటున్నారు. ఇలాంటి సమయంలో నా గురించి ఏం చెప్పినా ఆయనకు ప్రమాదం ముంచుకురావచ్చు. అందుకే ఆయనకేమీ చెప్పలేదు."

"ఇలా ఎన్నాళ్ళు?"



"అదే తెలియటంలేదు."

"డిగ్రీ పూర్తిచేయరాదూ."

"లేదు ఊహూ! ప్రస్తుతం నా ఆలోచనంతా నాన్నగారి గురించే. నేను చదువుకుంటాను అంటే ఏమిటి? ఎందుకు? అనే ప్రశ్నలు వస్తాయి. అందువల్ల ఆయనకు ఓ కొడుకులా వ్యాపార వ్యవహారాల్లో సహాయపడాలని అనుకుంటున్నాను. నాకూ ఓ డైవర్షన్ వుంటుంది. ఆయనకూ కొంత శ్రమ తగ్గుతుంది."

"నాన్నగారితో చెప్పావా?"

"చెప్పాను. ఆయన అదో జోక్‌లా తీసుకుని నవ్వేసారు. ఎన్నాళ్ళు నాకు సహాయం చేస్తావు?" అన్నారు.

"నేను కూడా నవ్వి ఉన్నన్నాళ్ళు అని చెప్పాను."

అనంది ఆమె చేతివ్రేళ్ళు నొక్కుతూ అడిగింది-

"నీ మనసులో అస్పష్టంగా ఉన్న భావాలకు ఓ రూపమంటూ ఏర్పడుతోందా?"

"అదే నాకూ అంతుపట్టటంలేదు. అమెరికాలో వున్న ఆరునెలల కాలంలోనూ అతడు మారటంలేదు, మారటంలేదు అనే ఆలోచించానుగానీ ఒకవేళ అతడు మారితే అతడి జీవితంలో ఇమడగలిగేదాన్నా అని ఎపుడూ ఆలోచించలేదు. ఇప్పుడు ఇక్కడకు వచ్చాక అన్పిస్తోంది అప్పుడు అదే విషయాన్ని అదే పనిగా ఆలోచించేసరికి గంతలుకట్టిన గుర్రంలా అదొక్కటే సమస్యలా సతమతమయ్యాను. కాని ఇప్పుడు కాస్త నిదానంగా ఆలోచిస్తే అదెంత అసహజమో తెలుస్తోంది. పెళ్ళయి ఒక కొడుకు కూడా వుండగా ఇక్కడకు వచ్చి ఇన్నిమైళ్ళ దూరంలో ఇంత ఆర్భాటంగా నన్ను పెళ్ళి చేసుకున్నాడు. ఎందుకయ్యా అంటే-అమ్మ కోసం అంటాడు. నేను కాదంటే ఆమె చచ్చిపోతానంది. అందుకోసం చేసుకున్నాను అన్నాడు."

అతనో పిరికివాడు!

చేసుకున్న పెళ్ళి గురించి, కన్నకొడుకు గురించీ తలిదండ్రులకు చెప్పి ఒప్పించలేని పిరికివాడు.

తల్లిని సంతోషపెట్టటం కోసం ఓ అమ్మాయి జీవితాన్ని బలి చేస్తున్నానేమో అని ఆలోచించలేని మూర్ఖుడు.

అలాంటివాడు ఒకవేళ అతని జీవితంలోకి ఆహ్వానించినా నేనెలా ప్రవేశించగలను.

అది మరీ దుర్భర పరిస్థితి అయ్యేదికాదా!

బట్ వన్ థింగ్! అంతగా అతడు దగా చేసినా ఒక విషయానికి మాత్రం అతడ్ని మెచ్చుకోకుండా వుండలేకపోయాను.

అతడు నన్ను తాకలేదు అసలు తాకాలనే ప్రయత్నం కూడా చేయలేదు. నన్ను చూసి ఆ అమ్మాయినీ, బిడ్డనూ వదిలేయలేదు. అందుకు అతడిని అభినందించకుండా వుండలేను.

అతడు ఒక విధంగా చూస్తే ఎంత చెడ్డవాడనిపిస్తాడో మరో కోణంలోంచి చూస్తే అంత మంచివాడనీ నా మనసు చెబుతోంది.

ఏదయినా అతడు మనల్ని మోసం చేసాడు అనేకంటే మనం మోసపోయాము అనుకుందాము. జీవితంలో రాజీపడి భవిష్యత్తుకోసం ఎదురుచూడటం-

ముఖ్యంగా నాన్నగారి కోసం తప్పనిసరి అన్పిస్తోంది."

"నాకర్థంకాలేదు" అంది ఆనంది.

నవ్వింది ఈశ్వరి.

"నేను నాకే అర్థంకావటంలేదు. నీకేమి అర్థమవుతాను? నా ఆలోచనలు నా అధీనంలోనే వుండటంలేదు. ఇప్పుడొచ్చిన ఆలోచన మంచిదిగా, ఇదే సరైన పద్ధతి అన్నట్లుగా వుంటుంది. మరికాసేపటికి మరో ఆలోచన-అపుడు అదే సరైన పద్ధతిగా అన్పిస్తుంది.

ప్రస్తుతం చీకట్లో తడుముకుంటూన్న దానిలావున్నాను. అసలిప్పటి వరకూ నా మనసువిప్పి ఎవరకూ చెప్పలేదు.

ఉత్తరకు తప్పించి వేరెవ్వరకూ తెలీదనే అనుకుంటున్నాను.

ఇప్పుడు మీకు!

స్నేహితులను మించిన ఆత్మీయులుండరంటారు! నాకోసం మీరూ ఆలోచించి చెప్పండి! ఏంచేస్తే మంచిదో చెప్పండి."



"ఒకవేళ మీ నాన్నగారితోగానీ, వాళ్ళ నాన్నగారితోగానీ చెబితే- పెద్దవాళ్ళు పిల్చి మందలించితే...." ఆ మాటలు పూర్తి అవ్వకుండానే అడ్డుపడింది ఈశ్వరి.

"వద్దు! ఖచ్చితంగా ఆ జీవితం నాకొద్దు. అతడితో సర్దుకుపోవటమనేది కలలోకూడా జరగని పని!

ఆ చాప్టర్ క్లోజ్!

ఆ విధమైన ఆలోచనలే వద్దు.

ఆ అమ్మాయి వుండగా అతడితో సర్దుకునే పెద్దమనసూ నాకులేదు! అలాగని ఆ అమ్మాయినీ అతడి జీవితంలోంచి తప్పించేసే క్రూరత్వమూ నాలోలేదు."

నేను విడిగావచ్చేసాను విడిగానే వుంటాను."

ఈశ్వరి వెళ్ళిపోయింది.

మిగిలిన నలుగురూ ఈశ్వరి గురించే చర్చించుకున్నారు.

ఆనంది అనుకుంది-

'అసలు సమస్యలేని జీవితాలే వుండవా? ఈశ్వరి ఎంత మంచిది.... అలాటి నయవంచకుడ్ని వాడి ఖర్మకు వదిలేసి గప్‌చుప్‌న వచ్చేసింది! వాటిలో చెడు ఎంతయినా వుండనీ! మనం మంచినే చూద్దాము అంటూన్న ఈశ్వరి ఎంత గొప్పది....! అదే సుజాతలాంటి ఆడదయితే ఏం చేసి వుండేది?

దేవుడిలాంటి అన్నయ్యనే ఎదిరించి బజారుకీడుస్తోంది. అలాంటిది- అలాటి పరిస్థితి ఎదురైతే—

జీవితాలు నాశనం అవటానికి కొందరి విషయంలో స్త్రీ కారణమైతే మరికొందరి విషయంలో పురుషుడు కారకుడవుతున్నాడు.'

* * * *

సెప్టెంబరు మాసం!

అప్పుడే పెద్ద వర్షంపడి వెలిసింది.

మెయిన్ రోడ్లన్నీ కడిగిన ముత్యాలా మెరుస్తున్నాయి.

చిన్న రోడ్లన్నీ వర్షపునీటికి తడిసి అతుక్కుపోయిన పేపర్లా,

నీటి గుంటలూ, చెత్తా చెదారంతో నిండి చీదరంగా, అసహ్యంగావున్నాయి.

రెండు చేతులూ పాంటు జేబుల్లో పెట్టుకుని తలవంచుకుని ఆలోచనగా నడుస్తున్న విశ్వనాథం మనసు ఆ వీధిలాగానే చిందర వందరగా ఉన్నది.

రెండురోజుల క్రితం సుజాత వచ్చింది.

బాబుని తీసుకురాలేదు.

"ఎందుకని?" అడిగాడు విశ్వనాథం.

అతడికి చాలా కోపం వచ్చింది.

"నా ఇష్టం" అంది పెంకెతనంగా.

నిశ్శబ్దంగా అవతలకు వెళ్ళిపోయింది పెద్దమ్మ.

విశ్వనాధానికి కోపంతోపాటు అసహ్యం అనిపించింది.

అతడూ మాట్లాడలేదు.

తెలివిగల వాళ్ళకు చెప్పనవసరంలేదు. తెలివితక్కువ వాళ్ళకు చెప్పటం చాలా తేలిక. తెలిసీతెలియని అధిక తెలివితేటలు గలవాళ్ళకూ, మిడిమిడి జ్ఞానంతో మిడిసిపడే ఇలాటి తెలివితక్కువ దద్దమ్మలకూ చెప్పటం చాలాకష్టం! అలాటి భార్యతో ఘర్షణపడటం బంతిని గోడకు కొట్టినట్టే అవుతుంది అనుకున్నాడు.

ఆవిడకు ఆలోచించడం చేతకాదు.

చక్కగా మృదువుగా మాట్లాడటం అసలేచేతకాదు.

ఆప్యాయత అనేది ఆమె డిక్షనరీలోనే లేదు.

అలాటి సుజాత బాబుని వదిలి వచ్చిందంటే పెద్ద ఆశ్చర్యం లేద గానీ ఎలాంటి ఉద్దేశంతో వచ్చిందో అని భయపడ్డాడు.

ఆరోజు విశ్వనాథం అలవాటు ప్రకారం రాత్రివేళ తొమ్మిది దాటతూండగా ఇంటికి వచ్చాడు.

అప్పటికే సుజాత గదిలోకెళ్ళిపోయింది. పెద్దమ్మ ముందర వరండాలో కూర్చుని 'తిరుక్కురళ్' చదువుతోంది.

ఒకటి రెండుసార్లు సుజాత బయటకూ లోపలకూ తిరగటం చూసింది.



'ఏమిటమ్మా....' అని అడగాలని మనసు ఆత్రతపడుతూన్నా ఏమి తిక్క సమాధానం చెబుతుందో అనే భయంతో అడగలేదు.

విశ్వనాథం ఇంకా ఇంటికి రాకముందే భార్యాభర్తలకు పీటలు వేసి కంచాలు పెట్టింది. నేయి కరిగించి, చారు, కూర వేడిచేసింది. గిన్నెలన్నీ అక్కడ పెట్టి గరిటెలుకూడా గిన్నెలపైన పెట్టివచ్చి మళ్ళీ వరండాలో కూర్చుంది.

విశ్వనాథం వచ్చాడు.

గదిలోకెళ్ళి బట్టలు మార్చుకుంటున్నాడు. అప్పటివరకూ కాలుగాలిన పిల్లిలా తిరిగిన సుజాత అతడు రావటంచూసి మంచమెక్కి ముసుగు పెట్టింది.

ఆవిడనోసారి చూసి పాంటూ-షర్టూ హాంగర్స్‌కు వేసి స్టాండుకు తగిలించి బయటకు వచ్చేశాడు.

కాళ్ళూ చేతులూ ముఖమూ కడుక్కొని తుడుచుకుంటూ తల్లి దగ్గరకు వచ్చాడు.

"అమ్మా! అన్నం తిందామా?"

"అన్నీ అక్కడేవున్నాయి విశ్వూ! సుజాత వుందిగా-తినేసెయ్యండి."

"నువ్వు భోజనం చేసావా?"

"నాక్కాస్త కడుపు బాగుండలేదయ్యా! మీరు చేసెయ్యండి."

"సుజాత పడుకుంది! సర్లే—నేను పెట్టుకుంటానులే." విశ్వనాథం వంటగదివేపు వెళుతుంటే చప్పున లేచింది.

"అయ్యో....అలాగా! అమ్మాయి పడుకోవడం నేను చూడలేదు" అంటూ వచ్చి వడ్డించటం మొదలుపెట్టింది.

"అమ్మాయిని లేపితే రెండు ముద్దలు తిని పడుకుంటుంది.

విశ్వనాథం ఏం మాట్లాడకుండా మౌనంగా భోజనానికి ఉపక్రమించాడు.

మరి మాట్లాడలేదు పెద్దమ్మ.

ఇద్దరూ సుజాత గురించే ఆలోచిస్తున్నారు. ఆ విషయం ఇద్దరికీ

తెలుసు. కాని ఎవరికి వారు ఎదుటి మనిషి మనసుని తేలికపర్చటానికి ప్రయత్నిస్తున్నారు.

విశ్వనాథం ఆఫీస్‌లో జరిగిన విషయాలు చెప్పి నవ్వుతున్నాడు.

గడపలోకొచ్చింది సుజాత.

"మీరు మనుషులేనా?"

ఉలిక్కిపడింది పెద్దమ్మ.

ఆ ప్రశ్న నిన్ను అడగాలి అనుకున్నాడు విశ్వనాథం.

"నేనొక్కదాన్ని ఆకలితో ఛస్తున్నానని తెలిసికూడా మీరుమట్టుకు హాయిగా తింటున్నారా?"

విశ్వనాథం తల ఎత్తలేదు.

అతని ముఖంలోకి చూసిన పెద్దమ్మ గబుక్కున చూపులు తిప్పుకుని "రామ్మా! వడ్డిస్తాను" అంది.

"అక్కర్లేదు. ఆ ముష్టి భోజనం తినకపోతే నేనేం చావను. మీరే కడుపు పగిలేట్టు మింగండి."

"అవేం మాటలమ్మా! రా....భోంచేద్దువుగాని." బతిమాలుతున్న ధోరణిలో అన్నది.

"నీ కపటనాటకాలూ, దొంగ ప్రేమలూ నాదగ్గరేం ఒలకబొయ్యనవసరం లేదు." గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

లేవబోయింది పెద్దమ్మ.

చటుక్కున ఆమెచేయి పట్టి ఆపేసాడు విశ్వనాథం.

ఇహ పెద్దమ్మ ఏమీ అనలేకపోయింది.

విశ్వనాథమూ మాట్లాడలేదు.

మౌనంగా భోజనం ముగించి వెళ్ళిపోయాడు.

గిన్నెలన్నీ సర్దేసి పెద్దమ్మకూడా పడుకుంది.

మరో రెండురోజులు గడిచాయి.

సుజాత వుండగా ఇల్లు ప్రశాంతంగా వుండంటే పెద్దమ్మకు పండగలాగా ఉంది.

సుజాత తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాప పడుతోందేమో అను



కున్నది.

నెమ్మదిగా మారిపోతుంది.

ఇహ తనకే బెంగా వుండదు.

కొడుకు సంసారం స్వర్గమవుతుంది.

సహజంగానే ఆడమనసు త్వరగా కలలు కంటుంది. ఎలాంటి భావాలకయినా త్వరగా లొంగిపోతుంది.

అలాంటి సగటు ఆడవాళ్ళకు ఉదాహరణే పెద్దమ్మ కూడాను.

కాని విశ్వనాథం అలా కాదు.

ఈ నిశ్శబ్దం వెనుక ఎలాటి ఘర్షణ దాగి వున్నదో అనుకున్నాడు.

తుఫాన్ వచ్చేముందు వాతావరణం ప్రశాంతంగా వుంటుందంటారు.

అతడికి తెలుసు!

మనుషుల్లో వుండే సహజ గుణాలు అంత త్వరగా మారవు.

అలా మార్చుకోగలిగే మనుషులు వేరుగా వుంటారు.

సుజాత ఆ కోవకు చెందిన మనిషి కాదు.

ఆమెలో మార్పు అంత సులభంగా రాదు.

ఈ నిశ్శబ్దానికి అర్థం ఏమిటో—

ఎపుడు బయటకు వస్తుందో—

విశ్వనాథం కాస్త భయపడ్డాడు కూడాను.

అతడు ఊహించినట్లే మర్నాడు రాత్రి విశ్వనాథాన్ని ఇంటిని గురించి అడిగింది.

"అలాగే!" అన్నాడు.

"అలాగే అంటే?" రెట్టించింది.

"కొందాం" నవ్వు తెచ్చిపెట్టుకుంటూ చెప్పాడు.

మొదట నమ్మలేదు సుజాత.

అతడు అంత త్వరగా ఒప్పుకుంటాడని నమ్మలేదు. తీరా అతడు ఒప్పుకునేసరికి అతడు చెప్పే మాటలు, ఒప్పుకున్న విధానమూ నిజమేనా అనే అనుమానం పట్టుకుంది.

'అమ్మయ్య! ఇవాల్టికి ఈ గాలి దుమారం తగ్గిపోయింది!' అనుకుని

కళ్ళు మూసుకున్నాడు విశ్వనాథం.

"ఏమండీ!" మళ్ళీ పిల్చింది సుజాత.

'అమ్మయ్యో! తగ్గినట్లులేదే' అనుకున్న విశ్వనాథం 'నిద్ర పట్టినట్లుగా' కళ్ళు తెరవలేదు.

పోనీలే అనుకునే తత్వం కాదు సుజాతది.

అతని భుజాలు పట్టుకొని కుదిపింది.

ఇహ తప్పక కళ్ళు తెరిచాడు విశ్వనాథం.

"ఏమిటి? ఏమైంది?" అన్నాడు అపుడే మెలకువ తెచ్చుకున్నట్లుగా ఆమె కూర్చుని వుండటాన్ని అపుడే గమనించినట్లుగా.

"అరే! ఇంకా నీవు పడుకోలేదా?"

"మీ వేషాలు చాలుగానీ ఇల్లెప్పుడు కొందాం చెప్పండి" అంది.

విశ్వనాథానికి కోపం వచ్చింది.

ప్రాణం ఉసూరుమంది.

"చూద్దాం" అన్నాడు.

"చూడటం కాదు" అంది సుజాత కూడా సహనాన్ని తెచ్చిపెట్టుకుంటూ.

"చూడూ! ఇల్లు కొనటమంటే మాటలతో అయ్యేదికాదు. డబ్బు కావాలి. దానికోసం బాంకులో లోను అప్లై చేయాలి. పైగా ఇపుడు ఈ ఇల్లు మనకు ఎంతో సౌకర్యంగా వుంది."

"అందుకని...." కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ అడిగింది.

"నెమ్మదిగా ఆలోచిద్దాం."

"మనం ఆలోచించుకునేవరకూ ఆ ఇల్లు ఆగదు. అతడు తొందర పడుతున్నాడు."

"పోనీ! అదిపోతే ఇంకొకటి."

"ఆఁ! చాల్లే. ఈ కబుర్లు నా దగ్గర కాదుగానీ చెప్పండి. ఎప్పుడో చెబితే మా నాన్నగారొస్తారు."

"మీ నాన్నగారెందుకు?" భృకుటి ముడుస్తూ అడిగాడు.

"మరి మీకేం చేతనవుతుంది?"



విశ్వనాథానికి ఒళ్ళు మండింది.

ఒక్కక్షణం "అయితే ఆ డబ్బు కూడా మీ నాన్ననే పెట్టి కొనమను" అనాలన్పించింది.

ఎలాగో నిగ్రహించుకుని కళ్ళు మూసుకున్నాడు.

"రేపు రమ్మని ఫోన్ చేయనా?"

విశ్వనాథం మాట్లాడలేదు.

తననితాను కన్‌ఫర్మ్ చేసుకుంటున్నట్లుగా మరోమారు అంది. "అయితే రేపు రమ్మని మా నాన్నగారికి చెబుతాను."

"అపుడే ఎలా వీలవుతుంది సుజాతా?"

"ఏం? ఎందుకని వీలుకాదు."

"ఇంకా లోనుకే అప్లయ్ చేయలేదుకదా?"

"లోను దేనికి?"

"డబ్బుకోసం."

"డబ్బు ఉందికదా!"

"ఎక్కడా?" అనుమానంగా చూస్తూ అడిగాడు.

"ఆనంది పేరుమీద వుందిగా." ఆవిడలో తెచ్చిపెట్టుకున్న సహనం నిలవటంలేదు.

పరుగెట్టి పారిపోయేందుకు సిద్ధంగా వుంది.

"అది మనదికాదు సుజాతా! ఆనందిది. దాని చదువుకూ, పెళ్ళికీ కావాలి."

"ఆ డబ్బుతో ఇల్లు కొనేసెయ్యండి. పెళ్ళినాటికి డబ్బు సమకూర్చుకోవచ్చు!"

మాట్లాడలేదు విశ్వనాథం! అతనికి అసహ్యమనిపిస్తోంది.

"మాటాడరేమిటి?" రెట్టించింది. అప్పటికే ఆమెకి కంట్రోలు తప్పులోంది.

"ఇహ నోరు మూసుకుని పడుకో" అతని స్వరంలో కత్తి అంచున ఉండే పదును ధ్వనించింది.

"నా నోరెందుకు మూసుకోవాలి? నేనేమీ కానిమాట అనలేదే"

ఆవిడలోని సహజగుణం బయటకు వస్తోంది.

విశ్వనాథం కళ్ళు తెరవలేదు.

అతనికి తెలుసు.

సుజాత కావాలని రెట్టించి ఇదో యుద్ధంలాగా మార్చేస్తుందని!

"చేతకానివాడికి కూతలెక్కువన్నట్లు, కొనే సత్తాలేదని చెప్పొచ్చుగా. సాకులెందుకు?" రుసరుసలాడింది.

ఇహ అతడ్ని కదిలించలేనని తెలుసుకున్న సుజాత అప్పటివరకూ అదిమి పట్టుకున్న సహనాన్ని, మర్యాదనూ ఒదిలేసింది.

తన సహజ ధోరణిలో, తనకు అలసట కలిగేవరకూ విశ్వనాథాన్నీ, అతడ్ని కన్నందుకు అతడి తల్లినీ, డబ్బు దాచుకున్నందుకు ఆనందినీ తిట్టి తిట్టి ఇహ తన అరుపులు వినటంలేదనీ, విశ్వనాథం అసలు నిద్రపోయి వుంటాడని అనుకుని ఆపేసింది.

సుజాత నిద్రపోయింది గానీ....

విశ్వనాథానికి మాత్రం నిద్ర ఎగిరిపోయింది. ఆమె మనస్తత్వానికి మార్పు తేవటం సాధ్యపడే విషయమేనా?

ఇహ ఆమెను ప్రేమతో లాలించి, అనురాగంతో ఒప్పించి, ఆప్యాయతతో మార్చలేకపోయాడు.

రెండు చేతులూ కలిస్తే చప్పుడు తప్ప ఫలితముండదని ఇంతకాలం ఓర్పుతో సహించాడు.

అది బూడిదలో పోసిన పన్నీరవుతోంది.

చేతకాని తనమవుతోంది.

తన సహనం పిరికితనానికి నిదర్శనమవుతుంటే, తననో వాజమ్మను చేస్తుంటే భరించలేకపోతున్నాడు.

ఆమె హఠం అతనిలోని మగతనాన్ని సవాలు చేస్తోంది.

ఆమెలోని అహం అతని పురుష అహంకారాన్ని రెచ్చగొడుతోంది.

మనిషిలోని మానవత్వానికి మరోవైపున నిద్ర పోతూంటే రాక్షసత్వాన్ని తట్టిలేపి రెచ్చగొడుతోంది. ఆమెని దెయ్యంలా ఆవహించి ఉన్న అహం భావం!



ఈసారి మళ్ళీ ఆమె ఇలాంటి ప్రసంగం తెచ్చి గొడవచేస్తే మాత్రం చిన్నతనంలే అనో, తనే నేర్చుకుంటుందిలే అనో అనుకోకూడదు.

'తన మూర్ఖత్వానికి సరైన జవాబు చెప్పాలి.' అని ఖచ్చితంగా తీర్మానించుకున్నాడు.

* * * *

"డాడీ! నేను కూడా మీతోబాటు ఆఫీసుకొస్తాను" అడిగింది ఈశ్వరి.

కారెక్కబోతున్న ఆయన ఆగి వెనక్కి తిరిగి చూశారు.

వరండాలో నిలబడిన ఈశ్వరి నవ్వింది.

ఆయన కూడా నవ్వుతూ "ఒక పని చేయరా తల్లీ! ఈ బిజినెస్ అంతా నీకు అప్పగించేస్తాను. అల్లుడ్ని కూడా వచ్చేయమని చెప్పు. నేను హాయిగా రిలాక్సవుతాను."

ఫక్కున నవ్వింది ఈశ్వరి.

ఆయన కూడా నవ్వుతూ చేత్తో రమ్మని సైగచేశారు.

ఈశ్వరి ఒక అడుగు ముందుకువేసి మళ్ళీ ఏదో గుర్తుకొచ్చినట్లు వెనక్కితిరిగింది.

గడపలో నించుని చూస్తూన్న తల్లితో చెప్పివచ్చి కారెక్కింది.

అలా యథాలాపంగా తండ్రితో ఆఫీసుకు వెళుతున్నట్లుగా మొదలు పెట్టిన ఈశ్వరి వరుసగా రోజూ వెళుతున్నది.

తండ్రి గదిలో తండ్రికి ఎడమ చేతివైపున కూర్చుని ఆయన ఎవరెవరితో ఎలా మాట్లాడుతున్నారో గమనించుతోంది.

మూడో రోజున ఆయన ఓ ఫైల్ ముందరపెట్టి ఈశ్వరితో అన్నారు.

"ఇది చూడు! నీకెంత అర్థమయిందో నాకు చెప్పు."

ఆ రోజంతా ఆ ఫైల్ స్టడీ చేస్తూనే వుంది ఈశ్వరి.

మరుసటి రోజు ఆఫీస్‌లో తండ్రి కెదురుగా కూర్చుని పెన్సిల్ చేత్తో పట్టుకుని ఆయనతో డిస్కస్ చేస్తూ కొన్ని పాయింట్లు అడుగుతూంటే ఆయన కళ్ళు కాంతివంతమయ్యాయి.

కొన్ని క్షణాలు ఈశ్వరినే చూస్తుండిపోయారాయన.

ఈశ్వరి ఆడపిల్ల అనీ, ఆ పిల్లకు పెళ్ళిచేసి పంపించేశామనీ ఆయన తాత్కాలికంగా మర్చిపోయారు.

చిన్న పిల్లాడిలా సంతోషపడిపోయారు.

"నాకందివచ్చిన కొడుకులా ఇహనుండీ ఈ వ్యాపారమంతా నువ్వే చూసుకోవాలి" అంటూ సంబరపడిపోయారు.

నిజంగానే మరో పదిరోజులకల్లా ముఖ్యమైన ఫైళ్ళు చూడటమూ, ముఖ్యమైన అక్కౌంట్లు చూడటం కూడా ఈశ్వరికి చేతనవుతోంది.

ఈశ్వరి ఆఫీస్‌కు రావటం మొదలెట్టి రెండు నెలలయింది.

ఆఫీసు వాతావరణాన్నే మార్పించేసింది. ఇదివరకటి ఆఫీసు కూడా బాగానే వుండేది. అయినా దాన్ని చిన్న చిన్న మార్పులు చేసి కొంత ఫర్నిచరు మార్పించి, కర్టెన్లు మార్పించి, కొన్ని చోట్ల కార్పెట్ అలంకరించి—

మొత్తానికి ఆ ఆఫీస్‌ని ఇంటర్నేషనల్ లెవెల్‌కి మార్చేసింది.

ఆమెని చూసి తండ్రి హృదయం ఆనందంతో నిండటమే కాక గర్వపడుతోంది.

అంతకంటే ఇంకా ఏం కావాలి?

ఇప్పుడామె ఆఫీసులో ఓ కీలకమయిన వ్యక్తిగా మారిపోయింది.

ఆమె తండ్రి ప్రతి చిన్న విషయమూ కూడా ఆమెతో సంప్రదించటం గాని లేక ఆమెని అడగటంగాని చేయాల్సివస్తోంది.

ఆయనకు తెలీకుండానే సలహాలిచ్చే స్థాయినుండి సలహాలడిగే స్థాయికి మారిపోయారు.

స్త్రీలకు ముద్దుగా నేర్పిస్తే నేర్చుకోలేని విద్యలుండవనేది నూటికి నూరుపాళ్ళు నిజమని ఈశ్వరి మరోమారు ఋజువుచేసింది.

ఈశ్వరి తండ్రితో సమానంగా ఆ వ్యాపారంలో మునిగిపోతూంటే మొదట్లో ఆయన ఆరోగ్య రీత్యా ఆయనకు సహకారాన్నందించి ఆయనకు అన్ని విషయాల్లోనూ కుడిచేయిలా మసలుకుంటున్నందుకు తల్లి మనసు చాలా సంతోషించింది. రాను రానూ క్రమంగా వస్తున్న మార్పుల్ని చూస్తూంటే ఆమె మనసు ఆందోళన కూడా చెందుతోంది.



కూతురు కొడుకుతో సమానంగా వ్యాపారదక్షతలు ప్రదర్శించగలదుగానీ బాధ్యతను తలకెత్తుకోలేదు గదా అనేది ఆమె భావన!

అదే ఆమె బహిర్గతం చేస్తోంది.

పైగా ఈశ్వరి తండ్రిని చూసేందుకు అమెరికానుండి వచ్చి మూడు నెలలకు పైనే అవుతున్నది.

భర్త దగ్గరకు వెళ్ళిపోవాలని ఈశ్వరీ అనటంలేదు. ఎప్పుడు వస్తున్నారంటూ అతడు ఫోన్ చేసినట్లుగా చూడలేదు.

అత్తగారింటి వద్దనుండి కూడా ఫోన్ వచ్చినట్లుగా ఆమె గమనించలేదు.

తల్లి మనసుకెప్పుడూ ఆందోళనే, అనుమానమే.

ఇలా ఇన్ని రోజులు ఇక్కడే వుంటే వాళ్ళకు కోపమొస్తుందేమో అని ఆవిడ భయం!

ఆమె అప్పుడప్పుడు కూతుర్ని హెచ్చరించుతూనే వుంటుంది.

"అల్లుడుగారికి ఫోన్ చేశావా?"

"చేశానమ్మా. బాగానే వున్నారుట."

"మీ అత్తగారికి?"

"అయ్యో! మర్చిపోయాను. ఆమె మిమ్మల్నిద్దర్నీ అడిగినట్లు చెప్పమంది."

తండ్రిని డాక్టరుగారు చెప్పిన ప్రకారం చెకప్‌లకు తీసుకు వెళుతూ ఆయన సలహాలకు అనుగుణంగా మందులూ, ఆహారమూ ఇస్తూ జాగ్రత్తలు తీసుకుంటూంటే—

'ఈశ్వరి ఎంతగా ఎదిగిపోయింది! నిన్న మొన్నటి వరకూ చిన్నపిల్లలా ఇంట్లో మారాం చేస్తూ గారాబంగా పెరిగిన పిల్ల పెళ్ళిచేసుకుని అలా వెళ్ళిందో లేదో ఇంతలా పెద్దరికం సంతరించుకుంది.' అని తల్లి తండ్రులిద్దరూ ఎన్నిసార్లో అనుకునేవారు.

ఆరోజు ఈశ్వరికి డాక్టరుగారు ఫోన్ చేశారు.

వెళ్ళింది.

తండ్రి ఆరోగ్యాన్ని గూర్చి అడిగింది.

"ఆయన పర్ఫెక్ట్లీ ఆల్‌రైట్! ఆయన ఇంత త్వరగా ఇంతదాగా కోలుకోపటానికి కారణం హండ్రెడ్ పర్సెంట్ నువ్వే! అయామ్ సో హేపీ! కీప్‌టప్!" అన్నారు.

ఆయన కొంచెంసేపు అవీ ఇవీ మాట్లాడి "నీ ప్రయాణం ఎప్పుడమ్మా?" అన్నారు.

నవ్వింది ఈశ్వరి.

"ఇంకొన్నాళ్ళు ఇక్కడే డాడీ దగ్గరే వుంటాను అంకుల్."

నవ్వారాయన.

ఆ నవ్వు....ఎప్పటిలా ఆప్యాయంగా నవ్వే నవ్వులా లేదు.

పిచ్చితల్లీ అన్నట్లుగా వుంది.

చప్పున గ్రహించేసింది ఈశ్వరి.

"అంకుల్!" అంది.

ఆమె కళ్ళల్లోని భావం ఆయన కర్థమయింది. ఆమె కంఠంలోని ప్రశ్నా అర్థమయింది.

"ఎస్ ఈశ్వరీ!" తలాడించుతూ ఆయన కుర్చీలోంచి లేచారు.

ఆయన కొడుకు కార్డియాలజిస్ట్! అతడు స్పెషలైజేషన్ కోసం అమెరికా వెళ్ళాడన్నది ఈశ్వరికి గుర్తుకొచ్చింది. అతడుగాని తిరిగి వచ్చాడా!

ఆమె అనుమానం నిజమే.

ఆయన డైరెక్ట్‌గానే అడిగారు.

అక్కడ జరిగిన ఓ గెట్ టు గేదర్‌లో తేజా కన్పించాడు.... భార్యతో....కొడుకుతో....

మరి....నువ్వు....?

నువ్వెవరివి?

కొద్ది క్షణాలు మౌనంగా తలవంచి కూర్చున్న ఈశ్వరి గుండెల్లో ఎగసిపడుతూన్న అలజడిని అణచుకుంటూ ఆయనవేపు చూసింది.

ఆయన ఈశ్వరినే చూస్తున్నారు.

"నీకు తెలుసా?"



తెలుసన్నట్లు తల వూపింది.

"డాడీకి తెలిస్తే ఏమౌతుందో వూహించగలవా?"

ఈశ్వరి కళ్ళనిండా నీళ్ళు.

ఆయన కళ్ళల్లోనికి కూడా నీటి చెమ్మ వచ్చింది.

"ఎంత అపరాధం జరిగిపోయిందమ్మా! జీవితంలో కొన్ని తప్పుల్ని సరిదిద్దుకోలేము! నిన్ను గురించిన ప్రతి చిన్న విషయాన్నీ కూడా ఎంతో జాగ్రత్తగా ఆలోచించే నాన్నగారు ఇంత పెద్ద విషయంలో తొందర పడ్డారు. కేవలం ఆయన ఆరోగ్యంలో వచ్చిన మార్పుల మూలంగానే నీ వివాహానికి ఇంతగా తొందరపడ్డారు."

బాడ్‌లక్....!

వెరీ బాడ్ ఎక్స్‌పీరియన్స్!

ఇది ఆయనకో షాక్!

దీన్నుంచి ఆయన తట్టుకోవటం చాలా కష్టం!

ఇద్దరిమధ్యా నిశ్శబ్దం.

గడియారంలోని సెకండ్ల ముల్లు చేసే చప్పుడు భయంకరంగా విన్పిస్తోంది.

నెమ్మదిగా లేచింది ఈశ్వరి.

"సారీ బేబీ! నిన్ను అప్‌సెట్ చేశాను."

"నో అంకుల్! ఇటీజ్ ఎ పార్ట్ ఆఫ్ మై లైఫ్."

"ధైర్యంగా వుండమ్మా! భగవంతుడే వున్నాడు."

"అంకుల్!"

"ఏమిటో చెప్పమ్మా!"

"ఇవ్వాళ మీకు తెలిసింది. రేపు ఇంకొకళ్ళకు....ఆ తర్వాత మరొకరికి! అలా ఎవరి ద్వారానో డాడీకి సడెన్‌గా తెలిసేకంటే మనమే చెప్పటం మంచిదేమో!"

"కరెక్ట్ బేబీ!"

"డాడీ అప్‌సెట్ అవ్వకుండా ఆ విషయాన్ని ఆయనకు మీరే చెప్పాలి అంకుల్!"

"అలాగేనమ్మా! ప్రయత్నిస్తాను. సమయం చూసి చెబుదాము. నువ్వు ధైర్యంగా వుండు. సమస్య అనేది వున్నప్పుడు సొల్యూషన్ తప్పకుండా వుంటుంది."

ఈశ్వరి బయటకి వచ్చేసింది.

ఆమె మనసు భారంగా, బాధగా మూలిగింది. ఎవరో చేయిపెట్టి కెలుకుతూన్నట్లుగా వికారంగా, ఛిన్నా భిన్నంగా అవుతోంది.

కళ్ళు తిరిగినట్లుగా అన్పించింది.

తలను వెనక్కువాల్చి కళ్ళు మూసుకుంది.

కనురెప్పల క్రింద తేజా, అతడందించిన చేదు అనుభవాలూ కదులుతున్నాయి.

వాటిని ఎంత దూరం చేయాలని ప్రయత్నిస్తున్నదో అంత దగ్గరగా వస్తున్నాయి.

డ్రైవర్ అడుగుతున్నాడు.

"ఆఫీసుకా, ఇంటికా అమ్మా?"

"ఆఫీస్‌కు వెళ్ళు."

ఈశ్వరి మనసుకి కాస్త ఛేంజ్ కావాలంటే ఆఫీస్‌కు వెళ్ళడమే మంచిదనుకుంది.

* * * *

ఈశ్వరి పెళ్ళికాక ముందు ఆయనకు గుండెనొప్పి వచ్చిన తర్వాత తండ్రి ఆరోగ్యం గురించి మాట్లాడుకుంటున్న సందర్భాల్లో ఓసారి ఈశ్వరి అంది. "ఇంకెందుకు డాడీ ఈ బిజినెస్! ఇంకా సంపాదించి ఎవరికి పెట్టాలి చెప్పండి. సంపాదనకు మితం ఏముంది! అంతా క్లోజ్ చేసేసి హాయిగా రిలాక్స్ అవ్వండి" అంది.

"బిజినెస్ అనేది ఓ పద్మవ్యూహం లాంటిది తల్లీ! దీంట్లో రావటానికి మాత్రమే ప్రవేశముంటుంది. తిరిగి వెళ్ళాలనుకుంటే క్షేమమైన దారి దొరకదు. ఎక్కడికక్కడ ఛేదించుకుని బయటపడాలి."

ఆనాడు చుట్టూ తెగిపడి వున్న బంధువుల శవాలను చూసి అభిమన్యుడెంత బాధపడ్డాడో అంతకు రెట్టింపుగా మనం అనుభవించాలి.



బిజినెస్ అనేది ఎప్పుడూ రొటేషన్‌లో వుంటేనే మనుగడ లభిస్తుంది.

ఉన్నట్లుండి క్లోజ్ చేశామనుకో—

ఆదాయం ఆగిపోతుంది. ఖర్చులు మాత్రం జరుగుతూనే ఉంటాయి. ఎక్కడెక్కడో దాగి వుండే నష్టాలన్నీ బయటకు వస్తాయి.

పరువు పోతుంది!

ప్రెస్టేజీ పోతుంది!

ఉన్న డబ్బంతా సాలిడ్ ప్రాపర్టీస్ మీద వుండేసరికి డెయిలీ మెయింటెయిన్స్‌కు కూడా ఇబ్బంది మొదలవుతుంది.

ఇవన్నీ నీకు చెప్పినా అర్థంకావు తల్లీ!

చూద్దాం....!

జరిగినన్ని రోజులు జరగనిద్దాం....

ఆయన చెప్పినదాంట్లో నిజాలు వెంటనే అర్థంకాలేదు.

తర్వాత తర్వాత ఆలోచిస్తూంటే అవన్నీ ఎంతెంత భయంకరమైన సత్యాలో అర్థం చేసుకుంది ఈశ్వరి.

బిజినెస్ చేసేవాళ్ళు అందులోనే ఎందుకు కొట్టుకుంటారో, రాజకీయవాదులు ఆ సముద్రంలోంచి బయటికెందుకురారో, గూండాలెందుకు గూండాయిజాన్ని వదలరో, ఈశ్వరికి ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నాయి.

ఒకనాడు క్లోజ్ చేసేయమన్న ఆఫీస్ ఇవ్వాళ ఈశ్వరికి మనశ్శాంతినిచ్చే దేవాలయం అయ్యింది.

ఆమెకు వృత్తే దేవుడు!

* * * *

ఆ రోజు ఆదివారం!

ఉదయం ఉదయించాల్సిన సూర్య భగవానునికే ఈ రోజు ఆలస్యం అయింది.

ఏమయ్యా అంటే—

ఏం చేయను.... అలుముకున్న కారుమేఘాలను తప్పించుకోవటం

నాపల్లకాలేదన్నాడు.

"ఆ యుద్ధంలో చాలా అలసిపోయాను. నన్ను డిస్టర్బ్ చేయొద్దు" అని ఖచ్చితంగా చెప్పేశాడాయన.

దాంతో మబ్బులకు కూడా రోషం వచ్చినట్లుంది. కోపంతో బుసలు కొడుతూ అటు ఇటూ పచార్లుచేస్తూ ఒకళ్ళనొకళ్ళ ఢీ కొట్టుకుంటున్నాయిలా వుంది.

వర్షం మొదలైంది.

తెరిపిలేకుండా పడుతూనే వుంది.

సాయంత్రం వచ్చిన చుట్టాలు, ఉదయాన్నే పట్టుకున్న వర్షమూ త్వరగా వదలవు అని అంటారు.

చూస్తుంటే అలాగే వుంది.

విశ్వనాథం ముందర వరండాలో నించుని వర్షాన్ని చూస్తూ, చలి గాలికి వణుకుతూ, వేడివేడి కాఫీ తాగుతున్నాడు.

అతనికి ఆ అనుభవం చాలా హాయిగా పసందుగా వుంది.

పెద్దమ్మ వంటగదిలోనే వున్నది. ముందరి గదులకూ వంట గదికీ మధ్య వుండే వరండా అంతా వర్షంవస్తే తడిసిపోతుంది. ఆ తడిలో అటు ఇటూ నడుస్తూ ఎక్కడ పడిపోతానో అని ఆమె భయం!

అందువల్ల ఎటువైపున వుంటే అక్కడి పనంతా పూర్తి చేసుకుని రెండో వైపుకి వెళుతుంది.

సుజాత ఇంకా నిద్ర లేవలేదు.

ఆమె లేచాక టిఫిన్ తయారుచేయవచ్చని ఎదురుచూస్తోంది పెద్దమ్మ.

కరెంటు లేదు.

చీకటి చీకటిగా వున్న ఆ వాతావరణం చిరాగ్గా కూడా వున్నది.

ఆదివారానికీ బద్ధకానికీ వాతావరణం తోడైంది.

కలుసుకున్న మిత్రులు ఆపకుండా కబుర్లు చెప్పుకుంటున్నట్లుగా వర్షం విసుగూ, విరామం అనేవి లేకుండా పడుతూనే వున్నది.

అంత వర్షంలోనూ ఒక తోపుడు బండిపై మొక్కజొన్న కండెలు పెట్టుకుని అమ్ముకోటానికి వచ్చాడు.



తల తడవకుండా గోనెసంచీ, అది తడవకుండా ఒక ప్లాస్టిక్ కవరూ, ఇంత వర్షంలో కూడా వాడు సంపాదించుకుంటేగానీ ఇంట్లో గడవదు కాబోలు అనుకున్నాడు విశ్వనాథం.

అతడ్ని పిల్చి ఆగమని చెప్పి లోపలకెళ్ళి గొడుగు, డబ్బులు, బుట్ట తీసుకెళ్ళాడు.

"మంచివి చూసివ్వు" అని అడిగిమరీ తీసుకొచ్చి పెద్దమ్మకిచ్చాడు.

"ఇప్పుడు తింటావా?" నవ్వుతూ అడిగింది. గొడుగుని బయటి గడప దగ్గర మూలగా పెడుతూ అన్నాడు.

"ఊఁ....ఈ చలిలో, వర్షంలో తింటేనే అవి రుచిగా వుంటాయి."

నవ్వింది పెద్దమ్మ.

"మరి నీళ్ళు కాగాయి నీకు."

"అవునా! అయితే ముందర స్నానంచేసి వస్తాను."

వేడినీళ్ళు బకెట్‌లో పోయించుకుని బాత్‌రూంకెళ్ళాడు విశ్వనాథం.

బయట పడుతున్న వర్షం చూస్తూ కూర్చున్నది పెద్దమ్మ.

సుజాత ఇంకా లేవలేదు.

పెద్దమ్మకు కొన్ని రోజులుగా సుజాతను గురించి ఆలోచిస్తోంటే అనిపిస్తోంది.

'ఇప్పుడిప్పుడే పెళ్ళిళ్ళు చేసుకుని వస్తున్న కోడళ్ల కట్నాలూ, పారెలూ మాట ఎలా ఉన్నా కొన్ని కొన్ని ఘాటైన భావాలతో వస్తున్నారనిపిస్తోంది.

వాళ్ళకు మంకెన పువ్వు ఎర్రగా వుంటుందనీ, గోంగూర పుల్లగా వుంటుందనీ, అన్నం తెల్లగా వుంటుందనీ, అత్త రాక్షసిలా వుంటుందనీ, లెక్కల్లోని సిద్ధాంతాల్లా ఏవో కొన్ని నమ్మకాలున్నట్లున్నాయి.

అందుకే వచ్చీరావటమే ఇలా యుద్ధభేరి మ్రోగించుతున్నారు.

వెనకటిరోజుల్లో ఆడపిల్లకు పెళ్ళిచేసి అత్తగారింటికి పంపేటప్పుడు అక్కడ క్రొత్తవ్యక్తులతో ఎలా మెలగాలో, అత్తమామల దగ్గర ఎలా మసులుకోవాలో, భర్తకు అనుకూలవతిగా ఎలా మనుగడ సాగించాలో అన్నీ చెప్పి పంపించేవారు - తల్లిదండ్రులు!

మరి—ఇప్పటి రోజుల్లో అలా కాకుండా నీకు నీ భర్తే ముఖ్యం! నీ భర్త సంపాదన జాగ్రత్త చేసుకో! అది నీ ఇల్లే! మిగిలినవాళ్ళందర్నీ బయటకు తరిమెయ్ అని చెబుతున్నారా లేక ఇప్పటి పిల్లల తలల్లో ఇలాంటి తెలివితేటలు పెరుగుతున్నాయో అర్థంకావటంలేదు.

రావటమే ఎడముఖం, పెడముఖం అయిపోతోంది! ఉప్పు నిప్పులా ఎప్పుడూ చిటపటలాడే అయిపోతున్నాయి.

వెనకటి రోజుల్లో కోడలు అంటే జీతం బత్తెంలేని ఓపని అమ్మాయిలాగా కొన్ని కుటుంబాల్లో, గడసరి అత్తలు భావించి కష్టాలుపెట్టి వుండవచ్చు! ఆ ఆధారంతోనే అత్తగారిగా ఓ గయ్యాళి గంపలాగా సూర్యకాంతాన్నీ ఎప్పుడూ ఏడుస్తూ అత్తగారి ధాటికి తట్టుకోలేక తల్లడిల్లిపోయే మేకపిల్లలాంటి కోడలుగా ఏ సావిత్రినో చంద్రకళనో చూపిస్తూ బోలెడు సినిమాలు కూడా వచ్చాయి.

దాంతో ఆ భావన అలా స్థిరంగా వుండిపోయింది. అంతేగానీ అందులో నిజం ఎంతవరకూ ఉన్నది! నేతిబీరకాయలో నెయ్యి వున్నట్టే!

లేకుంటే అత్తలందరూ రాక్షసులూ, కోడళ్ళందరూ దేవతలే అయితే అత్త అత్తగానూ పుట్టలేదు! కోడలు కోడలిగానే ఉండదు!

ఓనాటి కోడలే ఈనాటి అత్త!

ఈనాటి కోడలే రేపటి అత్త!

ఈ దేవతల్లాంటి కోడళ్ళందరూ రేపు అత్త స్థానాల్లోకి వచ్చేసరికి రాక్షసులవుతున్నారా!

కుమ్మరి కుండలు చేస్తాడనీ, చాకలి బట్టలుతుకుతాడనీ చెప్పినట్లే ఈ అత్తాకోడళ్ళ పదాలకు కూడా అర్థాలు నిర్ధారణ చేసేశారు! దానికి తగినట్లే ప్రతి విషయంలోనూ పురుషుడిదే పై చేయిగా వుండే ఈ సమాజంలో ఆడపిల్లలకు పెళ్ళిచేసి, భర్తర దగ్గరకు పంపేటప్పుడు మాత్రం 'అత్తగారిల్లు' అంటారు.

ఏం? మామగారిల్లు అని ఎందుకు అనరు?

ఎవరయినా అడ్రసుకోసం వెదుకుతూ ఫలానా రావుగారిల్లు అనో, చౌదరిగారిల్లు అనో, సోమనాథగారిల్లు అనో అడుగుతారు గానీ అనసూయమ్మ





గారిల్లు, అనో అన్నపూర్ణమ్మగారిల్లు అనో అడగరుకదా!
పెళ్ళికాకముందు ఫలానావారి అమ్మాయిగానూ, పెళ్ళయ్యాక ఫలానా
వారి భార్యగానూ, తల్లి అయ్యాక ఫలానావాళ్ళ అమ్మగానూ— జీవిత
మంతా తెరవెనుక ఉండే చెలామణీ అయ్యే ఈ ఆడబ్రతుకుల్ని ఈ 'అత్త'
అనే బిరుదు ఇచ్చి అప్పుడు మాత్రం రచ్చకీడుస్తారెందుకు?
ఇది ఎంతవరకూ న్యాయం అని అడగటం కూడా చేతగాని అత్త
లను రాక్షసులుగా ముద్రవేసేసారు. ఏ ప్రబుద్ధుల ఉద్ధరింపోగానీ అలా ఆడ
జన్మలకు ఓ సార్థకతను చేకూర్చిపెట్టారు.
మంచి అనేది రాకపోయినా చెడు మాత్రం వదలకుండా వంశపరం
పర్యంగా వస్తూనే వుంటుంది.
ఈ అత్తగారి పెత్తనం అనే పదం కూడా ఓ అంటు వ్యాధిలా
వ్యాపించి స్థిరపడిపోయింది.
ఈ రోజుల్లోని ఇలాంటి కోడళ్ళను ఎలా పోలుస్తారో ఎక్కడా
చిత్రించలేదు.
సుజాతలాంటి కోడళ్ళ ముందు ఎలాంటి అత్తలయినా బలాదూరే.
ఎవ్వరూ నోరు తెరచి మాట కూడా మాట్లాడలేరు.
తన కొడుకుని తాకటానికే అనుమతించని ఈ కోడల్ని ఏమంటారో
ఏ నిఘంటులోనూ వ్రాసినట్లు లేదు.
పూజించాల్సిన అత్తమామల్ని కనీసపు గౌరవంతో కూడా చూడని
ఈ నాటి కోడళ్ళని ఏ పేరుతో పిలవాలి మరి!
తన తల్లిదండ్రులే మనుష్యులు! తన భర్త తల్లిదండ్రులు మాత్రం
అడవి జాతికి చెందినవాళ్ళు! వాళ్ళకు పుట్టినవాడు భర్తగా కావాలి! వాళ్ళ
సంపాదించిన ఆస్తి కావాలి!

కాని—
ఆ మనుషులు కానీ, వాళ్ళ నీడకానీ భరించలేరు!
చిన్న పిల్లలతనంలే అని వదిలేయటానికీ లేదు! అలాగని వాళ్ళ
చేష్టల్ని లెక్కలో తీసుకుని కోపాన్ని పెంచుకుని సాధించగలిగేదీ లేదు!
ఎందుకంటే స్త్రీ మనసు తాళికట్టిన వాడ్నికంటే కూడా పేగుతెంచు

కని పుట్టిన వాళ్ళనే ఎక్కువగా ప్రేమిస్తుంది.

ప్రతి ఆడమనసుకూ తెలుసు—

జీవితాంతం తోడు ఉండి తన జీవితాన్ని వెళ్ళమార్చేది భర్తగానీ పిల్లలు కాదు అని!

అయినాసరే ఆ మమకారాన్ని చంపుకోలేదు.

ఆ రక్తసంబంధాన్ని వదులుకోలేదు!

కోపం వచ్చి నాలుగు తిట్టినా రెండు కొట్టినా ఆ పిల్లల క్షేమంకోసం ఆ పిల్లల భవిష్యత్తుకోసం ఏం చేయటానికైనా వెనుకాడదు ఈ భారతస్త్రీ!

కొవ్వొత్తిలా కాలిపోతూ ఆ వెలుగులో బిడ్డల భవిష్యత్తుకు బాట వేయాలనుకునే తల్లి మనసుకు సాటి ఈ భూ ప్రపంచం మొత్తం మీద ఏమూలా ఉండదు!

విశ్వనాథం వచ్చాడు.

పీటవేసుకుని కూర్చుంటూ అన్నాడు.

"వేడినీళ్ళతో స్నానం చేసినా చలి వేస్తూనేవుంది."

"ఇదుగో! ఈ వేడి కండెతిను. చలి తగ్గుతుంది."

అతడు వేడిగా కండెలు తింటుంటే ఏవో ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెపుతూన్న పెద్దమ్మ ఆనంది సమాచారం తీసుకొచ్చేంది.

"ఈ సంవత్సరంతో ఆనంది చదువు అయిపోతుంది. దానికేదయినా మంచి సంబంధం చూసి పెళ్ళి చేసేస్తే మన బాధ్యత తీరిపోతుంది. ఏలోకాన ఉన్నా దాని అమ్మానాన్నల ఆత్మలకు శాంతి కలుగుతుంది."

"అవునమ్మా! నేనూ అదే ప్రయత్నంలో వున్నాను. దెబ్బతిని వున్నాం కనుక తొందరపడకుండా నిర్ణయం తీసుకుంటాం."

సుజాత నిద్రలేచి వచ్చింది.

"గుడ్‌మార్నింగ్" నవ్వాడు విశ్వనాథం.

"కండి తింటావా? వేడివేడిగా రుచిగా వుందా" అతడి చేతిలోని కండిని కంపరంగా చూస్తూ అన్నది.

"ఛీ!ఛీ! అలాంటి తిళ్ళు నాకిష్టముండవు." పెద్దమ్మ ఇచ్చిన కాఫీ తీసుకుని గడపలో నించుని తాగుతోంది.



"ఇప్పుడు స్నానం చేస్తావా సుజాతా! నీళ్ళు స్టౌమీద పెడతాను."

"ఏం బాయిలర్ వేయలేదా?" ఆమె గొంతులో అధికారం.

"బయట వర్షం పడుతోందికదమ్మా! అందుకని వేయలేదు."

ఆమె గొంతులో మమకారం!

"ఊఁ—" కప్పు అక్కడ పెట్టేసి వెళ్ళిపోయింది.

విశ్వనాథం మనస్సు భగ్గుమంది.

కప్పు కడిగిపెట్టవచ్చుగా!

ఉహూఁ— అది మనిషికాదు!

ఆడమనసు అంతకన్నా కాదు!

ఖర్మకాలి నాపాలిట పెళ్ళామయింది!!

* * * *

ఆదివారం!

హాస్టలు వరండాలో నలుగురూ కూర్చుని సరదాగా పేకాడుతున్నారు.

"అనితకు విజిటర్స్ వచ్చారు" రంజని వచ్చి చెప్పింది.

అనిత కళ్ళు చురుగ్గా మెరిశాయి.

ఇందాకట్నుంచీ ఒకటి రెండుసార్లు వాచ్ చూసుకోవటమూ, ఎప్పటిలా కాకుండా కాస్త ప్రత్యేకంగా తయారవటమూ గమనించారు గానీ పట్టించుకోలేదు.

ఆమె ముఖంలోకి ఎరుపూ, కళ్ళల్లోనికి మెరుపూ పొక్కుంటూ వచ్చాయి.

ఆశ్చర్యపోయారు.

"ఎవరోయ్? మేమూరావూ?"

"నో" చటుక్కున అన్నది.

"వై?" నమ్మలేనట్లుగా అడిగింది.

అప్పటికే లేచిన అనిత "తర్వాత చెబుతాను" అంటూనే పరుగు తీసింది.

దూరంగా వెళుతున్న అనితను ఆశ్చర్యంగా చూశారు.

రంజని అంటోంది.

వెరీ స్మార్ట్‌గా వున్నాడు. బోయ్‌ఫ్రెండేమో" అందరూ నవ్వుకున్నారు.

రంజని ముందర నవ్వేసినా అందరి మనసుల్లోనూ 'అతడెవరు?' అనే ప్రశ్న వినిపిస్తూనే వుంది.

ఆనంది రంజనిని అడిగింది-

"నీ మేరేజి ఫిక్స్ అయిందిట కదా?"

"అవును!"

"అతనేం చేస్తాడు?"

"వ్యవసాయం."

"హా నైస్! నీ సెలెక్షనా?"

"నాకు అత్తకొడుకు! ఇంట్లో అందరకూ ఇష్టం. అఫ్‌కోర్స్— నాకూ ఇష్టమే!" సిగ్గుగా నవ్వింది.

అనిత వచ్చింది. బై చెప్పి రంజని వెళ్ళిపోయింది.

అనితతోపాటుగా వచ్చిన యువకుడ్ని చూస్తూ లేచి నిలబడ్డారు

"మిస్టర్ శ్రీనివాసన్! ది గ్రేట్ మెజీషియన్."

నమస్కారం చేశారందరూను!

"మై బెస్ట్‌ఫ్రెండ్స్-ఆనంది, ఉమ, ఊహ."

ఆశ్చర్యపోయారు.

అనితకూ, అతడికీ ఇంత స్నేహం పెరిగిందనిగానీ, కేవలం అనిత కోసం ఇంత దూరం వస్తాడనిగానీ వూహించలేదు.

అతడు చిన్న చిన్న మాజిక్కులు చేసి నవ్వించాడు.

అతడు ఎక్కడెక్కడ ప్రదర్శనలు ఇచ్చిందీ, అతడికి ఆవిద్యపట్ల ఎలా ఆసక్తి కలిగిందీ, ఎలా నేర్చుకున్నదీ, దానివల్ల అతనికి కలుగుతున్న తృప్తీ, పలుకుబడీ చెబుతున్నాడు.

'అతడు తిరిగిన దేశాలూ, ప్రదేశాలూ చెబుతూంటే కాసేపు అక్కడ తిరిగొచ్చినట్లే వుంది.

అతడు చెప్పే తీరు చాలా ప్రశంసనీయంగా వుంది.

ఓ గంటసేపుండి వెళ్ళాడు.



చాలా కబుర్లు చెప్పాడు.

'మంచి స్నేహితుడు.'

అతని మూవ్‌మెంట్స్‌లోను, అతడి స్వరంలోనూ ఓ విధమైన గంభీరతా, హుందాతనమూ వున్నాయి' అనుకున్నారు.

* * * *

ఆ రోజు ఆనంది పేరిట పోస్టులో ఓ తమిళ పత్రిక వచ్చింది.

"ఏమిటిది? నీకెందుకు పంపారు? ఇంతకుముందు ఎప్పుడూ రాలేదే?"

ఊహ గడగడా అడుగుతూన్నది.

ఆనంది పత్రిక తీసి తెరచి స్నేహితులకు చూపింది.

"ఈమధ్య ఏమీ తోచక ఓ ఆర్టికల్ వ్రాసిపంపాను. అది వాళ్ళకు నచ్చింది కాబోలు! ప్రచురించారు."

"వాహ్! వాట్ ఎ సర్‌ప్రయిజ్! ఏది ఏది నీ పేరెక్కడ?" బుక్‌లోకి చూస్తూ అడిగింది.

"ఇది! ఇదే నా పేరు" ఆనంది చెప్పింది.

మిగిలిన ముగ్గురూ నిరాశగా చూస్తూ "మాకేం తెలుస్తుందే తల్లీ! కాస్త చదవ్వూ" అన్నారు.

"అది చదివితే మాత్రం మనకేం అర్థమవుతుంది. అనువాదం కావల్సిందే" నవ్వుకున్నారు.

ఆనంది ఆ పేజీలు త్రిప్పి చూసి చదువుకుంటోంది.

'జీవితంలో స్థిరపడటం అంటే చదువూ, ఉద్యోగంకంటే పెళ్ళి, సంసారం అనే పదాలకే ముఖ్యస్థానం ఎందువల్ల!

అదీ ఆడపిల్లల విషయంలో మరీను! జీవితానికి పెళ్ళి అంత ముఖ్యమా!

పెళ్ళి అనేది లేకుండా. మగతోడు లేకుండా, కుటుంబం అనేది లేకుండా ఓ ఆడది ఒంటరిగా బ్రతకలేదా!

అసలు కుటుంబంలో స్త్రీ అవసరం ఏమిటి? ఆమె పాత్ర ఎంత వరకు!

పంట చేయటం—

భర్తకు అవసరమయినపుడు ఆయన కోరిక తీర్చటం- ఫలితంగా అవ్వనీ లేదా వంశాభివృద్ధికే అవ్వనీ—

ఏదైనా- పిల్లల్ని కనటం—

కన్నాక పెంచటం—

పెంచాక పెళ్ళిళ్ళు చేయటం—

మళ్ళీ వాళ్ళ పిల్లల్ని పెంచటం—

అసలు ఆడవాళ్ళకు జీవితమంటే ఇదేనా!

ఆవిడ పరిధి అంతవరకేనా?

డాక్టరయినా, కలెక్టరయినా—

ఆడది ఆడదే!

పనిమనిషి అయినా తలవంచి తాళి కట్టించుకోవలసిందే! మినిస్టరయినా తలవంచి తాళి కట్టించుకోవలసిందే!

మినిస్టరు కాబట్టి ఆవిడ తాళి కట్టలేదు కదా!

నేనింత కట్నం తెచ్చాను కాబట్టి కష్టపడి బిడ్డల్ని మోసి, కనే పని నేనెందుకు చేయాలి? నువ్వే కను- అని అనలేదు కదా!

ఎంత గొప్ప ఆడదయినా ఏ రోజయినా ఆమెకుగా కోరిక పుట్టి భర్తను అడగలేదు కదా!

అదే-స్త్రీ! ప్రకృతిపరంగా, సంఘపరంగా కొన్ని నిబంధనలూ, ప్రత్యేకతలూ పుణికిపుచ్చుకున్నదే స్త్రీ!

ఓ బస్తా కదిలించాలన్నా, ఓ బరువుని ఎత్తాలన్నా మగవాడు చేయగలడుగానీ ఆడది చేయలేదు.

అలాగే ఓ బిడ్డను కనాలన్నా, పాలిచ్చి పెంచాలన్నా ఆడది చేయగలదు.

అదే ఆడా-మగా—

జాతిలో తేడా! ఆడజాతి-మగజాతి!

సృష్టిలో తేడా!

ఆచారవ్యవహారాల్లో, ఆర్థిక వ్యవస్థలో, కట్టుబాట్లలో తేడా!



మాటల్లో, చేతల్లో, కూర్చోవటంలో, నించోవటంలో, కట్టులో, బొట్టులో, జుట్టులో—

ఒకటేమిటీ—ఈ ప్రపంచంలో ఎన్ని వున్నాయో- అన్నింటిలోనూ మగ-ఆడ అనే తేడా వుంటూనే వున్నది.

ఆ తేడా తేడానే! అది పోవాలనీ, సమానత్వం కావాలనీ-ఈ అరుపులూ, గోలలూ, సంఘాలూ, సమస్యలూ—

కేవలం మూర్ఖత్వం!

అసలు సమానత్వం అంటే ఏమిటి?

ఎందులో సమానత్వం కావాలి?

ప్రపంచం అంటే ఏదో కాదు!

ఎక్కడో లేదు!

అది—మన ఇల్లు!

మన ఇంట్లో మన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించితే మన హక్కులు మనం సగర్వంగా పొందవచ్చు.

మనకు కావలసింది సగౌరవంగా తీసుకోవచ్చు! దానికింత హంగామా చేసి గగ్గోలు పెట్టవలసిన అవసరమే లేదు.

మరిదంతా ఏమిటి?

ఓ గొప్ప పొలిటికల్ డ్రామా!

పేపర్లో ఫోటో పడాలన్నా, పదిమందిలోనూ హాట్‌న్యూస్‌లాగా నలగాలన్నా- గొప్పవాళ్ళన్నా అవ్వాలి. లేదా బెడ్డవాళ్ళయినా అవ్వాలి. అదీ ఇదీ కాకపోతే నాలుగు కేకలువేసి నలుగుర్నీ ఆకర్షిస్తూ రచ్చకయినా ఎక్కాలి.

ఈ రోజుల్లో గొప్ప పనులు చేసి గొప్పవాళ్ళవటం కష్టం. కొండ లెక్కటమే అది! దానికి చాలా సమయం కావాలి. ఓర్పు కావాలి.

ఇప్పుడెవరికీ అంతంత తీరిక సమయాలు దొరకటంలేదు. అందుకే బెడ్డవాళ్ళయినా ఫర్వాలేదు త్వరగా గొప్పవాళ్ళయిపోవాలి.

దానికి కావలసింది పాపులారిటీ, పబ్లిసిటీ- దానికి డబ్బు! పలుకుబడి! ఈ అరుపులూ, గోలలూ—

ఎడమచేయి ముఖ్యమా, కుడిచేయి ముఖ్యమా అనేది ఎంత తెలివి

తక్కువ ప్రశ్నో- స్త్రీయా- పురుషుడా అనే సమస్య కూడా అలాంటిదే!

ఆడా మగా ఇద్దరూ కలిస్తేనే జీవితం!

వాళ్ళు లేనిదే వీళ్ళు లేరు. వీళ్ళు లేకుండా వాళ్ళు లేరు.

రైలుపట్టాల్లాంటి ఈ జీవితంలో అందరూ సమానమే! అందరికీ అన్నీ సమానమే!

ఉపయోగించుకునే వారినిబట్టి ఉంటుంది.

ఈ ప్రపంచంలో ఏ వస్తువునూ అందరూ ఒకేలా ఉపయోగించ లేరు! అలాగే ఏ నీతి అయినా, ఏ న్యాయమైనా, ఏ సిద్ధాంతమైనా, ఏ నియమమైనా, ఏ కట్టుబాటయినా-అవసరాన్నిబట్టి, కాలాన్నిబట్టి మార్చు కోవాలి!

ఏదయినా స్త్రీ-పురుషుడూ కలిస్తే సాధించగలుగుతున్నారు?

ఇద్దరూ సమానమే!

ఎవరిది ప్రాముఖ్యత? అంటే ఒక్కరిగా ఎవ్వరిదీ కాదు! ఇద్దరిదీ అవుతుంది.

ఆయా కుటుంబాల్నిబట్టి, ఆ వ్యక్తుల మనోభావాల్నిబట్టి, వారి-వారి పరిస్థితుల్నిబట్టి ఒక్కొక్కరు ఆధిపత్యం వహిస్తుంటారు.

అంతేగానీ- అదో ఆచారమో, సంప్రదాయమో అవదు.

పురుషుడు శారీరకంగానూ, మానసికంగానూ బలవంతుడవటంవల్ల అతడి అండలో కుటుంబసభ్యులు అణగి వుండటం సహజం!

అందరి కోసమూ అతడు పాటుపడుతున్నాడు కాబట్టి అతనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటమూ ధర్మం!

అంతమాత్రాన అతడేదో అధికారం చెలాయిస్తున్నాడనీ, స్త్రీలను అణచివేస్తున్నారనీ అరుపులూ-గోలలూ చేయటం ఎంతవరకూ భావ్యమవు తుంది?

అసలు కొడుకులు కావాలనే కోరిక, మగపిల్లాడు పుట్టగానే చేసుకునే పండుగలూ-ఇవన్నీ ఆడవారి బలహీనతలు కావూ! ఆడపిల్లలు వద్దు అని తమని కాము అవమానం చేసుకోవటం కాదూ!

'మగ' అనే కిరీటం పెట్టిందీ ఆడవాళ్ళే!



వాళ్ళమీద ధ్వజంఎత్తి యుద్ధభేరీలు మ్రోగించుతూన్నదీ వీళ్ళే!

ఈ ఆడవాళ్ళు మాకు సమానత్వం కావాలని అరుస్తూ ఊరేగింపులు జరుపుతూ పేపర్లో ఫోటోలు వేయించుకుంటూంటే—

పరోక్షంగా-మేము ఆడవాళ్ళమంటే అబలలం! మాకేమీ చేతకాదు! మేమేమీ చేయలేము- అని చెప్పుకున్నట్లుగా లేదూ!

మగవాళ్ళకు ఆ ఆధిపత్యాన్ని ఇగోసీ వీళ్ళే అందిస్తూన్నట్లుగా లేదూ—

పదిమందికీ పనికివచ్చేలా, అందరకూ ఉపయోగపడేలా, ఈ సభ్య సమాజంలో ఓ క్యాన్సర్ లాగా ప్రబలిపోతూన్న అరాచకాలనూ, అన్యాయాలనూ, స్వార్థాన్ని, మోసాలను ఖండించటానికి ప్రయత్నం చెయ్యి! నడుంకట్టు! నిద్రపోతూన్న జనాన్ని లేపు! చైతన్యవంతుల్ని చెయ్యి!

ఒక ఉన్నతమైన, ఆదర్శవంతమైన, అభ్యుదయ ప్రపంచంలోకి చేయిపట్టి తీసుకువెళ్ళు!

దేశమంటే మట్టికాదోయ్- దేశమంటే మనుషులోయ్ అని ఋజువు చెయ్యి!

మారాలి మారాలి మనుషులు మారాలి అనీ, రావాలి రావాలి మార్పు రావాలి అనీ అరవద్దు!

ఆచరించి చూపెట్టు.

చెప్పేవారూ, వినేవారూ, చేసేవారూ వేరు వేరుకాదు- ఒక్కరే అవ్వాలి!

అప్పుడే జీవితం బంగారమౌతుంది! సూర్యకిరణాలంత స్వచ్ఛంగా వాడిగా వుంటుంది.

తోటి మనిషిపై అనురాగం, ఆప్యాయత, ప్రేమ—

మనసుల్లో దయా, దాక్షిణ్యం, స్నేహం-గౌరవం-వాత్సల్యం—

ముఖ్యంగా ఐక్యమత్యం-

భవిష్యత్ పై నమ్మకం-

రేపుపై ఆశ-ఇవీ మనిషికి వుండవలసిన బేసిక్ అవసరాలు.

ఉండటానికి ఇల్లు, తినటానికి తిండి, కట్టటానికి బట్ట ఎంత అవ

సరమో-

మనిషికి బ్రతకటానికి ఆ లక్షణాలు చాలా అవసరం!

కేవలం బ్రతకటమే ముఖ్యంకాదు!

మనిషిగా మంచిగా బ్రతకాలి.

అప్పుడే-

శ్రీరాముడయినా, శ్రీకృష్ణుడైనా, వెంకటేశ్వరుడయినా, యేసుక్రీస్తు అయినా, అల్లా అయినా దీవిస్తారు.

'మాంగల్యం తంతునానేనా'లాంటి మంత్రాలకు విలువ వుండి ఒకే కుటుంబంలా ఒకతాటిమీద ఒక కట్టుబాటులో పయనింపజేస్తాయి.

* * * *

సుజాత సినిమాకి వెళదామని అడిగింది విశ్వనాథాన్ని.

అది అడగటం కాదు! నిజం చెప్పాలంటే చెప్పటమవుతుంది.

అతడు ఉదయం బాంక్ కు తయారవుతూ అన్నాడు-

"బాబుని తీసుకురా! చూడాలని వుంది."

అతడి మాటకు జవాబు చెప్పకుండా—

"సాయంత్రం సినిమాకి వెళ్ళాలి" అంది.

విశ్వనాథం వెనక్కి తిరిగి చూసాడు.

తను చెప్పిందేమిటి?

ఆమె అనేదేమిటి?

కోపాన్ని అణచుకుంటూ బయటికివెళ్ళిపోయాడు.

బాంక్ కు వెళ్ళాక ఇహ అతడి మనసు అక్కడి పనుల్లో లీనమై పోతుంది!

ఆ హడావుడిలో పర్సనల్ లైఫ్ ని మర్చిపోతాడు. అలా చేయలేక పోతే అతనికి ఏనాడో పిచ్చిపట్టేసేది.

ఇదివరకు బాంక్ నుండి ఇంటికివచ్చి ఏమైనాతిని కాఫీ తాగి సూపర్ మార్కెట్ కి వెళ్ళేవాడు.

ఇప్పుడు సుజాత ఇంటిలో వుండగా అతనికి ఇంటికి రావాలనే కోరికే చచ్చిపోతుంది.



అందువలన అతడు ఇంటికి రాకుండా బాంక్ నుండి సూపర్ మార్కెట్టుకి వెళ్ళిపోతాడు.

ఇవ్వాళకూడా విశ్వనాథం అదేపని చేసాడు. నిజం చెప్పాలంటే అతడు కావాలని అలా చేయలేదు.

సుజాత చెప్పిన సినిమా ప్రోగ్రాం సంగతి అసలు మర్చిపోయాడు.

సుజాత మార్కెట్ లో పని ముగించుకుని వస్తూ వస్తూ కావాలని తల్లి చెప్పిన సరుకులూ, కూరలూ తీసుకుని ఇంటికి వచ్చాడు.

ఇల్లు చాలా నిశ్శబ్దంగా వుంది.

తల్లికి సామాన్లు అందించి గదిలోకి వెళ్ళాడు విశ్వనాథం.

సుజాత మంచంపై పడుకుని వుంది.

ఒకసారి ఆమెవేపు చూసి బట్టలు మార్చుకుంటున్నాడు.

వెనుకనుండీ ఏదో విసురుగా వచ్చి తనీమని తగిలేసరికి ఉలిక్కిపడి చటుక్కున వెనక్కి తిరిగాడు.

అప్పటికే తలగడదిండు ఒకటి తలకు తగిలి క్రిందపడింది.

మరో దిండుని విసురుతోంది సుజాత.

గబుక్కున తలను ప్రక్కకు జరిపాడు.

ఆ దిండు తిన్నగా వెళ్ళి డ్రెస్సింగ్ టేబిల్ అద్దానికి తగిలి టేబిల్ పైన పడింది.

ఆ పడటంలో టేబిల్ పైన వున్న తిలకంసీసా, కాఫీ కప్పు క్రింద పడి ముక్కలయ్యాయి.

విశ్వనాథానికి ఎన్నడూ లేనంత విసుగూ, కోపమూ కలిగాయి.

చిరాగ్గా చూస్తూ అడిగాడు—

"ఏమిటిది? ఏంచేస్తున్నావు?"

"ఒళ్ళుమండుతోంది."

"ఏం? ఏం జరిగింది?"

"అసలు మీకేమయినా బుద్ధుందా? నేను సినిమాకెళ్ళాలని చెబితే ఇప్పుడా వచ్చేది?"

విశ్వనాథం మాట్లాడలేదు. 'అరే మర్చిపోయాను! ఉదయం అన్నది

కదూ' అని గుర్తు తెచ్చుకుంటున్నాడు.

'కానీ ఆవిడ అడిగే పద్ధతి ఇది కాదు' అని కూడా అనుకుంటున్నాడు.

"నేనన్నా, నా మాటన్నా మీకు లెక్కే లేదా?"

క్రిందపడి పగిలిన గాజుముక్కల్ని పేపరు మీదికి తీస్తున్నాడు విశ్వనాథం

"నేనంటే ఇష్టంలేనప్పుడు ఆ ఏడుపేదో చెబితే నా దారి నేను చూసుకుంటానుగా" మళ్ళీ రెట్టించుతూన్నట్లుగా అంది.

"అసలు మర్చిపోయాను సుజాతా...." నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అన్నాడు.

"ప్రొద్దున్న అంత గట్టిగా చెబితే మర్చిపోయారా?" దూకుడుగా అంది సుజాత.

"పని వత్తిడిలో మర్చిపోయాను రేపు వెళ్దాములే" అన్నాడు.

"రేపా! రేపేమిటి? ఇవ్వాళ ఆకలయితే రేపు అన్నం తింటామా.... నేనివ్వాళే చూడాలనుకున్నాను" పంతంగా అన్నది.

విశ్వనాథం మాట్లాడలేదు. ఇక మాట్లాడటం అనవసరం అనుకున్నాడు.

"నేనంటే విలువలేదు! నా మాటకు విలువలేదు."

విశ్వనాథం వినిపించుకోకుండా క్రిందపడిన ఆ గాజు ముక్కలన్నీ పేపరు మీదకు ఏరేసాడు.

"ఓ ముద్దూ ముచ్చటా ఏం వుండవు! సినిమాకెళ్ళే జాతకం కూడా లేదు."

"వెధవ సినిమాకోసం అంత కోపం ఎందుకు! రేపు-రేపుకాకపోతే ఇంకోరోజు వెళ్ళవచ్చు."

"మీరో అడవి మృగం! మీకు ఏ విధమైన ఆనందాలూ వద్దు. నేను అలా కాదు."

కోపం వచ్చినా నవ్వాడు విశ్వనాథం.

"వెధవ నవ్వూ, మీరూను."



మాట్లాడలేదు విశ్వనాథం.

క్రిందపడిన దిండ్లు తీసి మంచంమీద పెట్టాడు. గాజుముక్కలు బయటపారేసి చేతులు కడుక్కుని వచ్చాడు.

సుజాత ఇంకా అలాగే కూర్చుని వుంది.

"ఏమిటి ఇంకా కోపం పోలేదా?" అన్నాడు.

బట్టలు మార్చుకుంటూ అన్నాడు—

"భోజనం పెట్టు."

"అంతకన్నా ఇంకేం చేతనవుతుంది. తింటం, పడుకోవటం...." ఈసడించినట్లుగా అన్నది.

విశ్వం మనసు చివుక్కుమంది.

ఆమెకు చక్కగా మాట్లాడటం అనేది ఇక చేతకాదేమో! మర్యాదల గురించీ, మృదుత్వం గురించీ, ఆడతనం గురించీ ఆమెకు నెమ్మదిగా చాలాసార్లు చెప్పాడు.

"బాబోయ్....చాలు! వెధవ సుత్తి. ఇక ఆపండి" అనేది.

లేదా నిద్రపోయేది.

ఇంతవరకూ సుజాత పెద్దమ్మనూ, ఆనందినీ మాటలతో ఎంత బాగా చిత్రవధ చేయవచ్చో అంతగానూ హింసించేది.

కాని విశ్వనాథంతో ఇంతవరకూ పెట్టుకోలేదు. అతడేం మాట్లాడినా పెంకెతనంగా, మొండితనంగా ప్రవర్తించడం—

ఏదైనా అడిగితే పొగరుబోతుగా, వ్యంగ్యంగా సమాధానాలివ్వటం-

చెత్త మాటలతో విమర్శించటం-అంతేగానీ ఇంతవరకూ అతడిని రెచ్చగొట్టలేదు.

సుజాత మనసులో ఉద్దేశం అసలదికాదు! ఎలాగైనా అతడ్ని బాగా రెచ్చగొట్టి ఆ ఇల్లు కొనిపించాలని. అందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది.

విశ్వనాథం బట్టలు తీసి హాంగర్స్‌కు వేసాడు. కాళ్ళు కడుక్కోటానికి వెళుతూ మళ్ళీ అడిగాడు "భోజనం పెడతావా?"

"సిగ్గులేని జన్మలు."

"సుజాతా! మాట్లాడేముందు ఏం మాట్లాడుతున్నామో కాస్త ఆలోచించుకుంటే మంచిది."

"నా గురించి, నా ఆశల గురించి ఆలోచించని మీ గురించి నేనెందుకు ఆలోచించాలి."

"ఇక్కడ నీకేం తక్కువయింది?"

"నామాటంటే లెక్కలేనిచోట అన్నీ తక్కువే."

"ఇప్పుడు భోజనానికి వస్తావా రావా?"

"నువ్వసలు మొగాడివేనా! రోషం, పౌరుషం ఇవేమీలేవా?"

అసహ్యమేసింది.

ముంజేతి మీద బ్లేడుతో సన్నగా కోసినట్లు రక్తం చ్రుస పొంగింది.

ఏం మాట్లాడకుండా బయటకు వెళ్ళబోయాడు.

"నీకన్నా ఆంబోతునయం! దానికి పుట్టెడు పౌరుషం."

చ్రుస వెనక్కు తిరిగి చూసాడు.

దవడ ఎముక బిగుసుకుంటోంది.

కళ్ళల్లోనికి ఎర్రగ జీరలు-

నరాలు చిట్లిపోతాయేమో అన్పించింది.

పిడికెడంత మనసు!

ఎంత కోపాన్నని భరిస్తుంది.

ఉప్పెనలా పొంగుకొస్తున్న ఆగ్రహాన్ని అణచుకుంటూ అన్నాడు-

"నోరుముయ్యి."

"నా నోరు ముయ్యమనటానికి నువ్వెవడివి?"

"నీ మొగుడ్ని." అతడి కంఠంలో కత్తి అంచునమెరిసే పదును లాంటి కఠ ధ్వనించింది.

"ఆ మాట చెప్పటానికి సిగ్గులేదూ." రెచ్చిపోతున్నది సుజాత.

"ఆ మాట నేను నిన్నడగాలి."

చ్రుస లేచింది మంచం మీంచి.

అంత వేగంగానూ వచ్చి అతడి షర్టు పట్టుకుంది.



"నాకు సిగ్గులేదంటావా! ఓ చీరకొనే సత్తాలేదు. ఓ నగానట్రా, ఇల్లూ వాకిలీ. ఏమీ కొనలేని చవటవి. నాకు సిగ్గులేదంటావా?"

"ఛట్! పో అవతలకు. వెధవ వాగుడూ నువ్వూను" విసురుగా అన్నాడు ఆమెని చేతిని తోసేస్తూ.

"పెళ్ళాన్ని ఓ సినిమాకు తీసుకెళ్ళలేని నువ్వు, పెళ్ళాన్ని ఏలుకోవటం చేతకాని నువ్వు-నువ్వు వెధవ్వి."

ఓ బజారు ఆడదానిలా చేతులు తిప్పుతూ పెద్ద నోరు పెట్టుకుని అసహ్యంగా, అసభ్యంగా మాట్లాడుతూన్న సుజాతను ఏహ్యంగా చూస్తూ- "నువ్వు-నువ్వో పెళ్ళానివి" అన్నాడు.

"ఏం పెళ్ళాన్నికాదా?" పొగరుగా, విసురుగా అంటూన్న ఆమెని చూస్తూ నిర్లక్ష్యంగా అన్నాడు-

"మొగుడ్ని ఎంతమాటపడితే అంతమాట అనే నువ్వు పెళ్ళానివి. కట్టుకున్న వాడికి కడుపునిండా అన్నం కూడా పెట్టలేని నువ్వు పెళ్ళానివి. పెళ్ళాం పదమే అపవిత్రమైపోతూంది."

విశ్వనాధం బయటకు వచ్చేసాడు.

లోపల సుజాత అరుస్తోంది. అయినా విశ్వనాధం పట్టించుకోదల్చుకోలేదు.

అసలు ఇంతసేపు ఆమెతో వాదనకు దిగటమే తప్పుగా అనుకుంటున్నాడు.

తలుపులు దగ్గరగా వేసి వంటగది దగ్గరకు వచ్చాడు.

వంటగదిలో పీటలు వాల్చి కంచాలు, గిన్నెలు అన్నీ సిద్ధంగా పెట్టి కూర్చుని బిక్కు బిక్కున చూస్తోంది పెద్దమ్మ.

స్పష్టంగా విన్పించకపోయినా గదిలో కొడుకు-కోడలు ఘర్షణ పడుతున్నారని తెలుస్తూనే వుంది. అసలు సాయంకాలం నుండీ కోడలు చక్కగా ముస్తాబై వరండాలోకీ, గదిలోకీ కాలు కాలిన పిల్లిలా తిరగటమూ, అసహనంగా గొణుక్కోవటమూ గమనిస్తూనే వుంది.

ఏమి అడిగితే ఏమి అపరాధమో అని నోరుతెరిచి ఏమీ అడగలేదు ఆవిడ.

అతడు బాత్‌రూంలో ముఖం కడుక్కుంటూ గట్టిగా అనుకున్నాడు.

"అబ్బే....లాభంలేదు! కుక్కతోక వంకరను ఏ విధంగా ప్రయత్నించినా సరిచేయలేము. సుజాత బుద్ధి అంతకన్నా హీనం. ఆమెతో సమానంగా నేనూ నోరు పారేసుకుంటే అమ్మకు తెలిసి బాధపడటం మినహా వేరే ప్రయోజనమేమీ వుండదు" అనుకున్నాడు.

అదే సమయంలో పెద్దమ్మ కూడా అనుకుంటోంది. 'ప్రొద్దుటనగా బయటకెళ్ళిన మగవాడు అనేక సమస్యలతో అలసిపోయి ఇంటికివస్తే భార్య నవ్వుతూ ఎదురువస్తే ఎంత హాయిగా వుంటుంది. పడిన కష్టమంతా మర్చిపోతాడు. దగ్గర కూర్చుని వేడివేడి అన్నం కొసరి కొసరి పెడుతుంటే అతగాడికి స్వర్గమంటే ఇదే సుమా అన్పిస్తుంది.

తల్లి అవ్వగానే ఆడదాని రొమ్ముల్లోకి పాలు వాటంతట అవే వచ్చినట్లుగా, భార్య అవ్వగానే దాని మనసులోకి భర్తపట్ల మమతానురాగాలూ, అతడ్ని ఆనందింపజేయాలనే కోరికా ఆటోమేటిక్‌గా పుట్టుకొస్తాయి.

ఇదేమి విడ్డూరమోగానీ దీనికి నోరుమాత్రం పెట్టి పంపినట్టున్నాడా బ్రహ్మదేవుడు. ఎప్పుడూ పోట్లగిత్తలా ఎగిరిపడటం తప్ప ఓ ఆడదానికుండాల్సిన పొందిక మచ్చుకైనా కన్పించదు.

విశ్వనాథం వచ్చి కూర్చున్నాడు.

"అన్నం పెట్టమ్మా" అన్నాడు.

"సుజాత...." సందిగ్ధంగా అడిగింది.

"తనకు ఆకలి లేదటలే అమ్మా!"

అపరకాళికలా గర్జిస్తూ వచ్చింది సుజాత.

"నాకు ఆకలి లేదని చెప్పానా? అంటే నాకు తిండి కూడా పెట్టరన్నమాట."

చేష్టలుడిగినదానిలా కోడల్ని చూస్తున్న తల్లిని విశ్వనాథం హెచ్చరించాడు.

"అది అలాగే వాగుతుందిలే అమ్మా! నువ్వు వడ్డించు."

చరాలున లోపలకి వచ్చి విశ్వనాథం ముందర వున్న ప్లేటును ఇవతలకు లాగేసి గరిటెతో తీసిన అన్నాన్ని తోసేసింది.



ఎన్ని అన్నా సహించాడు.

కానీ-నోటి దగ్గర అన్నాన్ని తోసేయటం క్షమించరాని నేరం.

గదినిండా చిందర వందరగా పడిపోయిన అన్నాన్ని, చండికలా నించున్న సుజాతనూ చూసేసరికి ఆగ్రహం అవధులు దాటిపోయింది.

"యూ డెవిల్" అంటూ లేచి నిలబడి చాచి చెంపమీద కొట్టాడు.

ఎదురు చూడని ఆ పరిణామానికి క్షణం బిత్తరపోయినా మరుక్షణం తేరుకుంది సుజాత.

"నువ్వు నన్ను కొడతావా? పెళ్ళాన్ని కొట్టే నువ్వు ఓ మగాడివేనా?"

"అమ్మా సుజాతా!" ఆమెని శాంత పర్చటానికీ, ఇంకేమి పెద్ద మాటలు అంటు దో అనే భయంతో అడ్డుకోవాలనీ ప్రయత్నించింది పెద్దమ్మ.

"నువ్వు మాట్లాడొద్దు. నోరు తెరిచావంటే చంపేస్తాను" ఆడపులిలా గాండ్రించింది.

"ఈ ఇంట్లో మనుషుల్ని నువ్వేనాడో చంపేశావు. నువ్వు ఆడదానివి కావు! రాక్షసివి" ఉద్రేకంగా అన్నాడు విశ్వం.

తన తల్లిని చంపుతానంటుందా?

ఎంత ధైర్యం....!

సుజాత పిచ్చిదైపోతోంది. గొడవ పెట్టుకుంటే అతడు తనమాట వింటాడనుకుంది.

పడక మంచంపైన వేసే పిచ్చి వేషాలకు విశ్వనాథం లొంగడని తెలుసుకుంది. ఇహ అతన్ని ఒప్పించాలంటే ఘర్షణ ఒక్కటే మార్గం అనుకుంది. ఘర్షణ పడటమంటే ఇష్టపడని విశ్వనాథం 'సరే' అనేసి ఆనంది డబ్బంతా ఇచ్చేస్తాడని సుజాత పన్నాగం! అది ఉన్నట్టుండి హద్దులు దాటిపోతోంది.

తల్లి ముందర తన మాటను ఖాతరు చేయలేదు సరికదా కొట్టాడు. నిర్లక్ష్యం చేశాడు.

ఆ ఊహను భరించలేకపోతోంది.

అసలే కోతి! పైగా నిప్పుతొక్కింది అన్న చందాన ఇంకా ఇంకా రెచ్చిపోయింది.

విశ్వనాథం చొక్కా పట్టుకుని గుంజేసింది. "నాకు తిండి పెట్టకుండా నువ్వూ నీ అమ్మా కలిసి కొట్టి చంపాలని చూస్తారా! మిమ్మల్ని ఊరికే వదలను. పోలీస్ కేస్ పెట్టి మిమ్మల్ని జైల్లో పెట్టిస్తాను."

పూనకం వచ్చినదానిలా వూగిపోతూ అరుస్తోంది.

అతడి అభిమానం తీవ్రంగా గాయపడుతోంది. ఒక్క సంస్కారవంతుల ఇంట్లో జరగాల్సిన రభసేనా ఇది!

"ఏమిటే నువ్వు చేసేది? ఏం చేసుకుంటావో చేసుకో! పోవే పో" తన షర్టుని బలంగా గుంజుతూన్న ఆమె చేతుల్ని లాగి తోసేశాడు.

అతడు కూడా తన ఉద్రేకాన్ని అణచుకోలేకపోతున్నాడు. ఒకే ఒక్క క్షణం ఆమెని కొట్టినందుకు సిగ్గుపడ్డమాట వాస్తవం! కాని మరుక్షణమే తనచొక్కా పట్టుకుని నిలదీస్తూ వాగుతూన్న ఆమె వాగుడు వినేసరికి అలా పశ్చాత్తాపపడినందుకు సిగ్గుపడాల్సి వచ్చింది.

అతనికి తెలుస్తోంది....

మురికి గుంటపై రాయి విసురుతున్నట్లు!

ఆమె మాటల బాణాల నుండి తప్పించుకోటానికీ, ఆమె నోరు మూయించే ప్రయత్నంలో ఆత్మరక్షణార్థం ఎదురుదాడి తప్పనిసరి అవుతోంది.

"పోతాన్రా పోతాను. నీలాంటి మొగుడి దగ్గర పడుండాల్సిన ఖర్మ నాకేం లేదు."

"పోతేపోవే! ఆడమనసులేని నీలాటి పెళ్ళాం వున్నా ఒకటే లేకపోయినా ఒకటే!"

"నాలో ఆడతనం లేకుండానే నా పక్కన పడుకుని కొడుకుని కన్నావా? సిగ్గులేదూ ఆమాట అనటానికి. నీలాంటి మొగుడి దగ్గర వుండాల్సిన అవసరం నాకూలేదు."

"క్షణం క్షణం నరకం చూపించే నువ్వూ నాకవసరంలేదు."

"పెళ్ళాన్ని సుఖపెట్టటం చేతకాని నువ్వూ ఒక మొగాడివట్రా!



స్తాను. నీ అంతు చూస్తాను. నిన్ను బజారుకీడ్చి నలుగురూ ఉమ్మి సేట్లుగా చేస్తాను చూడు."

శివంగిలా అరుస్తూ చారు గిన్నె తన్నేసింది. పెద్దమ్మ ముఖమంతా ందింది.

విశ్వనాథానికి పిచ్చి ఆవేశం వచ్చేసింది. అసలిది ఆడదికాదు....! నిషికాదు!

"నువ్వు అసలు మనిషివికాదు! పిశాచానివి" విశ్వనాథం కూడా రించలేని అసహ్యంతో కదిలిపోయాడు.

"ఏమిటీ! నేను పిశాచినా? నేనుకాదు పిశాచిని నువ్వు.... నువ్వు శాచానివి! మీ అమ్మో పిశాచి! మిమ్మల్ని ఊరికే వదలను. ముక్కలు ముక్కలుగా నరికి కాకులకూ గద్దలకూ వేస్తాను ఏమనుకున్నావో....నన్ను న్ని మాటలంటావా? చచ్చేట్లు కొట్టావుకదూ! చూస్తుండు నిన్ను ఉరి ంబానికెక్కించకపోతే నా పేరు సుజాతేకాదు."

"పోవే బోడి! ఏమిటే నువ్వు చేసేది. ఏం చేసుకుంటావో చేసుకో-పో! నీలాటి రాక్షసిని భరించే శక్తి నాకూలేదు పో."

"పోతాన్రా....పోతాను. ఊరికేపోను, నిన్ను నాశనం చేస్తాను. ళ్ళు కుళ్ళి ఏడ్చేలా చేస్తాను. నేను బోడినా? నువ్వు బ్రతికుండగా నేనెట్లా డిముండనవుతాన్రా? నేనుకాదురా బోడిముండని, నువ్వు! నిన్ను బోడి ధవని చేస్తాను. ఇదిగో నువ్వు కట్టిన ఈ వెధవ తాళిబొట్టు నాక్కర్లేదు. వ్వే వేసుకుని ఊరేగు" మెడలోంచి మంగళసూత్రాలు తీసి విశ్వనాథం దికి విసిరేసింది.

గడప దగ్గరగా వున్న మంచినీటి బిందెని తన్నేసి గడప దాటింది.

"అమ్మా సుజాతా! ఏమిటమ్మా, ఏమిటీ గొడవ? కాస్త ఆగు...." ర్చున్న చోటు నుండి లేస్తూ కంగారుగా అంది పెద్దమ్మ.

బర్రున వెనక్కి తిరిగింది సుజాత.

"ఆగు! అడుగు ముందుకేశావో ప్రాణం తీస్తాను. ముసలిముండా! ్ర గిల్లి జోలపాడే రకానివి. నా సంసారంలో నిప్పులుపోసింది నువ్వు! మొగుడ్ని నాక్కాకుండా చేసిన రాక్షసివి. నిన్నూ నీ కొడుకుని వూరికే

వదలను. మీ మీద కేసుపెట్టి కోర్టుకీడుస్తాను. ముప్పతిప్పలుపెట్టి ముప్పైత్త కునేలా చేస్తాను."

పోట్లగిత్తలా అరుస్తూ వెళ్ళిపోయింది.

నిర్జీవుడై నిలబడిన విశ్వనాథం భుజంపై చేయివేసింది పెద్దమ్మ.

బిందెలోంచి బుడ బుడా పడుతున్న నీళ్ళు.

గదినిండా నీళ్ళు....

ఆ నీళ్ళల్లో అన్నం....

దిగ్భ్రాంతితో చూస్తున్నాడు విశ్వనాథం.

"అర్ధరాత్రిపూట....ఆడపిల్ల ఏమి అఘాయిత్యం చేస్తుందో ఏమిటో" అంటూనే ఆమె గడపదాటి ఇవతలకి వచ్చింది.

అప్పటికే సూట్ కేస్ పుచ్చుకుని గదిలోంచి బయట వరండాలోకి వెళుతోంది సుజాత.

"బాబూ విశ్వం....అమ్మాయి వెళ్ళిపోతోందిరా! చూడూ....అమ్మా సుజాతా....ఆగు....నా మాట విను....కాస్త ఆగు...." ఆమె హైరాన పడుతూ ఖంగారుగా పరుగెత్తినట్లుగా ముందరకు వెళ్ళింది.

వెనకాలే విశ్వనాథం కూడా పరుగులాంటి నడకతో పెద్ద పెద్ద అంగలు వేస్తూ వచ్చాడు.

విసురుగా వెళుతున్న సుజాత అప్పటికే వరండాదాటి మెట్ల దగ్గరకు వచ్చేసింది.

గబుక్కున ఆమె చేయి పట్టుకుంది పెద్దమ్మ.

"ఆగమ్మా! నా మాటవిను! పెద్దదాన్ని! నీ కాళ్ళు పట్టుకుంటాను. ఏదైనా తప్పుంటే నన్ను క్షమించు. నువ్వెళ్ళబోకు."

"ఏమిటీ నాటకం? చేసేదంతా చేసి వెధవ నంగనాచి వేషాలేస్తున్నావా?" ఆమె చేతిని విసురుగా లాగి గుండెమీద చేయివేసి వెనక్కి తోసేసింది.

ఆ విసురుకు ఆమె తూలి అవతలకు పడబోయి నిలదొక్కుకోవటానికి విశ్వ ప్రయత్నం చేసి ఫలించక ఆధారం కోసం కుర్చీ పట్టుకుంది. కానీ అది నిలవక కుర్చీతోసహా ఆమె క్రింద పడిపోయింది.



వెనకాలే వస్తున్న విశ్వనాథం గబుక్కున పట్టుకోబోయాడు. కానీ అప్పటికే ఆమె పట్టుతప్పి పడిపోయింది.

కెవ్వుమన్న ఆమె అరుపు మెట్లమీది నుండి బరబరా దిగుతూన్న సుజాతను ఆపలేదు సరికదా ఒక్క క్షణం ఆగి వినటానికి కూడా ప్రయత్నించలేదు.

పడిపోయిన తల్లిని లేపలేక, వెళ్ళిపోతూన్న భార్యను ఆపలేక నానా అవస్థలూ పడ్డాడు విశ్వనాథం!

ఆ అర్థరాత్రి తాళిబొట్టు తీసి మొగుడి ముఖాన కొట్టేసి సూట్ కేసు తీసుకుని ఇల్లు వదిలి చీకట్లోకి వెళ్ళిపోయింది సుజాత!

పవిత్రమయిన మంత్ర ఘోషల మధ్య బంధుమిత్రుల ఆశీర్వాదాలతో అగ్నిసాక్షిగా మాంగల్యం తంతునానేనా అంటూ వేసిన మూడు ముడుల బంధాన్ని అతి సునాయాసంగా తృటికాలంలో తీసిపారేసి గడప దాటి బయటకు వెళ్ళిపోయింది.

ఆ మంత్రాలకున్న విలువా, ఆ మాంగల్యానికున్న పవిత్రతా, ఆ బంధానికున్న బలమూ, భారతదేశపు సంప్రదాయమూ---ఇవేవీ ఆపలేకపోయాయి—ఈనాటి నాగరికతకు చిహ్నమయిన ఓ స్వేచ్ఛా జీవిని.

వీచే గాలి విస్తుపోయింది.

చిమ్మ చీకటి చిన్నబోయింది.

భర్త అంటే భరించేవాడని అర్థమట.

మంకుతనంతో తెలిసీ తెలియని పొగరుబోతుతనంతో జీవితాలను ఛిన్నా భిన్నం చేస్తూ, అజ్ఞానంతో, అహంకారంతో సభ్యత సంస్కారాలను మర్చిపోయి దీపం వెలిగించవలసిన ఇంటిని అంధకారంలో ముంచే సుజాత లాంటి నరరూప రాక్షసులను భార్యలుగా భరించాలంటే విశ్వనాథం లాంటి మహాత్ములు ఆత్మత్యాగం చేసేయాలి.

తాళికట్టినంత మాత్రాన భార్యా అవ్వదు!

కన్నంత మాత్రాన బిడ్డలూ అవ్వరు!

సహనానికీ, త్యాగానికీ మారుపేరయిన స్త్రీ స్త్రీగా ప్రవర్తించని నాడు—

ప్రేమను పంచవలసిన భార్య నిప్పులు చెలరేగించిన నాడు–
ఏ మాంగల్య బంధమూ కట్టుబడి వుంచలేదు!
ఏ దేవతలూ దీవించలేరు!
ఏ భర్తా భరించలేడు!

*  *  *  *

"ఈశ్వరీ!"

పెద్దగా వినిపించిన ఆ పిలుపుకు బయట లాన్‌లో కూర్చుని తండ్రితో మాట్లాడుతూన్న ఈశ్వరి తలతిప్పి చూసింది.

"అల్లుడుగారు ఫోన్ చేస్తున్నారు."

ఆశ్చర్యంతో ఆమె కళ్ళు పెద్దవయినాయి.

"త్వరగా రా!" కోప్పడుతూన్నట్లుగా పిల్చింది. గబుక్కున లేచి పరుగెత్తినట్లుగా వెళ్ళి ఫోన్ అందుకుంది.

"హలో!" నేను తేజాని. గుర్తున్నానా?"

అతి ప్రయత్నం మీద ఊఁ....అనగలిగింది.

అతడు నవ్విన శబ్దం విన్పించింది.

ఎందుకు నవ్వాడు!

అసలెందుకు ఫోన్ చేశాడు?

తేజా ఫోన్ చేశాడని తెలియగానే మనసులో మొదలయిన అలజడి, ఖంగారు కాస్త సర్దుకున్నాయి.

ఈశ్వరి మామూలుగా అయింది.

"మన సంగతి మీ పేరెంట్స్‌కు చెప్పావా?"

ఓ క్షణం ఈశ్వరి మాట్లాడలేదు.

మరుక్షణం ఆమె ప్రమేయం లేకుండానే హఠాత్తుగా ఓ ఆలోచన వచ్చి చప్పున ఆమె బుర్రలో దూరింది.

అటువైపు నుండి అతడు అడుగుతున్నాడు.

"వింటున్నావా?"

"ఊఁ...."

"మీ పేరెంట్స్‌కు చెప్పావా అని అడుగుతున్నాను." అతని



గొంతులో అసహనం ధ్వనించింది.

"ఏమని?"

నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దం ఈశ్వరికి చాలా నచ్చింది. తన ప్రశ్న అతడ్ని కాస్త ఇరకాటంలో పెట్టి వుంటుంది.

ఆ ఊహ ఈశ్వరికి ఇంకా నచ్చింది.

చక్కిలి గింత పెట్టినట్లుగా వుంది.

"హలో" అన్నాడు తేజా.

"చెప్పండి."

"ఓ.కె. కమ్ టు ది పాయింట్! మనం డైకోర్స్ తీసుకుందాము"

ఈశ్వరికి ఓ క్షణంపాటు ఏం చెప్పాలో తెలియలేదు.

అసలు తను విన్నది తనకు సంబంధించిన విషయమేనా అనుకున్నది.

మరుక్షణం కించిత్ కోపం కూడా వచ్చింది.

"హలో....హలో...." అంటున్నాడు అవతలనుండి తేజా.

"ఎస్!"

గుండెలోని గురగుర గొంతుకలోనికి వచ్చింది.

"నేను చెప్పింది విన్పించిందా?"

"ఊఁ...."

"ఏమంటావు?"

రెప్పపాటులో ఈశ్వరిలోని జంకు జారిపోయింది. తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో బింకంగా చెప్పింది.

"మా నాన్నగార్ని అడగండి."

"స్టుపిడ్! డైవర్స్ అడుగుతూన్నది మనకు! మీ నాన్నగారిని అడగటమేమిటి!"

"పెళ్ళి చేయించింది మా నాన్నగారే కదా!"

"అయితే?"

అతడికి వినిపించేలా నవ్వింది ఈశ్వరి.

"ఎందుకు నవ్వుతున్నావు?"

అతడు అడిగే పద్ధతిలో అతడెంత చిరాకుపడుతున్నాడో, తన మాటలు అతన్నెంత ఇబ్బంది పెడుతున్నాయో స్పష్టంగా తెలుస్తూనే వుంది.

ఇంకాస్త వుడికించుతూన్నట్లుగా చెప్పింది ఈశ్వరి.

"తెలియలేదు."

"స్టుపిడ్! ఏమిటీ తెలియంది?"

"మీకు కోపం ఎందుకు వచ్చిందో, నాకు నవ్వు ఎందుకొచ్చిందో తెలియలేదు."

ఫోన్ డిస్‌కనెక్ట్ చేశాడు తేజా.

నవ్వుకుంది ఈశ్వరి.

నిజంగానే ఆమె అంతరంగంలో ఏదో ఆనందం!

అదో విధమయిన తృప్తి!

గుండెల్లోంచి నవ్వుతూన్న చప్పుడు!

మనసు పొరల లోపల హాయిగా నవ్వుతూన్న చల్లదనం!

ఇదేమిటి?

అతడు బాధపడుతూంటే నా మనసు సంతోషపడుతోందా?

అంటే నాలో శాడిజమ్ స్థానం చేసుకుంటోందా?

ఊహూఁ- కాదు!

దీన్ని శాడిజం అనరు.

టిట్ ఫర్ టాట్! జస్ట్ ఫర్ ఫన్.

అంతే!

నన్నింతదూరం తీసుకెళ్ళి ఎవరూ తెలీనిచోట తిండి కూడా లేకుండా మాట్లాడేవాళ్ళు లేక ఏదో జైల్లో పడేసినట్లుగా ఇంట్లో ఒక్కదాన్నీ వారాలకు వారాలు వదిలేసి నన్నిబ్బంది పెట్టలేదూ!

ఫర్వాలేదు!

అంత చేసిన అతడికి ఆ మాత్రం ఇబ్బంది కలిగించితే నష్టంలేదు!

నవ్వుకుంటూ వచ్చింది.



ఆమె నవ్వు చూసి తండ్రి తృప్తిగా ఫీలవుతూ "అల్లుడుగారు ఏమంటున్నారమ్మా" అన్నారు.

"త్వరలో ఆయన ఇక్కడకు వస్తారట. అందుకని నా ప్రోగ్రాము ఏమిటని అడుగుతున్నారు."

"అహఁ- అలాగా! మరి నువ్వేమని చెప్పావు?"

"మీరు వచ్చాక ఫిక్స్ చేసుకుందామని చెప్పాను."

"గుడ్! మంచిపని చేసావు" అంటూ నవ్వారు.

ఆ తర్వాత ఒంటరిగా వున్నపుడు ఈశ్వరి చాలాసేపు ఆలోచించింది.

తమ జీవితాలలో అనవసరంగా చోటుచేసుకున్న ఈ పెళ్ళి అనే సంఘటనను క్లోజ్ చేయాలంటే దానికి విడాకులొక్కటే సరైన పద్ధతి అవ్వచ్చు.

కాని—

అలా 'విడాకులు' అని అనుకుంటూంటే ఏమిటో చాలా అనీజీగా వుంది.

ఏదో తప్పు చేస్తున్న ఫీలింగ్ కలుగుతోంది.

ఇదివరకు ఎవరైనా విడాకులు తీసుకున్నారట అని వింటే తను చాలా తేలికభావంతో కామెంట్ చేసేది.

'జీవితపు విలువలు తెలియనివాళ్ళే అలా ప్రవర్తిస్తారు' అనేది.

వాళ్ళెవరో, వాళ్ళ పరిస్థితులేమిటో తెలియకపోయినా వాళ్ళపట్ల ఒక చులకనభావం ఏర్పడిపోయేది. అలాంటిది ఇవ్వాళ తనే ఆ పరిస్థితులలో ఇరుక్కుంటోంది.

పదిమంది విమర్శలకు గురికావలసి వస్తుంది.

వాళ్ళ సానుభూతి వాక్యాలను వినాల్సి వస్తుంది. ఎలాగో వుండే చూపులను ఎదుర్కోవాల్సివస్తుంది.

ఏదైనా- ఒక రకంగా సంఘంలోంచి వెలివేయబడ్డ ఓ కుష్టురోగిలా కుంగిపోయి తిరగాలి కాబోలు.

జైలుశిక్ష అనుభవించి వచ్చినవాడిలా ఒదిగి-ఒదిగి బ్రతకాలి

కాబోలు!

ప్చ్! నా ప్రమేయం లేకుండానే నా జీవితం ఓ వంకర తిరిగి పోయింది.

ఏ తప్పూ చేయకుండానే జీవితఖైదీ శిక్షను అనుభవించాలి.

నా మనసునీ, నా వయసునీ చంపుకుని జీవచ్ఛవంలా అన్ని అను భూతులకూ అతీతంగా అమ్మా నాన్నల ఎదుట ఓ గుదిబండలా బ్రతకాలి,

అసలీ విషయం తెలిస్తే అమ్మా, నాన్న ఏమౌతారు?

ముఖ్యంగా నాన్నగారు!

ఎన్నాళ్ళని దాచగలను?

ఎవరి ద్వారానో బయటకు వచ్చి నాన్నగారి చెవులబడకముందే ఆయనకీ విషయం స్వయంగా చెప్పటం ఎంతైనా అవసరం.

డాక్టరంకుల్‌తో ఓసారి మాట్లాడాలి.

* * * *

ఎవరో పట్టి కుదిపేసరికి ఆనంది ఆలోచనలు తెగిపోయాయి.

వెనుక సీటులో కూర్చుని వున్న ఓ అమ్మాయి నవ్వుతూ తనవంకే చూస్తోంది.

తమిళంలో అన్నది.

"మోట్టుపాళియం వచ్చేసింది. ఇక్కడ దిగేసేయాలి."

అప్పుడే స్పృహలోకి వచ్చినదానిలా తేరుకుని ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పింది.

అప్పటికే ఆ బోగీలోని వారంతా దిగిపోయారు.

ఆ అమ్మాయి దిగుతోంది.

ఆనంది కూడా సీట్లోంచి లేచింది.

సామాన్లు దించి ప్లాట్‌ఫారమ్‌పైన నించుని చుట్టూ చూసింది.

తనను హెచ్చరించిన అమ్మాయి తనవైపు చూడటం గమనించి నవ్వింది.

ఆ అమ్మాయి కూడా నవ్వుతూ "ఏమైనా హెల్ప్ కావాలా?" అని అడిగింది.



"నో థాంక్స్" చెప్పింది ఆనంది.

ప్లాట్‌ఫారమ్‌కు ఇటువైపున ఊటీ ట్రెయిన్ ఆగితే, అటువైపుకు మద్రాసు వెళ్ళే ట్రెయిన్ వస్తుంది. నెమ్మదిగా సామాను తీసుకుని అటు వైపు వెళ్ళింది.

మద్రాసు వెళ్లే ట్రెయిన్ ఇంకా ప్లాట్‌ఫారమ్ మీదకు రాలేదు.

సూట్‌కేస్‌నూ, బాగ్‌నూ క్రిందపెట్టి అటూఇటూ చూసింది.

అక్కడ ఎక్కువమంది తనతోపాటు ఊటీనుండి వచ్చినవాళ్లే కని పిస్తున్నారు.

కొంతమంది ప్రక్కనే వున్న టీస్టాల్ దగ్గర నిలబడి టీలు, కాఫీలు తాగుతున్నారు.

కొంతమంది చిప్స్ కొనుక్కుని తింటున్నారు.

అక్కడ ఓ పదిమందిదాకా ఫారినర్స్ వున్నారు.

పెద్ద-పెద్ద బాగ్‌లను భుజాలకు వెనుక వైపున తగిలించుకుని బిస్కెట్లు తింటూ అటూ-ఇటూ తిరుగుతున్నారు.

ఆనందికి కూడా ఆకలనిపించింది.

మధ్యాహ్నం ఇంటిదగ్గర కూడా ఏమీ తినలేదు. టైమయిపోయిం దని హడావుడిగా వచ్చేసింది.

ఆ టీ స్టాల్ దగ్గరకు వెళ్ళి కొనాలని అనిపించలేదు.

ఊటీనుండి స్వెట్టర్స్‌తో, షాల్స్‌తో వచ్చినవారంతా వాటిని తొల గించి మడతలు పెట్టి బాగ్‌లలో సర్దుకుంటున్నారు.

ఆరున్నరకు రావాల్సిన ట్రెయిన్ ఏడు గంటలవుతున్నా ఇంకా రాలేదు.

ఆనంది కాస్త అసహనంగా చూస్తోంది. పమిటచెంగు తీసుకుని ముఖంక్రిందా, మెడచుట్టూ తుడుచుకుంటూ అనుకున్నది.

"ఆ ఊటీ కొండలు దిగితే చాలు- చెమటలు ప్రారంభమవుతాయి.

నెలలు నిండిన గర్భవతిలా అతినెమ్మదిగా హైరానా పడుతూ వస్తు న్నది నీలగిరి ఎక్స్‌ప్రెస్.

ఇక్కడ ఇదొక సదుపాయం.

చక్కగా మన ముందుకు వచ్చి ఆగుతుంది ఎస్ ఒన్ కంపార్టుమెంట్.

సామాన్యంగా ఊటీలో రిజర్వేషన్ చేయించుకుంటే ఆ కంపార్టుమెంటుకే టిక్కెట్టు ఇస్తాడు.

సామానులు తీసుకుని తన బెర్తు నంబర్ చూసుకుంటూ వెళ్ళింది.

బాగ్‌లో పైనే పెట్టుకున్న పాత బట్టతీసి తన బెర్తు తుడుచుకుంది.

సూట్‌కేసుని సీటు క్రిందకు తోసి బాగ్‌ని సీట్లో పెట్టుకుంది.

అందులోంచి దుప్పటి, ఎయిర్‌పిల్లో తీస్తూంటే దుప్పటి అంచుల పట్టుకుని ఓ ఫోటో ఆల్బమ్ కూడా బయటకు వచ్చింది.

ఆ ఆల్బమ్‌ని చూడగానే ఆనంది పెదవులపైకి చల్లని చిరునవ్వు, కళ్ళల్లోనికి క్రొత్త వెలుగూ వచ్చాయి.

లైటూ, ఫానూ స్విచ్‌లు వేసుకుంది.

అటూ–ఇటూ చూసింది.

ఆ కంపార్టుమెంటునిండా ఇంచుమించు తనతోపాటు మధ్యాహ్నం నుండీ ప్రయాణం చేస్తూన్నవాళ్ళే.

ఆనంది కూర్చున్న కేబిన్‌లోకి ఇంకా ఎవరూ రాలేదు.

ప్లాస్టిక్ కవరులో చుట్టిపెట్టుకున్న మంచినీళ్ళ బాటిల్ తీసి సీట్లో మూలగా పెట్టుకుంది.

బాగ్‌నికూడా సర్ది కిటికీ ప్రక్కగా పెట్టేసింది.

తీరుబడిగా సీట్లో కూర్చుంది ఆనంది.

ఆల్బమ్ తీసి ఒడిలో పెట్టుకుంది.

కళ్ళజోడుతీసి పమిటచెంగుతో ఒకసారి అద్దాలు తుడిచిపెట్టుకుంది.

ఆల్బమ్ తెరిచింది.

మొట్టమొదటి పేజీ—

ఆనంది తలిదండ్రులు!

ప్చ్!

ఏ లోకంలో ఉన్నారో?

వాళ్ళ దీవెనలే తనకు శ్రీరామరక్ష!



రెండో పేజీ—

పెద్దమ్మ.

ఫోటోలోంచీ నవ్వుతోంది.

జీవితంలో ఎన్నికష్టాలు అనుభవించింది?

ఎన్ని ఆటుపోట్లను తట్టుకుంది?

ఎన్నో అడ్డంకులను యీ చిరునవ్వుతోనే ఎదుర్కొంది! ఆ చిరునవ్వుతోనే వెళ్ళిపోయింది! ప్రేమ, అనురాగం, త్యాగం కలిపి ముద్దగాచేసి ఆ ముద్దతో స్త్రీ బొమ్మనుచేసి ప్రాణంపోసి తనకోసమే ఈ భూమిమీదకు పంపించాడా దేవుడు.

సహనానికి మారుపేరయిన యీ పెద్దమ్మే లేకపోతే ఆనంది అనే మనసు ఏమై వుండేదానో్న?

ఉహూఁ-

నో ఆనంది!

మూడో పేజీ—

విశ్వనాథం!

ది గ్రేట్ మాన్!

అన్నయ్య!

ఉహూఁ-

ఉత్త అన్నయ్యేకాదు-

తల్లి, తండ్రి, అన్న, అక్క, చెల్లి, గురువు, స్నేహితుడు—

అన్నీ—

అన్నీ కలిపితేనే విశ్వనాథం!

అతడి అండ లేకపోతే-

నో ఆనంది!

నాలుగో పేజీ—

"అఆ- ఇఈ- ఉఊ."

కాలేజీలో ఆరుగురూ కలిసి తీయించుకున్న ఫోటో!

ఆనాటి స్నేహం నిజంగా ఎంత మధురమైనది?

వాళ్ళందరి ప్రేమనూ పంచుకున్న నేను ధన్యవంతురాల్ని.
జీవితంలో మంచి స్నేహితులు దొరకటం నిజంగా చాలా అదృష్టం.
ఐదు—
అనిత!
ఇప్పటికీ తన కవితలు నాకు ఊపిరి.
స్నేహానికి అర్థంచెప్పే అనురాగ పల్లరి.
తర్వాత—
శ్రీమతి అండ్ శ్రీ శ్రీనివాసన్!
ఇది వాళ్ళ పెళ్ళి ఫోటో.
అనిత కళ్ళల్లో ఎంత మెరుపు?
అనుకున్న విధంగా కోరుకున్న రీతిలో జీవితాన్ని మలచుకోవట మనేది అందరకూ చేతకాదు.
అలాంటి అదృష్టవంతులు కొందరే వుంటారు.
ఆ కోవకు చెందినదే అనిత.
తర్వాత—
ఐశ్వర్య!
చక్కనిరూపం!
నిజంగా అందానికి ఐశ్వర్యే!
అనిత పెళ్ళికి తొందరపడిందిగానీ-చదువుతూ కొంతకాలమూ, కెరీర్ కెరీర్ అంటూ కొంతకాలమూ మొత్తంమీద ముప్పై ఏళ్ళు దాటాక ఐశ్వర్యను కన్నది.

పట్టుపావడా కట్టుకుని, బుట్టచేతుల జాకెట్ వేసుకుని, పొడవాటి జడకు చివర జడకుచ్చులూ, నడుమున వడ్డాణం, చేతులకు అరవంకెలు, మెడలో పొడవాటి గొలుసూ, చెవులకు బుట్టల జూకాలూ-నవ్వుతూ అందానికి నిర్వచనంలా వున్న ఆ ఫోటోని ముద్దుపెట్టుకుంది ఆనంది.
తర్వాత—
ఇందిర!
చదువుకునే రోజుల్లో బాపు బొమ్మలా వున్నావని అందరూ అంటూ వుంటే అందంగా సిగ్గుపడేది.



స్నేహానికీ, ప్రేమకూ అతిసున్నితంగా లొంగిపోయి ప్రాణం పంచి ఇచ్చే ప్రేమమూర్తి!
తర్వాత—
ఇందిర, అనిల్‌కుమార్‌ల పెళ్ళిఫోటో!
అపురూపమైన జంట!
పండంటి సంసారం!
అచ్చమైన ఇల్లాలిగా, అమ్మగా-
జీవితంలో చక్కగా స్థిరపడిన ఇందిర నిజంగా అదృష్టవంతురాలు.
తర్వాత—
ఇందిర పెద్దకొడుకు కిరీట్‌బాబు!
కంప్యూటర్ ఇంజనీర్ చదువుతున్నాడు.
వాడి నవ్వూ, పోలికలూ అన్నీ వాళ్ళ అమ్మవే!
మంచి క్రికెట్ ప్లేయరు.
క్రితం సెలవులకు ఊటీ వచ్చినప్పుడు-
"ఈసారి నేను మాచ్ ఆడేటప్పుడు నిన్నూ తీసుకెళతాను ఆంటీ" అన్నాడు. అతనికి తన దగ్గర చాలా చనువు.
మంచి హాండ్‌సమ్ బోయ్!
వాడు మగపిల్లల కాలేజీలో చదువుతున్నాడు కాబట్టి సరిపోయింది కానీ అదే ఏ కో-ఎడ్యుకేషనల్ కాలేజీయో అయితే ఎంతమంది వలలువేసి ఇందిరకు తలనొప్పి తెచ్చేవారో?

తర్వాత—
నవీన్‌బాబు!
ఇందిర రెండో కొడుకు!
వీడిదంతా వాళ్ళ నాన్న పోలిక!
మెడిసిన్‌లో చేరినా యింకా చిన్నతనం పోలేదు.
అయినా పెద్ద డాక్టరయిపోయినట్లు ఫోజు మాత్రం పెట్టేస్తాడు.
"ఆంటీ నాకు మొదటి పేషంటు మీరేనని అంటాడు."
తర్వాత—
ఈశ్వరి!

నవ్వుతూ నవ్విస్తూ గలగలాపారే సెలయేరులా, ఆనందానికి పుట్టినిల్లులా, చిన్నపిల్లలా గల్లంతు చేస్తుండే ఈశ్వరి ముఖంలో ఎంత గంభీరత?

ఎంత హుందాతనం?

సంసారజీవితంలో మొదటి మెట్టుకూడా ఎక్కలేకపోయిన ఈశ్వరి.

తండ్రిపోయినా, తల్లిపోయినా, తన అనుకునే స్వంతవారెవరూ లేకపోయినా ధైర్యంతో, పట్టుదలతో ఒంటరిగానే ఈ ప్రపంచంలో నిలబడి గెలుపొంది ఈనాటికి ఆంధ్రరాష్ట్రం గర్వించేరీతిలో కీర్తి ప్రతిష్ఠలను స్వంతంచేసుకున్న గొప్ప బిజినెస్ మాగ్నెట్.

తన మనసుని మార్చి మరలా వివాహానికి ఒప్పించటం ఎవరితరమూ కాలేదు.

మరోసారి మాంగల్యం తంతునానేన అంటూ తంటాలుపడే ఆ తంతులను భరించే ఓపిక నాకు లేదన్నా! నన్నిలా వదిలేయండి.

నేనిపుడు చాలా హేపీగానే వున్నాను. నా లక్ష్యం, నా గమ్యం, నా సంకల్పమంతా ఈ ఇండస్ట్రియల్ వరల్డ్‌లో నాకొక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలి.

ఐ హావ్ టు రీచ్ మై గోల్ అనేది!

అలాగే సాధించింది.

తల్లిదండ్రుల పేరుమీద స్కూలు కట్టించింది.

హాస్పిటల్ కట్టించింది.

గుడులూ, గోపురాలూ అంటుంది.

అనాధులకు చాలా సహాయం చేస్తుంది.

గుప్తదానాలకు పెట్టిందిపేరు ఈశ్వరి.

ఆమె విజయం తల్చుకుంటే మనసు గర్వంగా నవ్వుకుంటుంది!

తనకు కాస్త మార్పు కావాలనుకున్నప్పుడల్లా ఊటీకి వస్తుంది.

నాలుగు రోజులు రిలాక్సయి వెళుతుంది. తర్వాత—

ఉమ పెళ్ళి ఫోటో!

తన కళ్ళల్లో ఎంత సిగ్గు!

ఆమె ముఖంలోని ప్రశాంతతా, ఆమె చిరునవ్వులోని స్వచ్ఛతా—ఆడతనమంతా రంగరించి అందులో అనురాగం కలిపి తయారు



చేసిన అమృత హృదయిని ఉమ!

ముక్కలు చింపిన విస్తరిలా విశ్వనాధం జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసిన సుజాత అరాచకపు పరిపాలనకు స్వస్తి చెప్పి వెళ్ళిపోయిన ఆంగ్లేయుల మాదిరిగా ఓ అర్థరాత్రి అతడి జీవితంలోంచి తప్పుకున్న తర్వాత విశ్వనాధం మామూలు మనిషి అవ్వటానికి చాలాకాలం పట్టింది.

బెంగతో మంచంపట్టిన పెద్దమ్మను ఓదార్చటం ఎవరికీ శక్యం కాలేదు.

ఆ సమయంలో ఉమ తనంత తానుగా కోరుకుని ఆ జీవితంలో ప్రవేశించింది.

కేవలం దైవఘటన!

దేవుడు తను చేసిన పొరపాటుని దిద్దుకోవటానికి అన్నయ్యకిచ్చిన అపురూపమైన వరం- ఉమ!

ఆ తర్వాత పేజీ తిప్పేసరికి ఆనంది అప్రయత్నంగా పైకే నవ్వేసింది.

అక్కడెవరూ లేరుగానీ వుంటే మాత్రం వింతగా చూసేవారు.

అది ఊహ ఫోటో!

పెళ్ళి అయిన మర్నాడు ఊహ రెండు చేతులతో రెండు గిన్నెలను పట్టుకుని డైనింగ్‌టేబుల్ దగ్గరకు వస్తోంది.

ఈశ్వరి కేక్ తెచ్చి ఊహను నోరు తెరవమంది.

ఊహ నోరు తెరిచేసరికి పెద్ద ముక్కను నోట్లో కుక్కేసింది. ఆ కుక్కటంలో ముక్కుకూ, బుగ్గలకూ కూడా అంటుకుంది.

నోటినిండా కేక్ వుండి బుగ్గలు ఉబ్బినట్లుగా, రెండు చేతులనూ ఎత్తి పట్టుకున్న గిన్నెలతో—

గబుక్కున ఫోటో తీసింది అనిత.

నిజంగా అద్భుతంగా వచ్చిందా ఫోటో. ఆ తర్వాతది-

ఊహ పెళ్ళిఫోటో!

చదువుకునే రోజుల్లో క్లాసు పిల్లలంతా కలిసి తీయించుకునే గ్రూపు ఫోటోలాగా వుంది.

పెళ్ళికొడుకు ఇందిర భర్తకు తమ్ముడవటంతో ఆ ఫోటోలో

అందరూ వుండి నిండుగా వుంది.

ఊహ అనాటినుండీ ఈనాటివరకూ కూడా చిలిపితనంపోని అల్లరి పిల్లే.

తన సమక్షం— ఓ సుందర స్వప్నం! తర్వాత పేజీ—

ఖాళీగా వుంది!

ఆనంది జీవితంలాగే—

ఆనంది జీవితం ఖాళీయేనా?

జీవితం అంటే పెళ్ళి- సంసారం- పెళ్ళి—పిల్లలు— అదేజీవితంఅంటే మాత్రం-

ఆనంది జీవితం ఖాళీ అనే చెప్పాలి.

కానీ, దానికి ఆనంది ఒప్పుకోదు!

తల్లిదండ్రుల పరువు ప్రతిష్ఠలకు, సమాజపు కట్టుబాట్లకూ, తరతరాలుగా రక్తంలో జీర్ణించుకుపోయిన సంప్రదాయానికీ, ఓ పద్ధతికీ! ఓ క్రమశిక్షణకూ, మాంగల్యం తంతునానేన అంటూ వేసిన వేయించుకున్న మూడు ముడుల బంధానికీ, నైతిక విలువలకూ ప్రాధాన్యతనిచ్చి మమతలను పంచుకుంటూ అనురాగాన్ని పెంచుకుంటూ ఇంటినో దేవాలయంలా మార్చుకునే జీవితం— పెళ్ళికి నిర్వచనం! అలా కాకుండా— రాసురానూ జీవితంపట్ల అవగాహన లేకుండా ఒకరంటే మరొకరికి గౌరవం లేకుండా, ఇద్దరి మధ్యా ఆత్మీయతా అనుబంధమూ అంతరించి నువ్వెంత అంటే నువ్వెంత అనే తిరుగుబాటు మనస్తత్వాలు ఎక్కువై సర్దుకుపోవటమనేది కరువై పెళ్ళి అనేది నూరేళ్ళ పంట అనేది పోయి—

ఓ వ్యాపారంలా

ఓ ఎగ్జిబిషన్‌లా

ఓ కాంట్రాక్టులా

ఓ రైలు ప్రయాణంలా

ఓ కలలా

దాంపత్య బంధానికి ఆయువు తక్కువై నవ్వులపాలయిపోతోంది.

ఇక పెళ్ళిళ్ళకు విలువెక్కడా!

వివాహ జీవితానికి ప్రాధాన్యతెక్కడా?



పెళ్ళి- వైవాహిక జీవితం అంటే ఆనందికి భయం.

సందుమలుపు సాంతం తిరిగితేగానీ అటువైపున ఏమున్నదీ ఏమి ుప వస్తున్నదీ తెలియదు!

అలాగే పెళ్ళి అనేది జరిగి ఆ అబ్బాయి దగ్గరకు వెళ్ళాకగానీ ఆ తం గురించి కాయా పండా అనేది తెలియటంలేదు.

'అందరూ ఇందిరలాంటి అదృష్టవంతులే వుండరుగా! ఈశ్వరి జాత లాంటిదే నాకూ దొరికితే ఏం చేయను! ఇప్పుడు నా యీ జీవితం ా హేపీగా వున్నది.

లాటరీ వేసి రిస్క్ తీసుకోవటం ఎందుకు!' అన్నది.

* * * *

ఆనంది డైనింగ్ హాలుకు వెళ్ళేసరికి తోటి టీచర్సందరూ నవ్వు టూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"హలో లక్ష్మి! వూరునుండి ఎప్పుడొచ్చారు!"

"సాయంత్రం వచ్చాను. రాగానే మీ రూమ్ దగ్గరకు వచ్చాను. మీరు డెంట్స్‌తో బిజీగా వున్నారు. డిస్టర్బ్ చేయటం ఎందుకని లోపలకు లేదు."

"అహం.... ఏమిటి విశేషాలు? ఇంట్లో అంతా బాగున్నారా? అరి లు తెచ్చారా?"

"ఓహ్! మీరు అరిసెలు తెమ్మన్నారు కదూ- కానీ ఆనందీ నేను టికి వెళ్ళలేదు. పెళ్ళి దగ్గర్నుండీ ఇటే వచ్చేశాను."

"పెళ్ళి బాగా జరిగిందా?"

"అదో తమాషా! ఓ బ్యూటిఫుల్ స్టోరీ" అందరూ ఆసక్తిగా శారు.

లక్ష్మి చెప్పింది.

"ఆ పెళ్ళికొడుకుది ఢిల్లీ! అతనికి సెలవుదినాలు తక్కువని యం పెళ్ళి, సాయంత్రం వ్రతం, ఆ రాత్రి వాళ్ళకు ఫస్టునైటు ఏర్పాటు రు. పెళ్ళికొడుకు, అతని ఫ్రెండ్స్ కలిసి లైట్‌గా డ్రింక్ చేశారట.

గదిలోకి వెళ్ళాక ఆ అమ్మాయి అడిగిందిట.

"డ్రింక్ చేశారా?"

అతడు వెంటనే ఫ్రాంక్‌గా ఒప్పుకున్నాడు.

"నాకిష్టముండదు" అన్నదిట.

"ఏదో ఫ్రెండ్స్ బలవంతం చేస్తే లైట్‌గా చేశాను"అన్నాడట.

"ఇవ్వాళ మీ ఫ్రెండ్స్ డ్రింక్ చేద్దామంటే చేశావు. రేపు ఇంకో దేదయినా చేద్దామంటారు! చేసేస్తారుకదా! మీకంటూ ఆలోచన లేదా? మీకో నిర్ణయం లేదా? మీరు చిన్నపిల్లలు కాదుకదా! ఎవరో చెబితే చేయటానికి! మీకు వ్యక్తిత్వం వుంది? అలాగే నీతి, నియమాలు వుండాలి. మొదటిరోజు నుంచే మన జీవితాలు అడ్జెస్టుమెంటుతో మొదలయితే ఎన్నాళ్ళు, ఎన్నేళ్ళు అడ్జెస్టు అవ్వాలో ఆలోచించితే ఇటీజ్ ఇంపాజిబుల్ అనిపిస్తోంది.

కలిశాక, గొడవలుపడి తర్వాత విడిపోయి సమస్యలు సృష్టించుకునే కంటే ఇవాళ- ఇప్పుడే విడిపోవటం మంచిదనిపిస్తోంది. అని చెప్పి బయటకు వచ్చేసింది. చుట్టాలందరూ ఒకచోట చేరారు.

ఆ పేరెంట్స్- ఈ పేరెంట్స్ కూర్చున్నారు.

"మన మధ్య గొడవలు వద్దు. ఫ్రెండ్లీగా విడిపోదాం" అనీ తనే చెప్పింది.

కట్నాలూ, కానుకలూ ఎవరివి వాళ్ళు తీసుకున్నారు. అయిన ఖర్చు ఇద్దరూ సమానంగా భరించారు.

ఎవరి సామాన్లు వాళ్ళు సర్దుకుని వెళ్ళిపోయారు.

నా సామాను సర్దుకుని నేను వచ్చేశాను" నవ్వింది లక్ష్మి.

విస్తుపోయింది ఆనంది!

వింటూంటే తమాషాగానూ వుంది.

బాధగానూ వుంది!

ఇదేమిటి—జీవితంలో పెరిగిన వేగమా? కాలంలో వచ్చిన మార్పా? మనుషుల్లో పెరిగిపోయిన నాగరికతా? రాను రానూ తగ్గిపోతున్న సంప్రదాయపు విలువలకు ఓ ఉదాహరణా!!

ఇలాంటివి ఎన్నో వింటున్నాము.

పుట్టుక ఎంత సహజమో మరణం కూడా అంతే సహజం. పుట్టిన నాటినుండీ మరణం నీడలా వెన్నంటే వుంటుంది.

కానీ పెళ్ళంటే ఎంత సహజమో విడాకులు కూడా అంత సహజం



అని ఏ వేదాల్లోనూ వ్రాసిలేదు. ఏ మహా పురుషులూ చెప్పిన దాఖలాలు కూడా ఏమీలేవు.

కాని ఇపుడు విడిపోవటం అనేది అత్యంత సహజమైన విషయంగా అయిపోయింది.

అబ్బాయికి నచ్చినట్లుగా అమ్మాయి వుండటంలేదని విడాకులు!

అమ్మాయికి నచ్చినట్లుగా అబ్బాయి ప్రవర్తించటంలేదని విడాకులు!

అబ్బాయికి పెళ్ళిలో అడిగినంత కట్నకానుకలూ లేవు, ఘనంగానూ చేయలేకపోయారు. ఆ ముష్టి సంబంధాన్ని తెగతెంపులు చేసుకోవటం ఉత్తమం. లాయరు నోటీసు పంపండి, విడాకులిమ్మని.

పెళ్ళయి మూడేళ్ళయినా పిల్లలు లేరు. దాని కడుపు పిల్లల్ని కనే కడుపుకాదు. విడాకులు తీసుకుని మరో అమ్మాయిని తెచ్చుకోకపోతే వంశం అంతమైపోతుంది.

నాకు నచ్చినట్లుగా చీరలు కట్టుకోవటంలేదు కాబట్టి నాకా అమ్మాయి అక్కరలేదు. విడాకులు కావాలి."

"నేను ఆ అబ్బాయిని మాత్రమే పెళ్ళి చేసుకున్నానుగానీ అతడి బంధువుల్ని కాదు! అతడు తన తల్లితండ్రుల్నీ, తోడబుట్టినా వాళ్ళనీ వదిలి వేరే కాపురం వస్తాడా సరి-లేకుంటే నాకా జీవితం అక్కర్లేదు. విడాకులు కావల్సిందే."

అసలీ విడాకులు అని అడగటానికి ఓ కారణమూ, పద్ధతీ పాడూ ఏమీ అవసరంలేదు."

జీడిపప్పుల్లో పురుగు కనిపిస్తే అవతల పారబోసినట్లే అయిపోతోంది జీవితాలు కూడా!

జీడిపప్పుల్లో పురుగులు తొందరగానే పడతాయి. అంత ఖరీదు పెట్టి కొనుక్కున్న వస్తువుల్ని భద్రంగా దాచుకోవాలిగానీ పాడయ్యాయని పారబోసుకోవటం మూర్ఖత్వం కాదా!

జీవితమైనా అంతే!

ఎక్కడో పుట్టి పెరిగిన ఇద్దరు క్రొత్త వ్యక్తులు కలిసి చేసే ప్రయాణమే జీవితం! చిన్న చిన్న తగాదాలూ, తేడాలు వుంటాయి.

గడపలేని ఇల్లు ఉండనట్లే, కలతలు లేని కాపురాలూ వుండవు.

ఎప్పటికప్పుడు భద్రంగా కాపాడుకోవలసిన బంధాన్ని విడాకులనే సొల్యూషన్‌తో తెంచుకోకూడదు.

మనుషుల్లో సర్దుబాటు మనస్తత్వమూ, ఇచ్చిపుచ్చుకునే గుణమూ వుంటేనే జీవితాలు శుభప్రదంగా వుంటాయి.

పెళ్ళి బడలికలు తీరకుండానే గొడవలు, ఒకరినొకరు అర్థంచేసుకునే ప్రయత్నం చేయకుండానే విడాకులు.

ఆ జీవితాలకు అర్థమే వుండదు.

భార్యా భర్తలూ-వాళ్ళ తప్పులూ—

వాళ్ళ అహంకారాలూ—వాళ్ళ గొడవలూ—

వాళ్ళ కొట్లాటలూ-వాళ్ళ స్వేచ్ఛలూ—

వాళ్ళ నాగరికతలూ-వాళ్ళ ఖర్మ!

కాని—పిల్లలు!?

ప్రేమకో కామానికో చిహ్నంగా ఓ స్వాతి చినుకులా ఈ జిలుగు వెలుగుల ప్రపంచంలోకి వచ్చిన కల్మషంలేని, కల్లాకపటం తెలీని చిన్నారి పిల్లలు—

వాళ్ళ సంగతేమిటి?

వాళ్ళ మనసులెంత బాధకు గురి అవుతున్నాయో ఎవరూ పట్టించుకోరు.

తమని తాము ఎక్కువగా ప్రేమించుకునే వాళ్ళెవరూ కూడా ఇతరులను ప్రేమించలేరు.

చివరకు కన్నపిల్లలనైనా సరే!

* * * *

ఆనంది స్టాఫ్ రూమ్‌కి వచ్చేసరికి రామాయమ్మగారు ఏదో క్లాసు తీస్తున్నారు. మిగిలిన వాళ్ళంతా చాలా శ్రద్ధగా వింటున్నారు.

"హాయ్ ఫ్రెండ్స్" అంది.

"రా....రా....నువ్వూ విను! వెరీ ఇంట్రెస్టింగ్."

"అహా...." ఆనంది కూడా కూర్చుంది.

రామాయమ్మగారు చెబుతున్నారు.

"వాళ్ళిద్దరూ చాలా స్నేహంగా వుండేవాళ్ళు. క్లాసులో ప్రక్క-



ప్రక్కనే కూర్చునేవారు. భోజనం చేసేటప్పుడు కూడా ఒకేచోట కూర్చునే వారు. అలా అలా వాళ్ళ అమ్మలకు పరిచయమైంది. అక్కడ్నుంచీ వాళ్ళ నాన్నలకూ పరిచయమైంది.

వీళ్ళింటికీ వాళ్ళు. వాళ్ళింటికి వీళ్ళు....మంచి స్నేహితులయ్యారు. మరికొన్ని రోజులకు ఈ ఇంటి పురుషునికీ ఆ ఇంటి స్త్రీకి కనెక్షగా మారిపోయింది. ఫలితంగా ఘర్షణ....!

విడిపోయారు.

వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకున్నారు.

ఇప్పుడామె గర్భవతి.

ఇప్పుడూ ఆ తల్లులు పిల్లలకు భోజనం తెస్తున్నారు. విడివిడిగా కూర్చోవటం, మాట్లాడుకోకుండా వుండటం....

వాళ్ళూ వీళ్ళూ వెక్కిరించటం....

ఆ పిల్లలకేం తెలుస్తుంది.... అర్థమయ్యే పద్ధతిలోనూ చెప్పుకోరు. పోనీ అలాగని ఏమీ చెప్పకుండానూ వుండరు.

ఊళ్ళోవాళ్ళ పిల్లల గురించే మనమింత ఆలోచిస్తున్నాంకదా! వాళ్ళింటి పిల్లలకోసం, వాళ్ళు కన్న పిల్లలకోసం వాళ్ళు కొంచెం కూడా జాగ్రత్త వహించరు. వాళ్ళకున్న ఉద్రేకాలనుబట్టి ఏదేదో వాగేస్తుంటారు. మీ నాన్నగార్ని వాళ్ళు తీసుకెళ్ళిపోయారని చెప్పారట. అంతే-వీళ్ళిద్దరూ కొట్టుకు చస్తున్నారు. వాళ్ళను చూస్తుంటే ఉసూరుమనిపిస్తోంది.

"రామాయమ్మగారూ! ఎనిమిదో తరగతిలో సిద్దార్థ తెలుసా మీకు?"

"అవును! వాడిదోకథ" అన్నారు రామాయమ్మగారు.

లక్ష్మి టీచర్ నవ్వింది.

"ఈ పిల్లల కథలన్నీ మీకెలా తెలుస్తున్నాయండీ?" అంది రామాయమ్మగార్ని చూస్తూ.

"సిద్దార్థ తల్లి భర్త నుండి విడిపోయి ఒంటరిగా వుంటున్నారట. ఐదేళ్ళుగా సిద్దార్థ అతని తల్లి మాత్రం ఇక్కడ వుంటాడుట. సిద్దార్థ తండ్రి మద్రాసులో వుంటాడుట. ఇప్పటికీ అతనికి వీలున్న ప్రతి ఆదివారమూ ఉదయమే ఊటీకి వచ్చి కొడుకుని తీసుకెళ్ళి ఆ రోజంతా అతనితో గడుపుతాడట!

సిద్ధార్థకు కూడా తన డాడీ అంటే అమితమైన ఇష్టం అని చెబుతాడు. అతనికిప్పుడు సుమారు పదేళ్ళుండవచ్చు.

ఇప్పుడామె పెళ్ళి చేసుకుంటోంది. ఆ వ్యక్తి కొత్తవాడుకాదు. ఇన్నాళ్ళూ ఆ ఇంట్లో తిరుగుతూ సిద్ధార్థతో అంకుల్ అని పిలిపించుకుంటూ కబుర్లు చెప్పే వ్యక్తే!

మరి మొన్నటివరకూ అంకుల్ అని పిలిచిన వ్యక్తిని ఇవ్వాల్టి నుంచీ డాడీ అని పిలుస్తాడా?

ఇవ్వాల్టికి కూడా కొడుకుని అంతగా ప్రేమిస్తూ అతనికోసం వారాకో రోజు కేటాయించుకుని గడుపుతూన్న అసలు తండ్రిని ఏమని పిలుస్తాడు?

అంకుల్ డాడీగా ఎందుకు మారారు?

నాకు నిజమైన తండ్రి ఎవరు?

నేనెవర్ని డాడీ అని పిలవాలి?

ఆ పిల్లల మనసుల్లో ఎంతెంత సంఘర్షణలు! తోటి పిల్లలు నవ్వుతూంటే, హేళన చేస్తూంటే, అవమానిస్తుంటే—వాళ్ళ మనసులు ఎలా మార్పు చెందుతాయి.

మానసికంగా అంతగా పక్వత చెందని ఆ చిన్నారి హృదయాల్లో వేసుకుంటోన్న ఈ రంగుల ముద్రలు ఎలాంటి ఫలితాలనిస్తాయో ఇప్పుడు వూహించలేరు.

వాళ్ళు ఏ దారిలోనయినా పెరగటానికి అవకాశాలు, వాళ్ళ ఇంటి పరిస్థితులూ, వాళ్ళ తల్లితండ్రులే సమకూరుస్తున్నారు.

భవిష్యత్తులో వాళ్ళెలాంటి పౌరులవుతారో మనం తేలిగ్గా వూహించగలం!

అందుకే నేననుకుంటున్నాను. ప్రిన్సిపాల్‌తో చెప్పాను. మన స్కూల్లో కూడా డే స్కాలర్స్ వద్దు. దాన్ని రద్దుచేసి రెసిడెన్షియల్ చేసేద్దాము. మనతోనే వుంటారు. వాళ్ళ పేరెంట్స్‌కన్నా మనమే బాగా పెంచగలుగుతాము."

"అదెలా రామాయమ్మగారూ! ఒకటో రెండో కేసులు అలాంటివి వున్నాయని మొత్తం అందర్నీ అలా లెక్క వేయలేముకదా!"

"అదీ నిజమేనండీ! స్కూలు స్ట్రెంగ్త్ తగ్గిపోతుంది. టీచర్స్‌ను



తగ్గించే ప్రమాదం వచ్చిందనుకోండి. మన ఉద్యోగాలు వూడిపోతాయి."

"అయ్యయ్యో....! అసలుకు మోసం వచ్చేట్లు చేయబోకండి."

ఒక్కొక్కరూ ఒక్కొక్క సలహా ఇస్తూంటే అదో చిన్న డిబేట్‌లాగా తయారయింది

ఆనంది ఆలోచిస్తోంది. చెబుతోంది.

"ఆడుతూ పాడుతూ స్వేచ్ఛగా, హాయిగా, స్వచ్ఛంగా పెరగాల్సిన వయసుల్లోనే వాళ్ళ బుర్రలలో ఇంతింత సమస్యలు చోటు చేసుకుంటూంటే వీళ్ళెలా గొప్ప వ్యక్తులుగా పెరిగి రాణించ గలుగుతారు?

పెద్దవాళ్ళమయ్యాక మనం చేసుకునే తప్పులకే మనం తల్లడిల్లిపోతున్నామే....అలాంటిది వూపిరి తిత్తులుకూడా సొంతం పెరగని ఈ వయసుల్లో వాళ్ళు చేయని తప్పులకు, పెద్దవాళ్ళ ఆలోచనా రహిత చర్యలకు ఫలితాల ననుభవిస్తూ బలయిపోతూన్న ఆ అమాయక హృదయాల్లోని అలజడిని ఎవరు దూరం చేయగలరు!

అసలు వాళ్ళెవరికి చెప్పుకోగలరు!

పెద్దవాళ్ళు వాళ్ళ బాధల్నీ, వాళ్ళ ఆవేదనల్ని మాత్రమే చూసుకుని నిర్ణయాలు తీసుకుంటున్నారు! మధ్యలో నలిగిపోతూన్న ఆ చిన్నారులకూ ఓ మనసుందనీ, వాళ్ళూ ఎంతో క్షోభననుభవిస్తున్నారని అర్థం చేసుకోవటం లేదు.

పిల్లలు!

తల్లి తండ్రులు చెప్పింది విని, చెయ్యమన్నది చేసి, చదవమన్నది చదివి....

ఆ రోజులు కావివి!

పిల్లలకు వ్యక్తిత్వాలు తెలుస్తున్నాయి!

ఇష్టాలను బహిర్గతం చేసే ధైర్యం వుంది

ఆలోచించటం తెలుస్తోంది!

తల్లి తండ్రుల మాటలను పిల్లలు విన్నట్టే సందర్భాన్ని బట్టి, అవసరాలను గమనించి పిల్లల మాటలనూ, వారి భావాలనూ పెద్దలుకూడా ఆలోచించాలి.

'పిల్లలు—వాళ్ళకేం తెలుసు' అని మాత్రం అనుకోకూడదు!

ఏ వయసుకు తగినట్లు అలా ఆలోచించటం వాళ్ళకు తెలుసు.

వాళ్ళ అభిప్రాయాలను మనం గౌరవించినప్పుడే మన పెద్దరికాన్ని వాళ్ళు నిలుపుతారు అనే వున్నతమయిన సత్యాన్ని పెద్దవాళ్ళకు తెలియ జేయాలి.

అందుకు మంచి మార్గం పేరెంట్స్, టీచర్స్ మీటింగ్స్ జరుగు తున్నాయి కదా!

వాటిని మనం అంత సీరియస్‌గా కండక్ట్ చేయటంలేదు. ఎప్పుడో సంవత్సరానికి ఒకటి రెండుసార్లు మాత్రమే కలుస్తున్నాము. అప్పుడు కూడా పిల్లల చదువులు మాత్రమే మనం చర్చిస్తున్నాము. అలాకాకుండా వారానికోసారి తప్పకుండా కలవాలి! వాళ్ళ చదువులే కాకుండా వ్యక్తిగత మయిన సమస్యలు కూడా చర్చించాలి."

"నో ఆనందీ! అలా ఒప్పుకోరు. కొంతమంది పేరెంట్స్ ఏదైనా తప్పు జరిగితే మనం గుర్తువచ్చి మనల్ని తిడతారు. మంచి జరిగితే....అది వాళ్ళ పిల్లల గొప్పతనమూ, వాళ్ళ పెంపకంలోని గొప్పతనమూ అని మురిసిపోతారు. అసలు పిల్లల జీవితాల్లో టీచర్సు పాత్ర చాలా ముఖ్య మయినది అని తొంభై తొమ్మిది పర్సెంట్ తల్లి తండ్రులు ఒప్పుకోరు.

ఇట్స్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్! హోల్డ్ యువర్ టంగ్ అని మనల్నే అవమానించగల సమర్థులు."

"నిజమే! పేరెంట్స్ టీచర్స్‌కివ్వాల్సిన గుర్తింపు ఇవ్వకపోవటం వల్లనే పిల్లలు కూడా తెలుసుకోలేకపోతున్నారు. తల్లితండ్రులనే కదా అనుకరిస్తారు."

"అవును! పెద్దలు వాళ్ళ మాటను చిన్న పిల్లలు వినాలని చెప్పి నట్లే-పిల్లలకు 'స్వార్థం' అనేది తెలుస్తోంది.

ఎవరిని వాళ్ళు ప్రేమించుకుంటూ, వాళ్ళ వాళ్ళ భావాలకు ప్రాము ఖ్యాన్నిచ్చుకుంటూ, ఎవరి సంతోషం కోసం వాళ్ళు బ్రతుకుతూ—

పిల్లలకోసం తల్లి తండ్రులూ ఆలోచించటం మానేస్తున్నారు. తల్లి తల్లి తండ్రుల కోసం పిల్లలూ ఆలోచించటం లేదు."

"పెద్దవాళ్ళ ఆలోచనలు పిల్లలకు అర్థమవ్వకపోవచ్చు గానీ పిల్లల భావాలు పెద్దవాళ్ళకు తెలుసు కదా! ఒకప్పుడు మనం అనుభవించిన



వయస్సే.... అవే ఆలోచనలు! అవే ఆవేదనలూ.... కాబట్టి పెద్దవాళ్ళు పిల్లలకోసం కొంత జీవితాన్ని కేటాయించాలి."

కొంతమంది టీచర్సు ఒప్పుకోలేదు.

ఖండించారు.

"పిల్లలు....పిల్లలు అంటూ జీవితమంతా వీళ్ళకోసమే తపించిపోయి పెంచి పెద్దచేస్తే ఎంతమంది పిల్లలు వాళ్ళ తల్లిదండ్రుల్ని ఉద్ధరిస్తున్నారు. రెక్కలొచ్చిన పక్షులు ఎగిరిపోతున్నట్లే పిల్లలుకూడా ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతున్నారు.

వృద్ధాప్యంలో కన్నబిడ్డల ఆదరణ లేక కృంగిపోతూన్న వాళ్ళు ఎంత మంది వున్నారో తెలుసా?"

"అవును ఆమాటా నిజమే! కాని ఒక్కటి ఆలోచిద్దాం! వాళ్ళకు ఆ స్వార్థం నేర్పుతూన్నదికూడా వాళ్ళ తల్లిదండ్రులు అంటాను. మనకో సామెత వుంది! 'నాన్న తాతయ్యకు వాడుతూన్న చిప్ప జాగ్రత్తగా దాయి. రేపు నీకు కావాలి కదా!' అని."

"ఆనందీ' ఈ సమస్యలు ఉదయాస్తమయాలు వున్నంతకాలమూ ఉంటూనే వుంటాయి.

ఎక్కువ ఆలోచించినకొద్దీ మనకు పిచ్చెక్కుతుంది. మనాకరిని సరిచేయటం అనేది ఈ ప్రపంచంలో ఎవరూ చేయలేని పని! వదిలేద్దాం" అంది లక్ష్మి.

అందరూ లేచారు!

ఆనంది అనుకొంటోంది-

'నాకేకాదు—ఇలా పరిష్కారం దొరకని సమస్యలూ, జవాబులు లేని ప్రశ్నలూ చాలామందికి వున్నాయి' అని.

ఆమె జీవితం ఓ రీసెర్చి గ్రంథం!

ప్రవృత్తిరీత్యా పరిచయమవుతున్న వేలకొద్దీ పిల్లలూ, వేల జీవి తాలూ, వేల సమస్యలూ-బాబోయ్! ఈ ఒంటరి జీవితం చాలా బాగుంది అనేలా చేసాయి.

అందరకూ పరిమిత కుటుంబాలుంటాయి.

కాని ఆనందికి అలాకాదు!

చాలామంది పిల్లలకు ఆమె అమ్మ.

కేవలం అమ్మేకాదు-

అమ్మలా, నాన్నలా, తోబుట్టువులా, శ్రేయోభిలాషిణిలా పలు రూపాల్లో వాళ్ళను ఆదరించే స్త్రీ మూర్తి!

ముఖ్యంగా అనాధ పిల్లలను ఇంకా బాగా చూసుకునేది.

చాలా మంది తమ కళ్ళను దానం చేస్తారు.

రక్తదానం చేస్తారు!

మూత్రపిండాలు దానం చేస్తారు!

ఆనంది లాంటివాళ్ళు—జీవితాలనే దానం చేస్తారు!

సూర్యుడు తూర్పునే ఉదయిస్తాడు—పడమరనే అస్తమిస్తాడు!

ఇందులో మార్పులేదు! రాదు!

భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతూనే వుంటుంది!

ఇందులోనూ తేడా వుండదు! రాదు!

స్త్రీనుండి ప్రేమ పుట్టింది! ఆ ప్రేమే సృష్టికి మూలం! ప్రపంచానికి రక్షణ కవచం!

ఓం భూర్భు వస్సువః

తత్ సవితుర్వరేణ్యం

భర్గో దేవస్య ధీ మహీ

ధియో యోనః ప్రచోదయాత్ !

భూమీ ఆకాశమూ ఎంత నిజమో—ఆ రెండింటి మధ్యా అంత శ్లీనంగా వ్యాపించి వున్న ఈ గాయత్రీ మంత్రం అంత నిజం!

మాంగల్యం తంతునానేనా

మమ జీవన హేతునాం!

నిప్పు నీరు ఎంత అవసరమో సంస్కృతి కట్టుబాటుకూ, సంప్రదాయ రక్షణకూ ఈ బంధం కూడా అంత అవసరం !!!

—: శుభం :—